శనివారం 14-6-2025



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 83

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

విజయపథం

అన్ని విజయాలను ఒకే గాటన కట్టలేము.
అన్నీ అనుకూలంగా ఉండడం వల్ల
కొన్ని విజయాలు నల్లేరు మీద నడక అవుతాయి.
కొన్ని విజయాలు అలా కాదు...
కారుమేఘాల్లాంటి ప్రతికూల పరిస్థితులను
చీల్చుకొని వెలుగు కిరణాలు అవుతాయి.
ఇందుకు సాక్ష్యం కశ్మీరి అమ్మాయి జెనిస్...
ఇండియా-పాక్‌ల మధ్య యుద్ధవాతావరణ
ఉద్రిక్తతల నేపథ్యంలో ఎన్నో ప్రతికూల
పరిస్థితులను తట్టుకొని మరీ
జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్)లో
విజయం సాధించింది.

చదువొక యుద్ధం!


జెనిస్

పరీక్షకు ప్రిపేర్ కావాలంటే వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. ఏకాగ్రతతో చదవాలి.

అయితే జెనిస్ ప్రిపరేషన్‌కు అవేం లేవు.

'జేఈఈ' పరీక్షలకు కొన్నిరోజుల ముందు...

పాకిస్తాన్ బాంబుల శబ్దం వినిపించేది. మరోవైపు విరామం ఇవ్వని సైరన్లు.

భయపెట్టేలా ఆకాశంలో డ్రోన్లు.

ఎటు చూసినా భయానకమైన వాతావరణం.

'జేఈఈ పరీక్ష వాయిదా పడితే బాగుండేది' అని మనసులో చాలాసార్లు అనుకుంది జెనిస్.

'ఇంత భయానక పరిస్థితుల్లో పరీక్ష రాయగలనా అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది.

ప్రిపరేషన్ సంగతి ఎలా ఉన్నా 'పరీక్ష కేంద్రానికి సురక్షితంగా చేరుకోగలనా? అసలు వెళ్లగలనా?' అనే సందేహం ఆమె మనసులో సుడులు తిరిగేది.

'ఇలాంటి పరిస్థితుల్లో అమ్మాయిని పరీక్షకు పంపడం సరియైనదేనా?' అని జెనిస్ తల్లిదండ్రులూ ఆలోచనలో పడ్డారు.

'స్కూలు రోజుల్లో నాకు జేఈఈ గురించి బొత్తిగా తెలియదు. కశ్మీర్‌లో చాలామంది తల్లిదండ్రులకు జేఈఈ గురించి తెలియదు. తమ పిల్లలను మెడిసిన్ చదివించాలనుకుంటారు. కశ్మీర్‌లో జేఈఈ కోచింగ్ సెంటర్‌లు కూడా చాలా తక్కువ. ఇంటర్మీడియెట్‌లో జేఈఈ గురించి తెలిసిన తరువాత నాలో ఆసక్తి పెరిగింది. జేఈఈ ఎగ్జామ్స్ రాయాలనుకున్నాను. గూగుల్ నాకు కోచింగ్ సెంటర్‌గా మారింది. జేఈఈ పరీక్షకు సంబంధించిన కంటెంట్‌ను సెర్చ్ చేసేదాన్ని' అంటుంది జెనిస్.

మొదటి ప్రయత్నంలో విఫలం అయినా రెండో ప్రయత్నంలో 'జేఈఈ'లో విజయం సాధించింది.

మొదటిసారితో పోల్చితే రెండోసారి 'జేఈఈ' కోసం ప్రిపేరవుతున్నప్పుడు బయటి పరిస్థితులు కల్లోలంగా ఉన్నాయి.

ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి.

ఇంటర్‌నెట్ షట్‌డౌన్ మరో సమస్య. కరెంట్ కోతలు సరేసరి.

'ఇంటర్‌నెట్ లేకపోతే ఆ ప్రభావం ప్రిపరేషన్‌పై పడుతుంది. ఎందుకంటే నేను కోచింగ్ సెంటర్‌లో చేరలేదు' అంటుంది జెనిస్.

అయినప్పటికీ 'ఈసారి ఎలాగైనా సాధించాల్సిందే' అనే గట్టి పట్టుదలతో విజయం సాధించింది పుల్వామాకు చెందిన జెనిస్.

'మా ప్రాంతంలో ఇంజనీరింగ్ అంటే అబ్బాయిలకు మాత్రమే అన్నట్లుగా ఉండేది. నా తల్లిదండ్రులకు జేఈఈ గురించి తెలియదు. నన్ను మెడిసిన్ చదివించాలనేది వారి కోరిక. నేను వారికి జేఈఈ గురించి వివరించాను. నాకు మ్యాథ్స్, ఫిజిక్స్ అంటే ఇష్టం. జేఈఈ గురించి చెప్పినప్పుడు నువ్వు మెడిసిన్ చదవాల్సిందే అనకుండా నన్ను ప్రోత్సహించారు' అని చెప్పింది జెనిస్.

'జేఈఈ' ప్రిపేర్ కావడానికి ముందు ఎంతోమంది బంధువులు జెనిస్ తల్లిదండ్రులతో.. 'జేఈఈ అంటే అబ్బాయిలు రాసే పరీక్ష. మీరు జెనిస్‌తో మెడికల్ ఎంట్రెన్స్ రాయించండి ఇంజనీరింగ్ ఫీల్డ్‌లో అబ్బాయిలు మాత్రమే ఉంటారు' అనేవాళ్లు.

అయితే వారి మాటలను జెనిస్ తల్లిదండ్రులు పట్టించుకోలేదు.

'నువ్వు సాధించగలవు' అని కూతురికి ధైర్యాన్ని ఇచ్చారు.

తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహబలంతో తన 'ఐఐటీ' కలను నిజం చేసుకుంది జెనిస్.

బాంబుల మోతలు వింటూనే...

'జేఈఈ' ఎగ్జామ్ కోసం ప్రిపేరవుతున్నప్పుడు సైరన్లు, బ్లాకవుట్స్ వల్ల ఏకాగ్రత కుదిరేది కాదు. 'జేఈఈ' అడ్వాన్స్‌డ్ ఫామ్స్ ఫిల్ చేయలేనేమో అని భయపడ్డాను. అదృష్టవశాత్తు చేయగలిగాను. ఆపరేషన్ సిందూర్ మే 7న జరిగింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్ మే 18. ఈ మధ్య కాలంలో ఎంతో ఉద్రిక్తత నెలకొని ఉంది. ఎక్కడెక్కడి నుంచో బాంబుల శబ్దాలు వినిపించేవి. అంతా భయంలోనూ ఈసారి ఎలాగైనా సీటు సాధించాల్సిందేనని అనుకున్నాను.

– జెనిస్

రేపు ఫాదర్స్ డే

నాటి రోజుల్లో నాన్న అంటే సంపాదించేవాడుగా, కుటుంబానికి ఆర్థిక భద్రతను కల్పించేవాడిగా మాత్రమే గుర్తింపు ఉండేది.
నేటి సమాజంలో తండ్రి పాత్ర ఒక కొత్త మలుపు తీసుకుంది.
కేవలం సంపాదనకే పరిమితం కాకుండా, పిల్లలతో కలిసి ఆడుతూ.. పాడుతూ..
అల్లరి చేస్తూ... వారి ఆలనాపాలనా చూసే మంచి తండ్రి.
అభివృద్ధిలో, భావోద్వేగ బంధాలలో, నైతిక విలువల్లో భాగస్వామి అయ్యే లక్కీ డాడీ!

ఐ లవ్ యు డాడీ...



ప్రస్తుత తల్లిదండ్రుల తరం 'సమాన భాగస్వామ్యం' అనే సిద్ధాంతాన్ని అంగీకరిస్తోంది. తండ్రులు ఇప్పుడు పిల్లల ఆరోగ్యం, విద్య, ఆటలు, వారితో గడిపే సమయం – అన్నిట్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. పాలు పట్టడం నుంచి బడికి తీసుకెళ్లడం వరకు ప్రతి దైనందిన పనిలోనూ తండ్రి పాత్ర కనిపిస్తుంది.

భావోద్వేగాలకు ప్రాధాన్యం

ఈ తరానికి చెందిన తండ్రులు పిల్లలను ఆదేశించేవాళ్లుగా కాదు అన్ని విషయాలు వారితో చర్చించేవాళ్లుగా మారారు. వారి భయాలు, ఆశలు, ప్రశ్నలు, ఆనందాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బంధం పిల్లల మనోభావాలపై ఎంతో ప్రభావాన్ని చూపుతుంది.

వర్క్-లైఫ్ బ్యాలెన్స్

కుటుంబానికి సమయం కేటాయించడం కోసం నేటి తండ్రులు పని సమయంలో సర్దుబాటు చేసుకుంటున్నారు. 'క్వాలిటీ టైమ్' అనే మాట ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తుంది. రోజూ కొంత సమయం పిల్లలతో గడపడం, స్కూల్ ఈవెంట్స్‌కు హాజరవడం, వారికి కథలు చెప్పడం వంటి పనులు ఈ తరం తండ్రుల ప్రత్యేకతగా చెప్పవచ్చు.

టెక్నాలజీతో అనుబంధం

ఈ డిజిటల్ యుగంలో తండ్రులు.. పిల్లల విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, ఆన్‌లైన్ యాప్స్, వీడియో కాల్స్, ఈ-లర్నింగ్ టూల్స్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. టెక్నాలజీ సహకారంతో పిల్లల ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నారు.

ఆధునిక తండ్రి

మోడర్న్ ఫాదర్‌హుడ్ అనేది ప్రేమతో, సహనంతో, బాధ్యతతో కూడినదిగా మారింది. ఒక తండ్రి మోడర్న్‌గా, ప్రేమగా మారినప్పుడు కుటుంబం మారుతుంది. కుటుంబం మారినప్పుడు సమాజం మారుతుంది. ఈ మార్పు ఒక మంచి భవిష్యత్తుకు వేదికగా మారుతుందని చెప్పడంలో సందేహం లేదు.

ఉదాహరణగా తండ్రి

ఓ ఆధునిక తండ్రిగా, సింగిల్ ఫాదర్‌గా ఉండటం అనే అసాధ్యమైన పనిని కూడా నేటి తండ్రులు సుసాధ్యం చేస్తున్నారు. పిల్లల చదువు, భావోద్వేగాలు, వారి భవిష్యత్తునూ చూసుకోవడంపై దృష్టి పెడుతున్నారు. సెలబ్రిటీలు కూడా ఇందుకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నా తండ్రి తనంలో వారు చూపే నిబద్ధతా, ప్రేమా ప్రతి తండ్రికీ ఆదర్శప్రాయమే.


పిల్లలు జూహీ, యష్‌లతో కరణ్ జోహార్

కరణ్ జోహార్ సరోగసీ ద్వారా జూహీ, యష్ అనే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. సింగిల్ డ్యాడ్‌గా ఆయన తన పిల్లలకు ఆదర్శంగా ఉండటమే కాక, తన అనుభవాలను పుస్తక రూపంలోనూ, ఇంటర్వ్యూలలోనూ పంచుకున్నారు.

ఇప్పుడు మాట్లాడలేను


ఎయిర్ హోస్టెస్ నగాన్తోయ్ శర్మ

అహ్మదాబాద్ విమానంలో ఎయిర్ హోస్టెస్ నగాన్తోయ్ శర్మ (21) కథ విన్న ఎవరికైనా కళ్లు చెమ్మగిల్లవలసిందే! మణిపురకు చెందిన ఈమె 19 ఏళ్లకే ఎయిర్ ఇండియాలో చేరింది. మంచిపేరు తెచ్చుకుంది. అసలు ఆమె ఉద్యోగంలో అనుకోకుండా చేరింది. ఆమె స్నేహితులు ఎయిర్ హోస్టెస్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళుతూ సరదాగా తనను కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. ఎలాగూ అంత దూరం వచ్చాను కదా అని ఇంటర్వ్యూలో పాల్గొంది నగన్. ఆశ్చర్యం... ఆ ఉద్యోగం ఆమెను వెంటబెట్టుకుని వెళ్లిన స్నేహితులకు రాలేదు. నగన్‌కు వచ్చింది. 'ఇలా ఉద్యోగం వచ్చింది నాన్నా, ఏం చేయమంటావు' అని అడిగింది. 'మంచి సంస్థ... చక్కటి ఉద్యోగం. నీది పదిమందితో కలిసిపోయే స్వభావం కాబట్టి వెంటనే చేరు తల్లీ... అని క్షణం ఆలోచించకుండా చెప్పాను. చివరికి ఇప్పుడిలా...' అంటూ ఆమె తండ్రి కన్నీళ్ల పర్యంతమవుతూ చెప్పారు. నగన్ ఉద్యోగంలో చేరిన రెండేళ్లకే అదే విమానంలో ప్రాణాలు కోల్పోవడం ఆమె కుటుంబ సభ్యులను, స్నేహితులనూ కలచి వేస్తోంది. ''ప్రమాదం జరిగే రోజు పొద్దున 11.30 గం.కు ఫోన్ చేసి 'నేనిప్పుడు లండన్ వెళ్తున్నాను. మళ్లీ మాట్లాడలేనేమో.. జూన్15న తిరిగి వస్తాను' అని చెప్పింది. చివరికి ఆ మాటే నిజమైంది. ఆమె మాతో ఇంకెప్పటికీ మాట్లాడలేదు'' అని ఆమె సోదరి, కుటుంబ సభ్యులు విలపిస్తూ చెప్పారు.

స్కై లవ్డ్ హర్


రోష్నీ రాజేంద్ర సొంఘారే

ఈమె పేరు రోష్నీ రాజేంద్ర సొంఘారే! ఎయిర్ ఇండియాలో ఫ్లయిట్ అంటెండెంట్! ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా!

మబ్బుల్లోంచి దూసుకెళ్లే విమానంలో ప్రపంచమంతా చుట్టేయాలని చిన్నప్పటి నుంచీ కలలు కంది!

ఆమె చిన్నప్పుడు అమ్మ గోరు ముద్దలు పెడుతూ చెప్పే కథల్లో అంశాలేవైనా విమానాన్నే ఊహించుకునేది!

చేయి పట్టుకుని నాన్న బజారుకు తీసుకెళ్తే.. విమానం బొమ్మ కనిపించిన షాప్ దగ్గరల్లా ఆగేది!

అందుకే జ్ఞానం వచ్చాక ఆమె ఎయిర్ హోస్టెస్ అవుతాననే నిర్ణయాన్ని వినిపించినప్పుడు అమ్మానాన్నలు ఆశ్చర్యపోలేదు! సంతోషంగా దీవించారు! వాళ్లది ఆర్థికంగా ఉన్న కుటుంబమేమీ కాదు. సర్దుబాటు చేసుకోగల పరిస్థితులూ లేవు. అయినా కూతురి ఆశను తుంచేయలేదు. తమ రెక్కలు ముక్కలు చేసుకునైనా కూతురి కోరికకు రెక్కలు తొడగాలనుకున్నారు. అయితే.. వాళ్లను కష్టపడనివ్వలేదు రోష్నీ! ఓ పక్క చదువుకుంటూనే మరోపక్క పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకుంది. పైసా పైసా కూడబెట్టుకుంది. చిన్న చిన్న సరదాలు, సంతోషాలనూ దూరం పెట్టింది. తన కల కోసం అమ్మానాన్నల మీద భారం మోపద్దనేదే ఆమె తాపత్రయం. మొత్తానికి కూడబెట్టుకున్న డబ్బుతో ఫ్లయిట్ అటెండెంట్ ట్రెనింగ్ పూర్తి చేసింది.

స్కై లవ్స్ హర్

నిన్న మొన్నటి (2025, జూన్ 12) దాకా ఎయిర్ ఇండియాలోనే ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసింది. ఆమె కోరుకున్నట్టుగానే కొత్త ప్రదేశాలెన్నిటినో చుట్టొచ్చింది. చూసొచ్చిన ప్రతి ప్రాంతం దగ్గర ఓ ఫొటో తీసుకుని, ఆ ఫొటో సహా ఆ ప్రాంతపు ముచ్చట్లను 'స్కై లవ్స్ హర్'అనే పేరుతో ఉన్న తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసేది. రోష్నీ పోస్ట్‌లు చూస్తే తెలిసిపోతుంది.. ప్రయాణాలంటే ఆమెకెంత ఇష్టమో! చాలా చురుకైన అమ్మాయి. ముంబైలో వాళ్లుండే డోంబివ్లీ ఈస్ట్‌లోని నవ్ ఉమియా క్రుపా సొసైటీలో ఏ చిన్న వేడుకైనా ఉత్సాహంగా పాల్గొనే రోష్నీని తలచుకుని బాధపడనివాళ్లు లేరు.

కలల ఇంట్లోకి రాకముందే!


రంజిత గోపకుమార్

అహ్మదాబాద్ ప్లేన్ క్రాష్‌లో తమ ప్రియమైన స్నేహితురాలు రంజిత గోపకుమార్ చనిపోయిందనే వార్త తెలిసి పుల్లాడ్ (కేరళ)లోని శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు షాక్ అయ్యారు.

'ఇది నిజమేనా!' అని ఒకరికి ఒకరు ఫోన్ చేసుకున్నారు.

పాత ఫోటోలలో రంజితను చూస్తూ భోరున విలపించారు.

రంజిత నర్స్‌గా పనిచేసేది.

'రంజిత ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఉండేది. అందరినీ నవ్వించేది. ఎన్నో కబుర్లు చెప్పేది. రంజిత నాకు మంచి స్నేహితురాలు. ఆమెకు సంబంధించిన జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి' అంటోంది జీజా దేవి. ఆమె రంజితకు పదవతరగతిలో క్లాస్‌మేట్.

తురుతికాడ్‌లో ఇద్దరూ బీఎస్సీ కలిసి చదువుకున్నారు.

డిగ్రీ సెకండ్ ఇయర్‌లో బీఎస్సీ నర్సింగ్‌లో చేరింది రంజిత.

'రంజితది ఒకరి మీద ఆధారపడే స్వభావం కాదు. స్వతంత్ర వ్యక్తిత్వం. ఓపెన్‌గా ఉండేది. ఆమె చనిపోయిందనే వార్త ఒక పట్టాన నమ్మలేకపోయాను' అంటోంది దేవి.

రంజితకు 'సొంత ఇల్లు' కల ఉండేది.

'ఇల్లు కట్టుకోవాలనేది రంజిత కల. అందుకోసమే యూకేలో ఉద్యోగం చేయాలనుకుంది. కొత్త ఇంటి నిర్మాణం పుల్లాడ్‌లో జరుగుతోంది. తన కలల ఇంట్లోకి అడుగుపెట్టక ముందే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది' అని బాధపడ్డారు రంజిత పొరుగింటి వ్యక్తి అనిల్ కుమార్.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 13న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,600
బంగారం (22 క్యారెట్లు)	91,230
వెండి	1,06,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,640
బంగారం (22 క్యారెట్లు)	92,950
వెండి	1,09,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,400
బంగారం (22 క్యారెట్లు)	92,950
వెండి	1,10,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,640
బంగారం (22 క్యారెట్లు)	95,740
వెండి	1,09,200
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,200
బంగారం (22 క్యారెట్లు)	90,340
వెండి	1,05,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,01,400
బంగారం (22 క్యారెట్లు)	92,950
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు

వంటిల్లు

బ్రెడ్ స్నాక్స్

బ్రెడ్ అనగానే బ్రెడ్-జామ్, బ్రెడ్ ఆమ్లెట్ తప్పితే పెద్దగా ఏ వెరైటీ గురించీ ఆలోచించం. ప్రయత్నించం. ఈసారి ఇంట్లో బ్రెడ్ ఉంటే వీటిని ప్రయత్నించి చూడండి. సూపర్ అనక మానరు.

బ్రెడ్ ఉప్మా



కావలసినవి: **బ్రెడ్ స్లైసెస్** – 7 లేదా 8; **ఉల్లిపాయలు** – 2 (సన్నగా తరగాలి); **టమాటో** – 1 (సన్నగా తరగాలి); **క్యాప్సికమ్ ముక్కలు** – 4 టేబుల్ స్పూన్లు; **క్యారెట్ తురుము** – 3 టేబుల్ స్పూన్లు; **పచ్చిమిర్చి** – 2 (నిలువుగా కట్ చేసుకోవాలి); **పసుపు, కారం** – అర టీ స్పూన్ చొప్పున; **గరం మసాలా పొడి** – అర టీ స్పూన్; **పంచదార** – అర టీ స్పూన్; **నూనె** – 4 టీ స్పూన్లు; ఆవాలు, శనగపప్పు ఒక టీ స్పూన్ చొప్పున; **జీలకర్ర** – అర టీ స్పూన్; **జీడిపప్పు/పల్లీలు** – కొన్ని; **కరివేపాకు రెబ్బలు** – 3 లేదా 4; **ఉప్పు** – సరిపడా; **నిమ్మరసం, కొత్తిమీర తురుము** – కొద్దికొద్దిగా; **సన్న కారప్పూస** – గార్నిష్ కోసం.

తయారీ: ముందుగా, బ్రెడ్ ముక్కలను చిన్నగా కట్ చేసి పెట్టుకోవాలి. అనంతరం కళాయిలో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసుకుని వేడి చేసి, ఆవాలు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర వేసి చిటపటలాడించాలి. తరువాత, జీడిపప్పు లేదా పల్లీలు వేసి అవి క్రిస్పీగా అయ్యే వరకు వేయించండి. ఆపై కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసుకుని ఉల్లిపాయ ముక్కలను చిన్న మంట మీద మగ్గనివ్వాలి. తర్వాత టమాటో ముక్కలు, ఉప్పు వేసి అవి మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. క్యాప్సికమ్ ముక్కలు, క్యారెట్ తురుము కూడా వేసి 2 నిమిషాల పాటు మధ్య మధ్యలో గరిటెతో తిప్పుతూ ఉండాలి.అనంతరం పసుపు, గరం మసాలా పొడి, కారం, పంచదార వేసి ఒక నిమిషం పాటు ఉడికించాలి. ఇప్పుడు 4 టేబుల్ స్పూన్ల నీరు పోసి, మూత పెట్టి, ఆ మిశ్రమం చిక్కబడే వరకూ ఉండాలి. ఇప్పుడు బ్రెడ్ ముక్కలు వేసి బాగా కలపాలి. అనంతరం మూత పెట్టి, మంట తగ్గించి 4 లేదా 5 నిమిషాల పాటు ఉడికించాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని, నిమ్మరసం, కొత్తిమీర తురుము వేసి బాగా కలపాలి. సర్వ్ చేసుకునే ముందు సన్న కారప్పూస వేసుకుని సర్వ్ చేసుకుంటే భలే రుచిగా ఉంటుంది ఈ బ్రెడ్ ఉప్మా.

బ్రెడ్-కీమా పిజ్జా



కావలసినవి: బ్రెడ్ స్లైసెస్ – 4 లేదా 5; సాస్ – 2 లేదా 3 టేబుల్ స్పూన్లు; **కీమా తురుము** – పావు కప్పు (మసాలా, ఉప్పు జోడించి మెత్తగా ఉడికించి పెట్టుకోవాలి); **మొజరెల్లా చీజ్ తురుము** – 4 టేబుల్ స్పూన్లు పైనే; **ఉల్లిపాయ సన్న ముక్కలు** – ఒక టేబుల్ స్పూన్లు; **పచ్చి మిరపకాయలు** – 5 (నిలువుగా ముక్కలు చేసుకోవాలి, పచ్చిమిర్చికి బదులుగా క్యాప్సికమ్ ముక్కలు కూడా తీసుకోవచ్చు); **నూనె** – కొద్దిగా; **మిరియాల పొడి** – అర టీ స్పూన్.

తయారీ: ముందుగా పాన్ మీద బ్రెడ్ స్లైసెస్‌లను దోరగా వేయించి పెట్టుకోవాలి. ఇప్పుడు ప్రతి బ్రెడ్‌కి ఒకవైపు సాస్ రాసి, దానిపైన ఉడికిన కీమా కొద్దికొద్దిగా వేసుకోవాలి. అనంతరం కొన్ని ఉల్లిపాయ ముక్కలు, కొన్ని పచ్చిమిర్చి లేదా క్యాప్సికమ్ ముక్కలను బ్రెడ్ మీద అక్కడక్కడా పరిచినట్లుగా పెట్టుకుని, వాటిపైన మిరియాల పొడి జల్లుకోవాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా చీజ్ తురుము వేసుకుని మూత పెట్టి కళాయిలో బేక్ చేసుకోవాలి. అనంతరం నచ్చిన విధంగా కట్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

బ్రెడ్ బోండా



కావలసినవి: బ్రెడ్ పౌడర్ – 2 కప్పులు; **మైదా పిండి** – ఒక కప్పు; **బంగాళదుంప గుజ్జు** – ఒకటిన్నర కప్పులు (మెత్తగా ఉడికించి, గుజ్జులా చేసుకోవాలి); **జీలకర్ర పొడి** – అర టీ స్పూన్; **పులిసిన గడ్డ పెరుగు** – పావు కప్పు; **వేయించిన కరివేపాకు పొడి** – కొద్దిగా (ఆకుల్ని కూడా తీసుకోవచ్చు, చిన్నగా తుంచుకుని వేసుకోవచ్చు); **ఉల్లిపాయ తరుగు** – 2 టేబుల్ స్పూన్లు; **ఉప్పు** – తగినంత; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా;

తయారీ: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో బంగాళదుంప గుజ్జు, మైదాపిండి, జీలకర్ర పొడి, కరివేపాకు పొడి లేదా తురుము, ఉప్పు, ఉల్లిపాయ తరుగు వేసుకుని బాగా కలుపుకోవాలి. ఆపైన బ్రెడ్ పౌడర్ వేసుకుని.. కొద్ది కొద్దిగా పెరుగు వేస్తూ బోండా పిండిలా కలుపుకోవాలి. కళాయిలో నూనె కాగిన తర్వాత బోండాలు వేసుకుని.. వేడిగా ఉన్నప్పుడే సర్వ్ చేసుకుంటే సరిపోతుంది. అభిరుచిని బట్టి మరిన్ని కూరగాయ ముక్కలను జోడించుకోవచ్చు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50


సంపుటి: 18 సంచిక: 83

శనివారం 14-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'




THIS IS HOW HYDERABAD
IS SUPPOSED TO LIVE!
"WITH A CURTAIN WALL"
Iconic Architecture, Extraordinary Craftsmanship, Obsessive Detailing.
1,07,000+ SQ.FT. Indoor amenities
something MORE for Everyone
ASBL
BROADWAY
EXCLUSIVE
3 BHKs
STARTING FROM
₹2.5 CR
092 895 89630
asbl.in/broadway
TG RERA NO: P02400009684 | FILE NO: 002916/BP/HMDA/0847/SKP/2025
*Artistic impression only.
THE CLUB 52,000 SQ. FT.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 83
శనివారం 14-6-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


గెలుపు దిశగా దక్షిణాఫ్రికా
విజయలక్ష్యం 282. ప్రస్తుతం 213/2. మార్క్‌రమ్ సెంచరీ. -15లో


ఎటాక్!
ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడితో ప్రపంచ మార్కెట్లలో కలకలం -15లో


25లోగా రైతు భరోసా
రాష్ట్రంలోని రైతులకు ఈ నెల 25లోగా రైతు భరోసా నిధులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.
వివరాలు 12లో ▸


18 నుంచి పీజీసెట్ దరఖాస్తులు
పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీగెట్ కోసం ఈనెల 18 నుంచి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు స్వీకరించనుంది.
వివరాలు 13లో ▸


ఉప్పు.. వెన్నంటే ముప్పు!
అధిక ఉప్పు వల్ల హైబీపీకి గురై దేశంలో ఏటా 1.75 లక్షల మంది మృతిచెందుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.
వివరాలు 13లో ▸


తెలంగాణ 286 టీఎంసీలు..
గతేడాది జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకు ఇరు రాష్ట్రాలూ 1,004 టీఎంసీలను వినియోగించుకున్నట్లు కృష్ణా బోర్డు తేల్చింది.
వివరాలు 12లో ▸



పశ్చిమాసియా రణరంగం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ భారీ దాడులు

- అణు, సైనిక లక్ష్యాలపై క్షిపణుల వర్షం
- నతాంజ్ అణుశుద్ధి కర్మాగారం భస్మీపటలం.. దేశవ్యాప్తంగా 200కు పైగా లక్ష్యాలపై దాడులు
- తుడిచిపెట్టుకుపోయిన ఇరాన్ సైనిక పాటవం.. ఆర్మీ, ఆర్‌జీ చీఫ్, సైనిక ముఖ్యులంతా మృతి
- ఖమేనీ సలహాదారు, అణు శాస్త్రవేత్తలు కూడా
- అణు ఒప్పందానికి రాకుంటే అంతే.. ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- దాడులు ఆగబోవు: నెతన్యాహు
- భారీ ప్రతీకారం తప్పదు: ఖమేనీ
- పూర్తిస్థాయి యుద్ధ సంకేతాలు

- వివరాలు 2లో ▶

దాడుల గురించి ముందే తెలుసు
- వాటిల్లో మా ప్రమేయం లేదు
- అణ్వాయుధ కలల్ని ఇరాన్ పక్కన పెట్టాలని ట్రంప్ హెచ్చరిక

శాంతి నెలకొనాలి
- శాంతి సుస్థిరత నెలకొనాలని ఆకాంక్ష
- ఇరు దేశాలకూ ఏ సాయానికైనా సిద్ధం: మోదీ

ఎడాపెడా అక్రమ అరెస్టులపై చెంపదెబ్బ

చంద్రబాబు సర్కారుకు గట్టి షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

వాక్ స్వాతంత్ర్య హక్కును హరిస్తున్న ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ

జర్నలిస్టుగా కొమ్మినేని శ్రీనివాసరావు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్న ధర్మాసనం

తద్వారా ఆయన వాక్ స్వాతంత్ర్యాన్నీ రక్షించినట్లవుతుందని స్పష్టీకరణ

నవ్వడం నేరమా..? నవ్వితే అరెస్ట్ చేసేస్తారా? అంటూ మండిపాటు

నవ్వడం తప్పయితే తాము రోజూ నవ్వుతూనే కేసులను విచారిస్తుంటామని వ్యాఖ్య

ఏపీ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టిన సుప్రీంకోర్టు

కొమ్మినేనికి బెయిల్ మంజూరు

తగిన షరతులు విధించాలని కింది కోర్టుకు స్పష్టీకరణ

2లో



సుప్రీం ఆదేశాలు చంద్రబాబుకు పెద్ద చెంపపెట్టు



- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది
- నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పింది
- ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు కొమ్మినేని అరెస్టు తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదావహం
- 'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

2లో

విశ్వాస్ కుమార్ రమేశ్‌ను పరామర్శిస్తున్న ప్రధాని మోదీ



ప్రమాద స్థలానికి మోదీ

అహ్మదాబాద్‌లో విమాన శకలాలు, ధ్వంసమైన భవనాల పరిశీలన

- వివరాలు 6లో

- సిటీ సివిల్ ఆసుపత్రిలో క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్‌కు పరామర్శ
- మాజీ సీఎం విజయ్ రూపానీ కుటుంబానికి ఓదార్పు
- విమాన ప్రమాదం, తాజా పరిణామాలపై ఉన్నతస్థాయి సమీక్ష

ఇంజన్ వైఫల్యమే!

- మేడే కాల్, వీడియోల్లో ఇంజన్ శబ్దమే విన్పించలేదు
- టేకాఫ్ అవగానే మూగబోయి ఉంటాయని అభిప్రాయపడ్డ ఏవియేషన్ నిపుణులు
- రెండు ఇంజన్లు విఫలమవడం అత్యంత అసాధారణమని వ్యాఖ్య
- టేకాఫ్ సెట్టింగుల్లో లోపం, పైలట్ తప్పిదమే కారణం?

6లో

మెడికల్ కాలేజీ మృతులెందరు?
- రోజున్నర దాటినా అస్పష్టతే.. అధికారికంగా వెల్లడించని వైనం
- 24 మంది మరణించినట్టు ప్రాథమిక సమాచారం



ఇక అసెంబ్లీ పదవులు!

- ఖాళీల భర్తీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు
- సామాజిక, ప్రాంతాలవారీగా సమీకరణలపై దృష్టి
- ఖాళీగా చీఫ్ విప్ పదవి.. ఇటీవల రెండు విప్‌లూ ఖాళీ
- చీఫ్ విప్‌గా రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం.. లేదంటే బీసీ విప్‌లకు ప్రమోషన్?
- విప్‌ల కోసం పరిశీలనలో సామాజిక వర్గానికి రెండు పేర్లు

12లో

ఇంజనీరింగ్ ఫీజుల పెంపు వాయిదా!

ప్రైవేటు కాలేజీల జమా ఖర్చులపై నివేదిక ఇవ్వాలన్న సీఎం

- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలిందేమిటి అంటూ ప్రశ్న.. అధ్యయనం తర్వాత చూద్దామని వ్యాఖ్య
- విద్యాశాఖ ఉన్నత అధికారులతో సమీక్ష
- గురుకులాలకు తాళాలు, అధికారుల తీరుపై ఆగ్రహం!



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల పెంపును వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు కాలేజీల జమా ఖర్చుల ప్రతిపాదనలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అసలు ఇంజనీరింగ్ ఫీజులు పెంచాల్సిన అవసరం ఉందా? అని కూడా ఆయన అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, ఇంజనీరింగ్ కాలేజీల కౌన్సెలింగ్ షెడ్యూల్, టీచర్ల సమస్యలు, ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపు, గురుకుల హాస్టళ్ల నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా ఇంజనీరింగ్ ఫీజుల విషయమై సీఎం.. అధికారులను అనేక ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. ప్రైవేటు కాలేజీలపై గతంలో వేసిన టాస్క్‌ఫోర్స్ నివేదికలోని అంశాలేంటి? అని నిలదీశారు. ఫ్యాకల్టీ లేకపోవడం, ఇష్టానుసారం
మిగతా 13వ పేజీలో ▶

నైపుణ్యం పెంచాలి
విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు, నైపుణ్యం పెంచేలా విద్యా వ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మౌలిక వసతుల కల్పన, టీచర్లకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు.

ఇదంతే సంగతి



కానీ.. ప్రపంచంలో ఎవరి మీద ఎవరు దాడి చేస్తున్నా చూస్తూ ఎంజాయ్ చేస్తాం అంతేగా సార్!



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 3.64% పెంపు

- 2023 జనవరి 1 నుంచి వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 30.03 శాతానికి చేరిన మొత్తం డీఏ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు శుభవార్త తెలిపింది. ఉద్యోగుల డియర్నెస్ అలవెన్స్ (డీఏ)ను 3.64 శాతం పెంచింది. పెంచిన డీఏ 2023 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జారీచేసిన జీవోలు 78, 79లో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 26.39 శాతం ఇస్తుండగా..
మిగతా 2వ పేజీలో ▶

కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

- ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో జారీ
- సోమవారం విచారణకు హాజరు కావాలన్న అధికారులు
- వాస్తవానికి మే 28నే విచారణకు హాజరుకావాలని మే 26న నోటీసులు
- విదేశీ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నందున తిరిగి వచ్చాక హాజరవుతానన్న కేటీఆర్
- ఫార్ములా–ఈ కార్ రేస్‌లో రూ. 54.89 కోట్లు దుర్వినియోగమైనట్లు ఏసీబీ కేసు
- ఇప్పటికే జనవరి 9న కేటీఆర్ స్టేట్‌మెంట్ నమోదు చేసిన దర్యాప్తు సంస్థ



12లో



హుస్సేన్ సలామీ



మహమ్మద్ బాఘేరి

పశ్చిమాసియా రణరంగం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ భారీ దాడులు • అణు, సైనిక లక్ష్యాలపై క్షిపణుల వర్షం

- నతాంజ్ అణుశుద్ధి కర్మాగారం భస్మీపటలం!
- దేశవ్యాప్తంగా 200కు పైగా లక్ష్యాలపై దాడులు
- తుడిచిపెట్టుకుపోయిన ఇరాన్ సైనిక పాటవం
- ఆర్మీ, ఆర్‌జీ చీఫ్, సైనిక ముఖ్యులంతా మృతి
- ఖమేనీ సలహాదారు,అణు శాస్త్రవేత్తలు కూడా
- అణు ఒప్పందానికి రాకుంటే అంతే
- ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- దాడులు ఆగబోవు: నెతన్యాహు
- భారీ ప్రతీకారం తప్పదు: ఖమేనీ
- ఇజ్రాయెల్‌పైకి వందలాది క్షిపణులు, డ్రోన్లు

అణు ముప్పును తిప్పికొట్టేందుకే: నెతన్యాహు

ఇరాన్‌పై తమ తొలి దెబ్బ అదిరిందని నెతన్యాహు ప్రకటించారు. ''ఇజ్రాయెల్ మనుగడను సవాలు చేసే ఇరాన్ అణు ముప్పును రూపుమాపేందుకే తిప్పికొట్టడానికి దాడులు ప్రారంభించాం. అవి చాలా రోజులు కొనసాగుతాయి. ముప్పు తొలగేదాకా వెనకంజ వేసేది లేదు'' అని స్పష్టం చేశారు. ''ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తామని ఇరాన్ బహిరంగ ప్రకటనలు చేస్తోంది. అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకుంటోంది. ఇటీవల ఇరాన్ శుద్ధి చేసిన యురేనియంతో 9 అణుబాంబులను తయారు చేయొచ్చు. ఇరాన్‌ను ఇప్పుడు నిలువరించకపోతే ఇజ్రాయెల్‌కు పెనుప్రమాదం. నాజీ హోలోకాస్ట్ మారణకాండ నుంచి మేం పాఠాలు నేర్చుకున్నాం. మరోసారి బాధితులుగా మిగిలిలేందుకు సిద్ధంగా లేం'' అని స్పష్టం చేశారు. ''మా పోరు ఇరానీలతో కాదు. వారిని 46 ఏళ్లుగా అణచివేస్తున్న నియంతలతో. వారి బారినుంచి ఇరానీలకు విముక్తి కల్పించే రోజు ఎంతో దూరం లేదు'' అని చెప్పారు.

దుబాయ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ: పశ్చిమాసియా మరోసారి రణరంగమైంది. అమెరికా ఆశీస్సులతో ఇరాన్‌పై ఇజ్రయెల్ భీకర వైమానిక దాడులు చేసింది. అణు కర్మాగారాలే లక్ష్యంగా విరుచుకుపడింది. గురువారం అర్ధరాత్రి మొదలుకుని శుక్రవారం రాత్రిదాకా పలు విడతల్లో దేశవ్యాప్తంగా 200కు పైగా అణు, సైనిక లక్ష్యాలపై క్షిపణులు, బాంబుల వర్షం కురిపించింది. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ ముందస్తుగానే ఇరాన్‌లోకి చేరవేసి ఉంచిన డ్రోన్లు కూడా కూడా అదే సమయంలో వాటిపై దాడులకు దిగాయి. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా పూర్తిగా కుప్పకూల్చాయి. దాంతో ఇజ్రాయెల్ వైమానిక దాడులను అడ్డుకోవడం ఇరాన్‌కు అసాధ్యంగా మారింది. రోజంతా విడతలవారీగా జరిగిన ఈ దాడుల్లో ఇరాన్ కనీవినీ ఎరగని నష్టాలు చవిచూసింది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు పదేపదే భారీ క్షిపణులు, బాంబులతో చేసిన దాడుల్లో నతాంజ్‌లోని ప్రధాన అణుశుద్ధి కర్మాగారం భస్మీపటలమైంది. ఆరుగురు అణు శాస్త్రవేత్తలతో పాటు సైనిక ముఖ్యుల్లో దాదాపుగా అందరూ దాడులకు బలయ్యారు! మృతుల్లో ఇరాన్ సైన్యాధిపతి మహమ్మద్ బాఘేరి, రెవల్యూషనరీ గార్డ్స్ చీఫ్ హుస్సేన్ సలామీ, బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రాం చీఫ్ అమీర్ అలీ హజీజాదే, ఫెరేడౌన్ అబ్బాసీ దవానీ, మహమ్మద్ మెహదీ టెహ్రాన్చి, పలువురు వాయుసేన అత్యున్నతాధికారులతో పాటు దేశ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీ సలహాదారు అలీ షంఖానీ తదితరులు కూడా ఉన్నారు. ఇరాన్ అంతటా కూలిన భవనాలు, శిథిలాల దిబ్బలు, వాటినుంచి వెలువడ్డ పొగ ఆకాశాన్ని కమ్ముకుంటున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురిచూసి ఇరాన్ గుండెలపై కొట్టామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఆర్మీ చీఫ్‌తో పాటు తమవారి మృతిని ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ ధ్రువీకరించారు. భారీ స్థాయిలో ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కాసేపటికే ఇజ్రాయెల్‌పై ఇరాన్ 100కు పైగా డ్రోన్లతో దాడికి దిగింది. శుక్రవారం రాత్రి క్షిపణులు కూడా ప్రయోగించింది. 1980ల్లో ఇరాక్‌తో యుద్ధం తర్వాత ఇరాన్‌పై జరిగిన అతి పెద్ద దాడి ఇదే. ప్రాంతీయ ప్రత్యర్థుల పోరు యుద్ధానికి దారితీసేలా కన్పిస్తోంది. గాజాపై ఏడాదిన్నరకు పైగా యుద్ధం కొనసాగిస్తూనే ఇరాన్‌పైనా ఇజ్రాయెల్ కయ్యానికి కాలుదువ్వడం విశేషం. ఇరాన్‌కు జరిగిన భారీ నష్టాలకు లెబనాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ హెజ్బొల్లా సంతాపం తెలిపింది. అయితే ఇరాన్‌కు దన్నుగా ఇజ్రాయెల్‌పై దాడికి దిగే దిశగా ప్రకటనేమీ చేయలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో కనీసం 70 మందికి పైగా మరణించారని, 350 మందికి పైగా గాయపడ్డారని సమాచారం.



టెహ్రాన్‌లో భారీ పేలుళ్లతో ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ



టెహ్రాన్‌లో పేలుడుతో ధ్వంసమైన భవనం

ఇజ్రాయెల్‌లో ఎమర్జెన్సీ

ఇరాన్ ప్రతి దాడుల హెచ్చరికలతో ఇజ్రాయెల్ జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించింది. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, హోమ్ ఫ్రంట్ కమాండ్, అధికారుల సూచనలను పాటించాలని సూచించింది. దాంతో జనం నిత్యావసరాలను నిల్వ చేసి పెట్టుకునేందుకు సూపర్ మార్కెట్లకేసి పరుగులు తీశారు. అన్ని సరిహద్దుల వద్దా తమ సైనికులు సర్వ సన్నద్ధంగా ఉన్నారని మిలిటరీ చీఫ్ ఇయాల్ జమీర్ హెచ్చరించారు. తమను సవాలు చేయడానికి ప్రయత్నిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. రాడార్ కేంద్రాలతో పాటు డజన్ల కొద్దీ క్షిపణి ప్రయోగ వ్యవస్థలను కూడా నేలమట్టం చేసినట్టు తెలిపారు. టెల్ అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ మూసేసింది. నెతన్యాహును తీవ్రంగా వ్యతిరేకించే విపక్ష నేత యైర్ లపిడ్‌తో పాటు ప్రత్యర్థి పార్టీలు, శక్తులు కూడా ఇరాన్‌పై దాడికి పూర్తి మద్దతు తెలపడం విశేషం. తమ మనుగడకు ఇరాన్ ప్రబల ముప్పన్న అభిప్రాయం ఇజ్రాయెలీలందరిలోనూ ఉంది. ఇది నెతన్యాహుకు అతి పెద్ద సానుకూలాంశమని చెబుతున్నారు. మరోవైపు ఇరాన్‌లో కూడా ఎమర్జెన్సీని మించిన పరిస్థితి కొనసాగుతోంది.

సైనిక సారథులంతా బలి

ఇజ్రాయెల్ దాడుల భయంతో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన అత్యున్నత అధికారులు అత్యంత భద్రతతో కూడిన భూగర్భ బంకర్‌లో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దానిపై అత్యంత కచ్చితత్వంతో బాంబులు, క్షిపణులు ప్రయోగించడంతో వారంతా దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఐఆర్‌జీసీ చీఫ్ హొస్సేన్ సలామీ, ఇరాన్ సైన్యాధిపతి మహమ్మద్ బాఘేరి ఉన్నారు.

ఇరాన్ నడిబొడ్డులోనే మొసాద్ డ్రోన్ స్థావరం!

మరో సంచలన కోవర్ట్ ఆపరేషన్

కోవర్ట్ ఆపరేషన్లలో తనకు తిరుగులేదని ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ మరోసారి నిరూపించుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ రైజింగ్ లయన్ ఆపరేషన్‌కు తనదైన శైలిలో సర్వం సానుకూలం చేసి పెట్టింది. అందుకోసం ఏకంగా టెహ్రాన్‌కు అతి సమీపంలోనే డ్రోన్ల స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంది! అందుకు కావాల్సిన సాయుధ సంపత్తితో పాటు ఏకంగా ఇజ్రాయెల్ స్పెషల్ ఫోర్సెస్ కమెండోలను కూడా గుట్టుచప్పుడు కాకుండా టెహ్రాన్‌కు చేర్చి ఉంచింది. అత్యాధునిక డ్రోన్లతో పాటు తిరుగులేని కచ్చితత్వంతో కూడిన గైడెడ్ ఆయుధాలను సిద్ధం చేసింది. గురువారం అర్ధరాత్రి దాటాక ఇజ్రాయెల్ వైమానిక దాడులు మొదలు కాగానే వాటిని యాక్టివేట్ చేసింది. కీలకమైన ఇరాన్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి స్థావరాలను, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను నేలమట్టం చేసింది. అలా వైమానిక దాడులకు లైన్ క్లియర్ చేసిపెట్టింది.

నతాంజ్ నేలమట్టం

నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై దాడుల్లో పైలట్ ఇంధనశుద్ధి ప్లాంటు, సెంట్రిఫ్యూజ్ విభాగాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థ తదితరాలన్నీ ధ్వంసమైనట్టు తెలుస్తోంది. అణ్వాయుధాల తయారీ పనులు ఇక్కడే సాగుతున్నట్టు ఇజ్రాయెల్ చెబుతోంది. ఇది ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో ఎడారి కింద భూగర్భంలో ఏకంగా లక్ష చదరపు మీటర్లలో విస్తరించింది.

ఫైటర్లకు గాల్లోనే ఇంధనం

ఇరాన్‌పై దాడుల సందర్భంగా ఇజ్రాయెల్ తన వైమానిక శక్తిని పూర్తిస్థాయిలో ప్రదర్శించింది. దాని యుద్ధ విమానాలు మధ్యలో వెనక్కు వచ్చే అవసరం లేకుండా వాటికి అవసరమైన ఇంధనాన్ని రీఫ్యూయలర్ల ద్వారా గాల్లోనే ఎప్పటికప్పుడు అందజేస్తూ వచ్చింది. అయితే ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు ఇరాన్ గగనతలం లోపలికి చొచ్చుకెళ్లాయా, లేక సమీప దేశాల నుంచే క్షిపణులు ప్రయోగించాయా అన్నదానిపై స్పష్టత లేదు. తమ ప్రాంతాల మీదుగా దూసుకుపోతున్న ఇజ్రాయెల్ యుద్ధ విమానాలను ఇరాక్ ప్రజలు ఊపిరి బిగబట్టి వీక్షించారు.

ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్

ఇజ్రాయెల్ దాడులకు తీవ్రమైన శిక్ష విధిస్తామని ఖమేనీ ప్రకటించారు. దాడుల అనంతరం అత్యున్నత స్థాయి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వెంటనే 100 డ్రోన్లతో ఇజ్రాయెల్‌పై దాడులు చేశారు. వాటిని ఇజ్రాయెల్ తిప్పికొట్టింది. చాలా డ్రోన్లను కూల్చేసింది. ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ తన వైమానిక స్థావరాలను, గగన తలాన్ని మూసివేసింది. పక్క దేశం ఇరాక్ కూడా గగనతలాన్ని మూసేసింది. అన్ని విమానాశ్రయాలలో విమాన రాకపోకలను నిలిపివేసింది. దాంతో ఇరాన్, ఇరాక్ మీదుగా వెళ్లే అనేక విమానాలు దారిమళ్లించుకోవాల్సి వచ్చింది. మరికొన్ని విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ఈ కారణంగా భారత్‌కు సంబంధించిన పలు విమాన సర్వీసులు ప్రభావితమయ్యాయి.

దాడులు ఎక్కడెక్కడ?

రాజధాని టెహ్రాన్ మొదలుకుని ఇరాన్‌వ్యాప్తంగా పలు నగరాలు, ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. తబ్రీజ్, కెర్మన్ షా సైనిక స్థావరాలతో పాటు అరక్, బుషెహ్ర్ అణు స్థావరాలు వీటిలో ఉన్నాయి. టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు దాడుల్లో నేలమట్టమయ్యాయి. అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలకు నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్తలు, సీనియర్ అధికారులను ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకుంది. నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై దాడులను అంతర్జాతీయ అణుఇంధన సంస్థ ధ్రువీకరించింది. రేడియేషన్ స్థాయిని గమనిస్తున్నట్టు పేర్కొంది.

దాడుల గురించి ముందే తెలుసు: ట్రంప్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల గురించి తమకు ముందే తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించారు. అయితే వాటిలో తమ ప్రమేయం లేదన్నారు. ఇకనైనా అణ్వాయుధ కలలను పక్కన పెట్టాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ''దౌత్యపరమైన పరిష్కారానికి ముందుకు రావాలి. కాదని ప్రతీకార దాడులకు పాల్పడితే ఎదుర్కొనేందుకు మా సెంట్రల్ కమాండ్ సిద్ధంగా ఉంది. అమెరికా తనను తాను రక్షించుకోవడంతో పాటు ఇజ్రాయెల్‌ను కూడా కాపాడుతుంది. మాతో ఇరాన్ తక్షణం అణు ఒప్పందానికి రావాలి. అదొక్కటే దారి. లేదంటే మరిన్ని తీవ్ర పర్యవసానాలు తప్పవు'' అంటూ తీవ్రంగా హెచ్చరించారు. ''తదుపరి దశలో మరింత తీవ్రమైన దాడులకు ప్రణాళికలు సిద్ధమైపోయాయి. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. కాలాతీతం కాకముందే తెలివైన నిర్ణయం తీసుకోండి. భారీ జన హననాన్ని తప్పించండి. ఇరాన్ అనే దేశమే లేకుండా పోయే పరిస్థితి రాకుండా చూసుకోండి'' అంటూ అల్టిమేటమిచ్చారు. జాతీయ భద్రతా మండలి చీఫ్ తదితరులతో వైట్‌హౌస్ సిచ్యుయేషన్ రూమ్‌లో ట్రంప్ అత్యవసరంగా సమావేశమయ్యారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితులను సమీక్షించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చర్యలు ఏకపక్షమైనవని, తమ ప్రమేయం లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పారు.

శాంతి నెలకొనాలి: మోదీ

పశ్చిమాసియాలో పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వెలిబుచ్చారు. అక్కడ తక్షణం శాంతి, సుస్థిరత నెలకొనాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ఆయనకు ఫోన్ చేశారు. ఇరాన్‌పై దాడులకు దారితీసిన పరిస్థితులను వివరించారు. ఇరాన్‌తో పాటు పశ్చిమాసియా దేశాల్లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. ఇజ్రాయెల్, ఇరాన్ ఇరు దేశాలతోనూ భారత్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని గుర్తు చేసింది. వాటికి అవసరమైన ఎలాంటి సాయానికైనా సిద్ధమని పేర్కొంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి పట్ల రష్యాతో సహా ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి.

ఎడాపెడా అక్రమ అరెస్టులపై చెంపదెబ్బ

చంద్రబాబు సర్కారుకు గట్టి షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

సాక్షి, అమరావతి


ఆంధ్రప్రదేశ్‌లో పౌరులు, మేధావులు, పాత్రికేయుల వాక్ స్వాతంత్ర్య హక్కును హరిస్తూ వస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. వాక్ స్వాతంత్ర్య హక్కును కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని తేల్చిచెప్పింది. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును తప్పుపట్టింది. లైవ్ షోలో ఓ ప్యానలిస్ట్ చేసిన వ్యాఖ్యలపై నవ్వినందుకు కొమ్మినేనిని అరెస్ట్ చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. ''నవ్వడం నేరమా? దానికే అరెస్ట్ చేసేస్తారా?'' అంటూ మండిపడింది. నవ్వడమే తప్పయితే, తాము కూడా ప్రతి రోజూ నవ్వుతూనే కేసులను విచారణ చేస్తుంటామంటూ గుర్తు చేసింది. లైవ్ షోలో ప్యానలిస్ట్ వ్యాఖ్యలకు కొమ్మినేని శ్రీనివాసరావు నవ్వారే తప్ప, ఆయన ఎలాంటి అనుచిత, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. ఓ జర్నలిస్టుగా లైవ్ న్యూస్ షోలో పాల్గొనే కొమ్మినేని హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని, తద్వారా ఆయన వాక్ స్వాతంత్ర్య హక్కును కూడా పరిరక్షించినట్లవుతుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు ఈ నెల 8న నమోదు చేసిన కేసులో కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. బెయిల్ మంజూరు సందర్భంగా షరతులు విధించాలని కింది కోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అరెస్ట్... రిమాండ్‌ను సవాల్ చేసిన కొమ్మినేని

కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించే కేఎస్సార్ లైవ్ షోలో పాల్గొన్న మరో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు అమరావతి రాజధాని గురించి పలు వ్యాఖ్యలు చేశారు. దీంతో కృష్ణంరాజు, కొమ్మినేనిపై టీడీపీకి చెందిన కంభంపాటి శిరీష ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కొమ్మినేని, కృష్ణంరాజుపై ఐటీ చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. తర్వాత పోలీసులు కొమ్మినేని శ్రీనివాసరావును హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఆయనను మంగళగిరి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో కొమ్మినేని తన అరెస్ట్, రిమాండ్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. కొమ్మినేని తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు.

- ఈ నెల 6న కొమ్మినేని లైవ్ షో నిర్వహించారని, అందులో ప్యానలిస్ట్‌గా పాల్గొన్న మరో సీనియర్ జర్నలిస్ట్ అమరావతి గురించి వ్యాఖ్యలు చేశారని సిద్ధార్థ దవే ధర్మాసనానికి వివరించారు. ఈ వ్యాఖ్యలతో కొమ్మినేనికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన ఎవరి మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయలేదని నివేదించారు. ప్యానలిస్ట్ వ్యాఖ్యలకు.. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిని బాధ్యుడిగా చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. మరొకరు చేసిన వ్యాఖ్యలకు యాంకర్‌ను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించిన జస్టిస్ మన్మోహన్... అలా అదుపులోకి తీసుకునేందుకు చట్టం అనుమతిస్తుందా? అని ప్రశ్నించారు. ఏ నిబంధన మేరకు అరెస్టు చేశారో చెప్పాలని ఏపీ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రాలను ప్రశ్నించారు.

చర్చలో ఆ వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు కొమ్మినేని నవ్వారని, ఈ విషయంలో ప్రేక్షక పాత్ర పోషించారని వివరించారు. ఆయన మాట్లాడేటప్పుడు అడ్డుకోకుండా నవ్వారని రోహత్గి బదులిచ్చారు. ఈ వాదనపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. నవ్వడం నేరమా? నవ్వితే అరెస్ట్ చేస్తారా? అంటూ నిలదీసింది. ఎవరైనా నవ్వొచ్చేలా మాట్లాడితే ధర్మాసనంపై ఉన్న తాము కూడా నవ్వుతామన్న జస్టిస్ మన్మోహన్ అంతమాత్రాన... తప్పుడు కేసులు అంటగట్టేస్తారా? అని ప్రశ్నించారు. జస్టిస్ మిశ్రా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ... ప్రతి రోజూ ఇలా జరుగుతూనే ఉంటుందని అన్నారు. కొమ్మినేని చర్చలో ప్రేక్షకుడు కాదని రోహత్గీ చెప్పగా... ఆయన ఆ వ్యాఖ్యలు చేయలేదు కదా? అని జస్టిస్ మిశ్రా అసహనం వ్యక్తం చేశారు. పిటిషనర్ స్వయంగా ఎటువంటి పరువు నష్టం కలిగించే, అవమానకర వ్యాఖ్యలు చేయలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. లైవ్ షోలో ఆయన పాత్రికేయ భాగస్వామ్యం రక్షణకు అర్హమైనదని.. ఇది వాక్ స్వాతంత్ర్య హక్కును కాపాడుతుందని తెలిపింది. కొమ్మినేని అరెస్ట్ ఎంతమాత్రం సహేతుకం కాదంటూ ఆయనను బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. ట్రయల్ కోర్టు విధించే నిబంధనలు, షరతులకు లోబడి ఈ నెల 8న నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ నంబర్ 108లో కొమ్మినేనిని బెయిల్‌పై విడుదల చేయాలని ఏపీ పోలీసులకు నిర్దేశించింది. తాను నిర్వహించే షోలో కొమ్మినేని ఎలాంటి పరువు నష్టం వ్యాఖ్యలు చేయడానికి వీల్లేదని, ఇతరులను అలాంటి ప్రకటనలు చేయడానికి అనుమతించడం గానీ చేయొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



"ఎవరో చేసిన వ్యాఖ్యలకు కావాలని కుట్ర సంబంధం అంటగడుతూ 70 ఏళ్ల సీనియర్ జర్నలిస్ట్‌ను అక్రమంగా అరెస్టు చేస్తారా?"

"ఏపీ ప్రభుత్వం తీరు ఎంతమాత్రం ఆమోదనీయం కాదు. పాత్రికేయ హక్కులు, వాక్ స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులను కాపాడాల్సిందే"

"అరెస్టు చేయడానికి... నవ్వడమే కారణం అని చెప్పడం సరికాదు. నవ్వినంత మాత్రాన కుట్రలో భాగస్వామ్యం అంటగడతారా? అలాగంటే కోర్టులో పలు సందర్భాల్లో మేం కూడా నవ్వుతాం"

–సుప్రీంకోర్టు ధర్మాసనం

సుప్రీం ఆదేశాలు చంద్రబాబుకు పెద్ద చెంపపెట్టు

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది
- నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పింది
- ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు కొమ్మినేని అరెస్టు తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదావహం
- 'ఎక్స్' వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెద్ద చెంపపెట్టు' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ అభివర్ణించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఆయన పోస్టు చేశారు. 'నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు సుప్రీంకోర్టు గట్టిగా బుద్ధిచెప్పింది. కొమ్మినేని అరెస్టు ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు తీవ్ర భంగకరమని సుప్రీంకోర్టు చెప్పడం ముదావహం' అని పేర్కొన్నారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే.. 'అమరావతి నిర్మాణం పేరిట రూ.వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించడానికి తన ఎల్లో ముఠాతో కలిసి చంద్రబాబు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలన నుంచి మళ్లించడానికి, చేయని వ్యాఖ్యలను కొమ్మినేనికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్ ద్వారా పథకం ప్రకారం విష ప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు. ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని 'సాక్షి' మీడియా యూనిట్ ఆఫీసుల మీద, కార్యాలయాల మీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబు తన తప్పు తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీకి, 'సాక్షి' మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా మాట్లాడడంతోనే ఆయన రాజకీయ లబ్ధి కోసం ఈ కుట్ర పన్నారని అర్థం అవుతోంది. విశ్లేషకుడి వ్యాఖ్యలతో యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేనికి ఏం సంబంధం అంటూ ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటుకావు. సత్యమేవ జయతే' అని పేర్కొన్నారు.

డీఏ 3.64% పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

తాజాగా పెంపుతో 30.03 శాతానికి చేరుతుంది. తాజాగా పెంచిన డీఏను జూన్ నెల వేతనంతో జూలైలో ఇస్తారు. 2023 జనవరి 1వ తేదీ నుంచి 2025 మే 31 వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమచేస్తారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లిస్తారు. సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు 10 శాతం డీఏ బకాయిలను ప్రాన్ ఖాతాల్లో జమచేస్తారు. మిగిలిన 90 శాతం బకాయిలను 28 వాయిదాల్లో జూన్ నెల వేతనంతో నెలవారీగా చెల్లిస్తామని ఉత్తర్వుల్లో వెల్లడించారు. 1 జూలై 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రత్యేకంగా ఆరు నెలల తర్వాత జారీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎమ్మెల్యే హరీశ్‌బాబుపై కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. 2023 ఎన్నికలప్పుడు అనుమతి లేకుండా ఆసిఫాబాద్ జిల్లా దహేగావ్‌లో సభ నిర్వహించారని నమోదైన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఎస్టీపీపీకి 'గ్లోబల్ గ్రీన్‌టెక్ పర్యావరణ' అవార్డు



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో ఇప్పటికే వరుసగా అవార్డులు అందుకుంది. ఢిల్లీలో గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 24వ గ్లోబల్ గ్రీన్‌టెక్ పర్యావరణ, సస్టెయినబిలిటీ అవార్డు–2025 వేడుకల్లో ఎస్టీపీపీకి గ్లోబల్ గ్రీన్‌టెక్ పర్యావరణ, సస్టెయినబిలిటీ అవార్డు లభించింది. ఈ మేరకు ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి అవార్డు అందుకున్నారు. ఎస్టీపీపీ ఇప్పటివరకు 50 అవార్డులు అందుకుంది. సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణరావు ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి మిథనాల్ ప్లాంటును ఏర్పాటు చేశామని, త్వరలో ఇది అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

మారుమూల గ్రామాల్లోని యువతకు టెక్ శిక్షణ. నెక్స్ట్‌వేవ్ & ఎన్ ఎస్ డి సి కృషితో కొత్త అధ్యాయం



ఉత్తరప్రదేశ్ బాగ్‌పత్ జిల్లాలోని ఛప్రౌలి అనే గ్రామంలో యువతకు కొత్త భవిష్యత్తు చూపిస్తూ ఒక పెనుమార్పు తెచ్చే విద్యా కార్యక్రమం మొదలైంది. నెక్స్ట్‌వేవ్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) కలసి గ్రామీణ ఉత్తరప్రదేశ్‌లో టెక్ స్కిల్స్ నేర్పే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని ఛప్రౌలిలోని చౌదరి చరణ్ సింగ్ ప్రభుత్వ మహావిద్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీ జయంత్ చౌదరి గారు ప్రారంభించారు. అక్కడే 'ఫ్యూచర్ స్కిల్ ల్యాబ్' పేరుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్కిల్ ఇండియా సెంటర్‌లో ఆధునిక టెక్నాలజీలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నారు. అక్కడి యువతలో మార్పు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అక్కడ జాయిన్ అయిన విద్యార్థుల్లో చాలా మంది కంప్యూటర్ ఎప్పుడూ వాడలేదు. మొదటి రోజు ల్యాప్‌టాప్ ఆన్ చేయడం, కీబోర్డ్ ఎలా వాడాలో నేర్పించారు. ఇప్పుడు చూస్తే వారు వెబ్ యాప్స్ రూపొందించడం మొదలు పెట్టి టెక్ రంగంలో కెరీర్ దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సిన ఒక గొప్ప విషయం ఈ విద్యార్థుల పరిస్థితులు. వీళ్లంతా రైతు కుటుంబాల నుంచి వచ్చారు. ఉదయం 4 గంటలకే లేచి ఇంటి పనులు, పొలంలో పనులు పూర్తి చేసి, 5 నుంచి 10 కిలోమీటర్లు నడిచి స్కిల్ సెంటర్‌కు వస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్లాసులు అటెండ్ అవుతారు. తర్వాత మళ్లీ ఇంటికి వెళ్లి వంట పనులు, ఇల్లు చూసుకోవాలి. అయినా 4.0 టెక్నాలజీస్‌ను పట్టుదలతో నేర్చుకుంటున్నారు.

ఒకప్పుడు బిడియంగా ఉంటూ ఎవరితోనైనా మాట్లాడాలంటే ఇబ్బంది పడే స్వాతి తోకర్ ఇప్పుడు కెరీర్ వైపు ధైర్యంగా ముందుకు అడుగులేస్తోంది. తండ్రిని కోల్పోయిన తర్వాత కుటుంబ బాధ్యతను తన భుజాలపై వేసుకుంది. ప్రస్తుతం కోడింగ్ నేర్చుకుంటూ, తాను మాత్రమే కాదు, తన వయసు అమ్మాయిలందరికీ ఆదర్శంగా మారింది.

నెక్స్ట్‌వేవ్ సీఈవో రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ, "లక్షలాది మంది విద్యార్థులకు టెక్నాలజీ స్కిల్స్ నేర్పించడమే మా లక్ష్యం. వాళ్లు చక్కగా స్కిల్స్ నేర్చుకుని, మంచి కెరీర్ నిర్మించుకోవాలి. తమ కుటుంబాలు, దేశానికి ఉపయోగపడేలా ఎదగాలి. ఈ రోజు టెక్నాలజీలకే కాదు, రేపటి భవిష్యత్తుకి కూడా సిద్ధంగా ఉండేలా మేము తయారుచేస్తున్నాం" అన్నారు.

మొదట్లో వాళ్ళ పిల్లలు నేర్చుకోగలరా అని ఈ ప్రోగ్రాం పట్ల సందేహంగా ఉన్న తల్లిదండ్రులే ఇప్పుడు పెద్ద ఎత్తులో మద్దతు ఇస్తున్నారు. తమ పిల్లలు కోడ్ రాయటం, వెబ్ యాప్‌లు రూపొందించటం, నేర్చుకున్న విషయాల గురించి ధైర్యంగా మాట్లాడటం చూసి వాళ్ల నమ్మకాలే మారిపోయాయి. ఈ స్కిల్ సెంటర్ పై చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే తదుపరి బ్యాచ్‌లో చేర్చుకోమని 25 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చౌదరి చరణ్ సింగ్ ప్రభుత్వ మహావిద్యాలయం ప్రిన్సిపాల్ డా. ప్రతీక్ దహియాకు ఇది ఒక పెద్ద లక్ష్యానికి మొదటి అడుగులాగా కనిపిస్తోంది. "ఈ కళాశాల భారత రత్న చౌదరి చరణ్ సింగ్ గారి పేరు మీద ఉంది," అని చెప్పారు. "ఆయన ఎప్పుడూ దేశం అభివృద్ధి బాటలో సాగాలంటే అది గ్రామాల నుంచి జరగాలి' అని చెప్పేవారు. గ్రామీణ పిల్లలకు టెక్నాలజీ స్కిల్స్ ఉండాలన్నది ఆయన కల. ఇప్పుడు ఆ కల నిజమవుతుండడం ఆనందంగా ఉంది."

గ్రామీణ భారతంలో పాత పద్ధతుల విద్యపై ఆదరణ తగ్గుతూ, స్కిల్స్‌తో కూడిన ప్రాక్టికల్ లెర్నింగ్ పట్ల ఆసక్తి పెరుగుతోంది. ఆ మార్పునే ఈ ప్రోగ్రామ్ ప్రతిబింబిస్తోంది. నెక్స్ట్‌వేవ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ విద్యార్థులకు కోడింగ్ మాత్రమే కాకుండా, కమ్యూనికేషన్, టీం వర్క్, సమస్యల పరిష్కారం, ప్రాజెక్ట్ ప్రాక్టీస్ ఇలా ఇండస్ట్రీ కి అవసరమైన అనేక నైపుణ్యాలు నేర్పిస్తోంది. భాష సమస్యను ఎదుర్కొంటున్న విద్యార్థులకు మెంటర్లు ఏఐ టూల్స్ ద్వారా వర్నాక్యులర్ సపోర్ట్ ఇవ్వడమూ ఓ పెద్ద ముందడుగు. కేవలం 6 నెలల్లోనే ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలు పొందడం వల్ల, గ్రామీణ యువతలో ఎంత వేగంగా టాలెంట్ వెలికి తీయవచ్చో స్పష్టమవుతోంది. మొదట్లో కేవలం 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన ప్రోగ్రాం, ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాలనంతా తాకుతోంది. NSDC, స్థానిక నేతల మద్దతుతో నగరాల్లో మాత్రమే ఉండే అవకాశాల్ని గ్రామీణ యువతకు అందించేందుకు నెక్స్ట్ వేవ్ వేగంగా ముందుకెళ్తోంది. అవకాశం దరిచేరదు అనిపించిన గ్రామాల్లో ఇప్పుడు కొత్త ఉద్యమం మొదలైంది. ఈ కార్యక్రమం కేవలం శిక్షణ ఇవ్వడం మాత్రమే కాదు, విద్యార్థులలో, కుటుంబాల్లో, గ్రామీణ భారత్ భవిష్యత్తు నిర్మాణం చేయగలదు అన్న విశ్వాసాన్ని మళ్లీ చేకూర్చడం దీని అసలైన లక్ష్యం.

NxtWave Institute of Advanced Technologies
కొటిల్ కాపుల హౌస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, తెలంగాణ, 500032

దివ్యాంగులకు రెండు విధాలా వివాహ ప్రోత్సాహకం అందిస్తాం

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు రెండు విధాలా వివాహ ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ (టీవీసీసీ) చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి ప్రోత్సాహకం కింద రూ.1,00,116తో పాటు దివ్యాంగ వ్యక్తిని వివాహం చేసుకున్నందుకు రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తామన్నారు. తాజాగా దివ్యాంగులకు పరికరాలందించే విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి ఉదారంగా నిర్ణయం తీసుకున్నారని, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులందరికీ పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. శుక్రవారం మలక్‌పేటలోని టీవీసీసీ కార్యాలయంలో వివిధ దివ్యాంగుల సంక్షేమ సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు.. ముత్తినేని వీరయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలోనూ దివ్యాంగులకు కోటా కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

"ధర్మాచరణ కల్గినవారిని సంరక్షించుటకు, అధర్మ ఆచరణ కల్గినవారిని లేకుండచేయుటకు, ధర్మసంస్థాపన మొనర్చుటకు యుగయుగమందు పుట్టుచుందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 14 జూన్ 2025

ఇజ్రాయెల్ బాధ్యతారాహిత్యం

గాజాలో నరమేధం కొనసాగిస్తూనే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ మరో కుంపటి రాజేసింది. ఎలాంటి కవ్వింపూ లేకుండానే శుక్రవారం ఇరాన్‌పై దాడులకు దిగి రాజధాని టెహ్రాన్‌తో సహా అనేకచోట్ల బాంబుల వర్షం కురిపించింది. 200 యుద్ధ విమానాలు ఏకబిగిన సాగించిన ఈ దాడుల్లో ఇరాన్ సైన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న సైనిక దళాల చీఫ్, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్, ఇరాన్ ఎమర్జెన్సీ కమాండ్ చీఫ్‌ల ప్రాణాలు తీయటంతో పాటు అణు కార్యక్రమంలో చురుగ్గా ఉంటున్న ఆరుగురు శాస్త్రవేత్తలను హతమార్చింది. ఇరాన్ అణు స్థావరాలను కూడా లక్ష్యం చేసుకున్నట్టు సమాచారం. ఆ దేశంపై తమ యుద్ధం ఆగదని కూడా ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రతీకారంగా ఇరాన్ వంద డ్రోన్‌లతో సాగించిన దాడి పెద్దగా ఫలించిన వైనం కనబడట్లేదు. అమెరికా అధ్యక్ష ఎన్నికలప్పుడూ, అధికారం స్వీకరించాకా ట్రంప్ ఇరాన్‌తో అణు ఒప్పందం గురించి పదేపదే ప్రకటనలు చేశారు. కానీ ఇజ్రాయెల్ దుందుడుకు చర్య చూస్తుంటే ఆ ప్రకటనల్లోని నిజాయతీ ప్రశ్నార్థకమైంది. ఎందుకంటే అమెరికా లోపాయకారీ అనుమతి లేకుండా ఆ దేశం ఇలాంటి దాడులకు తెగించే అవకాశం లేదు. తాజా దాడుల్ని ఖండించకపోగా ఒప్పందం కోసం వస్తున్న అవకాశాలను ఇరాన్ కాలదన్నుకుంటున్నదని, ఇదే కొనసాగితే పరిస్థితి విషమం కావొచ్చని శుక్రవారం ఆ దేశాన్ని ట్రంప్ హెచ్చరించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. నిజాయతీ ఉంటే అణు ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగా ఈ దాడులేమిటని ఇజ్రాయెల్‌ను నిలదీసి ఉండాలి. చర్చలే అణు ఒప్పందానికి సంబంధించినవైనప్పుడు ఇరాన్ అణు శాస్త్రవేత్తల్ని హత్య చేయటం నేరపూరితమని చెప్పివుండాలి. ఆ పని చేయకపోగా ఇజ్రాయెల్ దాడుల్లో తమ ప్రమేయం లేదని, కనుక పశ్చిమాసియాలోని అమెరికన్ స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగొద్దని ఇరాన్‌ను హెచ్చరించింది.

ఇరాన్‌తో అణు ఒప్పందం గురించి తన దూతల ద్వారా చర్చలు మొదలెట్టాక వాటిని భగ్నం చేసే చర్యకు పాల్పడవద్దని ఆ మధ్య ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించారు. అయితే అమెరికా విధిస్తున్న షరతులు తమకు సమ్మతం కాదని మూడు రోజుల క్రితం ఇరాన్ ప్రకటించాక పరిస్థితి మారింది. వాస్తవానికి వచ్చే ఆదివారం అమెరికా–ఇరాన్‌ల మధ్య మరో దఫా చర్చలు జరగాల్సి ఉంది. తాజా దాడుల తర్వాత వాటిని నిలిపివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అణుబాంబు వైపుగా అడుగులేస్తున్నదని ఇరాన్‌పై ఆరోపణలు చేసేవారు ఏ కవ్వింపూ లేకుండానే ఇజ్రాయెల్ దాడులు చేయటాన్ని ఏ రకంగా సమర్థిస్తారు? ఈ దాడులకు 24 గంటల ముందు పశ్చిమాసియా దేశాల్లోని తమ సైనికాధికారుల కుటుంబాలు వెనక్కి వచ్చేయాలంటూ పిలుపునివ్వటం, ఇరాక్ నుంచి దౌత్యవేత్తల్ని కూడా వెనుదిరగమని అమెరికా చెప్పటం గమనార్హం. వాస్తవానికి గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌కు విమానాలూ, క్షిపణులూ, ఇతర ఆయుధాలు పంపిస్తూ తాజా దాడులకు అమెరికాయే పూర్వరంగాన్ని సిద్ధం చేసిందా అనే అనుమానం కలుగుతోంది.

అసలే ప్రపంచం పలు సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. కరోనా మహమ్మారి కాటేయటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ తీవ్రంగా దెబ్బతిని ఉన్నాయి. అయిదేళ్లు కావస్తున్నా ఏ దేశమూ పూర్తిగా కోలుకున్న దాఖలా కనబడటం లేదు. అంతక్రితమే 1991లో కువైట్‌పై ఇరాక్ సాగించిన యుద్ధం మొదలుకొని ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య టర్కీ, సిరియాల మధ్య తీవ్ర ఘర్షణలు సాగాయి. ఉగ్రవాదాన్ని అంతమొందించే పేరిట ఇరాక్‌పై అమెరికా, పాశ్చాత్య దేశాలు కొనసాగించిన యుద్ధం, లిబియాలో కల్లోలం సృష్టించి గడాఫీని అంతం చేయటం వంటి పరిణామాల నుంచి పశ్చిమాసియా ఇంకా కోలుకోలేదు. అక్కడ చాలా దేశాల్లో సాయుధ ముఠాలు పరస్పరం తలపడుతున్నాయి. ఇజ్రాయెల్–పాలస్తీనా వైరం సరేసరి. ఉక్రెయిన్‌తో యుద్ధానికి దిగిన రష్యా బయటకొచ్చే మార్గం తెలియక కొట్టుమిట్టాడుతోంది. దాన్నుంచి సాయం అందే దారులు మూసుకుపోవటంతో సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మిలిటెంట్ల దాడుల తర్వాత దేశం విడిచి పరారయ్యారు. ఇప్పుడక్కడ అమెరికా మద్దతుతో ఒకప్పటి అంతర్జాతీయ ఉగ్రవాది మహమ్మద్ అల్–షారా దేశాధ్యక్షుడయ్యాడు. సరిగ్గా నెలరోజుల క్రితం గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సదస్సుకెళ్లిన ట్రంప్ ఆయనపై పొగడ్తల వర్షం కురిపించారు.

ఇలా పశ్చిమాసియా రకరకాల క్లేశాలతో ఇప్పటికీ నెత్తురోడుతూ ఉండగా దాన్ని మరింత ఊబిలోకి నెట్టేలా తాజా పరిణామాలున్నాయి. ఇరాన్‌పై దాడి జరిగితే తాము మౌనంగా ఉండబోమని ఆ మధ్య రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. అదే జరిగితే ఇజ్రాయెల్ తరఫున అమెరికా నేరుగా రంగంలోకి దిగుతుంది. సారాంశంలో ఇజ్రాయెల్ దుందుడుకు చేష్టలు, అమెరికా గుడ్లప్పగించి చూడటం ఒక్క పశ్చిమాసియాను మాత్రమే కాదు... ప్రపంచాన్నే యుద్ధం అంచుల్లోకి నెడుతున్నాయి. తాను అధికారంలోకొచ్చాక ఇరాన్‌తో 46 ఏళ్లుగా కొనసాగుతున్న వైరానికి స్వస్తి పలుకుతానని, ప్రపంచంలో ఏ మూలనా అమెరికా సైన్యం ఉండాల్సిన అవసరం లేకుండా చేస్తానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలు ట్రంప్ మరిచారా? ఈ యుద్ధం కొనసాగితే తక్షణం హోర్ముజ్ జలసంధి మూతబడి ప్రపంచ దేశాలకు పోయే 25 శాతం ముడిచమురు, సహజవాయు రవాణా నిలిచిపోతుంది. పర్యవసానంగా అంతంతమాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలు మరింత కుంగుతాయి. ఇక అమెరికా, రష్యా, చైనాలు నేరుగా దిగితే జరిగే పరిణామాలు ఊహాకందని ఉత్పాతాన్ని సృష్టిస్తాయి. అగ్రరాజ్యాలు... ముఖ్యంగా అమెరికా తమ మూర్ఖత్వాన్ని విడనాడి ఇజ్రాయెల్‌ను దారికి తేవాలి. లేనట్టయితే భవిష్యత్తరాలు క్షమించవు.

గాల్లో ప్రాణాలు

సందర్భం



కె.వి.జె. రావు

దేశంలో విమానయాన నియంత్రణ సంస్థ అయిన 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) పాత్రపైనే ఇపుడు అనివార్యంగా ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రయాణికుల భద్రత పట్ల ఉపేక్ష, జాగ్రత్త, ఆదుర్దా కనబరచక పోవడం డీజీసీఏ స్వభావంగా మారిపోయింది. విమాన భద్రతా ఉల్లంఘనలు 2008 నుంచి వేలాదిగా చోటుచేసు కుంటున్నా అది వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. దీనికి డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు పయనించగలిగిన బోయింగ్ 777-200, 777-300-ఇ.ఆర్. విమానాలను ఎయిర్ ఇండియా రంగంలోకి దించింది. భారత్ నుంచి అమెరికా వెళ్ళే విమానాలకు 16 గంటల వరకు సమయం పడుతుంది. దాంతో ఎయిర్ ఇండియాకు చెందిన సుదూర శ్రేణి విమానాలకు అప్పటి డీజీసీఏ నసీమ్ జైదీ కఠిన నిబంధనలను నిర్దేశించారు.

కానీ, ఎయిర్ ఇండియా 787 డ్రీమ్ లైనర్ విమానాలతో భారత్ నుంచి

> డ్రీమ్‌లైనర్ విమానాలు విహరించడం మొదలుపెట్టిన తొలినాళ్ళలోనే అనేక ఇంజినీరింగ్ సమస్యలు వెలుగు చూశాయి. భద్రతా లోపాలు, నిర్వహణా ఉల్లంఘనల గురించి ఎయిర్ ఇండియాను మూడేళ్లుగా డీజీసీఏ మళ్లీ మళ్లీ హెచ్చరించినట్టుగా తెలిసింది. తాజా ప్రమాదం నేపథ్యంలో అన్ని బోయింగ్ (787, 788, 789) విమానాలకూ భద్రతా తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది.

ఆస్ట్రేలియాకి సర్వీసులు మొదలు పెట్టిన పుడు ఎగువ నిబంధనలను అప్పటి డీజీసీఏ మార్చేసింది. అది ఆకాశయాన భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసింది. ఇది అటు ప్రయాణికులతో పాటు ఇటు విమాన సిబ్బంది ప్రాణాలకు కూడా చేటు తేవడమే అవుతుంది. డ్రీమ్ లైనర్‌ను ఆ విధంగా ఉపయోగించడం వల్ల ప్రమాదానికి లోనయ్యే అవకాశం అనుమతించిన సాధారణ పరిమితులకు మించి 25 రెట్లు పెరిగిందని ఎయిర్ ఇండియాకూ తెలుసు. కానీ, ఆ నివేదికను ఎయిర్ ఇండియా, డీజీసీఏ రెండూ మరుగు పరిచేశాయి. ఆ రూటులో సురక్షిత పయన నిబంధనలు ఉల్లంఘనలకు గురవుతున్న సంగతి ప్రయాణికులకు తెలియలేదు.



డిజైన్ దశలోనే లోపాలు

అలాగే, 787 డ్రీమ్‌లైనర్లు ఇంకా డిజైన్ దశలో ఉన్నప్పుడే,ఇంకా వాటి గగన సామర్థ్యాలను పరీక్షించకముందే ఎయిర్ ఇండియా వాటి కొనుగోలుకు ఆర్డరు పెట్టేసింది. ఎయిర్ ఇండియా సమకూర్చుకున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ల ప్రారంభపు ఆకాశయానాల్లోనే వాటి భద్రత, ఇంజినీరింగ్‌కు సంబంధించి అనేక లోపాలు, సమస్యలు బయటపడ్డాయి.

విమాన సిబ్బందికి విమాన భద్రతా నిబంధనలను రూపొందించడంలో డీజీసీఏకున్న అధికారాలను సవాల్ చేస్తూ, నేను బొంబాయి హైకోర్టులో 2013–14 రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేశాను. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి అప్పట్లో బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. నేను వేసిన రిట్ పిటిషన్లకు అటు డీజీసీఏ గానీ, ఇటు ఎయిర్ ఇండియా గానీ 2019 వరకు జవాబులు దాఖలు చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు.

మరో దిగ్భ్రాంతికరమైన సంగతి ఏమిటంటే, విమాన సిబ్బందికి విమాన సురక్షిత నిబంధనలను జారీ చేసే, లేదా రూపొందించే అధికారం డీజీసీఏకు 2016 సెప్టెంబర్‌లో మాత్రమే లభించింది. అదీ 1937 నాటి విమాన నిబంధనలోని 42–ఎ సెక్షనుకు సవరణ తీసుకురావడం ద్వారా మాత్రమే సాధ్యమైంది.

ఎయిర్ ఇండియా విమాన సురక్షిత నిబంధనలను తుంగలో తొక్కుతున్నా డీజీసీఏ వాటిని కప్పిపుచ్చుతూ వచ్చిందని దీనిద్వారా స్పష్టమవుతోంది. డీజీసీఏ, ఎయిర్ ఇండియా అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతూ నేను చాలా క్రిమినల్ కేసులు పెట్టాను. విమాన సురక్షిత ప్రమాణాలు ఉల్లంఘనలకు లోనవుతున్న సంగతిని ట్రయల్ కోర్టు అయినా పట్టించుకుంటుందని ఆశతో ఆ పని చేశాను. ఎందుకంటే, ఆ లోపాలు ప్రయాణికులు, విమాన సిబ్బంది... ఇద్దరి ప్రాణాలకూ ముప్పు తెచ్చేవిగా ఉన్నాయి. కనీసం ఇప్పుడు ఇంత పెద్ద ప్రమాదం తర్వాతనైనా, కోర్టు మేల్కొని, విమాన సురక్షిత నిబంధనలను బాహాటంగా ఉల్లంఘించిన సంబంధిత డీజీసీఏ, ఎయిర్ ఇండియా అధికారులపై కఠిన చర్య తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త ఎయిర్ ఇండియా మాజీ సీనియర్ అధికారి
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

కారణాలు ఏమిటి?

సందర్భం



నటాషా హీప్

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఏఐ 171 కూలిపోయి కొన్ని గంటలే అవుతోంది. దాదాపు 260 మందికి పైగా బలిగొన్న ఈ దుర్ఘటనకు దారితీసిన కారణాలపై ఊహాగానాలు అప్పుడే జోరందుకున్నాయి. కొన్ని సమాచార సాధనాలు దీన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తున్నాయి. ఈ విషాదకర ఘటనపై నా అభిప్రాయాలు తెలుపవలసిందని ఒక అంతర్జాతీయ వార్తా సంస్థ కోరింది. నేను అందుకు అంగీకరించి, "దీనిపై ఊహాగానాలకు పాల్పడటం తొందరపాటు అవుతుంది" అని మాత్రమే చెబుతానన్నాను. ఫలితంగా, వారు నాతో ఆ ఇంటర్వ్యూను జరపనే లేదు. ఊహాగానాలు చేసేందుకు నేను విముఖంగా ఉండటమే బహుశా అందుకు కారణం కావచ్చు.

ఈ ఘోర విపత్తుకు కారణం ఏమై ఉంటుందో తెలుసుకోవాలని అందరిలాగా నాకూ కుతూహలం ఉంది. కానీ ఇంత త్వరగా బాహాటంగా ఊహాగానాలు చేయడం–అందులోనూ ఆధారాలు స్వల్పంగా ఉన్న సమయంలో–ఎవరికీ ప్రయోజనకారి కాదనిపించింది. అది హానికరం కూడా!

పురాతన తవ్వకాల మాదిరిగా...

మొదట అగ్ని జ్వాలలను ఆర్పి, బతికున్న వారికోసం అన్వేషణ పూర్తయిన పిదపనే వైమానిక ప్రమాద దర్యాప్తులు ప్రారంభమవుతాయి. అలాంటి దుర్ఘటనలు జరిగినపుడు ప్రాణాలతో ఉన్నవారు, క్షతగాత్రుల గురించి మొదట పట్టించుకోవాలి. తర్వాత, ప్రమాద స్థలికి వెళితే సురక్షితమేనని, ఇబ్బందేమీ ఉండదని ప్రకటించాలి. అనంతరం, చనిపోయిన వారిని గుర్తించడం ఆరంభమవుతుంది. ప్రమాదంపై దర్యాప్తునకు సమాంతరంగా, బాధితులను గుర్తించే పనిని వేరే సంస్థ చూసుకుంటుంది. దర్యాప్తులో పాలుపంచుకునేది కేవలం ప్రభుత్వ అధికారులే కాదు, సదరు విమానాన్ని తయారు చేసిన సంస్థ (ప్రస్తుత సందర్భంలో బోయింగ్) దర్యాప్తునకు సహాయపడేందుకు తన ప్రతినిధులను పంపుతుంది. ప్రయాణికులు ఏయే దేశాలకు చెందినవారో ఆ యా దేశాలు కూడా కొందరిని పంపవచ్చు. ప్రమాదం సంభవించిన దేశంలోని పరిశోధకులు, వైమానిక దుర్ఘటనలపై దర్యాప్తు చేయడంలో మరింత అనుభవం ఉన్న ఇతర దేశాలకు చెందినవారి సహాయాన్ని కూడా అర్థించవచ్చు.

ఇన్వెస్టిగేటర్లు శిథిలాల నుంచి బ్లాక్ బాక్స్ (ఫ్లైట్ డాటా రికార్డర్లు, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్)లను వెతికి పట్టుకోవడాన్ని ప్రాథమిక బాధ్యతగా భావిస్తారు (అహ్మదాబాద్‌లో వైద్య కళాశాల హాస్టల్ మెస్ పైకప్పు మీద బ్లాక్‌బాక్స్‌ను గుర్తించారు). విమానం గురించిన డేటా కూడా వీటిల్లో ఉంటుంది. విమానం ఎలా పని చేస్తోందో, పైలెట్లు ఏం చెబుతున్నారో తెలుస్తుంది. బ్లాక్ బాక్స్‌లను వెలికి తీసినంత మాత్రాన విమానం కూలిన ఘటనలో దర్యాప్తు పూర్తయినట్లు కాదు. విమాన ప్రమాద దర్యాప్తు పురావస్తు తవ్వకాల లాంటిదే! ఒక పద్ధతి ప్రకారం, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి చేయాల్సిన పని అది. ఆధారాలను సేకరించి తదుపరి విశ్లేషణకు వాటిని భద్రపరచకపోతే, విలువైన ఆధారాలను ఎప్పటికీ కోల్పోయినట్లే లెక్క.

దర్యాప్తు అధికారులు సాక్షుల వాఙ్మూలాలను, ఆ ఘటనకు సంబంధించి వారు ఏవైనా వీడియోలు తీసి ఉంటే వాటిని సేకరిస్తారు. వారి విశ్లేషణను కంపెనీ డాక్యుమెంటేషన్, శిక్షణ, నియంత్రణ సంస్థ పేర్కొన్న నియమ నిబంధనలను పాటించడం గురించిన సమాచారంతో పోల్చి చూసుకుంటారు.

> విమాన ప్రమాద దర్యాప్తు పురావస్తు తవ్వకాల లాంటిదే. ఒక పద్ధతి ప్రకారం, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి చేయాల్సిన పని అది. ఒక రకం విమానాలను నడిపేవారికి, అదే రకానికి చెందిన కొత్త మోడల్ విమానాలను ఇచ్చి (తగినంత శిక్షణ ఇవ్వకుండానే) నడిపేయమనడం కూడా విమానయాన సంస్థలకు కొత్తేమీ కాదు.

విమాన ప్రమాదాలలో దాదాపు 80 శాతానికి 'మానవ అంశాలే' కారణం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ పేర్కొంటున్న మానవ అంశాలు: మానవుల సామర్థ్యాలు, గుణగణాలు, పరిమితులు, వారు ఉపయోగించే విధివిధానాలు, పరికరాలు, ఎలాంటి వాతావరణంలో పనిచేస్తున్నారు లాంటివి! ఈ దుర్ఘటనపై పూర్తి ఫోరెన్సిక్ దర్యాప్తు సమగ్ర రూపంలో చేతికందడానికి కొన్నేళ్ళు పట్టవచ్చు. ఉదాహరణకు, ఆస్ట్రేలియాలో 2023లో సీ వరల్డ్ హెలికాప్టర్ కూలిన ఘటనపై తుది నివేదిక ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైంది.

ఊహాగానాలు–నిందలు

విమాన ప్రమాదానికి కారణం కాగల అంశాలపై హానికరమైన ప్రజా ఊహాగానాలకు సంబంధించి సుదీర్ఘ చరిత్రే ఉంది. మలేసియా ఎయిర్ లైన్స్‌కు చెందిన ఎంహెచ్–370 విమానం 2014 మార్చి 8న గగనతలం నుంచి అదృశ్యమైంది. ఆ ఘటనకు దాని చీఫ్ పైలట్ జహారీ అహ్మద్ షాయే బాధ్యుడంటూ ప్రచారం జరిగింది. షాతోపాటు ఆ ఘటనలో 238 మంది చనిపోయారు. ఆ ప్రచారం తనను చాలా బాధకు గురిచేస్తోందని షా సోదరి సకీనట్ షా 2016లో సి.ఎన్.ఎన్.కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాపోయారు. ఆ ప్రమాదానికి తన సోదరుడిని 'బలిపశువును' చేస్తున్నారని ఆమె అన్నారు. ఇదమిత్థంగా కారణాలు తెలియకుండానే, ప్రమాదాలకు అలా ఎవరెవరినో బాధ్యులుగా భావించిన దృష్టాంతాలను చాలా చూపవచ్చు.

ఒక రకం విమానాలను నడిపేవారికి అదే రకానికి చెందిన కొత్త మోడల్ విమానాలను ఇచ్చి (ఈ కొత్త విమానాలను నడపడంలో పైలట్లకు సిములేటర్‌లో తగినంత శిక్షణ ఇవ్వకుండానే) నడిపేయమనడం కూడా విమానయాన సంస్థలకు కొత్తేమీ కాదు. ఫలితంగా జరగరానిది ఏదైనా జరిగితే వచ్చే అపనిందల వల్ల పైలట్లు ఉద్యోగాలు కోల్పోతారు. ప్రతిష్ఠ దెబ్బతింటుంది. వారి కుటుంబ సభ్యులు పడే వేదన వర్ణనాతీతం.

బహిరంగంగా ఊహాగానాలు చేయడం దర్యాప్తు ప్రక్రియకు ఏ విధంగానూ దోహదపడదు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలకు ఒరిగే ప్రయోజనం ఏమీ లేదు. సునిశితమైన అంశాలను కనుగొనడానికి వీలుగా బాహ్య ఒత్తిడులు ఏమీ లేకుండా ఇన్వెస్టిగేటర్లను వారి పనిని వారిని చేసుకోనివ్వాలి. ఈ ప్రక్రియను గౌరవించడం, నిజాయతీతో వ్యవహరించనివ్వడం ముఖ్యం. మాటలకందని విషాదాన్ని అనుభవిస్తున్న అనేక మందికి మనం అండగా నిలవాలి.

వ్యాసకర్త యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్వీన్స్‌ల్యాండ్ బ్యాచిలర్ ఆఫ్ ఏవియేషన్‌కు ప్రోగ్రామ్ డైరెక్టర్
('ది కాన్వర్సేషన్' సౌజన్యంతో)

నడచిన హిమాలయం... ఎగసిన ప్రజాకెరటం!

సందర్భం



భూమన కరుణాకర రెడ్డి

కళ్లు ఆకారాన్ని చూస్తాయి. మనస్సు అంతర్యాన్ని చూస్తుంది. దాని పరిధి చాలా విశాలం. మనసుతో మనుషుల్ని, సమాజాన్ని చూడగలిగినవాడు, చదవగలిగినవాడు మహానాయకుడు. ఆ మహానాయకుడే మాజీ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి.

నాకు అత్యంత సన్నిహితుడు, హితుడు, గురువు, మార్గదర్శి. అకుంఠిత దీక్ష, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, మనిషి పట్ల మమకారం, పేదరికాన్ని పారద్రోలాలన్న పట్టుదల, అణగారిన జనానికి అన్నీ సమకూర్చాలన్న కోరిక, సమసమాజ స్థాపన ఆయన లక్షణాలు, లక్ష్యాలు. శత్రువును కూడా క్షమించగలిగే సంస్కారం, పగవాడికైనా మేలు చేసే గుణం ఆయన సొంతం. హిమాలయ సమున్నతుడు కాబట్టే ప్రజలు ప్రేమగా ఆయనను 'రాజన్న' అని పిలుచుకున్నారు.

పాదయాత్ర:

2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు ఆయన చేసిన 1,648 కిలోమీటర్ల పాదయాత్ర ఓ చరిత్ర. ఆయన వెంట నేను ఉండటం నా అదృష్టం. ఎంత జీవితాన్ని చూశానో, ఎన్ని నేర్చుకున్నానో అన్నిటికీ 'సాక్షి' ఆ పాదయాత్ర. 2003 ఏప్రిల్ 9న చేవెళ్లలో పెద్ద బహిరంగ సభతో ప్రారంభమైంది మహాయాత్ర. ఆ సభా వేదికకు పైన నీడగా షామియానా వేశారు. విపరీతంగా వచ్చిన జనం అందరూ ఎండలోనే ఉన్నారు. అది గమనించిన వైఎస్ 'జనం ఎండలో ఉంటే నేను నీడలో ఉండాలా' అంటూ షామియానా తీయించారు. మండుటెండలోనే సాగింది ఆయన ప్రసంగం. అనంతరం తొలి అడుగు వేశారు ప్రజా ప్రస్థానానికి! కీపాస్ కట్టిన పంచ, తలపాగాలతో రైతులా కదిలారు. ఆయనను దగ్గరగా చూడాలని, కరచాలనం చేయాలని, కష్టాలు చెప్పుకోవాలని, గ్రామాలకు గ్రామాలు కదలి వచ్చాయి. చేవెళ్ల దాటి కౌకుంట్ల, మన్నెగూడ, శివారెడ్డిపేట... ఇలా అనేక గ్రామాల గుండా సాగుతోంది పాదయాత్ర.

దారి పొడుగునా కనిపిస్తున్న ప్రజల ఆవేదనకు ఆయన చలించిపోతున్నారు. రాత్రి బస చేస్తున్న గ్రామాలలో కొందరు పెద్దలు ఆయన వద్దకు వచ్చి అక్కడ ఏసీ సౌకర్యం ఉన్న ఇల్లు ఉందని ఆహ్వానించినా, సున్నితంగా కాదని జనం మధ్య పడుకునేవారు వైఎస్. సదాశివ పేటకు చేరింది యాత్ర. అక్కడ ఎందరో కుండలు చేస్తున్నారు. వారిని చూపించాను ఆయనకు. 'కరుణా! చూడాల్సింది వారు చేస్తున్న కుండల్ని కాదు, వారి గుండెల్ని' అంటూ వారి దగ్గరికి వెళ్లారు. అంత దగ్గరగా ఆయనను చూసి చెమ్మగిల్లిన కళ్లతో వారు వారి బాధల్ని చెప్పుకున్నారు. 'మంచిరోజులు వస్తున్నాయి' అంటూ వారిని ఓదార్చారు. ప్రజలలో కనిపిస్తున్న పేదరికం, అనారోగ్యం, కరవు చూసి చలించిపోయిన ఆయనలో అప్పుడే ఉచిత కరెంటు, 'ఆరోగ్యశ్రీ' లాంటి పథకాలు రూపుదిద్దుకున్నాయి. ఎనిమిదవ రోజు సుల్తానాపూర్‌లో యాత్ర సాగుతోంది. ఆ గ్రామంలో నర్సారెడ్డి అనే రైతు కుటుంబాన్ని అప్పు తీర్చమని బ్యాంకు వారు దౌర్జన్యం చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అప్పటికే నర్సారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా ఆ కుటుంబాన్ని బ్యాంకువాళ్లు వేధిస్తున్నారు. అది విన్న వైఎస్ ముఖంలో బాధ, కోపం! వెంటనే బ్యాంకు వారిని పిలిపించి నిలదీశారు, హెచ్చరించారు. బ్యాంకువారు భయపడి వెనక్కి తగ్గారు, ఆ కుటుంబం రక్షింపబడింది.

పాతంశెట్టి పల్లెలో యాత్ర సాగుతోంది. ఓ యువ జంట వైఎస్ ఎదురుగా వచ్చి కాళ్ళమీద పడింది. తాము ప్రేమికులమని, కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని, చాలా దూరం నుంచి మిమ్మల్ని నమ్మి వచ్చామని వారు చెప్పుకొన్నారు. కొన్ని క్షణాలు ఆలోచించిన ఆయన అక్కడే అప్పుడే ఆ జంటకు వివాహం చేశారు, అక్షింతలు వేశారు. మరో నాయకుడైతే వారిని అక్కడే వదిలేసేవారు. కానీ వైఎస్ ముందుచూపుతో హైదరాబాదులోని ఓ పోలీసు ఉన్నతాధికారికి ఫోన్ చేసి ఆ జంటకు రక్షణ కల్పించమని చెప్పారు. రాజశేఖర రెడ్డి గారి పాదయాత్ర సాగే దారిలో నేను, మరికొందరు మిత్రులం వైఎస్ కన్నా కాస్త ముందుగా ఆ



దారిలో వెళ్లేవాళ్ళం. వైఎస్ రాక గురించీ, పాదయాత్ర గురించీ ప్రజలు ఏమనుకుంటున్నారు అని తెలుసుకునేందుకు మా ప్రయత్నం. బురుగిద్ద గ్రామం దాటి, గాంధీనగర్ చేరుకున్నాం. అప్పటికి రాత్రి ఏడు గంటలు అయి ఉంటుంది. హఠాత్తుగా వడగళ్ళ వాన, విపరీతమైన చలి! వర్షంలో తడుస్తామని ప్రక్కనే వున్న జీపు ఎక్కి కూర్చున్నా. దాదాపు అరగంట పాటు వర్షం కురిసింది. మా వెనుక దాదాపు కిలోమీటరు దూరంలో ఉన్న వైఎస్ ఆ చలిలో, వర్షంలో అలాగే తడుస్తూ వచ్చారు. అందుకే ధీరుడు, నాయకుడు అయ్యారాయన. నాయకపురం దాటి, లక్ష్మీపురం గ్రామంలో ప్రవేశించాం. అక్కడ రెండు గ్రూపులు ఉన్నాయి. ఒకే పార్టీ, ఇద్దరు నాయకులు! ఎవరి ఏర్పాట్లు వాళ్లు చేస్తున్నారు. అది గమనించిన వైఎస్సార్ ఇద్దర్నీ పిలిచి అక్కడే రాజీ చేశారు.

> 2003 ఏప్రిల్ 9న చేవెళ్లలో మొదలైన డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి పాదయాత్ర 1,648 కిలోమీటర్లు సాగి, జూన్ 15న ఇచ్ఛాపురంలో ముగిసింది.

పాదయాత్ర గోదావరి జిల్లాలలోకి ప్రవేశించింది. అక్కడ కూడా రైతు బతుకు దీనంగా ఉండటం, గ్రాసం లేక పశువులను రైతులు సగం ధరకు అమ్ముకోవడం చూసి వైఎస్ చలించిపోయారు. సీతంపేట గ్రామంలో నాగపద్మిని అనే మహిళ వైఎస్ దగ్గరికి వచ్చింది. కుటుంబ నియంత్రణకు ఆపరేషన్ చేయించుకున్నాననీ, అధికారులు ఆ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారనీ చెప్పింది. వెంటనే అధికారులను పిలిపించి అక్కడే సర్టిఫికెట్ ఇప్పించారు. ఆమె చేతిలో పదిహేను రోజుల పసికందు ఉంది. ఆ బిడ్డకు 'రాజశేఖర్' అని పేరు పెడతానంటే, ఆయన కాదని 'రాజీవ్' అని నామకరణం చేశారు. రాజమండ్రి సమీపం కోవూరుకు చేరుకున్నాం. జన ప్రవాహం మరింత ఎక్కువయింది. ఆయన ప్రసంగం ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు జనం చప్పట్లు ఆగలేదు. ఆ క్షణమే అర్థమయ్యింది రాష్ట్రానికి కాబోయే అధినాయకుడు ఎవరో!

2003 మే 18:

తెల్లారింది. కానీ నిప్పుల కొలిమిలో నిద్ర లేచినట్లు ఉంది. వైఎస్ నీరసంగా కనిపించారు. అయినా నడక సాగింది. కానీ నీరసం తెలుస్తోంది. ఓ చెట్టు క్రింద మంచం వేసి కాసేపు కూర్చోబెట్టాం. తరువాత మెల్లగా మధురపూడి గ్రామం చేరుకున్నాం. ఆయన పూర్తిగా నీరసించి పోయారు. వైద్యులు విశ్రాంతికి ఆదేశించారు. రాష్ట్రం అంతా కలకలం. ఆయన ఆరోగ్యం కోసం అన్ని మతాల వారి ప్రార్థనలు కొనసాగాయి. ఆరు రోజుల విరామం తరువాత మే 24న తిరిగి నడక ప్రారంభించారు వైఎస్. యాత్ర పత్తిపాడు గ్రామం దగ్గర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. జనప్రవాహం చెక్కు చెదరడం లేదు. జూన్ 11న జర్జంగి గ్రామం చేరుకున్నాం. అక్కడ రాళ్ళ క్వారీలలో వందలాది మంది వడ్డెరలు పని చేస్తున్నారు. వారంతా ఆయణ్ణి చూడటానికి వచ్చారు. తమ తలపాగాలను తీసి రోడ్డుమీద పరిచారు. దానిపై ఆయన్ని నడవమన్నారు. చూస్తున్న అందరి కళ్ళూ చెమరించాయి. శరీరాలు పులకరించాయి. అది కదా అభిమానం, అది కదా గౌరవం... అది కదా నిజమైన సన్మానం!

జూన్ 15న ఇచ్ఛాపురం చేరుకున్నాం. ఆ సాయంత్రం బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిగింది. పార్టీలోని అతిరథ మహారథులందరూ వేదికపైకి వచ్చారు. లక్షలాది మంది జనం. చప్పట్లకు దిక్కులు దద్దరిల్లాయి. ఆ మహా ప్రజా ప్రస్థానానికి చిహ్నంగా ఒక స్తూపాన్ని ఏర్పాటు చేశారు. మహా పాదయాత్ర పూర్తి అయింది. ఎన్నో అనుభవాలు, ఎన్నో జ్ఞాపకాలు! చాలు జీవితానికి ఈ అనుభూతి. గుర్తు చేసుకుంటే శరీరం పులకరిస్తోంది. ఆయన జ్ఞాపకంతో కళ్లు చెమరిస్తున్నాయి. రైతు బాంధవుడైన ఆ మహానేత అడుగులో అడుగు వేసి నడచిన నా జన్మ ధన్యం. చరిత్ర ఏనాడూ మరచిపోలేని సత్యం ఈ మహాయాత్ర!

వ్యాసకర్త టీటీడీ మాజీ చైర్మన్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.తదియ ప.2.32 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.11.41 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.7.09 నుండి 8.48 వరకు, తదుపరి రా.3.43 నుండి 5.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.02 నుండి 7.13 వరకు, **అమృతఘడియలు:** సా.4.54 నుండి 5.46 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

జల్దీ ఇల్లు కట్టుకోండి!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కోరుతున్న అధికారులు

- ఇళ్ల వద్దకు బృందాలుగా వెళ్లి మరీ విన్నపాలు
- భారీ వర్షాలు మొదలైతే పనులు సాగవని ఆందోళన
- ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సర్కారు లక్ష్యం
- మొదటి విడతలో 4.50 లక్షలకు మొదలైనవి 69 వేలే
- రెండో ఏడాది మొదలు పెట్టాల్సినవి మరో 4.50 లక్షలు
- ఇప్పటివరకు పూర్తిగా నిర్మాణమైన ఇళ్లు రెండు మాత్రమే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేదల కోసం ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. కానీ, ఇప్పటికి పనులు మొదలైనవి 69 వేలు మాత్రమే. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండో సంవత్సరం కొనసాగుతుండటంతో మరో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని భావిస్తోంది. అసలే పనుల ప్రారంభంలో ఆలస్యం జరుగుతుండగా, ప్రస్తుతం వానాకాలం కూడా మొదలు కావటంతో ఇళ్ల నిర్మాణం మరింత మందగించనుంది. భారీ వర్షాలు ప్రారంభమైతే అసలు పనులే చేపట్టేందుకు జనం ఆసక్తి చూపరు. వ్యవసాయ పనులు ఊపందుకుంటే పనుల్లోకి వెళ్లేందుకే మొగ్గు చూపుతారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా చూడాలని గృహనిర్మాణ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి త్వరగా పనులు ప్రారంభించాలని సూచిస్తున్నారు.

పూర్తయిన ఇళ్లు రెండే..

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లు కూడా ఉన్నాయి. దీంతో వీటి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవలి నుంచే లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు జారీ చేస్తుండటంతో నెల రోజులుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 69 వేల ఇళ్లు మాత్రమే మొదలయ్యాయి. వాటిల్లో పూర్తయినవి రెండు మాత్రమే. 15 వేల ఇళ్లకు మాత్రమే ఇప్పటివరకు ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. ఇందులో 10 వేల ఇళ్లకు సంబంధించి తొలి విడత బేస్‌మెంట్ లెవల్ నిధులు రూ.లక్ష చొప్పున విడుదల కాగా, మూడు వేల ఇళ్లకు రెండో విడత, మరో రెండు వేల ఇళ్లకు గోడలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. మొత్తంగా రూ.100 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. నిధులకు ఇబ్బంది లేదని, ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది.

భారీ వర్షాలు పడితే ఇసుకకూ కష్టమే..

రాష్ట్రంలో వానాకాలం మొదలు కావటంతో భారీ వర్షాలు కురిస్తే ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకాలేర్పడతాయని అధికార యంత్రాంగం భయపడుతోంది. దీంతో వర్షాలు ఊపందుకోకముందే వీలైనన్ని ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తోంది. ఈ ఇళ్లకు కావాల్సిన ఇసుకను వాగులు, వంకల నుంచి సేకరించి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. భారీ వర్షాలు కురిసి వాగులు నీటితో నిండిపోతే ఇసుక సేకరణ కూడా కష్టమవుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈలోపే వీలైనంత మందికి ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించారు. అది జరగాలంటే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి. ఇందుకోసం బృందాలుగా అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వెంటనే పనులు మొదలుపెట్టాలని కోరుతున్నారు.



భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లో ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న గృహనిర్మాణ సంస్థ సీఈ చైతన్యకుమార్, స్థానిక అధికారులు

రేవంత్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు చెల్లదు

- గోపనపల్లి భూ వివాదం కేసులో హైకోర్టులో వాదనలు
- సివిల్ వివాదంలో అట్రాసిటీ కేసు చట్ట విరుద్ధమన్న రేవంత్ న్యాయవాది
- విచారణను ఈ నెల 20కి వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై 2016లో దాఖలైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు చెల్లదని ఆయన తరఫు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఘటన జరిగినప్పుడు రేవంత్ అక్కడ లేరని.. అయినా కేసు నమోదు చేశారని తెలిపారు. గతంలో ఇదే ఫిర్యాదుదారు.. రేవంత్‌పై మరో పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టగా, దాన్ని కోర్టు కొట్టివేసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. అనంతరం ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వాదనల కోసం న్యాయస్థానం విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు (డీఫ్యాక్టో కంప్లైనెంట్) పెద్దిరాజుకు, ఎనుముల సోదరుల మధ్య వివాదం ఉంది. తన భూమిలోకి అక్రమంగా జొరబడి జేసీబీతో సొసైటీకి చెందిన గదిని కూల్చివేశారని, తనను కులంపేరుతో అసభ్యకరంగా దూషించారని పెద్దిరాజు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కొండల్‌రెడ్డిని ఏ–1గా, ఈ.లక్ష్మిని ఏ–2గా, రేవంత్‌రెడ్డిని ఏ–3గా పేర్కొంటూ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 2016, జనవరి 13న గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో దాఖలైన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ ప్రేరేపితంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. రేవంత్ తరఫున సీనియర్ న్యాయవాది రఘు వాదనలు వినిపించారు. సివిల్ వివాదంలో అట్రాసిటీ కేసు నమోదు చట్టవిరుద్ధమని వాదించారు. ఇదే భూమికి సంబంధించి ఫిర్యాదుదారు గతంలో చందానగర్ స్టేషన్‌లో కొండల్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారని, ఆ కేసును కోర్టు కొట్టివేసిందని చెప్పారు. దీంతో మరోసారి ఇక్కడ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ట్రయల్‌కోర్టుకు హాజరుకాలేదని, అభియోగాల నమోదు జరగలేదని ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది నారాయణ వాదించారు. ఐదేళ్లుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను వాయిదా వేశారు.

మొహర్రంకు నిధులు విడుదల చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎమ్మెల్సీ కవిత ఫోన్



సాక్షి, హైదరాబాద్: షియా ముస్లింలకు అత్యంత పవిత్రమైన మొహర్రంకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈమేరకు మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో శుక్రవారం ఆమె ఫోన్‌లో మాట్లాడారు. మొహర్రం పండుగ సందర్భంగా ఏనుగుపై ఊరేగింపు తీయడం షియా ముస్లింల సంప్రదాయమని గుర్తు చేశారు. 2024లో ఏనుగుపై ఊరేగింపు నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం షియా ముస్లింల మనసులను గాయపరిచిందన్నారు. ప్రభుత్వం ఈసారి ఇలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందిస్తూ నిధుల విడుదల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మొహర్రంను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఆదేశాలిస్తానన్నారు. కాగా, ప్రతీ సందర్భంలో గద్దర్ పేరును జపం చేసే కాంగ్రెస్ సర్కార్ ఆయన పేరిట ఇస్తున్న సినీ అవార్డుల ఆహ్వాన పత్రికలో ఫొటో లేకుండా చేసిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అవార్డుల పంపిణీ కార్యక్రమంలోనైనా గద్దర్ చిత్రపటాన్ని పెట్టి గౌరవించాలని కోరారు.

మరో 297 దేవాలయాల్లో అభివృద్ధి పనులు

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ మరో 297 దేవాలయాల అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేసింది. సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) ద్వారా ఈ పనులు చేస్తారు. ఇందుకోసం దాదాపు రూ.72.47 కోట్లు ఖర్చు కానున్నాయి. శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో జరిగిన సీజీఎఫ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ కొత్త పనులతోపాటు, ఇప్పటికే మంజూరై చేపట్టిన పనులను కూడా వీలైనంత తొందరలో పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సురేఖ ఆదేశించారు. చిన్న దేవాలయాల అభివృద్ధికి నిధుల విడుదలలో నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. దేవాలయాల అభివృద్ధి పనులకు సంబంధించి అన్ని అంశాలు పరిశీలించి.. తుది ప్రతిపాదనలనే తనకు పంపాలని సూచించారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయాల్సిన ఉందని, ఇందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు కసరత్తు చేయాలని సూచించారు. ఈసారి ఆషాఢ బోనాల జాతరను వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్‌రావు, అదనపు కమిషనర్ కృష్ణవేణి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

జపాన్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు రాష్ట్ర విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో నిర్వహించే సకుర సైన్స్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జపాన్‌లో తమ ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశాన్ని దక్కించుకున్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఎ.శివారెడ్డి, మంచిర్యాలలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి సాయి శ్రీవల్లి, కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థి శుభశ్రీ సాహులు ఎంపికైనట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ తెలిపారు. వీరు ఈనెల 15 నుంచి 21 వరకు జపాన్‌లో నిర్వహించే ప్రదర్శనల్లో పాల్గొంటారని వెల్లడించారు. 2016 నుంచి ఇప్పటివరకు 21 మంది విద్యార్థులు సకుర ప్రోగ్రామ్‌లో భాగంగా జపాన్‌ను సందర్శించారు.

ఎవరు చెప్పారు?.. ఎందుకు చెప్పారు?

- హార్డ్‌డిస్క్‌ల ధ్వంసంపై ప్రణీత్‌రావుకు సిట్ ప్రశ్నలు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సుదీర్ఘ విచారణ



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, ఆ విభాగం మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును సిట్ అధికారులు శుక్రవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ప్రభాకర్‌రావు ఏర్పాటు చేసిన స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ద్వారానే అక్రమ ట్యాపింగ్ మొత్తం నడిచిందనేది పోలీసుల వాదన. అయితే ప్రస్తుతం పోలీసులు ట్యాపింగ్ కంటే ఎస్ఐబీ కార్యాలయంలో జరిగిన హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం పైనే దృష్టి పెట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే అలా చేయమని ఎవరు చెప్పారు? ఏ కారణంతో అలా చేయమని చెప్పారు? తదితర అంశాలు మరోసారి అడిగి వాంగ్మూలంగా నమోదు చేశారు. గతంలో ఇచ్చిన వాంగ్మూలంలో ప్రభాకర్‌రావు చెప్పడంతోనే హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేసినట్లు ప్రణీత్‌రావు పేర్కొన్నారు. శనివారం ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతో కలిపి ప్రణీత్‌ను మరోసారి విచారించనున్నారు. గురువారం వీరిద్దరినీ సిట్ ప్రశ్నించిన విషయం విదితమే.

ఫోరెన్సిక్ నివేదికలపై ప్రశ్నలు

ప్రణీత్‌ను అరెస్టు చేసినప్పుడు అతడు చెప్పిన అంశాలు, నేరాంగీకార వాంగ్మూలంలో నమోదైనవి, గురువారం ప్రభాకర్‌రావుతో కలిపి విచారించినప్పుడు బయటపెట్టినవి... ఇలా వివిధ సందర్భాల్లోని వాంగ్మూలాలను సిట్ అధికారులు సరిచూస్తున్నారు. మరోపక్క ఈ కేసుకు సంబంధించి కొన్ని సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, హార్డ్‌డిస్క్‌లు తదితరాలను సిట్ సీజ్ చేసింది. వీటిని విశ్లేషించడంతో పాటు డిలీట్ చేసిన సమాచారాన్ని రిట్రీవ్ చేయడానికి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపింది. వీటికి సంబంధించిన నివేదికలు ఒక్కొక్కటిగా సిట్‌కు అందుతున్నాయి. దీంతో తాజాగా అందిన కొన్ని నివేదికల్లోని అంశాల పైనా ప్రణీత్‌ను పోలీసులు ప్రశ్నించారు. సిట్ విచారణకు కారులో వచ్చిన ప్రణీత్‌రావు..విచారణ ముగిసిన తర్వాత మీడియా దృష్టి మళ్లించడానికి కారును అక్కడకు పిలవకుండా.. పోలీసుస్టేషన్ వెనుక గేటు నుంచి బయటకు వెళ్లి కొద్దిదూరం నడిచిన తర్వాత ఆటో ఎక్కి వెళ్లిపోయారు.

ఇంజన్ వైఫల్యమే!

మేడే కాల్, వీడియోల్లో ఇంజన్ శబ్దమే విన్పించలేదు

- టేకాఫ్ అవగానే మూగబోయి ఉంటాయి: నిపుణులు
- రెండు ఇంజన్లు విఫలమవడం అత్యంత అసాధారణం
- టేకాఫ్ సెట్టింగుల్లో లోపం, పైలట్ తప్పిదమే కారణం?

దేశాన్ని దిగ్భ్రాంతికి లోను చేసిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ (వీటీ–ఏఎన్‌బీ) 171 విమాన ప్రమాదానికి ఇంజన్ వైఫల్యమే కారణమై ఉంటుందని వైమానిక రంగ నిపుణులు అనుమానిస్తున్నారు. ఎందుకంటే పెను ప్రమాదాన్ని సూచిస్తూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు పైలట్ చేసిన మేడే కాల్‌లోనూ, ప్రమాద వీడియోల్లోనూ విమానం ఇంజన్ శబ్దం అసలు విన్పించమే లేదు. దాన్నిబట్టి విమానం అప్పటికే పూర్తిగా థ్రస్ట్ (ఎగిరేందుకు అవసరమైన వేగం) పూర్తిగా కోల్పోయిందని విశ్లేషిస్తున్నారు. పక్షులు ఢీకొట్టడం వంటివి ఇందుకు కారణం కావచ్చంటున్నారు. అహ్మదాబాద్ విమానాశ్రయంలో పక్షుల బెడద ఎక్కువే. అయితే బోయింగ్‌లో అత్యాధునికమైన ఈ శ్రేణి విమానాల్లో రెండు అత్యంత శక్తిమంతమైన ఇంజన్లుంటాయి. ఒకటి అనుకోకుండా ఫెయిలైనా రెండో ఇంజన్ సాయంతో విమానం సునాయాసంగా ఎగరగలదు. దాన్నిబట్టి రెండు ఇంజన్లూ విఫలమై ఉంటాయని అనుకోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కానీ 10 లక్షల ప్రయాణాలకు కేవలం ఒకసారి మాత్రమే అలా జరిగే ఆస్కారముంటుంది! ఇంధన కల్తీ, యాంత్రిక వైఫల్యం వల్ల కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. కానీ బోయింగ్ 787లో వాడేది అత్యంత శక్తిమంతమైన జనరల్ మోటార్స్ కంపెనీ తాలూకు జీఈఎన్‌ఎక్స్ ఇంజన్లు. అవి అత్యంత విశ్వసనీయమైనవి. ఈ నేపథ్యంలో ప్రమాద కారణం పెద్ద పజిల్‌గా మారింది. బ్లాక్‌బాక్స్ డేటాను పూర్తిగా విశ్లేషించిన మీదటే దీనిపై స్పష్టత వస్తుందని నిపుణులు అంటున్నారు. **వారి విశ్లేషణ ప్రకారం ప్రమాద కారణాలు ఏమై ఉండొచ్చంటే...**


బ్లాక్‌బాక్స్ దొరికిన చోటు

టేకాఫ్ సెట్టింగుల్లో లోపం

విమానం టేకాఫ్ కాగానే లాండింగ్ గేర్ మూసుకోవాలి. సురక్షితమైన ఎత్తుకు చేరేదాకా రెండు ఫ్లాప్‌లూ (రెక్కల వెనక భాగం) విచ్చుకుని ఉండాలి. అప్పుడే విమానానికి ఎగిరేందుకు అవసరమైన శక్తి, ఊపు లభిస్తాయి. వీటన్నింటినీ టేకాఫ్ సెట్టింగులుగా పిలుస్తారు. ఇకగురువారం మధ్యాహ్నం ప్రమాద సమయంలో అహ్మదాబాద్‌లో ఏకంగా 43 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో వాయుసాంద్రత తక్కువగా ఉంది. అలాంటప్పుడు లాండింగ్ గేర్, ఫ్లాప్‌లు అత్యంత కచ్చితత్వంతో పని చేయడం చాలా కీలకం. కానీ ఏఐ171 విమానం గేర్ తెరుచుకునే ఉండగా ఫ్లాప్‌లు మూసుకుపోయాయి. ఇది పెను ప్రమాదానికి దారితీసే అసాధారణ పరిస్థితి. దీనివల్ల పైకెగిరేందుకు కావాల్సిన శక్తి సమకూరక విమానం అదుపు తప్పుతుంది. పైగా అవసరమైన థ్రస్ట్ లభించకుండానే పైలట్ టేకాఫ్‌కు ప్రయత్నించి ఉంటాడంటున్నారు. ఇలా ఫ్లాప్‌లు వెంటనే ముడుచుకుపోవడం వల్లే 2008లో స్పాన్‌ఎయిర్ విమానం కుప్పకూలింది.

సరిపోని థ్రస్ట్

బోయింగ్ ఇంజన్లు శక్తిమంతమైనవే అయినా విమానం బరువు, రన్‌వే పొడవు, ఉష్ణోగ్రత తదితరాల ఆధారంగా టేకాఫ్‌కు నిర్దిష్ట థ్రస్ట్ సెటింగ్‌లు అవసరమవుతాయి. 43 డిగ్రీల ఎండ ఉన్నందున ఇంజన్ సామర్థ్యం సహజంగానే కాస్త తగ్గుతుంది. అలాంటప్పుడు టేకాఫ్‌కు మామూలు కంటే అధిక థ్రస్ట్ తప్పనిసరి. కానీ ఏఐ171 పైలట్ రొటేషన్ స్పీడ్‌ను పొరపాటుగా లెక్కించి తక్కువ థ్రస్ట్ ప్రయోగించి ఉండొచ్చు. 241 మంది ప్రయాణికులు, భారీ లగేజీ, ఏకంగా 1.25 లక్షల లీటర్ల ఇంధన బరువు దీనికి తోడై విమానం సజావుగా ఎగరలేకపోయి ఉంటుంది.

లాండింగ్ గేర్ వైఫల్యం

ప్రమాద సమయంలో ఏఐ171 విమానం లాండింగ్ గేర్ తెరుచుకునే ఉంది. ఇది డ్రాగ్‌కు దారితీస్తుంది. దాంతో విమానం సజావుగా ఎగరలేదు. అందుకే టేకాఫ్ అయ్యాక క్షణాల్లోనే గేర్ మూసుకోవాల్సి ఉంటుంది. కానీ తొలుత దాదాపుగా మూసుకున్న ఏఐ171 లాండింగ్ గేర్ ఆ వెంటనే బయటికొస్తూ కన్పించింది. బహుశా విమానాన్ని పైకి తీసుకెళ్లేందుకు అవసరమైన థ్రస్ట్ లభించడం లేదని అర్థమై ఎమర్జెన్సీ లాండింగ్‌కు వీలుగా పైలట్ ఉద్దేశపూర్వకంగానే అలా చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. మొత్తం ఉదంతంలో ఏదో ఒక దశలో పైలట్ లోపం కచ్చితంగా ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇలాంటి లోపాలను సునాయాసంగా అధిగమించే అత్యాధునిక సాంకేతికత 787 సొంతం. ఇక్కడే పైలట్ మానవ తప్పిదం చోటుచేసుకుని ఉంటుందంటున్నారు.

విద్రోహ కోణం

ఉగ్రవాదులో, దేశ వ్యతిరేక శక్తులో ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చేయడం. కానీ ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న సమాచారం,సాక్ష్యాలను బట్టి ఇందుకు అవకాశాలు తక్కువే.

\- సాక్షి, నేషనల్ డెస్క్

బ్లాక్ బాక్స్ దొరికింది

అహ్మదాబాద్: విమాన ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది గుర్తించడానికి కీలకమైన ఆధారంగా భావిస్తున్న బ్లాక్ బాక్స్ లభించింది. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను బి.జె.మెడికల్ కాలేజీ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌పై భాగంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) శుక్రవారం తెలియజేసింది. కీలక ఆధారం చేతికి చిక్కడంతో అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు ఇక వేగవంతం అవుతుందని అధికారులు చెబుతున్నారు. పౌర విమానయాన శాఖకు చెందిన బృందాలు గుజరాత్ ప్రభుత్వ అధికారులతో కలిసి దర్యాప్తులో నిమగ్నమయ్యాయి. ఘటనా స్థలంలో సాక్ష్యాధారాలు సేకరిస్తున్నాయి. బ్లాక్ బాక్స్ అనేది ప్రతి విమానంలో తోక భాగంలో ఉంటుంది. విమాన ప్రయాణంలో నమోదయ్యే ప్రతి సంభాషణ, ఘటన ఇందులో నిక్షిప్తమవుతుంది. పేరుకే బ్లాక్ బాక్స్ కానీ నిజానికి ఇది నారింజ రంగులో ఉంటుంది. బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి కారణం ఏమిటన్న దానిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. విమానానికి సంబంధించిన డిజిటల్ వీడియో రికార్డర్(డీవీఆర్)ను అధికారులు ఇప్పటికే సేకరించారు.

చెక్కు చెదరని భగవద్గీత ప్రతి

అహ్మదాబాద్: మొత్తం 265 మంది ప్రాణాలను బలి తీసుకున్న విమాన ప్రమాద శకలాల్లో భగవద్గీత దాదాపు చెక్కు చెదరని రీతిలో లభ్యమైంది. కాలిపోయిన శిథిలాల మధ్యన భగవద్గీత గ్రంథం కనిపించింది. ఘటనాస్థలిలో విమాన ఇంధనం, శకలాలు పడిన చోట్ల తీవ్రస్థాయిలో మంటలు చెలరేగినా ఈ పవిత్ర గ్రంథానికి పెద్దగా నష్టం కలగకపోవడం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. మంటల తీవ్రతకు విమానంలోని చాలా భాగాలతోపాటు, అందులోని ఇతర వస్తువులు సైతం కరిగిపోయి, నామరూపాల్లేకుండా కాలిపోయాయి. అయినప్పటికీ భగవద్గీత ప్రతికి ఎలాంటి నష్టం జరగలేదు. కవర్ పేజీ మాత్రమే దెబ్బతిన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మోదీ

ప్రాణాలతో బయటపడిన విశ్వాస్ కుమార్ రమేశ్‌కు పరామర్శ

అహ్మదాబాద్: దేశ ప్రజలను తీవ్ర విషాదంలో ముంచిన ఎయిర్ ఇండియా బోయింగ్ విమాన ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం స్వయంగా పరిశీలించారు. ఆయన ఉదయం ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఘటనా స్థలానికి వచ్చారు. 20 నిమిషాల పాటు ఇక్కడే ఉన్నారు. విమానం కూలిపోవడంతో ధ్వంసమైన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వెంట పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, గుజరాత్ మంత్రి హర్ష్ సంఘావీ ఉన్నారు. ప్రమాదం గురించి వారు ప్రధానమంత్రికి తెలియజేశారు. మెడికల్ కాలేజీ హాస్టల్, మెస్ ధ్వంసమైన తీరును వివరించారు. అనంతరం మోదీ సిటీ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. విమాన ప్రమాదంలో గాయాలతో బయటపడి చికిత్స పొందుతున్న విశ్వాస్ కుమార్ రమేశ్‌ను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో 25 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్న సీ7 వార్డును మోదీ సందర్శించారు. అక్కడున్న డాక్టర్లతో మాట్లాడారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

విజయ్ రూపానీ కుటుంబానికి ఓదార్పు

విమాన ప్రమాదంలో మృతిచెందిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కుటుంబాన్ని ప్రధాని మోదీ ఓదార్చారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గుజ్‌సెయిల్ కార్యాలయంలో విజయ్ రూపానీ భార్య అంజలి రూపానీతోపాటు ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ విపత్కర సమయంలో గుండె నిబ్బరం కోల్పోవద్దని, ధైర్యంగా ఉండాలని చెప్పారు.

అధికారులతో సమీక్ష

ప్రధాని మోదీ గుజ్‌సెయిల్ ఆఫీసులో గుజరాత్ ప్రభుత్వ అధికారులతో, పౌర విమానయాన శాఖ అధికారులతో సమావేశమయ్యారు. విమాన ప్రమాదం, తాజా పరిణామాలపై సమీక్ష నిర్వహించారు.


శుక్రవారం ప్రమాద స్థలి వద్ద ప్రధాని

ఎగిరిపడ్డ సీటే బతికించింది

ప్రమాదంపై మృత్యుంజయుడు రమేశ్

అహ్మదాబాద్: ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృత్యుంజయుడిగా నిలిచిన ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేశ్. బ్రిటిష్ జాతీయుడైన ఆయన అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''ప్రమాద తీవ్రత చూసి చనిపోయాననే అనుకున్నా. బతికి బయటపడ్డానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా'' అని చెప్పారు. ''విమానం ఎడమ వైపున ఉన్న ఎమర్జెన్సీ డోర్ పక్కన 11ఏ సీట్లో కూర్చున్నా. టేకాఫైన కాసేపటికే విమానం కూలిపోయి ముక్కలైంది. ఆ తాకిడికి నా సీట్ ఊడిపోయింది. సీటు బెల్టు పెట్టుకుని ఉండటంతో నేను సీటుతోపాటు ఎగిరిపడ్డాను. ఒక క్షణం భయం వేసింది. నేను పడ్డచోటు చాలా తక్కువ ఎత్తులో నేలకు చాలా దగ్గరగా ఉంది. అంతేగాక విమానంలో నేనున్న చోటు మెడికల్ కాలేజీ హాస్టల్ గ్రౌండ్ ఫ్లోర్‌పై పడింది. అంతేగాక విరిగిన విమానం తలుపు విరిగిపోయి కన్పించింది. 'ఎలాగైనా బయటపడగలను' అని నాకు నేను చెప్పుకున్నా. వెంటనే సీట్ బెల్ట్ తీసేసి తలుపు గుండా బయటికొచ్చేశా. అంతసేపూ తోటి ప్రయాణికులు, సిబ్బంది ఆక్రందనలు, వారి మృత్యుఘోష వెనక నుంచి వినిపిస్తూనే ఉన్నాయి. వాళ్లంతా నా కళ్లముందే చనిపోయారు'' అని ఘటనను గుర్తు చేసుకున్నారు. ఈ ఉదంతంతో విమానాల్లోని 11ఏ సీటు రాత్రికి రాత్రి ఫేమస్ కావడం తెలిసిందే. విమానం నుంచి బయటపడి రమేశ్ గాయాలతో కుంటుకుంటూ అంబులెన్స్ వైపు నడుస్తున్న వీడియో కూడా విపరీతంగా వైరల్ అవుతోంది. గుజరాత్‌లోని దియూకు చెందిన ఆయన బ్రిటన్‌లోని లీసెస్టర్‌లో స్థిరపడ్డారు.

ఒకరు మానేద్దామనుకున్నారు.. ఇంకొకరు ఇప్పుడే మొదలెట్టారు!

ముంబై: ప్రమాదానికి గురైన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ పైలట్ సుమీత్ సభర్వాల్(56), కో పైలట్ క్లైవ్ కుందర్‌లది విభిన్నమైన నేపథ్యం. ఒకరు ఎంతో అనుభవశాలి కాగా, మరొకరు ఇప్పుడిప్పుడే కెరీర్‌ను మొదలుపెట్టారు. సభర్వాల్ బాధ్యతల నుంచి తప్పుకోవాలనే యోచనలో ఉండగా, క్లైవ్ కుందర్ భవిష్యత్తు గురించి కలలు కంటున్నారు. ఫ్లయింగ్ అనుభవం వీరిద్దరిదీ కలిపి 9,300 గంటలు కాగా, ఇందులో సభర్వాల్ ఒక్కరికే 8,200 గంటల అనుభవముంది. పైలట్ సుమీత్ సభర్వాల్(56) ముంబైలోని పొవై ప్రాంతానికి చెందిన జల్ వాయు విహార్‌లో వృద్ధులైన తల్లిదండ్రులతో ఉంటున్నారు. ఎంతో అనుభవం కలిగిన సుమీత్‌కు, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా ఉంటారని పేరుంది. 'వింగ్ కమాండర్‌గా రిటైరయ్యాను. ఎయిరిడింయా సిబ్బందితో కలిసి సుదీర్ఘ కాలం పనిచేశాను. కెప్టెన్ సుమీత్ ఎంతో మంచివారు. అనుభవశాలి అయిన పైలట్. ఆయన మరణం ఎయిరిండియాకు తీరని లోటు'అని సుమీత్ ఫ్యామిలీ ఫ్రెండ్ సంజీవ్ పాయ్ చెప్పారు. 'సుమీత్ పనితీరుపై గానీ, ప్రజలతో వ్యవహరించే తీరుపైగానీ ఎన్నడూ ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఆయన ఎంతో సౌమ్యుడు. శాంతిస్వభావి'అని పాయ్ అన్నారు. 'సుమీత్ తండ్రి డీజీసీఏ అధికారిగా పనిచేసి, రిటైరయ్యారు. ఆయన కుటుంబంలోని మరో ఇద్దరు సైతం పైలట్లుగా ఉన్నారు. వారి స్ఫూర్తితోనే సుమీత్ పైలట్ అయ్యారు. అయితే, 82 ఏళ్ల వృద్ధుడైన తండ్రి బాగోగులను చూసుకునేందుకు ఉద్యోగం మానేయాలనుకుంటున్నట్లు కొన్ని రోజుల క్రితం సుమీత్ నాతో అన్నారు'అని పాయ్ వివరించారు.

కో–పైలట్ క్లైవ్ కుందర్‌కు 1,100 గంటల ఫ్లయింగ్ అనుభవముంది. క్లైవ్ తల్లి ఫ్లయిట్ క్రూ సభ్యురాలు. ముంబై జుహులోని బాంబే ఫ్లయింగ్ క్లబ్‌లో క్లైవ్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ కోర్సు పూర్తి చేశారు. ఏరోనాటికల్ ఇంజనీర్‌గా ఏడాదికి పైగా పనిచేశారు. కలినాలోని ఎయిరిండియా కాలనీలో క్లైవ్ పెరిగాడు. అనంతరం వీరి కుటుంబం బొరివలికి మకాం మార్చింది. కుందర్ పైలట్ కావాలన్న తన కలను సాకారం చేసుకునేందుకు ఎయిరిండియాలో చేరారని పొరుగునుండే ఫ్లాయిడ్ డిసౌజా చెప్పారు. ఎంతో సరదాగా అందరినీ నవ్విస్తుండే క్లైవ్ కుందర్‌కు, ఆయన తండ్రి క్లిఫ్ఫర్డ్‌కు ఆటలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. క్లైవ్ ఖాళీ దొరికితే చాలు క్రికెట్ ఆడేవారని చెప్పారు. విషాదం తెల్సిన వెంటనే ఆస్ట్రేలియాలో ఉంటున్న క్లైవ్ సోదరి క్లైన్, తల్లి రేఖ ఇండియాకు బయలుదేరారని ఫ్లాయిడ్ అన్నారు. క్లైవ్ కుందర్ మృతిపై నటుడు విక్రాంత్ మస్సీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.


సుమీత్ సభర్వాల్ క్లైవ్ కుందర్

వెయ్యి డిగ్రీల వేడిలోనూ బ్లాక్ బాక్స్ భద్రం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తులో బ్లాక్ బాక్స్, డిజిటల్ వీడియో రికార్డర్(డీవీడీ) అత్యంత కీలకం కాబోతున్నాయి. ఈ రెండింటిని దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విమానం పేలిపోయినప్పుడు అందులోని ఇంధనం కారణంగా ఏకంగా 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వెలువడింది. విమానం మొత్తం మంటల్లో చిక్కుకుంది. మృతదేహాలు మసిబొగ్గులా మారాయంటే ప్రమాద తీవ్రతను అంచనా వేయొచ్చు. భారీ ఉష్ణోగ్రతలోనూ బ్లాక్ బాక్స్ సురక్షితంగా ఉంటుందని, అందులోని డేటా చెరిగిపోదని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ బాక్స్‌లో ప్రధానంగా రెండు భాగాలు ఉంటాయి. ఒకటి ఫ్లైట్ డేటా రికార్డర్(ఎఫ్‌డీఆర్), మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్(సీవీఆర్). ఎఫ్‌డీఆర్‌లో సాంకేతికపరమైన అంశాలు నిక్షిప్తమవుతాయి. అంటే విమానం ఎగురుతున్న ఎత్తు, వేగం, ఇంజన్ పనితీరును ఇది రికార్డు చేస్తుంది. కాక్‌పిట్‌లోని శబ్దాలు, సంభాషణలు సీవీఆర్‌లో నమోదవుతాయి. టైటానియం లేదా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో బ్లాక్‌బాక్స్ తయారు చేస్తారు. ఇది 1,100 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతోపాటు అత్యధిక ఒత్తిడిని సైతం తట్టుకోగలదు. అంతేకాకుండా ఇది వాటర్‌ప్రూఫ్. నీటిలో 6 వేల మీటర్ల లోతున కూడా 30 రోజులపాటు భద్రంగా ఉంటుంది. నీటిలో దీని జాడ సులభంగా కనిపెట్టవచ్చు. అందులోని నుంచి సంకేతాలు వెలువడుతుంటాయి. డీవీఆర్ అనేది బ్లాక్‌బాక్స్ కంటే భిన్నమైనది. విమానంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ఇందులో ఉంటుంది. విమానం కాక్‌పిట్, కేబిన్‌లో ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు. బ్లాక్ బాక్స్, డీవీఆర్ డేటాను ప్రత్యేక ల్యాబ్‌ల్లో ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషించబోతున్నారు. ఇందుకోసం ఢిల్లీలో ఇటీవలే డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ ల్యాబ్ ప్రారంభించారు. దెబ్బతిన్న రికార్డర్లను మరమ్మతు చేసి, డేటాను వెలికితీసే సదుపాయం ఇక్కడ ఉంది.



సెక్యూరిటీ అలర్ట్‌తో వెనుదిరిగిన ఎయిరిండియా విమానం

ముంబై: థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిరిండియా విమానం 'సెక్యూరిటీ అలర్ట్'కారణంగా అకస్మాత్తుగా వెనుదిరగాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు టేకాఫ్ తీసుకున్న ఎయిర్‌బస్ ఏ320 రకం విమానం మధ్యాహ్నం 12.40 గంటలకు ఢిల్లీకి చేరుకోవాల్సి ఉంది. విమానంలో 'సెక్యూరిటీ అలర్ట్'రావడంతో పైలట్ వెంటనే వెనక్కి మళ్లించారు. తిరిగి ఫుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 11.46 గంటల సమయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికుల తోపాటు లగేజీని పూర్తిగా కిందికి దించేసి క్షుణ్నంగా తనిఖీలు చేపట్టినట్లు ఎయిరిండియా అధికారి ఒకరు చెప్పారు. విమానంలో ప్రయాణికులెందరున్నారనే విషయం వెల్లడి కాలేదు.

యూకే నుంచి దర్యాప్తు బృందం

లండన్: ఎయిరిండియా దుర్ఘటనపై దర్యాప్తులో భారత్‌కు సాయపడేందుకు బ్రిటన్ నుంచి బృందాన్ని పంపినట్లు ప్రధాని కియిర్ స్టార్మర్ తెలిపారు. ఆ బృందానికి విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ నాయకత్వం వహిస్తున్నారు. పౌర విమాన ప్రమాదాలు, తీవ్ర ఘటనలను దర్యాప్తు చేసే బ్రిటిష్ ఏజెన్సీ, ఎయిర్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఏఏఐబీ) బృందం కూడా రానుంది. ప్రమాద మృతుల్లో 52 మంది బ్రిటిష్ పౌరులుండటం తెలిసిందే. కనుక దర్యాప్తులో తమకు నిపుణుల హోదా ఉంటుందని ఏఏఐబీ తెలిపింది. పేలిపోయిన విమానం బోయింగ్ కంపెనీదన్నది తెలిసిందే. అమెరికా నుంచి బోయింగ్ ప్రతినిధులు కూడా దర్యాప్తు నిమిత్తం రానున్నట్టు సమాచారం.

మెడికల్ కాలేజీ మృతులెందరు?

- రోజున్నర దాటినా అస్పష్టతే
- అధికారికంగా వెల్లడించని వైనం
- 24 మంది మరణించినట్టు ప్రాథమిక సమాచారం

అహ్మదాబాద్: ఎయిరిండియా విమానానికి సంభవించిన ఘోర ప్రమాదంలో మరణించిన వారి సంఖ్యపై గురువారం అర్ధరాత్రికే స్పష్టత వచ్చింది. 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందికి గాను ఒక్కరు మినహా అందరూ దుర్మరణం పాలయ్యారు. 241 మంది మరణించినట్టు ఎయిరిండియా అధికారికంగా ప్రకటించింది. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరిన విమానం టేకాఫైన 33 సెకన్లకే రన్‌వే సమీపంలోని బీజే మెడికల్ కాలేజీ మెస్, హాస్టల్‌పై పడి పేలిపోవడం తెలిసిందే. ఆ సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉండటంతో అత్యంత భారీ పేలుడు సంభవించింది. దాంతో మెస్, హాస్టల్ ధ్వంసమవడమే గాక పరిసర భవనాలకూ నిప్పంటుకుని కాలిపోయాయి. కానీ అక్కడి వారిలో ఎందరు చనిపోయారన్న దానిపై మాత్రం ఇప్పటికీ స్పష్టత లేదు. దీనిపై గుజరాత్ ప్రభుత్వం గానీ, కేంద్రం గానీ అధికారికంగా స్పందించలేదు. కనీసం 24 మంది మరణించినట్టు గురువారమే వార్తలొచ్చాయి. గురువారం అర్ధరాత్రికే ఆస్పత్రికి 265 మృతదేహాలు వచ్చినట్టు డీఎస్పీ కనన్ దేశాయ్ చేసిన ప్రకటన వాటికి బలం చేకూర్చింది. నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు, ఒక వైద్యుడు, మరో వైద్యుడి భార్య మృతిని కాలేజీ వర్గాలు గురువారం రాత్రి ధ్రువీకరించాయి. మరో 60 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు గాయపడ్డట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ పేర్కొంది. వారిలో 19 మందికి తీవ్ర గాయాలయ్యాయని, ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని కూడా వెల్లడించింది. అంతేగాక ఇద్దరు ఎంబీబీఎస్ మూడో సంవత్సరం విద్యార్థులు, ఒక వైద్యుని తాలూకు ముగ్గురు బంధువుల ఆచూకీ తెలియడం లేదని కాలేజీ డీన్ డాక్టర్ మీనాక్షీ పారిఖ్ తెలిపారు. వీరి పరిస్థితి ఏమిటన్నది మాత్రం శుక్రవారం అర్ధరాత్రి దాకా తెలియరాలేదు. ప్రమాదస్థలి వద్ద భవనాల శిథిలాలు తదితరాలను తొలగించేందుకు ఆరు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు శ్రమిస్తున్నట్టు సంస్థ డీజీ హరి ఓం గాంధీ శుక్రవారం తెలిపారు. మృతులపై మాత్రం ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. దాంతో మొత్తం మృతుల సంఖ్యపై రకరకాల ఊహాగానాలు విన్పించాయి. శుక్రవారం మరో నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల మృతదేహాలు లభించాయని, మొత్తం మృతుల సంఖ్య 325కి చేరిందని వార్తలొచ్చాయి. గుజరాత్ పోలీసులు కూడా మృతుల సంఖ్య 294కు చేరినట్టు శుక్రవారం మధ్యాహ్నం చెప్పారు. కానీ, '240 మందికి పైగా మరణించార'ంటూ సాయంత్రానికల్లా సవరణ ప్రకటన చేశారు! మెడికల్ కాలేజీ మృతుల సంఖ్యను ప్రభుత్వం ఎందుకు గుట్టుగా ఉంచుతున్నదీ అంతుబట్టడంలేదు.

డ్రీమ్‌లైనర్‌లను మరింత క్షుణ్నంగా తనిఖీ చేయండి: డీజీసీఏ

న్యూఢిల్లీ: ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలన్నిటినీ తక్షణమే మరింత క్షుణ్నంగా తనిఖీ చేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ విమానాలకు అమర్చిన జీఈ ఎన్‌ఎక్స్ రకం ఇంజన్లతోపాటు టేకాఫ్ పారామీటర్స్‌ను, ఇతర వ్యవస్థల పనితీరును సమీక్షించాలని కోరింది. డీజీసీఏ ప్రాంతీయ కార్యాలయాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. క్యాబిన్ ఎయిర్ కంప్రెషర్ అనుబంధ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ ఇంజన్ కంట్రోల్ సిస్టమ్ టెస్ట్, ఇంజన్ ఫ్యూయల్ డ్రివెన్ యాక్చువల్ ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్స్ చెకింగ్ కూడా చేపట్టాలంది. తదుపరి నోటీసు ఇచ్చే వరకు తనిఖీలు కొనసాగించాలని, సంబంధిత నివేదికలను అందజేయాలని స్పష్టం చేసింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియాకు 26 బోయింగ్ 787–8లతోపాటు 7 బోయింగ్ 787–9 రకం విమానాలున్నాయి. కాగా, విమాన ప్రమాద ఘటనపై అమెరికాకు చెందిన విమాన ఇంజన్ తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్ స్పందించింది. భారత నియంత్రణ వ్యవస్థలు, దర్యాప్తు విభాగాలతో కలిసి పనిచేయడం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అహ్మదాబాద్‌లో గురువారం ప్రమాదానికి గురైన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానానికి జీఈ ఎన్‌ఎక్స్ రకం ఇంజన్ ఉండటం తెల్సిందే.

పరిహార భారం ఎయిర్ ఇండియాదే

- ఒక్కో బాధిత కుటుంబానికి రూ.2.80 కోట్లు
- బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానానికి బీమా సదుపాయం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ దుర్ఘటనలో ఖరీదైన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయింది. విమానం ఖరీదు, బాధిత కుటుంబాలకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని ఎవరు భరిస్తారన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. విమానానికి బీమా సదుపాయం ఎలాగూ ఉంటుంది. బీమా సంస్థ నుంచి నష్టాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద ఏవియేషన్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ కాబోతోందని నిపుణులు చెబుతున్నారు. ఇక బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత విమానయాన సంస్థదే. అంటే ఇక్కడ ఎయిర్ ఇండియాదే. ఈ విషయంలో స్పష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయి. 1999 నాటి మాంట్రియల్ అంతర్జాతీయ తీర్మానం ప్రకారం.. విమానం ప్రమాదానికి గురై ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగితే, ఎవరైనా క్షతగాత్రులుగా మారితే సంబంధిత విమానయాన సంస్థే ఆ నష్టాన్ని భరించాలి. విమానంలో ప్రయాణికుల వస్తువులు, సామగ్రి ధ్వంసమైనా, అవి వారికి అందడంలో ఆలస్యం జరిగినా పరిహారం ఇవ్వాల్సిందే. అహ్మదాబాద్ ప్రమాదంలో ఎయిర్ ఇండియా సంస్థ ఒక్కో బాధిత కుటుంబానికి 1,51,880 స్పెషల్ డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డీఆర్) ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఎస్‌డీఆర్ విలువ దాదాపు రూ.120. ఈ లెక్కన ఒక్కో కుటుంబానికి రూ.1.80 కోట్లు పరిహారంగా ఇవ్వాల్సి ఉంది. ఎస్‌డీఆర్‌ను అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) గతంలోనే ఖరారు చేసింది. అహ్మదాబాద్ ప్రమాదంలో 265 మంది మృతిచెందారు. మాంట్రియల్ అంతర్జాతీయ తీర్మానం ప్రకారం వీరందరికీ కలిపి ఎయిర్ ఇండియా యాజమాన్యం రూ.435 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ప్రయాణికులు కాకుండా విమానంలో పనిచేసే సిబ్బందికి చట్టప్రకారం అదనపు పరిహారం ఇవ్వక తప్పదు. మాంట్రియల్ అంతర్జాతీయ తీర్మానం ప్రకారం విమాన ప్రమాదంపై దర్యాప్తు పూర్తికాక ముందే బాధిత కుటుంబాలకు 16,000 ఎస్‌డీఆర్‌లు(రూ.18 లక్షలు) అడ్వాన్స్‌గా చెల్లించాలి. మాంట్రియల్ తీర్మానం కింద ఇచ్చే పరిహారంతో పాటు ఒక్కో కుటుంబానికి అదనంగా రూ.కోటి చొప్పున ఇస్తామని టాటా గ్రూప్ ఇప్పటికే ప్రకటించింది. అంటే ఒక్కో కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం దక్కబోతోంది. ఎయిర్ ఇండియా టాటా గ్రూప్ యాజమాన్యంలో ఉన్న సంగతి తెలిసిందే. బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానాన్ని దాదాపు రూ.960 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిసింది. విమానానికి బీమా, బాధితులకు ఇచ్చే పరిహారం మొత్తంగా చూస్తే ఈ విలువ రూ.1,000 కోట్ల నుంచి రూ.1,250 కోట్ల వరకు ఉంటుంది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 14 । జూన్ । 2025



బాంబే సలీం.. ఇక్కడా వాంటెడ్!

బాంబే సలీంపై దేశవ్యాప్తంగా 300కు పైగా కేసులు నమోదయ్యాయి. తెలంగాణలోనూ 70 కేసులు ఉన్నాయి. ఇతగాడిని విశాఖపట్నం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. -8లో



మెట్రో సిటీలో 'ఈ- స్కేటర్స్'

నగరంలో సరికొత్తగా 'స్టాండింగ్ మొబిలిటీ స్కూటర్లు' లేదా 'ఈ- స్కేటర్స్' రాబోతున్నాయి. ఈ తరహా మైక్రో మొబిలిటీ వాహనాలు కీలక పాత్ర పోషించనున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

హరిచందన.. బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా హరిచందన దాసరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు జి.ముకుంద రెడ్డి, కదిరవన్ పళని, జిల్లా అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ వార్షిక కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 1న జరగనున్న అమ్మవారి కల్యాణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టి ఒక గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చి దిద్దుతున్నట్లు వివరించారు. అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు, సీసీ కెమెరాలు, లైటింగ్, ఆరోగ్య కేంద్రాల ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాల్లో 4 ఆరోగ్య క్యాంపులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ కె.సరళ, అధికారులు డాక్టర్ వెంకట్, రవీంద్ర మోహన్, ప్రభు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, జోగిని శ్యామల పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో 24 కొత్త బార్లకు శుక్రవారం నిర్వహించిన డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. గ్రేటర్ పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు అందిన విషయం విదితమే. గోల్కొండ నార్సింగ్ ప్రాంతంలోని కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీశారు. జాయింట్ కమిషనర్ కేఏపీ శాస్త్రి గెలుపొందిన వారి వివరాలను వెల్లడించారు. 90 రోజుల్లోగా నిబంధనల ప్రకారం బార్లను తెరవాలని సూచించారు. రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ పాల్గొన్నారు.

నాలాల్లో ఆటంకాలు ఉండకూడదు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని, నాలాల్లో ఎక్కడా నీటి ప్రవాహానికి ఆటంకాలు ఉండకూడదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నాలాల్లో ఉన్న ఆక్రమణలన్నీ వెంటనే తొలగించాలని ఆదేశించారు. చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12, పింఛన్ ఆఫీసు దగ్గర 15 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా చింతల బస్తీ వైపు 7 మీటర్ల కు తగ్గడంతో హైడ్రా కబ్జాలను తొలగించింది. ఆక్రమణల కారణంగా కల్వర్టు కింద సగం భాగం పూడిపోయినట్లు గుర్తించారు. ఆ పూడిక తీతను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జేసీబీలను నాలాలోకి దింపి చెత్తను తొలగించాలని సూచించారు. వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. శంకరిపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే ఈ నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూ కాలనీ, షేక్‌పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హకీమ్సా విరాట్ నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలిటరీ ఏరియా, బంజారాహిల్స్, చింతల్ బస్తీ, తుమ్మల బస్తీ, ఖైరతాబాద్ మీదుగా ప్రవహించి హుస్సేన్‌సాగర్‌కు నీటిని చేరుస్తుంది.



చింతల్‌బస్తీ నాలాను పరిశీలిస్తున్న రంగనాథ్



ఇదీ పరిస్థితి..

జీహెచ్ఎంసీ పరిధిలో సీవరేజ్ నెట్‌వర్క్: 5,767 కి.మీ
శివారు మున్సిపాలిటీల పరిధిలో: 4,200 కి.మీ
మొత్తం మ్యాన్‌హోళ్లు: 6,34,919
డీప్ మ్యాన్‌హోళ్లు: 63,221
వీటిలో జీహెచ్ఎంసీ పరిధిలో: 26,798
శివారు మున్సిపాలిటీల పరిధిలో: 36,423

వానొస్తే వణుకే!

కుండపోత వేళ కరువైన రక్షణ చర్యలు

- 2 సెంటీ మీటర్ల వర్షానికే రోడ్లన్నీ జలమయం
- ఇక 10 సెం.మీ కురిస్తే.. అతలాకుతలమే..
- డీప్ నాలాలు, మ్యాన్‌హోళ్ల వద్ద కనిపించని సూచికలు
- ప్రాణాంతకంగా ఓపెన్ నాలాలు, డీప్ డ్రైనేజీ వ్యవస్థ



సాక్షి, సిటీబ్యూరో:

మహా నగరంలో కుండపోత వర్షం కురిసినప్పుడు ఓపెన్ నాలాలు, డీప్ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద వాహనదారులు, పాదచారుల రక్షణ ఆందోళనకరంగా తయారైంది. పెరుగుతున్న జనాభాకు తోడు విచ్చలవిడిగా బహుళ అంతస్తుల భవంతులు, ఆకాశహర్మ్యాలు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య భవనాలు ఇతరత్రా నిర్మాణాలతో మహా నగరం కాంక్రీట్ జంగిల్‌గా తయారైంది. భూమిపై పడే వాన చినుకులోనికి ఇంకే పరిస్థితి లేకుండా పోవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయవుతుంటాయి. కేవలం రెండు, మూడు సెంటీమీటర్ల వర్షపాతాన్ని మాత్రమే తట్టుకునే విధంగా డ్రైనేజీ, నాలా వ్యవస్థ ఉండటం ఆందోళనకరంగా తయారైంది. ఏ సమయంలో వర్షం కురిసినా కనీసం ఐదు సెంటీమీటర్లకు తగ్గకుండా నమోదవుతుండటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఇక 10 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసిన సమయంలో నగరమంతా జలసంద్రంగా మారుతోంది. లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో డ్రైనేజీలు, నాలాలు పొంగిపొర్లుతుంటాయి. ఎటు చూసినా ఉద్ధృతంగా ప్రవహించే నీరే కనిపిస్తుంటుంది.

సాయంత్రం సమయాల్లోనే ఎక్కువగా..

పగటి పూట కంటే సాయంత్రం కురిసే వర్షం సిటీజనులను వణుకు పుట్టిస్తోంది. సాధారణంగా సాయంత్రం సమయాల్లోనే వర్షం అధికంగా కురుస్తోంది. నిమిషాలు, క్షణాల్లోనే సర్వీస్ రోడ్లతో పాటు ప్రధాన రోడ్లపై భారీ నీరు వచ్చి చేరి పూర్తిగా జల మయమవుతుంటాయి. ఎక్కడ మ్యాన్‌హోళ్లు ఉన్నాయి? అసలు ఎక్కడ రోడ్డు ఉంది?. తెలియని పరిస్థితి నెలకొంటోంది. కార్యాలయాల నుంచి విధులు ముగించుకొని ఇంటికి తిరుగుముఖం పట్టే ఉద్యోగులు, పాఠశాల వదలడంతో ఇంటి బాటపట్టే విద్యార్థులు, వివిధ పనుల కోసం బయటికి వచ్చిన వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతుంటారు. జలమయమైన రోడ్లలో డ్రైనేజీ, నాలాల మ్యాన్‌హోళ్లు తెరిచి ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్న భయం వెంటాడుతోంది. దీంతో ఓపెన్ మ్యాన్‌హోళ్లు, నాలాలు మృత్యు కుహరాలుగా తయారయ్యాయి.

సూచికలెక్కడ?

వర్షాకాలం ప్రారంభమైనా.. ఓపెన్ నాలాలు, డీప్ మ్యాన్‌హోళ్లవద్ద హెచ్చరిక సూచికలు కనిపించడం లేదు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం విస్మయానికి గురి చేస్తోంది. వాటర్ లాగింగ్ పాయింట్స్, మ్యాన్‌హోళ్ల వద్ద ఎరుపు రంగు వేసి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వాటర్ లాగింగ్ పాయింట్ దగ్గర ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి.. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాల్సింది ఉంటుంది. కానీ.. ఇవేవీ నగరంలో కనిపించడం లేదు. వర్షం పడుతున్న సమయంలో మాత్రం కొందరు స్థానికులు, వ్యాపారులు పాడవాటి కర్రలు లేదా చెట్ల కొమ్మలను తెరిచి ఉన్న నాలాల, డ్రైనేజీల మ్యాన్‌హోళ్లలో పెట్టి జనాన్ని అప్రమత్తం చేయడం సర్వసాధారణంగా తయారైంది. వారు పనుల్లో ఉండి మరిచిపోతే మాత్రం వాహనదారులు, పాదచారులకు ముప్పు వాటిల్లడం తప్పనిసరిగా మారుతోంది.

146 వాటర్ లాగింగ్ పాయింట్ల గుర్తింపు

జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 146 వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. ఇందులో 50 వరకు మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఖైరతాబాద్, మైత్రివనం, పంజాగుట్ట, లక్డీకాపూల్, చే నెంబర్, మెట్టుగూడ, వీఎస్టీ, ముషీరాబాద్, బాలానగర్, మూసాపేట, బోరబండ, మియాపూర్, కొండాపూర్, ఎల్బీనగర్, చాదర్ ఘాట్, మల్లెపల్లి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో నీరు వెళ్లేందుకు క్యాచ్‌పిట్స్, డ్రైనేజీల మూతలు తీస్తుండటంతో ప్రమాదాలకు దారి తీస్తోంది.

బడి గదికి తాళం!

ఆరుబయటే చదువుకున్న చిన్నారులు

- పోలీసుల జోక్యంతో తెరుచుకున్న పాఠశాల
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ



స్కూల్ బయటే చదువుకుంటున్న చిన్నారులు

బంజారాహిల్స్/శ్రీనగర్‌కాలనీ: స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ పాఠశాల గదికి.. వివాదం కారణంగా తాళం వేయడంతో విద్యార్థులు రెండు రోజుల పాటు ఆరుబయటే ఉండి చదువుకున్నారు. అనంతరం పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం కావడంతో ఎట్టకేలకు శుక్రవారం పాఠశాల గదిలోకి అడుగుపెట్టారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలోని రామాలయం ఆవరణలో జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ జర్నలిస్ట్ వామన్ రావు సహకారంతో సుమారు 30 ఏళ్లుగా సుశీలాదేవి మెమోరియల్ స్కూల్ కొనసాగుతోంది. బస్తీలోని పేద పిల్లలకు ఇక్కడ 4వ తరగతి వరకు ఉచితంగా చదువు చెబుతున్నారు. 2018లో వామన్‌రావు మృతి చెందడంతో స్కూల్ బాధ్యతలను అమెరికాలోని ఆయన కుమార్తె మాలతి చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ బడిలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ క్రమంలో పంజగుట్ట బస్తీ కమిటీ పెద్దలకు, స్కూల్ నిర్వాహకులకు ఇటీవల వివాదం తలెత్తింది. దీంతో కమ్యూనిటీ హాల్‌లో స్కూల్ నడిపించేందుకు వీల్లేదని బస్తీవాసులు నెల రోజుల క్రితం పాఠశాల నిర్వాహకులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో స్కూల్‌ను ఎట్టి పరిస్థితిలో నడవనిచ్చేది లేదంటూ బస్తీ కమిటీ నేతలు వారం రోజుల క్రితం కమ్యూనిటీ హాల్‌కు తాళం వేశారు.

పోలీసుల జోక్యంతో..

వేసవి సెలవులు ముగియడంతో గురువారం పిల్లలు స్కూల్‌కు వచ్చారు. కమ్యూనిటీ హాల్‌కు తాళం కనిపించడంతో బయటే కూర్చొని చదువుకున్నారు. ఈ వ్యవహారంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఉదయం కలకలం రేగింది. ఒకవైపు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పిల్లలను స్కూల్‌కు పంపించాలంటూ ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తుంటే, ప్రతాప్‌నగర్‌లో స్కూల్ పిల్లలను రోడ్డున పడేసిన వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్‌తో పాటు ఇతర సిబ్బంది ప్రతాప్‌నగర్‌కు చేరుకున్నారు. కమ్యూనిటీ హాల్‌కు తాళం వేసే అధికారం బస్తీ నేతలకు లేదని, ఏవైనా సమస్యలు ఉంటే చట్టపరంగా చూసుకోవాలే తప్ప పిల్లలను రోడ్డున పడేసే హక్కు లేదని ఇన్‌స్పెక్టర్ శోభన్ తేల్చి చెప్పారు. దీంతో బస్తీ కమిటీ నేతలు తాళాలు తొలగించారు.

నీడ జాడలు!



కొత్తగా 500 బస్ షెల్టర్లు

- ఏర్పాటుకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- అనుమతి కోసం ఎదురుచూపులు


సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా 500 బస్ షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. నగరంలో ప్రస్తుతమున్న 1300కు పైగా బస్ షెల్టర్లకు తోడు కొత్తగా మరో 500 బస్ షెల్టర్లు ఏర్పాటు చేసే యోచనలో అధికారులున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. ఆమోదం లభిస్తే బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ఓవైపు ప్రజలకు సదుపాయంతో పాటు మరోవైపు జీహెచ్ఎంసీకీ తగిన ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. నగరంలో తగినన్ని బస్ షెల్టర్లు లేక ప్రజలు ఎండుకు ఎండుతూ, వానకు తడుస్తుండటాన్ని వివరిస్తూ ఏప్రిల్‌లో 'సాక్షి' దినపత్రికలో 'షెల్టర్ ప్లీజ్' ప్రచురితమైన కథనంలోని అంశాలతో పాటు ఆయా వర్గాల నుంచి సేకరించిన సమాచారం తదితర వివరాలతో కొత్తగా 500 బస్ షెల్టర్ల వరకు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ అనుమతి వస్తే బీఓటీ విధానంలో వాటి ఏర్పాటుకు ప్రైవేటు ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానించి, కొత్త షెల్టర్లు ఏర్పాటు చేయనున్నారు.

కొత్తవి సరే.. ఉన్నవాటి నిర్వహణ ఏదీ?

- కొత్తగా బస్‌షెల్టర్ల ఏర్పాటు స్వాగతించదగ్గ అంశమే అయినా, వాటిని నిజంగా ప్రజల సదుపాయార్థం ఏర్పాటు చేస్తారా? లేక వాటిని నిర్మించే ప్రైవేటు ఏజెన్సీల ఆదాయం కోసం ఏర్పాటు చేస్తారా ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బీఓటీ విధానంలోనే గతంలో ఏసీ బస్ షెల్టర్లతో సహా ఏర్పాటు చేసిన వందల బస్ షెల్టర్లలో ఒప్పందం మేరకు ఉండాల్సిన సదుపాయాల్లేవు. చాలా వాటిలో కనీస సదుపాయాలైన కూర్చునేందుకు బెంచీలు, రాత్రి పూట విద్యుత్ సైతం లేవు. పేరుకు బస్ షెల్టర్లే అయినా పైకప్పు లేనివి కూడా ఎన్నో. ఈ నేపథ్యంలో బస్‌షెల్టర్లు లేని ప్రాంతాలతో పాటు ఉన్న చోట సైతం ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సిన పరిస్థితులే ఉన్నాయి.
- అంతేకాదు.. గతంలో ఏర్పాటు చేసినవి ప్రజలకు ఉపయోగపడే ప్రాంతాల్లో కంటే, ఏజెన్సీలకు ప్రకటనల ఆదాయానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసినవే ఎక్కువ. అక్కడ బస్సులు ఎక్కేవారు తక్కువ. బస్‌షెల్టర్లు మాత్రం అదరగొట్టే ప్రకటనలతో, రాత్రుళ్లు వెలుగుజిలుగులతో తళతళలాడుతుంటాయి. బస్సు ప్రయాణాలపైనే ఆధారపడే సామాన్య ప్రజలుండే ప్రాంతాల్లో తగినన్ని బస్‌షెల్టర్లు లేవు. కొత్త బస్‌షెల్టర్లను ఏర్పాటుచేసే కంటే ముందు ఉన్నవాటిల్లో కనీస సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాదు. ప్రకటనల కోసం కాకుండా ప్రజల కోసమే అయితే, సిటీ బస్ ప్రయాణాలు చేసే వారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

స్మార్ట్ 'ఫ్యూచర్'

20 ఏళ్ల అవసరాలు తీర్చేలా.. 'నాలుగో నగరి'



- ప్రపంచ నగరాలతో పోటీపడేలా అభివృద్ధి
- ఫోర్త్ సిటీకి రెండు మాస్టర్ ప్లాన్లు
- 14 వేల ఎకరాల టీజీఐఐసీ భూములకు ఒకటి..
- 2 లక్షల ఎకరాల అథారిటీ పరిధికి మరొకటి
- 5 ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ శాశ్వత కార్యాలయం
- వారం రోజుల్లో 34 రెగ్యులర్ పోస్టుల భర్తీ: ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా నిలవనున్న ఫ్యూచర్ సిటీ (నాలుగో నగరి).. స్థిరమైన, సమగ్రమైన స్మార్ట్ పట్టణీకరణ నగరంగా అభివృద్ధి చెందనుంది. ప్రపంచ నగరాలతో పోటీ పడేలా గ్రేటర్ హైదరాబాద్‌కు దక్షిణ భాగంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జాతీయ రహదారుల మధ్య అభివృద్ధి చేయనున్న ఈ ప్రతిష్టాత్మక నాలుగో నగరం 765.28 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంటుందని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) తొలి కమిషనర్ కె.శశాంక పేర్కొంటున్నారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఏమంటున్నారంటే..

భవిష్యత్ నగరి ఎలా ఉంటుందంటే?

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో నాలుగో నగరం అవసరం ఉందని సీఎం రేవంత్ నిర్ణయించారు. మహేశ్వరం, ఆమన్ గల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల ఏడు మండలాల్లోని 56 గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వస్తాయి. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కాలుష్య రహిత వాతావరణం ఈ నగరం ఉంటుంది. ఫోర్త్ సిటీకి ప్రతిష్టాత్మకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక పాలసీలు, ప్రోత్సాహకాలు కల్పించనున్నాం.

మాస్టర్ ప్లాన్ ఇలా..

ఫార్మాసిటీ కోసం టీజీఐఐసీ ఇప్పటికే 14 వేల ఎకరాల భూమిని సేకరించింది. ఈ భూముల వరకూ ఒక మాస్టర్ ప్లాన్, ఎఫ్‌సీడీఏ పరిధి విస్తరించి ఉన్న సుమారు 2 లక్షల ఎకరాల వరకూ మరో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నాం. ప్రత్యేక జోన్‌లతో ఈ మాస్టర్ ప్లాన్‌లు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. అథారిటీ కోర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో టీజీఐఐసీ మాస్టర్ ప్లాన్‌ను ఇంటిగ్రేటెడ్ చేస్తాం. ఈ మాస్టర్ ప్లాన్ల రూపకల్పన బాధ్యతలు హెచ్ఎండీఏకు ఇవ్వాలని సూత్రప్రాయంగా భావిస్తున్నాం.

బడ్జెట్ కేటాయింపులు..

తొలి విడతగా ప్రభుత్వ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించింది. మాస్టర్ ప్లాన్ అభివృద్ధితో పాటు రహదారులు, విద్యుత్, నీరు వంటి మౌలిక అవసరాలకు ఖర్చు చేయనున్నాం. ఇతరత్రా వ్యయాల కోసం మరో విడత బడ్జెట్‌ను విడుదల చేయాలని ఇటీవలే ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు నివేదించాం.

ఎఫ్‌సీడీఏలో సిబ్బంది భర్తీ ఎప్పుడు పూర్తవుతుంది?

ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ముందుగా ప్లానింగ్, ఇంజినీరింగ్ వంటి పలు విభాగాలలో 34 పోస్టుల భర్తీ ఉంటుంది. మున్సిపల్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ వంటి పలు విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రానున్నారు. సీఎంవోకు ఫైల్ చేరింది. వారం రోజుల్లో భర్తీ పూర్తవుతుంది.

ఈ సిటీలో ఏం ఉంటాయంటే?

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానిస్తూ ఫ్యూచర్ సిటీకి మెట్రో కనెక్టివిటీ ఉంటుంది. ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, గ్రీన్ బిల్డింగ్, స్మార్ట్ లివింగ్ ఎకో సిస్టమ్ ఉంటుంది. ఇందులో కృత్రిమ మేధ (ఏఐ), ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ జోన్ వంటి ప్రత్యేక జోన్లు ఉంటాయి. ఫోర్త్ సిటీలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటికే బేగరి కంచెలో స్కిల్ యూనివర్సిటీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వారసత్వ కట్టడాలకు విఘాతం కలగదు

చార్మినార్, ఫలక్‌నుమాలకు దూరంగానే మెట్రో అలైన్‌మెంట్: ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక కట్టడాలు చార్మినార్, ఫలక్‌నుమాలకు దూరంగానే పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ వెళ్లనుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఏ ఒక్క చారిత్రక, వారసత్వ కట్టడానికి విఘాతం కలగడం లేదని, ఎక్కడా వారసత్వ కట్టడాలను కూల్చివేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. పాతబస్తీ మెట్రోరైల్ పనులపై హైకోర్టు స్టే విధించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి ప్రతిస్పందనగా గతంలోనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో.. పాతనగరంలో ఏ వారసత్వ నిర్మాణాన్ని తాకడం లేదా కూల్చివేయడం లేదని హైకోర్టుకు విన్నవించినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెట్రోరైల్ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ న్యాయస్థానానికి గతంలోనే హామీ ఇచ్చారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత పిటిషనర్, హెచ్ఏఎంఎల్ అదనపు అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయన్నారు. కొన్ని రోజుల క్రితం పిటిషనర్ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్లకు అదనపు అడ్వొకేట్ జనరల్ తమ తరఫున ప్రతిస్పందనను దాఖలు చేయడానికి కొంత సమయం కోరారని, ఈ మేరకు సమగ్రమైన కౌంటర్ దాఖలు చేసేందుకు హైకోర్టు 3 వారాల సమయం ఇచ్చిందన్నారు. మధ్యంతర ఉపశమనం ఏదైనా ఇదివరకు ఇచ్చి ఉంటే, తదుపరి విచారణ తేదీ వరకు అది అమలులో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొందని ఆయన వివరించారు.

వక్రీకరించారు..

హైకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ కొందరు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇచ్చే కన్సెంట్ అవార్డుల ఆధారంగా సముచితమైన పరిహారం చెల్లించిన తర్వాతే ప్రైవేట్ భవనాల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయన్నారు. పాత నగరంలో ఒకదానికొకటి అనుకోని ఉన్న భవనాలు, సంక్లిష్టంగా ముడిపడిన విద్యుత్, టెలికాం, ఇతర కేబుల్ వైర్లను జాగ్రత్తగా తొలగిస్తూ, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం రాత్రిపూట పనులు చేస్తున్నట్లు చెప్పారు. వారసత్వ కట్టడాలను మినహాయించి మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 311 ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని, సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు రు. 283 కోట్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.



కొనసాగుతున్న మెట్రో విస్తరణ పనులు

గృహిణి ఆత్మహత్య


రూప (ఫైల్)

తల్లి, సోదరి వేధింపులే కారణమని సూసైడ్ నోట్

సుభాష్‌నగర్: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రియాంక కాలనీలో నివాసం ఉంటున్న రూప అనే గృహిణి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన తల్లి, సోదరి వేధింపులే తన చావుకు కారణమని సూసైడ్ నోట్ రాసింది. సీఐ భరత్ కుమార్ కథనం ప్రకారం..మహబూబాబాద్‌కు చెందిన జంగారెడ్డి, సత్తమ్మల చిన్నకుమార్తె రూప వివాహం 2014లో గుండు జలంధర్ రెడ్డితో జరిగింది. వీరికి సిరిరెడ్డి, వేదాన్స్ రెడ్డి సంతానం. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో రూప సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండగా కూతురు సిరిరెడ్డి గమనించి తండ్రికి ఫోన్ చేసింది. దీంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే చనిపోయింది. అక్కడ నాలుగు పేజీల సూసైడ్ నోట్ లభించింది. అందులో తన తండ్రి జంగారెడ్డి రెండునెలల క్రితం చనిపోగా.. తల్లి సత్తమ్మ, అక్క చంద్రకళలు తనకు కట్నం కింద రాసిచ్చిన రెండెకరాల భూమిని తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ వేధిస్తున్నారని, అందువల్లనే తాను చనిపోతున్నట్లు లేఖలో పేర్కొంది. తనకు రాసిచ్చిన రెండెకరాల భూమి తన పిల్లలకే చెందాలని రూప పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

బాంబే సలీం..ఇక్కడా వాంటెడ్!

దేశ వ్యాప్తంగా 300 పైగా చోరీ కేసుల్లో నిందితుడు

- ఛోటా రాజన్ ఇంట్లో చేతివాటం చూపిన హిస్టరీ ఇతడిది
- రాజధానిలోని 14 పోలీసుస్టేషన్లలో ఇతడిపై పలు కేసులు
- బెయిల్ పొంది అజ్ఞాతంలోకి వెళ్లడంతో వారెంట్లు జారీ
- తాజాగా గురువారం అరెస్టు చేసిన విశాఖ పోలీసులు
- పీటీ వారెంట్‌పై తీసుకురావడానికి అధికారుల సన్నాహాలు


2021లో ముంబై పోలీసులకు చిక్కిన సలీం గ్యాంగ్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు సలీమ్ హబీబ్ ఖురేషీ...బాంబే సలీం, మున్నా అనే మారు పేర్లు ఉన్నాయి. 51 ఏళ్ల వయస్కుడైన ఇతడిపై దేశ వ్యాప్తంగా 300లకు పైగా కేసులు నమోదయ్యాయి. తెలంగాణలోనూ 70 కేసులు ఉన్నాయి. ఈ ఘరానా నేరగాడిని విశాఖపట్నం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇతగాడిపై నగరంలో ఉన్న 65 కేసుల్లో కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) జారీ అయ్యాయి. సలీంను వైజాగ్ పోలీసులు పట్టుకున్న విషయం తెలుసుకున్న ఇక్కడి పోలీసులు అతడిని పీటీ వారెంట్‌పై తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. కొన్నాళ్లు హైదరాబాద్‌లోనూ నివసించిన ఇతగాడికి 2001లో ముంబై మాఫియా డాన్ ఛోటా రాజన్ ఇంట్లో, 2021లో గుజరాత్‌లోని ఓ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ చేసిన చరిత్ర ఉంది.

పాతికేళ్లుగా వరుసపెట్టి నేరాలు చేస్తూ...

ముంబైలోని గోవంది ప్రాంతంలోని టాటానగర్ స్లమ్‌లో ఉన్న డియోనార్ బుచ్చర్ హౌస్‌కు చెందిన సలీం చదివింది ఆరో తరగతి మాత్రమే. తొలినాళ్లల్లో ముంబైలోనే చిన్న చిన్న చోరీలు చేసినా అవి రికార్డుల్లోకి ఎక్కలేదు. 2000 నుంచి ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని ఇళ్లల్లో దొంగతనాలు మొదలెట్టాడు. ఎప్పటికప్పుడు ముఠా సభ్యుల్ని మార్చే ఇతడికి గ్యాంగ్‌లో నగరానికి చెందిన గౌస్ కూడా గతంలో అనుచరుడిగా వ్యవహరించాడు. సలీం 2001లో ముంబైలోని చెంబూర్‌పై కన్నేశాడు. తన గ్యాంగ్‌తో కలిసి అక్కడ రెక్కీ చేసిన ఇతగాడు ఓ ఇంటిని టార్గెట్‌గా చేసుకున్నాడు. అదే రోజు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి 'పని' పూర్తి చేసేశాడు. మరుసటి రోజు పత్రికలు చూసిన సలీంకు తాము చోరీ చేసింది మాఫియా డాన్ ఛోటా రాజన్ ఇంట్లో అని, దొంగిలించిన సొత్తు విలువ దాదాపు రూ.9 కోట్ల వరకు ఉంటుందని తెలిసి హడలిపోయాడు. చాలా రోజులు తప్పించుకు తిరిగినప్పటికీ చివరకు బాంబే సలీం అరెస్టు చేసిన ముంబై పోలీసులు సొత్తు రికవరీ చేశారు. జైల్లో ఉండగానే ఇతడికి రాజన్ అనుచరుల నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. బెయిల్‌పై బయటకు వచ్చాక అతడే స్వయంగా వెళ్లి రాజన్ అనుచరుల్ని కలిసి, జరిగింది చెప్పడంతో పాటు ముంబైని వదిలేస్తానని హామీ ఇచ్చి బయటపడ్డాడు.

టోలిచౌకిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టి...

2012లో సలీం హైదరాబాద్ వచ్చి కొంతకాలం షెల్టర్ తీసుకున్నాడు. ఆపై తన ఇద్దరు భార్యలను తీసుకువచ్చి వేర్వేరుగా ఇళ్లు తీసుకుని కాపురాలు పెట్టాడు. టోలిచౌకి ప్రాంతంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించాడు. ఇది నష్టాలు రావడంతో నగరవాసి గౌస్‌తో కలిసి మళ్లీ చోరీల బాటపట్టాడు. చందానగర్, బాలానగర్, ఉప్పల్, కుషాయిగూడ, అల్వాల్, మల్కాజ్‌గిరి, నేరేడ్‌మెట్, సరూర్‌నగర్, శివరామ్‌పల్లి, చైతన్యపురి, శంషాబాద్, రాయదుర్గం, మీర్‌పేట్, ఇబ్రహీంపట్నంల్లో పంజా విసిరాడు. మధ్య మధ్యలో పుణే, ముంబై తదితర నగరాలకు వెళ్తూ అందినకాడికి దండుకు వచ్చాడు. రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సుదీర్ఘకాలం సలీంపై నిఘా ఉంచి 2012 ఫిబ్రవరి 28న పట్టుకుని రూ.56,27,500 విలువైన 1.58 కేజీల బంగారం, ఆరు కేజీల వెండి స్వాధీనం చేసుకున్నారు.

అప్పటి నుంచి పంథా మార్చేసి...

సలీం 2012 తర్వాత తన పంథా పూర్తిగా మార్చేశాడు. టార్గెట్ చేసిన నగరానికి విమానంలో ప్రయాణించడం, అక్కడి సంపన్నుల ఇళ్లలో అనుచరులతో కలిసి చోరీలు చేయడం మొదలెట్టాడు. 2021లో గుజరాత్ ఎమ్మెల్యే ఇంట్లో, ముంబైలోని జల్ వాయు విహార్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో తన ఇద్దరు అనుచరులతో కలిసి చోరీ చేశాడు. ఈ కేసులో సలీంతో పాటు అరెస్టు అయిన నిందితుల్లో గౌస్ కూడా ఉన్నాడు. బెయిల్‌పై వచ్చిన సలీం మరో ఇద్దరితో కలిసి గత ఏడాది జూన్‌లో వైజాగ్‌లో ఒకటి, ముంబైలో ఆరు నేరాలు చేశాడు. 2024 నవంబర్‌లో ముంబైలోని బోరోవాలి పోలీసులకు చిక్కినా వైజాగ్ నేరం బయటపెట్టలేదు. జైలు నుంచి వచ్చిన ఇతడు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో వైజాగ్‌లోనే మరో రెండు నేరాలు చేశాడు. దీంతో ఆ పోలీసులు మహారాష్ట్ర అధికారుల సాయంతో సలీంను పట్టుకున్నారు.

నగరంలో నేడు

- ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, అడ్వకేట్ పృథ్వీరాజ్ సింగ్‌లు రచించిన ఓబీసీల పోరుబాటు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉదయం 10.30గంటలకు నాంపల్లిలోని ఎస్‌పీఆర్ తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఆకృతి ఎలైట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో 'వస్త్రభూషణ' పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టులో యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌లతో కలిసి టైలరింగ్, సీసీటీవీ ప్రోగ్రాంలలో ఉచిత శిక్షణ ఇస్తారు.
- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ స్టైల్‌తత్వ 2025 మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వస్త్రభూషణం పేరిట వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

సౌదీ నుంచి నా భర్తను రప్పించండి: ఓ మహిళ వినతి

లక్డీకాపూల్ : సౌదీలో వ్యవసాయ కూలీగా మారి అష్టకష్టాలు పడుతున్న తన భర్తను ఇండియాకు రప్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన అలేఖ్య అనే మహిళ శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించింది. తన భర్త గుడిసె యాకూబ్ సౌదీలోని ఓ యజమాని ఇంటి డ్రైవర్ పని కోసం వెళ్లాడని వాపోయారు. ముంబయికి చెందిన ఒక ఏజెంట్ తన భర్తను సౌదీలోని దమ్మాంకు పంపించాడని..కానీ అక్కడి యజమాని వ్యవసాయ కూలీపని చేయిస్తూ హింసిస్తున్నట్లు తెలిసిందని, ఎలాగైనా అతన్ని కాపాడాలని కోరింది. అర్జీని ఆమె తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డా.బీఎం వినోద్‌కుమార్‌కు అందజేసింది.

బైక్‌ను ఢీ కొట్టిన ట్రక్: ఒకరి మృతి



మేడ్చల్ రూరల్: బైకును ట్రక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లో నివాసించే రాంకిషోర్ (29) రావల్‌కోల్‌లోని ఓ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విధులకు వెళ్లేందుకు ఉమానగర్ నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరి కిష్టాపూర్ రోడ్డులోని ప్రశాంతి వెంచర్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంకిషోర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. రాంకిషోర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ట్రక్ డ్రైవర్‌ను కిష్టాపూర్‌కు చెందిన వాల్మీకి బాలరాజుగా గుర్తించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో 185 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 185 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35, రెవెన్యూ శాఖకు 45, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46, విద్యుత్ శాఖ 24, మున్సిపల్ శాఖ 11 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు.

పోలీసులు చెబితే ఉత్తర్వులిస్తారా?

- సరూర్‌నగర్ తహసీల్దార్‌పై హైకోర్టు మండిపాటు
- కోర్టులో పెండింగ్‌లోని అంశంలో జోక్యంపై ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్‌లోని ఓ భూ వివాదం సందర్భంగా పోలీసులు, తహసీల్దార్ తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరం లేకున్నా సివిల్ పంచాయతీల్లో పోలీసులు తలదూరుస్తున్నారని అభిప్రాయపడింది. పోలీసు చెప్పినంత మాత్రాన దాని ఆధారంగా ప్రొసీడింగ్స్ జారీ చేస్తారా అని తహసీల్దార్‌పై మండిపడింది. ఈమేరకు సరూర్‌నగర్ మండల తహసీల్దార్ ఓ భూమికి సంబంధించి జారీ చేసిన ప్రొసీడింగ్స్ రద్దు చేశారు. వివరాల్లోకి వెళ్తే..బుజ్జి అనే మహిళకు సంబంధించిన భూమి కర్మన్‌ఘాట్‌లోని సర్వే నంబర్ 60 (400 గజాలు)లో లేదని, 58లో ఉందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాసిన లేఖ ఆధారంగా తహసీల్దార్ గత నెల 28న నంబర్ మారుస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ హిమాయత్‌నగర్‌కు చెందిన బాధితురాలు (బుజ్జి) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తన భూమి విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది గుమ్మల్ల భాస్కర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ '400 గజాల భూమిని బుజ్జి 1981లో కొనుగోలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు కూడా చేసుకుని ఫీజు చెల్లించారు. మలక్‌పేట్‌కు చెందిన చక్రధర్ ఏప్రిల్ రెండో వారంలో ఆ భూమి వద్దకు వచ్చి కబ్జాకు యత్నించారు. తప్పుడు డాక్యుమెంట్లతో లేని భూమిని సృష్టించి అధికారులతో కుమ్మక్కై కొట్టేయాలని చూస్తున్నారు. దీనిపై రంగారెడ్డి కోర్టును పిటిషనర్ ఆశ్రయించి ఇంజక్షన్ ఉత్తర్వులు కూడా పొందారు. అనంతరం సివిల్ కేసు దాచి పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల లేఖ మేరకు తహసీల్దార్ చర్యలు చేపట్టారు. ఆ ప్రొసీడింగ్స్ చట్టవిరుద్ధం.. కొట్టివేయాలి' అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి..ఏ అధికారం, ఏ చట్టం మేరకు తహసీల్దార్ ప్రొసీడింగ్స్ జారీ చేశారని ప్రశ్నించింది. సివిల్ కోర్టులో భూ వివాదం పెండింగ్‌లో ఉండగా తలదూర్చడం సరికాదని తహసీల్దార్, పోలీసులను మందలించారు. తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను రద్దు చేసిన న్యాయమూర్తి..తదుపరి విచారణ వచ్చే నెల 11కు వాయిదా వేశారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ కేసులు, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. అట్రాసిటీ కేసుల నష్ట పరిహారం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- 2022 నుంచి 2025 వరకు 571 కేసులు నమోదు కాగా 135 ఇన్వెస్టిగేషన్ దశలో ఉన్నాయని, 15 చార్జిషీట్ కేసులు ఉన్నాయన్నారు. వాటి పరిష్కార కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎస్సీ ఎస్టీల భూ సమస్యలకు సంబంధించిన కేసులను పరిశీలించి సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీసీపీ శ్వేత, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ ఫ్యాక్టరీలో బ్లాస్ట్

పలువురు కార్మికులకు తీవ్ర గాయాలు

లాలాపేట: తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలోని విజయ డెయిరీ ఫ్యాక్టరీ బాదాం మిల్క్ తయారీ యూనిట్‌లో శుక్రవారం స్టెరిలైజర్‌లో స్టీమ్ ఒక్కసారిగా ఎక్కువై బ్లాస్ట్ అయ్యింది. దీంతో గాజు ముక్కలు ఎగిరిపడి అక్కడే విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగి, టెక్నీషియన్ రవి ముఖంపైన, కళ్లల్లో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఇతర సిబ్బంది మీరజ్, చంద్రయ్య, ఓ మహిళా కార్మికురాలు కూడా గాయపడగా వీరిని చికిత్స నిమిత్తం నాచారంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌కు తరలించారు. రవికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం డీఆర్‌డీఏ హాస్పిటల్‌కు తరలించారు. విజయ డెయిరీలో ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలుసుకున్న చైర్మెన్ గుత్తా అమిత్‌రెడ్డి హుటాహుటిన విజయ డెయిరీకి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు, కార్మికులకు చికిత్సపై అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌సీయూకు మరో గుర్తింపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో మరో గుర్తింపు లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఐఐఆర్ఎఫ్)–2025 ర్యాంకింగ్స్‌లో టాప్–5లో స్థానం లభించడం విశేషం. టాప్‌లో నిలిచిన జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్‌యూ) మొత్తం స్కోరు 994.89 సాధించగా అయిదవ స్థానం పొందిన హెచ్‌సీయూ 988.93 స్కోరు సాధించింది. ఇదిలావుండగా సెంట్రల్ యూనివర్సిటీలలో తెలంగాణ రాష్ట్రంలో, దక్షిణ భారతదేశంలో కూడా హెచ్‌సీయూ టాప్ ర్యాంక్ సాధించడం మరో విశేషం. ఐఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లు అనేక కీలక పారామీటర్స్ ఆధారంగా సంస్థలను అంచనా వేసి ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తుంది. వీటిలో ప్లేస్‌మెంట్స్, పనితీరు, విద్యార్థుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అంచనా వేయడం, బోధన, అభ్యాస వనరులు తదితరాలుంటాయి.

ఓటుకు నోటు కేసు విచారణ జులై 25కు వాయిదా

సిటీ కోర్టులు: తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన ఓటుకు నోటు కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని మొదటి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య హాజరుకాగా సీఎం రేవంత్ రెడ్డి, ఉదయ్ సింహ, వేం కృష్ణ కీర్తన్, సెబాస్టియన్, గైర్హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన కోర్టు నిందితులను ఎగ్జామినేషన్ చేసేందుకు తదుపరి విచారణను జులై 25కి వాయిదా వేసింది.

పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని చింతల్ బస్తీ వద్ద ధ్వంసమైన 300 ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతుల పనులను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. స్థానికులకు నీటిసరఫరా ఇబ్బంది తలెత్తకుండా వెంటనే మరమ్మతులు పనులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరణ చేయాలని సూచించారు. రెండు రోజుల క్రితం హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సమయంలో బంజారా హిల్స్ సంప్ ఔట్‌లెట్ నుండి మసాబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ కు మంచినీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

అంబేడ్కర్ యూనివర్సిటీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు మరో అవకాశం

చార్మినార్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 1987 నుంచి 2012 మధ్య కాలంలో యూజీ (డిగ్రీ) కోర్సుల్లో చేరి పలు కారణాలతో మధ్యలో ఆపేసిన విద్యార్థులకు తిరిగి పూర్తి చేసుకునే అవకాశాన్ని విశ్వవిద్యాలయ అధికారులు కల్పించారని సిటీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్ కుమార్ శుక్రవారం తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి రీ అడ్మిషన్ పొంది బ్యాక్ లాగ్ పరీక్షలకు ఫీజు చెల్లించి హాజరు కావచ్చని ఆయన చెప్పారు. 2025 డిసెంబర్ లోపు రెండు అవకాశాల్లో రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు హాజరై కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా 2013, 2014, 2015, 2016 బ్యాచుల బ్యాక్ లాగ్ అభ్యర్థులు రీ అడ్మిషన్ పొంది థియరీ, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా రీ అడ్మిషన్ పొందవచ్చని, రూ.500 ఆలస్య రుసుంతో ఈనెల 26 వరకు మరో అవకాశం లభిస్తుందని తెలిపారు. జూలై 30 నుంచి ఆగస్టు 11 వరకు నిర్ణయింపబడిన తేదీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 90000 22997, 73829 29622 నెంబర్లలో సంప్రదించవచ్చు.

జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దంగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఉదయ్‌కుమార్ ముదిరాజ్, గురుబ్రహ్మగౌడ్, వలిశెట్టి రాంబాబు, పాండు రంగారావు, జనరల్ సెక్రటరీలుగా సీహెచ్. గిరి, రాజకళ, సెక్రటరీలుగా బొట్టు కల్యాణి, ఎం.అంజిరాజు, జే లలిత, లక్ష్మీనారాయణ ముదిరాజ్, కోశాధికారిగా జే శైలజ, కార్యవర్గ సభ్యులుగా విద్యాసాగర్‌రావు, రామ్మోహన్ రావు, ఎం.శ్రీనివాస్, రాజు ఎన్నికయ్యారని అధ్యక్షుడు తెలిపారు.

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బీజేపీ బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. బంజారాహిల్స్ రోడ్డునంబర్-2లోని సాగర్ సొసైటీ పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, ముఖ్య నేతలు మేచినేని శ్రీనివాసరావు, ప్రేమ్‌రాజ్, భోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్ఐల బదిలీ

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు సెక్టార్ ఎస్ఐలు బదిలీ అయ్యారు. సర్దార్ జమాల్ కామటిపురకు, తుల్జారాం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐగా, మరో ఎస్ఐ మనోజ్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వై.కాశయ్య, పంజాగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ ఎస్. భూమేశ్వర్‌ను బోరబండకు నియమించారు.

'మంత్రివర్గ విస్తరణలో బంజారాలకు అన్యాయం'

హిమాయత్‌నగర్ : రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో బంజారాలకు తీవ్ర అన్యాయం జరిగిందని సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సేవాలాల్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు జరిగిన అవమానానికి ప్రతిఫలంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మా సత్తా ఏంటో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ప్రధాన కార్యదర్శి రేఖ్యానాయక్, ఉపాధ్యక్షులు రవి నాయక్, పరశురాం నాయక్, భీమ్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: రోడ్లకిరువైపులా ఆక్రమణల వల్ల వాహనాలు సాఫీగా వెళ్లడం లేదని పంజగుట్ట ట్రాఫిక్ సీఐ రాంప్రసాద్ అన్నారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజగుట్ట నుంచి యశోదా ఆస్పత్రి దారిలో ఉన్న ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. మళ్లీ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు.

పార్కుల పరిరక్షణకు హైడ్రా..!

స్థలాలు కబ్జాకు గురికాకుండా నలుగురు డీఆర్ఎస్ సూపర్‌వైజర్ల నియామకం | ప్రతిరోజు ఉద్యానవనాల సందర్శన

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ పార్కుల పరిరక్షణకు హైడ్రా చర్యలు చేపట్టింది. ఇంతకుముందు ఏ పార్కు చూసినా వాటి చుట్టూ స్థలాలు ఆక్రమణలకు గురై కుచించుకుపోగా జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయేది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్ సర్కిల్-18, ఖైరతాబాద్ సర్కిల్-17తో పాటు మెహిదీపట్నం, కార్వాన్ సర్కిళ్ల పరిధిలో పార్కులు కబ్జాకు గురికాకుండా నిత్యం నిఘా పెట్టేలా 4 హైడ్రా డీఆర్ఎఫ్ సూపర్‌వైజర్లను నియమించింది.



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ జీహెచ్ఎంసీ పార్కును పరిశీలిస్తున్న హైడ్రా సూపర్‌వైజర్

- విధులు కేటాయించిన సూపర్‌వైజర్ తన సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ పార్కులను ప్రతిరోజూ సందర్శించాలి. ఎక్కడైనా కబ్జాకు గురైతే వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంటుంది.
- పార్కును సందర్శించినప్పుడు తప్పనిసరిగా రోజూ సెల్ఫీ తీసుకుని అధికారులకు వాట్సప్ ద్వారా పంపించాలి.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో 30 పార్కులను గుర్తించడమే కాకుండా వాటి పూర్తి వివరాలను ఈ సూపర్‌వైజర్లకు అందజేశారు.



ఫిలింనగర్ లోటస్‌పాండ్ పార్కులో ఆక్రమణకు గురైన స్థలంలో ప్రహరీ నిర్మించిన దృశ్యం

- ఇటీవల బంజారాహిల్స్‌లోని లోటస్‌పాండ్ పార్కు ఫిలింనగర్ సొసైటీ వైపు కబ్జాకు గురికాగా, డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఘటనా స్థలానికి చేరుకుని కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని స్వా. దీనం చేసుకుని వెంటనే ప్రహరీ నిర్మించారు.
- ఆక్రమించిన స్థలంలో మొక్కలు నాటి పార్కును సుందరంగా తీర్చిదిద్దారు.
- ఫిలింనగర్ సొసైటీలో ఓ బడా బాబుకు లోటస్‌పాండ్‌లో ఫ్లాట్‌ను తయారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా అధికారుల దర్యాప్తులో తేలింది. తాజా పరిణామాలతో ఈ ఆక్రమిత ఫ్లాట్ స్థలం మొత్తం లోటస్‌పాండ్ పార్కులో కలిసిపోయింది.
- ప్రతి పార్కునూ సందర్శిస్తున్న సూపర్‌వైజర్లు అక్కడ ఏమాత్రం అనుమానాస్పద కదలికలు ఉన్నా ఎవరైనా పార్కులోకి చొచ్చుకువచ్చినట్లు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తున్నారు.
- ఒకవేళ ఏదైనా పార్కు కబ్జాకు గురైతే వెంటనే ఆక్రమణలు కూల్చివేయడమే కాకుండా సంబంధిత కబ్జాదారుడిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో పార్కుల జోలికి రావాలంటే కబ్జాదారులు భయపడుతున్నారు.

హైడ్రా సూపర్‌వైజర్లు నిఘా పెట్టిన పార్కులు

జూబ్లీహిల్స్‌లోని స్టార్‌బక్స్ పార్కు, ఫిలింనగర్, జూబ్లీహిల్స్ రాక్‌గార్డెన్, ప్రశాసన్‌నగర్ గుండు, వెంకటగిరి, జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10లోని హెర్బల్ గార్డెన్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు పార్కు, లోటస్‌పాండ్-1 పార్కు, లోటస్‌పాండ్-2, ప్రశాసన్‌నగర్, జూబ్లీహిల్స్ ఫైకస్ గార్డెన్, బంజారాహిల్స్ కేబీఆర్ జీహెచ్ఎంసీ వాక్‌వే పార్కు, మలకంచెరువు, బాలకృష్ణ ఇంటిఎదుట కేబీఆర్, బీకేగూడ, అల్లం చెరువు, ఆస్బెస్టాస్ థీమ్, హెచ్ఎంటీ నర్సరీ, సుభాష్‌నగర్, బంజారాహిల్స్ ఫ్రీడం, కల్యాణ్‌నగర్ థీమ్, జపనీస్‌గార్డెన్, వీ6 పార్కు, జూబ్లీహిల్స్ బట్టర్‌ఫ్లై గార్డెన్, కేఎల్ఎస్‌వై, కృష్ణకాంత్, ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ విజయ నర్సరీ పార్కులు.

ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలి



అభివాదం చేస్తున్న కురుమ సంఘం నాయకులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలని సంఘం ఉపాధ్యక్షుడు కోషికె శ్రీనివాస్, సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..రెండు దశాబ్దాలుగా ఎగ్గె మల్లేశం బైలాస్‌కు విరుద్ధంగా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించకుండా తన అనుచర వర్గానికే సభ్యత్వ నమోదు పుస్తకాలు ఇచ్చి, అందరికీ సభ్యత్వం ఇవ్వకుండా నాలుగు గోడలమధ్యే మండల, జిల్లా కమిటీలు వేసుకుని సంఘానికి జీవితకాలం అధ్యక్షుడిగా కొనసాగే కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా స్పందించిన కోర్టు వారికి నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటికైనా ఎగ్గె మల్లేశం సంఘం నుంచి పక్కకు తప్పుకుంటే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకుంటామని తెలిపారు. సమావేశంలో దొడ్డ శ్రీనాథ్, వంశీ జక్కుల, బెల్లంపల్లి సురేశ్, రాకేశ్, బిద్ద శ్రీనివాస్, రామ్ గోపాల్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సంజయ్ ఉపాధ్యాయ

పంజగుట్ట: అక్రిడిటేషన్ విధివిధానాలు వెంటనే ప్రకటించి అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరగా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ పర్యటనలో భాగంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జర్నలిస్టులకు గతంలో రైళ్లు, విమానం టిక్కెట్లల్లోనూ రాయితీ ఉండేదని, టోల్‌గేట్ వద్ద కూడా ఉచితం ఉండేదని వాటిని పునరుద్ధరించాలన్నారు. ఆరోగ్య బీమా, ఉచిత విద్య ఇవ్వాలని కోరారు. పై డిమాండ్లు జాతీయస్థాయిలో సాధించేందుకు సెప్టెంబర్‌లో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యా సదస్సు, పాత్రికేయులకు పురస్కారాలు

జాతీయ విద్యావిధానం 2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో (నేడు) శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్ల డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ జర్నలిస్టులకు పురస్కారాల ప్రదానం ఉంటుందని ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి క్రాంతి, నగర అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ చౌరస్తాలో మంత్రి డెవలపర్స్ హైదరాబాద్ వారు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలలను పనిలో పెట్టుకుంటే యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి బాలలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిరిపురం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బోరబండకు కేటీఆర్ రాక

రహమత్‌నగర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఉదయం 10 గంటలకు బోరబండలోని ఎస్ఆర్‌టీనగర్‌కు రానున్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన బోరబండ బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు సర్దార్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

మంత్రిని కలిసిన నాయకులు

శ్రీనగర్‌కాలనీ: రాష్ట్ర నూతన కార్మికశాఖ మంత్రి ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను తెలంగాణ రాష్ట్ర దళితసేనా అధ్యక్షుడు డాక్టర్ గంట మల్లేశ్, దళితసేనా ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య సోమాజిగూడలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు బాలయ్య, రెడ్డిమల్ల పార్వతి, ప్రవీణ, సరస్వతీ, కల్యాణి, నరసింహ, ఎల్లయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పనులు ప్రారంభం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో సుమారు రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న హైమాస్ట్ లైట్ల పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు,కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ప్రహరీ ఏర్పాటు చేసి ఇండోర్ స్టేడియంగా మార్చుతామని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఎక్బాల్, అహ్మద్, లింగమూర్తి, రామకృష్ణ, నాగరాజు, యాదగిరి, కేశవులు అందాలు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట

శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బడిబాటలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ శ్రావణ్‌కుమార్, హెచ్ఎం కాంతయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునంబర్-10లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో రూ.8 లక్షల వ్యయంతో తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత రాములుచవాన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎమ్మెల్యే నిధులతో పనులు చేపట్టామన్నారు. అయితే ఆ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డికి సమాచారం లేకుండానే కాంగ్రెస్ నేతలు పనులకు శంకుస్థాపన చేయడంపై కవితారెడ్డి మండిపడ్డారు. పనుల విషయమై తనకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

గంధపు చెట్ల దొంగల అరెస్టు

బంజారాహిల్స్: గంధపు చెట్లు దొంగతనం చేస్తున్న పార్ధీ గ్యాంగ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే ప్రాంగణంలో ఇటీవల పెద్ద ఎత్తున గంధపు చెట్లు చోరీకి గురయ్యాయి. ఈమేరకు నిమ్స్ మే యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు మధ్యప్రదేశ్ పార్ధీ కమ్యూనిటీకి చెందిన పలన్ బాయిపార్ధీ (22), షహరాజ్‌బాయి, నిమ్మత్‌బాయి, మాధురిఆదివాసీ తదితరులను పట్టుకున్నారు. 23 మంది కలిసి చోరీ చేసినట్లుగా గుర్తించగా 19 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరందరిపై గతంలో కూడా గంధపు చెట్ల దొంగతనంలో కేసు నమోదై ఉన్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. 20 రోజుల క్రితం నిమ్స్‌మే క్యాంపస్‌లోకి ప్రవేశించిన వీరంతా గుట్టుచప్పుడు కాకుండా వీటిని దొంగిలించి పరార్ కాగా పక్కా సమాచారంతో జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్ : ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన ఎస్.త్రినాథ్ రహమత్‌నగర్‌లో ఉంటూ వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 11న యూసుఫ్‌గూడలోని ఓ వైన్ షాపు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి వెళ్లాడు. తర్వాత వచ్చి చూడగా కనిపించలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: యువతి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టి.నాగరాజు ఎస్పీఆర్‌హిల్స్‌లో ఉంటూ ప్రైవేట్ సంస్థలో ఆఫీస్ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 12న ఉదయం నాగరాజు విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. కుమార్తె కోసం కుటుంబ సభ్యులను అడిగాడు. మధ్యాహ్నం జిరాక్స్ కోసం వెళ్లి ఇంకా రాలేదని బదులిచ్చారు. అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించాడు. ఆచూకీ తెలియకపోవడంతో తమ ఇంటి సమీపంలో ఉండే ఆసిఫ్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో..

వెంకటేశ్వరకాలనీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-5లోని దేవరకొండ బస్తీలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. తల్లిదండ్రులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-45 లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం నర్సరీ విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్‌తో పాటు ఉపాధ్యాయులు చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

అతివేగం ప్రమాదకరం

పంజగుట్ట: అతివేగం ప్రమాదకరమని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ (టీటీఐ) బేగంపేట ఇనిస్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. పంజగుట్టలోని ఏరో ఫల్కన్ ఏవియేషన్ అకాడమీలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు.



హోటల్ తాజ్ కృష్ణాలో శుక్రవారం ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారభమైంది. ఈనెల 15 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మంత్రికి సన్మానం

హిమాయత్‌నగర్: జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షాలకు పర్మిట్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం, నేతలు వి.మారయ్య, రామకృష్ణ(బీఆర్‌టీయూ), ఖాజా భాయ్(ఏఐటీయూసీ) వి.ప్రవీణ్, లింగం గౌడ్(టీయూసీఐ) రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.12 వేల ఆర్థిక సాయం అందజేయాలని అలాగే ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించేందుకు ప్రభుత్వమే ఓయాప్‌ను రూపొందించాలని వారు మంత్రిని కోరారు. మంత్రి స్పందించి రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సీఎంతో చర్చించి మిగితా సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు.

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన సమన్వయంతో జరగాలి

జస్టిస్ బి.చంద్రకుమార్

హిమాయత్‌నగర్ : పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన సమన్వయంతో జరగాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఇందుకోసం దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కేంద్రంపై తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్దారక భవన్‌లో సుప్రీంకోర్టు న్యాయవాది, జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కరణం రాజేశ్ కుమార్ అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల సమ్మేళనం నిర్వహించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన పలుపార్టీల నేతలు పాల్గొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. త్వరలో చేపట్టనున్న పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా ప్రాతిపదికన అయితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. దక్షిణ భారతంపైన ఉత్తరాది పాలకులు తీవ్ర వివక్షత చూపుతున్నారని ఆయన ఆరోపించారు. దక్షిణ భారత పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించి సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ పొలిటికల్ జేఏసీ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుధాగాని హరిశంకర్ గౌడ్, ఆమ్‌ఆద్మీ పార్టీ డాక్టర్స్ సెల్ కన్వీనర్ లక్ష్మా నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అద్దెకు కార్లు తీసుకుని అమ్ముతున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: అద్దెకు తీసుకున్న కార్లను అమ్ముకున్న ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. అత్తాపూర్‌కు చెందిన రషీద్ బంజారాహిల్స్‌లో లగ్జరీ కార్ల రెంటల్ వ్యాపారం చేస్తుంటాడు. 2024 నవంబర్‌లో బండ్లగూడకు చెందిన మహ్మద్ జాహిద్ అలీ ఖరీదైన డిఫెండర్ కారు, ఫోర్డ్ ఎండీవర్ కార్లను అద్దెకు తీసుకున్నాడు. ప్రతి నెలా కిరాయి చెల్లించేవాడు. 3 రోజుల క్రితం రషీద్‌కు మహారాష్ట్ర పోలీసులు ఫోన్ చేసి మీ కార్లు ఎక్కడ ఉన్నాయని అడిగారు. 2024లో జాహిద్ అనే వ్యక్తికి కిరాయికి ఇచ్చానని రషీద్ చెప్పాడు. అయితే తాము మహారాష్ట్రలో జరిగిన కార్ల చీటింగ్‌లో జాహేద్ అలీని అరెస్టు చేశామని, విచారణలో ఈ రెండు కార్లను కూడా వేరే వ్యక్తులకు అమ్మినట్లుగా తేలిందని అక్కడ పోలీసులు రషీద్‌కు తెలిపారు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా జాహెద్ అలీపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపోలోకు ఏహెచ్ఏ సర్టిఫికెట్ ప్రదానం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చెస్ట్ పెయిన్‌తో వచ్చిన రోగులకు తక్షణ చికిత్స అందించినందుకు కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ సెంటర్‌గా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్ఏ) సర్టిఫికెట్‌ను అందజేసింది. రాష్ట్రాల్లోనే ఈ తరహా సర్టిఫికెట్ పొందిన మొదటి ఆస్పత్రిగా తాము నిలిచామని అపోలో ఆస్పత్రుల తెలంగాణ రీజియన్ సీఈఓ తేజస్విరావు తెలిపారు. అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ ఇమ్రాన్ సుబ్హాన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులే మరణాలకు ప్రధాన కారణమని, అలాంటి పరిస్థితుల్లో ఈ ఏహెచ్ఏ సర్టిఫికేషన్ ద్వారా అపోలో హాస్పిటల్స్ అందిస్తున్న క్లినికల్ ప్రోటోకాల్స్, టెక్నాలజీ వినియోగం, అంతర్జాతీయ ప్రమాణాలను స్పష్టంగా అమలుచేస్తున్నామని తెలిపారు. అపోలో హెల్త్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ సర్టిఫికేషన్ ద్వారా అపోలో ఆస్పత్రి గ్లోబల్ ఏహెచ్ఏ సర్టిఫైడ్ చెస్ట్ పెయిన్ సెంటర్స్ నెట్‌వర్క్‌లో చేరిందన్నారు. రోగి ఆస్పత్రికి వచ్చిన క్షణం నుంచి పీసీఐ ప్రక్రియ మొదలుపెట్టే వరకూ సమయం 60 నిమిషాల్లోపు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్‌, శనివారం, 14, జూన్‌, 2025



మహత్తర కార్యం..

గార్డియన్‌ ఆఫ్‌ స్పర్శ్‌

– సినీ నటి శ్రీలీల

ఒక్కో రోజు గడిచిన కొద్దీ వారు మరణానికి దగ్గరవుతున్నట్లే.. వారిలో ఎప్పుడు ఎవరిని మృత్యువు కబళిస్తుందో తెలియని పరిస్థితి.. చావు తమకు దగ్గరవుతోందని తెలిసీ ఏమీ చేయలేని స్థితిలో కేన్సర్‌ మహమ్మారితో పోరాడుతున్నారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని స్పర్శ్‌ హాస్పిస్‌లో చివరి దశలో ఉన్న కేన్సర్‌ బాధితులతో ప్రముఖ నటి శ్రీలీల శుక్రవారం చాలాసేపు గడిపారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి గురించి తెలుసుకున్నారు. వారితో ఆడి పాడి సందడి చేసి స్థైర్యం నింపారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా 'గార్డియన్‌ ఆఫ్‌ స్పర్శ్‌' పేరిట రూపొందించిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా కేవలం రూ.500 లేదా అంతకన్నా ఎక్కువ విరాళం అందజేయాలనుకుంటే నెలకు రూ.500లతో గార్డియన్‌ ఆఫ్‌ స్పర్శ్‌గా మారవచ్చున్నారు. ఈ మహత్తర కార్యానికి అందరూ తోడవ్వాలని కోరారు.

– రాయదుర్గం

ఆటాడుకుందాం రా..

సాక్షి, సిటీబ్యూరో: ఆటల పట్ల ఆసక్తి పెంచేందుకు టాయ్స్‌ బ్రాండ్‌ హామ్లీస్‌తో కలిసి సైబరాబాద్‌లోని ఇనార్బిట్‌ మాల్‌లో లెగో ఎట్‌ సమ్మర్‌ ప్లే గ్రౌండ్‌ పేరిట వినోద భరిత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు ముగియనున్న తరుణంలో టీనేజర్లలో సృజనాత్మకత పెంచేందుకు, ఉత్సాహం నింపేందుకు వీలుగా ఇవి రూపుదిద్దుకున్నాయని, హై–ఎనర్జీ రేసింగ్‌ ఛాంపియన్‌షిప్‌లు ఎస్కేప్‌ రూమ్‌ల నుంచి ఫ్రీ యాక్టివిటీ లెగో ఎట్‌ జోన్‌లో ఓపెన్‌–ఎండ్‌ ప్లే తదితర విభిన్న రకాల ఆసక్తిదాయకమైన ఆటల్ని వయసులకు అతీతంగా ఆస్వాదించవచ్చని వివరించారు. విజేతలకు సర్టిఫికెట్లు, ఆకర్షణీయమైన బహుమతులు సైతం అందించే ఈవెంట్‌ ఈ నెల15న ముగుస్తుందని తెలిపారు.







ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌ వీధుల్లో ఓ కొత్తదనం కనబడుతోంది. నిత్యం ట్రాఫిక్‌తో తడబడే ప్రధాన రహదారుల మధ్యలో అక్కడక్కడా ఒక్కరే నిలబడి నడిపే ఎలక్ట్రానిక్‌ వాహనాలు దూసుకెళ్తున్న దృశ్యం ఇప్పుడు చాలామందికి కొత్తగా, వినూత్నంగా అనిపిస్తోంది. ఇవి ఎలక్ట్రిక్‌ సైకిళ్లు కాదు, స్కూటర్లు అంతకన్నా కాదు. ఇవి 'స్టాండింగ్‌ మొబిలిటీ స్కూటర్లు' లేదా 'ఈ–స్కేటర్స్‌' అని పిలవబడే కొత్త తరహా వ్యక్తిగత ట్రాన్స్‌పోర్టు వాహనాలు. ఈ సరికొత్త ట్రెండ్‌ రాబోయే రోజుల్లో నగర జీవనశైలిలో ఈ తరహా మైక్రోమొబిలిటీవాహనాలు కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో కస్టమైజ్డ్‌ మొబిలిటీ, గ్రీన్‌ ట్రాన్స్‌పోర్ట్‌, ట్రాఫిక్‌ లేని ప్రయాణాల దిశగా హైదరాబాద్‌ అస్తిత్వాన్ని మార్చుకుంటోంది. – సాక్షి, సిటీబ్యూరో

E-SCOOTER



మెట్రో సిటీలో

ఈ–స్కేటర్స్‌

సిటీలో సందడి చేస్తున్న స్టాండింగ్‌ మొబిలిటీ స్కూటర్లు, ఈ–స్కేటర్స్‌

లిథియం–అయాన్‌ బ్యాటరీలతో, 25 కి.మీ గరిష్ట వేగంతో..

యువత, ఐటీ ఉద్యోగులకు నరికొత్త ట్రెండింగ్‌ ప్రయాణం

స్మార్ట్‌ మొబిలిటీపై ఆసక్తి..

ఈ ఎలక్ట్రిక్‌ వాహనాలు చిన్నవిగా, తేలికగా ఉంటాయి. పాదాలపై నిలబడి నడిపే వీలుగా తయారు చేశారు. ముందుభాగంలో హ్యాండిల్‌ బార్‌, కింద మోటార్‌తో నడిచే చక్రాలు ఉంటాయి. లిథియం–అయాన్‌ బ్యాటరీలతో పనిచేసే ఇవి ఒకసారి చార్జ్‌ చేస్తే 20–30 కి.మీల వరకూ ప్రయాణించగలవు. అవి తక్కువ వేగంతో (20–25 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో) ప్రయాణిస్తాయి. దీంతో నగరంలోని చిన్నచిన్న ప్రయాణాలకు ఇవి అనుకూలంగా మారుతున్నాయి. ఈ తరహా వినూత్న వాహనాలు హైటెక్‌ సిటీ, జూబ్లీహిల్స్‌, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత, స్టార్టప్‌ ఉద్యోగులు, ఓపెన్‌ ఆఫీస్‌లలో పనిచేసే వాళ్లు వీటిని ఎక్కువగా వాడుతున్నారు. ట్రాఫిక్‌ జామ్‌లో చిక్కుకోకుండా, పార్కింగ్‌ సమస్య లేకుండా, తక్కువ ఖర్చుతో వేగంగా ఓ చోటినుంచి మరోచోటికి వెళ్లడానికి ఇవి చాలా ఉపయోగకరంగా మారాయి.

వినూత్నంగా మెట్రో నగరాల్లో..

ఈ వాహనాల వెనుక కొన్ని స్టార్టప్‌ కంపెనీల ఆవిష్కరణశక్తి ఉంది. 'యులు, భౌన్స్‌, వోగో' వంటి స్టార్టప్స్‌ ఇప్పటికే ఈ తరహా మొబిలిటీ సొల్యూషన్స్‌ను అందిస్తున్నాయి. నగరంలో ఇటీవల కొన్ని పబ్లిక్‌–ప్రైవేట్‌ భాగస్వామ్యాల ద్వారా ఈ వాహనాలు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టబడ్డాయి. కొన్ని హైదరాబాద్‌తో పాటు కొన్ని నగరాల్లో



మున్సిపల్‌ పార్కులు, మెట్రో స్టేషన్ల వద్ద డాక్‌–లెస్‌ షేరింగ్‌ విధానంలో వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఇలాంటి వాహనాలు నేడు నగర జీవన శైలిలో మార్పుకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా యువతలో ఎకో–ఫ్రెండ్లీ, స్మార్ట్‌ మొబిలిటీ పట్ల ఆసక్తి పెరిగిపోతోంది. పెట్రోల్‌ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ వాహనాలు నెలకు రూ.వెయ్యికి పైగా ఆర్థిక భద్రతతో బాగా ఉపయోగపడుతున్నాయి. శరీర చలనం, హెల్తీ హ్యాబిట్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్‌, లైసెన్స్‌ అవసరమా?

ప్రస్తుతం దేశంలో ఈ తరహా వ్యక్తిగత ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాలపై క్లియర్‌ చట్టం లేదు. అయితే 25 కి.మీలకు తక్కువ వేగంతో నడిచే వాహనాలకు రిజిస్ట్రేషన్‌, లైసెన్స్‌ అవసరం ఉండదు అని ఆర్‌టీఓ నిబంధనలు చెబుతున్నాయి. అందువల్ల వీటి వాడకానికి ఎటువంటి చట్టబద్ధమైన ఆటంకం లేదు. అయితే హెల్మెట్‌ ధరించడం, రోడ్డు నిబంధనలు పాటించడం తప్పనిసరి. వాహనాల వేగం ఎక్కువగా అనుమతి ఉన్నటువంటి రోడ్లపైన ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏఐతో స్మార్ట్‌ మైక్రో మొబిలిటీ..

ఈ కొత్త తరహా వాహనాల్లో కొన్ని ప్రస్తుతం ఆర్టిఫిషియల్‌ ఇంటిలిజెన్స్‌, ఇంటర్‌నెట్‌ ఆఫ్‌ థింగ్స్‌(ఐఓటీ) ఆధారిత ఫీచర్లను కలిగి ఉన్నాయి. ఇందులో భాగంగా వాహనం ప్రయాణించాల్సిన ప్రాంతాన్ని ముందే పరిమితం చేయడానికి 2జీయో ఫెన్సింగ్‌, వినియోగం తర్వాత వాహనం ఆటోమేటిక్‌గా లాక్‌ అవడానికి 'ఆటో లాకింగ్‌', వినియోగదారుడు ఎక్కడికి వెళ్లాడు, ఎంత దూరం ప్రయాణించాడు అన్నది ట్రాక్‌ చేయడానికి 'జీపీఎస్‌ ట్రాకింగ్‌' వంటి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి వినియోగదారుని భద్రతతో పాటు కంపెనీలకు డేటా అనాలిటిక్స్‌ ద్వారా మెరుగైన సేవ అందించే అవకాశాన్ని ఇస్తున్నాయి.

పర్యావరణహిత సోలార్‌ ఛార్జింగ్‌ స్టేషన్లు..

హైదరాబాద్‌ భాగస్వామ్యంలో కొంత మంది స్టార్టప్‌లు సోలార్‌ పవర్డ్‌ ఛార్జింగ్‌ స్టేషన్లను ప్రైవేట్‌ స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇవి పూర్తిగా పర్యావరణ హితంగా ఉండి, కన్వెన్షనల్‌ పవర్‌ వాడకాన్ని తగ్గిస్తాయి. కొన్ని స్టార్టప్‌లు వీల్‌చెయిర్‌–అనుకూలమైన ఎలక్ట్రిక్‌ వాహనాలు (వైడ్‌ బేస్‌, కస్టమైజ్డ్‌ హ్యాండిల్స్‌తో) అభివృద్ధి చేస్తున్నారు. వీటిని ట్రయల్‌ బేసిస్‌పై నగరంలో కొన్ని పబ్లిక్‌ ప్లేస్‌లలో ప్రవేశపెట్టారు. ఇది డిజెబుల్డ్‌ వ్యక్తుల కోసం సమాన అవకాశాలను అందించడానికి వారి రవాణా హక్కుల వైపు ఒక ముందడుగు.

విదేశాల్లో ముందుగా..

ప్యారిస్‌, బెర్లిన్‌, లండన్‌ వంటి నగరాల్లో ఇప్పటికే ఈ–స్కూటర్‌ షేరింగ్‌ వ్యవస్థలు బాగా ప్రజాదరణ పొందుతున్నాయి. సిటీ ఆ దిశగా తొలి అడుగులు వేస్తోంది. నగర ప్లానింగ్‌లో దీనికి ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. క్యాంపస్‌ మొబిలిటీకి గేమ్‌ చేంజర్‌ జవహర్‌నగర్‌లోని జేఎన్‌టీయూ, గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ యూనివర్సిటీ క్యాంపసుల్లో ఈ వాహనాలు ప్రవేశపెట్టారు.

బీమా అవసరమా?

ఈ చిన్నవాహనాలకు బీమా అవసరమా? ప్రస్తుతం భారత్‌లో లైట్‌ ఎలక్ట్రిక్‌ వెహికల్స్‌కు ప్రత్యేక బీమా పాలసీలు లభిస్తున్నాయి. అనుకోని ప్రమాదం జరిగితే చికిత్స ఖర్చులు, వాహన హాని వంటి వాటిని కవర్‌ చేస్తాయి. చాలామంది దీనిపై అవగాహన లేకుండా ప్రయాణిస్తుండడం గమనార్హం.





చిత్రాలు అద్భుతం

మాదాపూర్‌: ఫొటోగ్రఫీ చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో శుక్రవారం కావలి చంద్రకాంత్‌ తీసిన చిత్రాల ప్రదర్శనను మాఫోగ్రఫీ పేరిట ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రదర్శనను డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రావెల్‌ చేస్తూ అద్భుతమైన చిత్రాలను తీసినందుకు కొనియాడారు. ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో 50 ఫొటోగ్రాఫ్స్‌ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు కావలి చంద్రకాంత్‌ తెలిపారు.



ఐ కేర్‌ మాన్సూన్‌ క్యాంప్‌


సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో కార్లకు వచ్చే రకరకాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఆటోమొబైల్‌ సంస్థ ఇసుజు ఆధ్వర్యంలో నగర వాసుల కోసం ఐ కేర్‌ మాన్సూన్‌ క్యాంప్‌ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వర్షాకాల కష్టాలపై ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు వాహనాన్ని కూడా సంసిద్ధం చేయడం కోసం ఈ క్యాంప్‌ నిర్వహిస్తున్నామని తమ షోరూమ్స్‌లో ఈ నెల 16 నుంచి 5 రోజుల పాటు క్యాంప్‌ కొనసాగుతుందని వివరించింది.





మహిళా సాధికారతకు ప్రతీక.. స్టైల్‌తత్వ

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫిక్కీ లేడీస్‌ ఆర్గనైజేషన్‌(ఫ్లో) హైదరాబాద్‌ చాప్టర్‌ స్టైల్‌ తత్వ 2025ను నిర్వాహకులతో కలిసి శుక్రవారం నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టైల్‌తత్వ ఒక ఎగ్జిబిషన్‌ మాత్రమే కాదని, ఇది మహిళా సాధికారతకు ప్రతీక అని, డొక్రా కేవలం కళ మాత్రమే కాదు.. అది మన సంప్రదాయమని అన్నారు. ఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్‌శర్మ మాట్లాడుతూ మహిళలు జనాభాలో సగమని, పాలన, ప్రజా జీవితంలోనూ నాయకత్వం వహించేందుకు ప్రోత్సహించాలన్నారు. పాలసీ మేకింగ్‌లో వారి భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 250కిపైగా ప్రదర్శకులను ఒకే వేదికపై తీసుకువచ్చినట్లు చెప్పారు. ఫ్యాషన్‌, హోండెకార్‌, వెల్‌నెస్‌, కన్‌షస్‌ లివింగ్‌ విభాగాల్లో ఉత్పత్తులను ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. – మాదాపూర్‌





ఐమ్యాక్స్‌ నాట్‌ ఫిక్స్‌

నగరానికి ఐమ్యాక్స్‌ స్క్రీన్‌ ఇప్పట్లో రానట్లే..

మరికొంత కాలం వెయిటింగ్‌ తప్పదు

ఐమ్యాక్స్‌ కార్పొరేషన్‌ ప్రకటనతో స్పష్టం

సాక్షి, సిటీబ్యూరో:

అత్యంత భారీ తెరపై సినీ అనుభవం కోసం.. సిటీలోని సినీ ప్రియులు మరికొంత కాలం వేచి ఉండక తప్పదు. ఐ మ్యాక్స్‌ కార్పొరేషన్‌ ప్రకటనతో ఈ విషయం స్పష్టమైంది.

పదేళ్ల క్రితం.. తెరమరుగై..

ఇటీవలే ఏషియన్‌ సినిమా గ్రూప్‌ అధిపతి సునీల్‌ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో నగరంలోని హకీంపేట ప్రాంతానికి సమీపంలో తమ ఆధ్వర్యంలో ఐమాక్స్‌ స్క్రీన్‌ ప్లాన్‌ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 70 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న స్క్రీన్‌ కోసం ప్రణాళికలను కూడా ఆయన వెల్లడించారు. ఇది ఐమాక్స్‌ అనుభవం కోసం ఆశగా ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఆనందాన్ని కలిగించింది. 2014లో ఐకానిక్‌ ప్రసాద్స్‌ ఐమాక్స్‌ తెర'మరుగై'పోయిన దగ్గర నుంచి మళ్లీ ఐమాక్స్‌ తిరిగి రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్న వారు ఐమాక్స్‌ మ్యాప్‌లో సిటీ తన స్థానాన్ని తిరిగి పొందే అవకాశం ఉందని సంతోషించారు. ఈ వార్త సోషల్‌ మీడియాలో వైరల్‌ అయ్యింది.

ఖండించిన ఐమ్యాక్స్‌..

అయితే ఐమ్యాక్స్‌ కార్పొరేషన్‌ అధికారికంగా ఏషియన్‌ సినిమాస్‌తో భాగస్వామ్యం వార్తల్ని ఖండించింది. ఈ మేరకు ఐమ్యాక్స్‌ కార్పొరేషన్‌ ఇండియా వైస్‌ ప్రెసిడెంట్‌ ప్రీతం డేనియల్‌, ఎక్స్‌లో పోస్ట్‌ చేసారు. దాంతో ఐమ్యాక్స్‌ నగరానికి ఇప్పట్లో రాదనే విషయం ఖరారైంది. దేశంలోనే తొలి ఐమ్యాక్స్‌ కలిగి ఉన్న నగరం అనే హోదాను పోగొట్టుకున్న సిటీ ఐమ్యాక్స్‌ తెరలు ఉన్న నగరాల జాబితాలో చేరడానికి కూడా మరింత కాలం వేచి ఉండక తప్పదు.



సిటీకి కాక్‌టైల్‌ కలెక్షన్‌



ప్రముఖ పానీయాల బ్రాండ్‌ బాంబే సఫైర్‌ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పేరొందిన 50 మంది నిపుణులు రూపొందించిన ఆఫ్‌–ది–మెనూ కాక్‌టెయిల్‌ల కలెక్షన్‌ నగరానికి రానుంది. ఈ విషయాన్ని బ్రాండ్‌కు చెందిన అద్ను తివారీ ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధాన మెట్రో నగరాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ముంబైకి చెందిన సోహో హౌస్‌ రూపొందించిన జాంగానంగ్‌, ది బోంబే క్యాంటీన్‌ తయారు చేసిన ప్రాంతిక్‌ హల్దార్‌, న్యూఢిల్లీలోని లైర్‌ అందిస్తున్న నావల్‌ భట్‌, సైడ్‌ కార్‌ సమర్పించిన మెయిస్నామ్‌.. తదితర కాక్‌టైల్స్‌ నగరవాసుల్ని అలరించనున్నాయని. దేశంలోని 50 మంది అగ్రశ్రేణి బార్టెండర్లతో పాటు దేశీయ కళాకారులు చెఫ్‌లతో వరుస వర్క్‌షాప్‌ల ద్వారా, వీటిని సృష్టించామన్నారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, గోవా, జైపూర్‌ కోల్‌కతాలతో పాటు నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉన్న బార్‌ కిన్‌–రులో వీటిని ఆస్వాదించవచ్చు అన్నారు.

– సాక్షి, సిటీ బ్యూరో

సాక్షి రియల్టీ
శనివారం
14-06-2025

విలాసం.. ఆ తర్వాతే ఆవాసం

సూపర్ బిల్టప్ ఏరియాలో కార్పెట్ ఏరియా సగమే..



నివాస విభాగాన్ని కరోనా కంటే ముందు, ఆ తర్వాత అని విభజించే పరిస్థితులు వచ్చాయి. కోవిడ్ కంటే ముందు వరకూ అపార్ట్‌మెంట్ విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అంటే ఫ్లాట్ ఏరియాలో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం ఎంత ఉందని చూసుకునేవారు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. ఫ్లాట్‌లో నివాసితుడు వినియోగించే స్థలం కంటే క్లబ్‌హౌస్, పార్క్, గార్డెన్, లాబీ వంటి వసతులకు ఎంత స్థలం కేటాయిస్తున్నారనే దానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ లైఫ్ స్టయిల్‌ను కోరుకునే యువ జనరేషన్ పెరుగుతుండటంతో అపార్ట్‌మెంట్‌లో కార్పెట్ ఏరియా క్రమంగా తగ్గుతోందని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

❖ అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లో ఫ్లాట్ల స్థలంతో పాటు లిఫ్ట్, మెట్లు, క్లబ్‌హౌస్, పార్క్ ఇతరత్రా వసతుల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలిపితే దాన్ని సూపర్ బిల్టప్ ఏరియాగా పేర్కొంటారు. ఇక, ఫ్లాట్‌లో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం(గోడ నుంచి గోడ వరకూ ఉండే స్పేస్)ను కార్పెట్ ఏరియాగా పేర్కొంటారు. కరోనా మహమ్మారి కంటే ముందు వరకూ గృహ కొనుగోలుదారులు కార్పెట్ ఏరియాకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా.. కోవిడ్ తర్వాత నుంచి కార్పెట్ కంటే అపార్ట్‌మెంట్‌లోని వసతులకు(లోడింగ్) ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1) నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ లోడింగ్ 40 శాతానికి చేరుకుంది. 2019లో ఇది 31 శాతంగా ఉంది. నివాస సముదాయాలలో అధునిక వసతులు, సౌకర్యాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ల లోడింగ్(వసతులు)పెరుగుతోంది. విలాసవంతమైన జీవనశైలి కారణంగా గృహ కొనుగోలుదారులు అధిక వసతులు, సౌకర్యాలను కోరుతున్నారు.

వసతులకు ప్రాధాన్యం

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్లలోని మొత్తం స్థలంలో 60 శాతం నివాసయోగ్యమైన స్థలం కాగా మిగిలిన 40 శాతం సాధారణ ప్రాంతం. లిఫ్ట్, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్, వసతులు, టైరస్ వంటి కామన్ ఏరియాలు. కరోనా కంటే ముందు వరకూ 30 శాతం కంటే తక్కువ లోడింగ్ సాధారణంగా భావించేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి విలాసవంతమైన జీవనశైలి అలవాటైపోయింది. ప్రాజెక్ట్ చిన్నదైనా, పెద్దదైనా ఆధునిక వసతులు ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లలో నివాసయోగ్యమైన స్థలం కార్పెట్ ఏరియా తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు ప్రాథమిక జీవనశైలి సౌకర్యాలతో సంతృప్తి చెందడం లేదు. ఫిట్‌నెస్ కేంద్రాలు, క్లబ్ హౌస్, పార్క్, గార్డెన్, గ్రాండ్ లాబీలు ఉండాలని కోరుకుంటున్నారు.



నగరంలో పెరుగుతున్న అపార్ట్‌మెంట్ లోడింగ్

1,500 చ.అ. ఫ్లాట్ విస్తీర్ణంలో వినియోగ స్థలం 750 చ.అ.లే

మిగిలిన స్థలం వసతుల కోసం కేటాయింపు

లగ్జరీ లైఫ్ స్టయిల్‌కు ప్రాధాన్యత ఇస్తుండటమే కారణం

రీసేల్ విలువ పెరుగుదల..

లోడింగ్ పెరిగితే కమ్యూనిటీ నివాస యోగ్యత, రీసేల్ విలువలను కూడా పెరుగుతుంది. అయితే గృహ కొనుగోలుదారులు తమ అపార్ట్‌మెంట్లలో వాస్తవంగా ఉపయోగించే స్థలాన్ని కోల్పోతారు. ప్రతి ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్‌లోని మొత్తం స్థలంలో గృహ కొనుగోలుదారులు వాస్తవంగా ఉపయోగించే స్థలం, సౌకర్యాల కోసం కస్టమర్లు ఎంత చెల్లిస్తున్నారో స్పష్టంగా పేర్కొనేలా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) నిబంధనలు రూపొందించాలి. దీంతో కస్టమర్లు చెల్లించే సొమ్ములో దేనికెంత వ్యయం అవుతుందో స్పష్టత ఉంటుంది.

లెక్క ఇలా..

- ❖ అపార్ట్‌మెంట్ సూపర్ బిల్టప్ ఏరియా: 1,500 చ.అ.
- ❖ కార్పెట్ ఏరియా: 1,000 చ.అ.
- ❖ 1,500-1,000/1,000 × 100= 50 శాతం
- ❖ అంటే 1,500 చ.అ. అపార్ట్‌మెంట్‌లో వాస్తవంగా కస్టమర్ వినియోగించే స్థలం సరిగ్గా సగం అంటే 750 చ.అ.లే అన్నమాట.

నగరంలో లోడింగ్ 38 శాతం..

❖ హైదరాబాద్‌లో లోడింగ్(వసతులు) శాతం 2019లో 30 శాతంగా ఉండగా.. 2022 నాటికి 33కు, ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 38 శాతానికి పెరిగింది. 2025 క్యూ1 నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అత్యధికంగా



43 శాతం లోడింగ్‌తో ముంబై ప్రథమ స్థానంలో నిలిచింది. 2019లోనూ ఈ ఆర్థిక నగరంలో అత్యధిక లోడింగ్ 33 శాతంతో టాప్‌లో నిలిచింది. అత్యల్పంగా 36 శాతం లోడింగ్‌తో చెన్నై చివరి స్థానంలో నిలిచింది. 2019లో ఇక్కడ లోడింగ్ 30 శాతంగా ఉంది. ఏటేటా బెంగళూరులో అపార్ట్‌మెంట్ లోడింగ్ క్రమంగా పెరుగుతోంది. 2019లో ఇక్కడ 30 శాతం లోడింగ్ ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 41 శాతానికి పెరిగింది. 2022లో ఇది 35 శాతంగా ఉంది. గత



ఏడేళ్లలో బెంగళూరులో సగటు లోడింగ్ అత్యధిక శాతం వృద్ధిని నమోదు చేస్తూ ఉంది. ఎన్‌సీఆర్‌లో 2019లో లోడింగ్ శాతం 31 శాతం నుంచి 2025 క్యూ1 నాటికి 41 శాతానికి చేరింది. పుణేలో 32 శాతం నుంచి 40కు, కోల్‌కతాలో 30 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది.

నగరాల వారీగా సగటు లోడింగ్(వసతులు) (శాతంలో)

నగరం	2019	2022	2025 క్యూ1
ముంబై	33	39	43
ఢిల్లీ–ఎన్‌సీఆర్	31	37	41
బెంగళూరు	30	35	41
పుణె	32	36	40
కోల్‌కతా	30	35	39
హైదరాబాద్	30	33	38
చెన్నై	30	32	36



లోడింగ్ శాతాన్ని ఎలా లెక్కిస్తారంటే..

సూపర్ బిల్టప్ ఏరియా నుంచి కార్పెట్ ఏరియాను తీసి వేసి, కార్పెట్ ఏరియాతో భాగించాలి. వచ్చిన ఫలితాన్ని వందతో గుణిస్తే వచ్చేదే లోడింగ్ శాతం. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో మీరు 1,500 చ.అ. అపార్ట్‌మెంట్ కొంటున్నారని అనుకుందాం. ఇందులో ఫ్లాట్‌లో కస్టమర్ వినియోగించే స్థలం 750 చ.అ.లే ఉంటుంది. మిగిలిన స్థలం లిఫ్టు, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్ వంటి కామన్ ఏరియాలు ఉంటాయి. అంటే ఫ్లాట్ ఖరీదులో కస్టమర్ వాస్తవంగా వినియోగించే కార్పెట్ ఏరియాతో పాటు కామన్ ఏరియా కూడా కలిపే ఉంటుందన్నమాట.

ఇళ్ల ధరలు పెరిగేనా?



- కొంచెం నేర్పు.. కాసింత ఖర్చు పెడితే చాలు
- ప్రతికూలంలోనూ స్థిరాస్తిని అమ్మేయొచ్చంటున్న నిపుణులు

కొనేటప్పుడు తక్కువ ధరకు రావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ రేటు రావాలనుకునేది ఒక్క స్థిరాస్తిలో మాత్రమే. ప్రస్తుతం మార్కెట్లో బూమ్ లేదు కాబట్టి మనం కోరుకున్న ధర రావడం కొద్దిగా కష్టమే. అయితే కొంచెం ప్రణాళిక, మరికొంచెం నేర్పుతో కాసింత ఖర్చు పెడితే చాలు ప్రతికూల సమయంలోనూ స్థిరాస్తి అమ్మేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఇంటి ధరను ప్రధానంగా స్థిరాస్తి ఉన్న ప్రాంతం, దాని నిర్మాణ ఖర్చులు, స్థలం ధర నిర్ణయిస్తాయి. అయితే పూర్తిగా ఈ అంశాలే ధరను నిర్ణయించలేవు. మార్కెట్ సెంటిమెంటే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. గిరాకీ, సరఫరా కూడా కొంతమేర ప్రభావం చూపుతాయి. కాబట్టి స్థిరాస్తిని విక్రయించాలనుకున్నప్పుడు ముందుగా మార్కెట్ స్థితిగతుల్ని అధ్యయనం చేయాలి. ధరల పోకడ, ఆ ప్రాంతంలో సగటు ధర వంటి విషయాలపై దృష్టిపెట్టాలి.

వసతులే కీలకం..

ఒక ఇంటి అంతిమ విలువ రెండు రకాలుగా ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం నివసించడానికి సౌకర్యాలన్నీ ఉన్నాయా? ఒకవేళ భవిష్యత్తులో ఇల్లు అమ్మాలనుకుంటే మంచి ధర వస్తుందా? ఈ రెండు అంశాలు ముఖ్యం. ఉదాహరణకు చేరువలో షాపింగ్ మాల్స్ లేదా దుకాణాలు ఉన్నాయా? స్కూళ్లు, ఆస్పత్రులు, రవాణా సదుపాయాలు వంటివి ఉన్నాయా లేదా అనేవి చూడాల్సిందే.. చుట్టుపక్కల వాళ్లు స్నేహపూర్వకంగా ఉంటేనే ప్రశాంతంగా నివసించవచ్చు. కొత్తగా పెళ్లయిన జంటలకు స్కూళ్ల అవసరం ఉండదు కాబట్టి ఇల్లు కొనే ముందు ఈ అంశం గురించి పట్టించుకోరు. కాకపోతే ఇంటిని అమ్మాలనుకుంటే మాత్రం ఇదే కీలకం.

సౌకర్యాలే ముఖ్యం కాదు..

ఇల్లు కొనే ప్రతి ఒక్కరూ తమ సౌకర్యాల్నే చూసుకోకూడదు. భవిష్యత్తు అవసరాల్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. కారు లేదా బైకు ఉన్నవారికి ప్రజారవాణా వ్యవస్థ అవసరం ఉండకపోవచ్చు. ఇవే అంశాలు ఇతరులకు ముఖ్యమవుతాయని గుర్తుంచుకోండి. ఇంటిని అమ్మేటప్పుడు ఇలాంటివే కీలకంగా మారతాయి. చేరువలోనే షాపింగ్ చేసుకోవడానికి అవకాశం ఉంటే.. భవిష్యత్తులో ఇల్లు విక్రయించే

సమయంలో కొనేవారికి ఇవే కీలకమవుతాయి. ఇలాంటి అంశాల ఆధారంగా ఇంటి విలువ లెక్కగడతారని గుర్తుంచుకోవాలి.

చిక్కులుండొద్దు..

స్థిరాస్తికి ఎన్ని అనుకూలతలు ఉన్నా ఓ విషయంలో మాత్రం చిన్నపాటి తేడా ఉన్నా కొనుగోలుదారులు ముందుకురారు. అదే న్యాయపరమైన అంశం. మీరు విక్రయించాలనకున్న స్థిరాస్తికి సంబంధించిన న్యాయపరమైన అంశాల్ని కొనుగోలుదారులకు స్పష్టంగా వివరించాలి.

ప్రాంతం కూడా ముఖ్యమే..

మన ఇంటికి అధిక ధర రావాలంటే అది ఉన్న ప్రాంతమూ ముఖ్యమే. ఇంట్లోని వసతులను మార్చినట్టుగా ప్రాంతాన్ని మార్చలేము. కాకపోతే మన ఇంటి నిర్మాణం ఎంత అభివృద్ధి చెంది ఉంటుందో ఆ ప్రాంతం కూడా అంతే వృద్ధి చెంది ఉంటుందనేది మర్చిపోవద్దు. అంటే ఇంట్లోని వసతులకే కాదు ఇంటికి దగ్గర్లో పాఠశాలలు, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్ ఉండాలన్నమాట. ఇంటికి లిఫ్ట్, పార్కింగ్ వంటి వసతులతో పాటు మెయిన్ రోడ్డుకు వెళ్లేందుకు అనువైన రోడ్డు ఉండాలి.

నిర్వహణతోనే రెట్టింపు విలువ..

గేటెడ్ కమ్యూనిటీల్లో పిల్లలు, పెద్దలకు ప్రత్యేకంగా పార్కులు, ఆట స్థలాలు, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి ఆధునిక సదుపాయాలు కల్పించగానే సరిపోదు. వాటిని పక్కాగా నిర్వహించే సామర్థ్యం ఉండాలి. అప్పుడే ఇంటి విలువ రెట్టింపు అవుతుంది. ప్రతి ఫ్లాట్ యజమానులతో స్నేహపూర్వకంగా మెలగాలి. విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి, లిఫ్టు వంటి మౌలిక వసతుల నిర్వహణకు ఉద్యోగులుండాలి. అప్పుడే ఆ గృహ సముదాయం బాగుంటుంది. ఇంటి విలువ కేవలం ఫ్లాట్‌కో.. ప్లాట్‌కో పరిమితం కాదు.. సౌకర్యాలు, నిర్వహణతో కలిపి ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈమధ్య కాలంలో వైఫై, జనరేటర్, హౌజ్ కీపింగ్ వంటి వసతులూ ఉంటేనే ధర ఎక్కువ పలుకుతోంది. ఫుల్లీ ఫర్నీచర్, సెమీ ఫర్నీచర్ ఫ్లాట్లకు ఎక్కువే రేటు వస్తుంది.

వర్షంలోనే.. ఇల్లు వెతకండి!

- నిర్మాణ నాణ్యత, ప్రాంతం పరిస్థితులు తెలిసేది ఈ కాలంలోనే..
- రాయితీలతో రా..రమ్మంటున్న బిల్డర్లు

వర్షంలో బయటకు వెళ్లాలంటే కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంది. తడిసిపోతామనో లేక బురదగా ఉంటుందనో కారణాలెన్నో! కానీ, గృహ అన్వేషణ కోసం ఇదే సరైన సమయం అంటున్నారు రియల్టీ నిపుణులు. వానల్లోనే ఇంటి నిర్మాణ నాణ్యత, ప్రాంతం పరిస్థితి క్షణ్ణంగా తెలుస్తుంది కాబట్టి.. సొంతింటి ఎంపికకు ఇదే సరైన కాలమని సూచిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



గృహ కొనుగోలుదారులు అంతిమ నిర్ణయం తీసుకునే ముందు ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతం వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలంటే వర్షంలో ప్రాజెక్ట్‌ను పరిశీలించాలి. నగరం ఏదైనా సరే వానొస్తే చాలు రహదారులన్నీ ట్రాఫిక్ జామ్ అవుతాయి. వర్షం నీరు వెళ్లే సౌకర్యం లేక రోడ్లన్నీ మునిగిపోతాయి. ఇది ఇల్లు ఉన్న ప్రాంతానికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలియజేస్తుంది. ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థ ఎలా ఉంది? ఇంటి నుంచి బస్ స్టాండ్ లేక రైల్వే స్టేషన్‌కు చేరుకునేందుకు ఎంత సమయం పడుతుంది వంటి వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి.

నాణ్యత తెలుస్తుంది..

ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతంతో పాటూ ఇంటి నిర్మాణ నాణ్యత బయటపడేది కూడా వానాకాలంలోనే.. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్ట్‌లో కొనుగోలు చేసే కొనుగోలుదారుల మాత్రం వానాకాలంలో ఇంటి నాణ్యత చెక్ చేసుకోవటం ఉత్తమం. ఎందుకంటే ఒక్కసారి గృహ ప్రవేశం అయ్యాక కామన్‌గా ఏర్పాటు చేసిన వసతుల్లో లీకేజ్‌లను పునరుద్ధరించడం కొంత కష్టం. వర్షాకాలంలో ప్రాజెక్ట్ లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇంట్లోని వాష్ రూమ్, సీలింగ్, పంబ్లింగ్, డ్రైనేజీ లీకేజ్ వంటివి తెలుస్తాయి. ఆయా లోపాలను పునరుద్ధరించమని డెవలపర్‌ను కోరే వీలుంటుంది.

రీసేల్ ప్రాపర్టీలనూ..

రీసేల్ ప్రాపర్టీలను కొనేవారైతే వర్షాకాలంలో ఆయా ప్రాపర్టీలను స్వయంగా పరిశీలించడం ఉత్తమం. ఎందుకంటే వానల్లోనే ప్రాపర్టీ నిర్వహణ ఎలా ఉందో అవగతమవుతుంది. గోడల ధ్రుడత్వం, డ్రైనేజీ, పంబ్లింగ్ లీకేజీలు వంటివి తెలుసుకునే వీలుంటుంది. ప్రాపర్టీ లోతట్టు ప్రాంతంలో ఉందా? వరదలు ఎక్కువగా వచ్చే అవకాశముందా? అనేది తెలుస్తుంది. వరద నీరు భూమిలోకి ఇంకిపోయే ఏర్పాట్లు ఉన్నాయా? లేక అపార్ట్‌మెంట్ సెల్లార్ నీటిలో మునిగిపోతుందా? అనేది తెలుస్తుంది.

వర్షంలో రాయితీలు..

వర్షాకాలంలో గృహ కొనుగోళ్లు అంతగా జరగవు. కాబట్టి ఇలాంటి సమయంలో నిజమైన గృహ కస్టమర్లు వచ్చినప్పుడు వారిని డెవలపర్లు స్వాగతిస్తారు. ధర విషయంలో బేరసారాలు ఆడే వీలుంటుంది. రాయితీలు, ఇతర ప్రత్యేక వసతుల విషయంలో డెవలపర్లతో చర్చించవచ్చు. పైగా సెప్టెంబర్–అక్టోబర్ పండగ సీజన్ కావటంతో భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక రాయితీలతో అమ్మకాలను ప్రకటిస్తుంటారు డెవలపర్లు.

పైకప్పే అదిరింది!

సాక్షి, సిటీబ్యూరో: ఫాల్స్ సీలింగ్‌తో ఇంట్లోని వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదకరంగా మార్చుకోవచ్చు. దీంతో పాటు సాధారణ ఇంటి పైకప్పును డైమండ్, చతురస్రం, గోళాకారం వంటి విభిన్న ఆకృతుల్లో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు కూడా. ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేసే ఫాల్స్ సీలింగ్ రంగుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- గోడ రంగుతో పోల్చుకుంటే సీలింగ్‌కు వేసే వర్ణం తేలికగా



ఉండాలి. అప్పుడు పైకప్పు తక్కువ ఎత్తులో ఉందనిపిస్తూ, విశాలంగా ఉన్న భావనను కలిగిస్తుంది. ముదురు షేడ్లను ఎంచుకుంటే పైకప్పు ఎత్తులో ఉందన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది.
- మిగతా గదులతో పోల్చుకుంటే పడకగది సీలింగ్‌నే ఎక్కువసేపు చూస్తాం కాబట్టి వర్ణాల్లో సాదాసీదావి కాకుండా నేటి పోకడలకు అద్దం పట్టేవి ఎంచుకోవాలి. మధ్యస్థం, డార్క్, బ్రౌన్ వర్ణాలు పడకగదికి చక్కగా నప్పుతాయి. ఎందుకంటే ఈ వర్ణాలు ఉత్సాహపరిచే విధంగా, స్వభావానికి అనుకూలంగా ఉంటాయి మరి.
- తాజాదనం ఉట్టిపడుతున్న లుక్ రావాలంటే మోనోక్రోమాటిక్ థీమ్‌ను ఎంచుకోవాలి. రెండు, మూడు వర్ణాలు కలిసినవి ఎంచుకుంటే మాత్రం అది పడక గది గోడలకు వేసిన రంగు కంటే తేలికగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీ సీలింగ్ ప్రశాంత భావనను కలగజేస్తుంది.
- గోడల రంగుకు, సీలింగ్‌కు ఒకే రకమైంది కాకుండా.. వేర్వేరు వర్ణాల్ని వేసుకోవచ్చు. దగ్గర రంగులు కాకుండా, చూడగానే తేడా ఇట్టే కన్పించే వర్ణాలను ఎంపిక చేసుకోవటం మేలు. దృశ్య వ్యక్తీకరణ ప్రదేశంగా సీలింగ్‌ను వినియోగించుకోండి. ఆహ్లాదభరితమైన ఆకాశం, లేదంటే గదితో కలిసిపోయేలా ఆకట్టుకునే ఆకారాలు, వర్ణాలతో నాటకీయత కన్పించేలా అలంకరించుకోవచ్చు.

జాగ్రత్తలివే..

- ఫాల్స్ సీలింగ్ ఎంపికలో ధర కంటే నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలి.
- ఫ్లోర్ నుంచి పైకప్పు మధ్య కనీసం 10–12 అడుగుల ఎత్తు అయినా ఉండాలి.
- ఏమరుపాటుగా ఉంటే ఫాల్స్ సీలింగ్‌తో పాటు ఎయిర్ కండిషన్ మెషిన్ కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది.
- ఉడెన్ ఫాల్స్ సీలింగ్‌లో అయితే ఎలుకలతో పాటు చెదలు, పురుగులు చేరే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.
- దుమ్ము, ధూళి చేరకుండా అప్పుడప్పుడు శుభ్రం చేయాలి.



నాణ్యమైన ఇళ్లే కావాలి

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సదుపాయాలు లేకపోయినా పర్వాలేదు. ఆట స్థలాలకు స్థానం కల్పించకున్నా ఇబ్బంది లేదు. విస్తీర్ణం తక్కువైనా నో ప్రాబ్లం. అందుబాటు ధర.. నిర్మాణంలో నాణ్యత ఉంటే చాలు.. నగరంలో ఇల్లు కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఓ ప్రాపర్టీ పోర్టల్ సర్వే తెలిపింది. సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులను దృష్టిలో పెట్టుకొని అందుబాటు ప్రాజెక్ట్‌లను నిర్మించాలని సూచించింది. మన దేశంలోని నగరాలు, పట్టణాల్లో సుమారు 3 కోట్ల దాకా ఇళ్ల అవసరమవుతాయని సర్వే చెబుతోంది. దీంతో బడా డెవలపర్లూ అందుబాటు గృహాల వైపు దృష్టిసారించారు. ఆర్థిక మాంద్యం కారణంగా ప్రవాస భారతీయులు, ఐటీ ఉద్యోగుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేవు. దీంతో తక్కువ విస్తీర్ణం ఉన్న ఇళ్లకు, స్థానిక కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే ఇళ్లకు శ్రీకారం చుట్టాయి. నగరానికి చెందిన పలు నిర్మాణ సంస్థలు అందుబాటు ధరల్లో ఇళ్లను నిర్మించడం మొదలుపెట్టాయి. ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్ వంటి ప్రాంతాల్లో రూ.40 లక్షల్లోపు ఫ్లాట్లు కొనేవారు బోలెడు మంది ఉన్నారు. కానీ, ఈ తరహా నిర్మాణాలు చేపట్టేవారి సంఖ్య తక్కువగా ఉంది. నేటికీ సిటీ నిర్మాణ రంగం ఐటీ ఉద్యోగుల కొనుగోళ్ల మీదే ఆధారపడి ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే నగరంలో రేట్లు తక్కువగా ఉండటం. పెట్టుబడి కోణంలో ఆలోచించేవారు, స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు నగరం వైపు దృష్టిసారిస్తున్నారు.



ఇక అసెంబ్లీ పదవులు!

ఖాళీల భర్తీపై సీఎం రేవంత్ కసరత్తు

- సామాజిక, ప్రాంతాల వారీ సమీకరణలపై దృష్టి
- ఖాళీగా చీఫ్ విప్ పదవి.. ఇటీవల రెండు విప్‌లూ ఖాళీ
- చీఫ్ విప్‌గా రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం..లేదంటే బీసీ విప్‌లకు ప్రమోషన్?
- విప్‌ల కోసం పరిశీలనలో సామాజిక వర్గానికి రెండు పేర్లు



సాక్షి, హైదరాబాద్: మంత్రివర్గ విస్తరణ, ఐఏఎస్‌ల బదిలీలు, జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా అసెంబ్లీ పదవుల భర్తీపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక, ప్రాంతాల వారీ సమీకరణలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ చీఫ్ విప్, విప్‌ల నియామకంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఈ మేరకు ఒక జాబితా కూడా సిద్ధం చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. చీఫ్ విప్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు ఇచ్చే అవకాశముందని, ఒకవేళ మండలిలో అదే సామాజిక వర్గ నేతకు చీఫ్ విప్ పదవి ఉందని సీఎం భావించిన పక్షంలో బీసీ నేతకు కేటాయించే అవకాశముందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఇక మొన్నటివరకు విప్‌గా ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మంత్రిగా, మరో విప్ రాంచంద్రు నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించిన నేపథ్యంలో ఖాళీ అయిన ఆ రెండు పదవులను కూడా భర్తీ చేసే యోచనలో సీఎం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో సమీకరణలను బట్టి విప్‌ల సంఖ్యను 4 నుంచి 5 లేదా 6కు పెంచే అవకాశాలను కూడా ఆయన పరిశీలిస్తున్నట్లు సమాచారం.

చీఫ్ విప్ ఎవరికి?

ప్రస్తుతం అసెంబ్లీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా ఉన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా ఎస్టీ వర్గాలకు చెందిన రాంచంద్రునాయక్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఇద్దరు బీసీలు.. కురుమ సామాజిక వర్గం నుంచి బీర్ల అయిలయ్య, మున్నూరుకాపు వర్గం నుంచి ఆది శ్రీనివాస్‌లు విప్‌లుగా ఉన్నారు. మరో రెండు విప్ పదవులు (అడ్లూరి, రాంచంద్రు నాయక్) ఇటీవల ఖాళీ అయ్యాయి. ఇప్పటివరకు చీఫ్ విప్‌ను నియమించకపోవడంతో అది కూడా ఖాళీగా ఉంది. ఇలావుండగా ఇప్పటివరకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విప్ పోస్టులను రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వలేదు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలోనూ ఆ వర్గం నేతలకు చాన్స్ దక్కలేదు. ఈ నేపథ్యంలో చీఫ్ విప్ పదవిని ఆ సామాజిక వర్గానికి చెందిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డికి కేటాయిస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. కానిపక్షంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని నియమించే అవకాశాలున్నాయి. ఈ ఇద్దరిలో ఒకరి నియామకం ద్వారా అటు సామాజిక సమీకరణలను పాటించడంతో పాటు రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో ప్రాతినిధ్యం దక్కలేదనే విమర్శకు కొంతవరకు చెక్ పెట్టినట్టు అవుతుందనే ఆలోచనలో సీఎం ఉన్నారని సమాచారం. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి కాకపోతే మాత్రం ప్రస్తుతం విప్‌లుగా ఉన్న ఇద్దరు బీసీ నేతల్లో ఒకరికి పదోన్నతి లభించవచ్చని, బీర్ల అయిలయ్య లేదంటే ఆది శ్రీనివాస్‌లను చీఫ్ విప్‌లుగా నియమిస్తారని, తద్వారా మంత్రి పదవుల్లో ఈ వర్గాలకు ప్రాతినిధ్యం లేదన్న వాదనకు తెరపడినట్టవుతుందని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

విప్‌ల భర్తీకీ సమీకరణాలు

అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా ఎవరికి అవకాశం ఇవ్వాలన్న దానిపై కూడా సామాజిక, ప్రాంతీయ సమీకరణలను సీఎం రేవంత్ అంచనా వేస్తున్నారు. మాదిగ సామాజిక వర్గం నుంచి వేముల వీరేశం, లక్ష్మీకాంతరావు, మాల సామాజిక వర్గం నుంచి మేడిపల్లి సత్యం శ్రీగణేష్, ఎస్టీ కోటాలో మురళీ నాయక్, వెడ్మ బొజ్జుల పేర్లను పరిశీలిస్తున్నారని, సామాజిక వర్గాలు, ఉమ్మడి జిల్లాల సమీకరణల్లో ఒక్కో వర్గానికి ఒకరిని నియమిస్తారని తెలుస్తోంది. మరోవైపు విప్‌గా మహిళా ఎమ్మెల్యేకు అవకాశం కల్పించే విషయాన్ని కూడా సీఎం రేవంత్ సీరియస్‌గా పరిశీలిస్తున్నారని, ఈ మేరకు త్వరలోనే అసెంబ్లీ పదవుల పందేరం అధికారికంగా ఉండే అవకాశముందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

రేవంత్.. లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?

- తెలంగాణ ప్రజలు చూసేలా ప్రత్యక్ష ప్రసారం చేయిద్దాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'రేవంత్‌రెడ్డి గారూ.. ఓటుకు నోటు కేసులో మీరు..ఫార్ములా ఈ అంశంలో నేను.. ఇద్దరమూ ఏసీబీ విచారణను ఎదుర్కొంటున్నాం. న్యాయమూర్తి సమక్షంలో మనిద్దరం లై డిటెక్టర్ పరీక్ష ఎందుకు చేయించుకోకూడదు. ఈ పరీక్షను టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తే అసలు దోషులు ఎవరో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారు. నాతోపాటు లై డిటెక్టర్ పరీక్షకు హాజరయ్యే దమ్ముందా'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాలు చేశారు. శుక్రవారం 'ఎక్స్'లో కేటీఆర్ స్పందించారు. 'ప్రభుత్వం నడిపే చేవలేనప్పుడు ప్రజలతో సర్కస్ చేస్తూ వారి దృష్టిని మళ్లిస్తారు. కానీ కాంగ్రెస్ పార్టీతోపాటు దాని జోకర్ సీఎం చేసే హడావుడి మమ్మలను అడ్డుకోలేవు. సోమవారం ఉదయం 10 గంటలకు ఫార్ములా–ఈ కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఏసీబీ నుంచి పిలుపు వచ్చింది. చట్టానికి కట్టుబడిన పౌరుడిగా విచారణకు హాజరై ఏసీబీ అధికారులకు పూర్తిగా సహకరిస్తాను. నల్లటి బ్యాగ్ నిండా డబ్బుతో దొరికి పదేళ్లు పూర్తి చేసుకున్నదెవరో చెప్పగలరా. ఓ వైపు రాష్ట్రం దివాలా తీసిందని చెబుతున్న సీఎం రేవంత్.. పదే పదే విచారణలు, ప్రచారాలు పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఎందుకు వృథా చేస్తున్నారు'అని కేటీఆర్ ప్రశ్నించారు.



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్

విద్యా వ్యవస్థపై బాధ్యత లేదు

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కూడా కుంటుపడిందని కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. దీని పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేదన్నారు. వానాకాలం సీజన్ మొదలవుతున్నా రైతు భరోసా అమలు విషయంలో ప్రభుత్వానికి ప్రణాళిక లేదని మండిపడ్డారు. పాఠశాలలు పునః ప్రారంభమైనా పాలకులు నిర్లక్ష్యం వీడటం లేదన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ

సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకొని తిరిగి ప్రజాక్షేత్రంలో చురుగ్గా పాల్గొనాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఆస్పత్రికి వెళ్లిన వారిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, తాతా మధు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, సండ్ర వెంకటవీరయ్య ఉన్నారు.

కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

- ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో జారీ
- సోమవారం విచారణకు రావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేస్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు శుక్రవారం పంపిన నోటీసులో సూచించారు. ఈ కేసులో కేటీఆర్ ఏ–1గా ఉన్నారు. వాస్తవానికి మే 28నే తమ ఎదుట విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్‌కు మే 26న ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నందున తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ నెల 16న విచారణకు హాజరుకావాలంటూ ఏసీబీ అధికారులు తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా–ఈ కార్ రేస్‌లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఫార్ములా–ఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి నిబంధనలు అతిక్రమించి విదేశీ కంపెనీకి డబ్బులు పంపారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే జనవరి 9న కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. కేసులో ఏ–2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ–3గా ఉన్న హెచ్‌ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్‌రెడ్డిని సైతం ఇప్పటికే ఏసీబీ అధికారులు విచారించారు. జనవరి 8న అర్వింద్‌కుమార్‌ను, జనవరి 9న కేటీఆర్, 10న బీఎల్‌ఎన్‌రెడ్డిని, అదే నెల 18న గ్రీన్‌కో ఏస్ నెక్స్‌ట్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. వీరందరి స్టేట్‌మెంట్ల ఆధారంగా ఫార్ములా–ఈ ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులు, సీఈవోను జూమ్ మీటింగ్ ద్వారా వర్చువల్‌గా విచారించారు. తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండడంతో ఈ కేసు దర్యాప్తు తుది దశకు చేరినట్టుగా తెలుస్తోంది. ఏసీబీ నోటీసులు జారీ చేసిన విషయాన్ని కేటీఆర్ సైతం ధ్రువీకరించారు.

కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కక్షసాధింపే: కవిత

ఫార్ములా–ఈ రేసింగ్‌లో మరోసారి విచారణకు రావాలని కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ నోటీసులు జారీ చేసిందని ఎక్స్ వేదికగా ఆమె ఆరోపించారు.

25లోగా రైతు భరోసా

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలోని రైతులకు ఈ నెల 25వ తేదీలోగా ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల చివరి వరకు రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, మిగతావి ఆగస్టు తర్వాత వస్తాయని తెలిపారు. బోనస్ ప్రకటన తర్వాత రాష్ట్రంలో సన్న ధాన్యం సాగు పెరిగిందని చెప్పారు. ఇతర దేశాల్లో డిమాండ్ ఉన్న ఆరు రకాల వరి రాష్ట్రంలో సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకు రూ.25 వేలు తగ్గకుండా కనీస మద్దతు ధర కోసం దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్రానికి లేఖలు పంపించి, త్వరలోనే ప్రధానమంత్రిని కలుస్తామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని, అందులో తాను కూడా ఉన్నానని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు చెపుతున్న మాటలన్నీ అబద్ధమని మంత్రి తుమ్మల అన్నారు. కేబినెట్ సబ్ కమిటీ వేయడానికి 15 రోజుల ముందుగానే మేడిగడ్డ బరాజ్ మంజూరైందని తెలిపారు.

16న రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి

- సీఎస్ రామకృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 16న రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారని, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్న రైతునేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని అన్ని రైతునేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని, ఈ నేపథ్యంలో రైతునేస్తం కేంద్రాలకు కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా చూసి, కార్యక్రమాన్ని సముచితంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 500 కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించి, ఈ నెల 16 నుంచి అదనంగా మరో వెయ్యి కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ నిపుణులు ఏయే పంటలు వేసుకోవాలనే అంశాలతోపాటు ఆధునిక సాగు విధానాల గురించి రైతులకు సూచనలు ఇస్తారని సీఎస్ చెప్పారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ, ప్రతి రైతునేస్తం కేంద్రంలో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారితో పాటు మండల స్థాయి అధికారిని నియమించాలని కలెక్టర్లను కోరారు.

గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమానికి ఏర్పాట్లు

శనివారం హైటెక్స్‌లో జరగనున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమంపై డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నందున గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్ తెలిపారు.

తెలంగాణ 286 టీఎంసీలు.. ఏపీ 718 టీఎంసీలు

- కృష్ణా జలాల వాడకం లెక్కలు తేల్చిన బోర్డు
- 11 ఏళ్లలో ఇదే అత్యధిక వినియోగం
- పాలమూరు–రంగారెడ్డి, డిండి పూర్తయితే పెరగనున్న రాష్ట్ర వినియోగం

సాక్షి, హైదరాబాద్: ఈ నీటి సంవత్సరం (వాటర్ ఇయర్)లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కృష్ణా జలాల్లో ఎంతెంత వినియోగించుకున్నాయన్న లెక్కలు తేలాయి. గత సంవత్సరం జూన్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ వరకు ఇరు రాష్ట్రాలూ మొత్తం 1,004 టీఎంసీలను వినియోగించుకున్నట్లు కృష్ణా బోర్డు తేల్చింది. తెలంగాణ 286 టీఎంసీలు, ఏపీ 718 టీఎంసీలు వినియోగించుకున్నాయి. కాగా గడిచిన పదకొండేళ్ల కాలంలో ఏ సంవత్సరంలో కూడా ఈసారి వినియోగించిన స్థాయిలో నీరు వినియోగించలేదని బోర్డు నివేదికలోని గణాంకాలు చెబుతున్నాయి. 2019–20లో గరిష్ట వినియోగం 278 టీఎంసీలు కాగా.. 2022–23లో 273 టీఎంసీలు వినియోగించుకున్నాయి.

తరలింపు ఇలా..

తెలుగు రాష్ట్రాల కామన్ రిజర్వాయర్ శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా ఏపీ ఏకంగా 207 టీఎంసీల నీటిని తరలించగా.. హంద్రీనీవా సుజల స్రవంతి కోసం 30 టీఎంసీలు, ముచ్చుమర్రి ద్వారా 3 టీఎంసీలు, చెన్నై వాటర్ కోసం 3 టీఎంసీలు తరలించింది. తెలంగాణ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 50 టీఎంసీల నీటిని తరలించిందని గుర్తించారు. నాగార్జునసాగర్ సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి 192 టీఎంసీలు, ఎడమకాల్వ ద్వారా (పాలేరు దాటిన తర్వాత ఏపీ భూభాగం కోసం) 20 టీఎంసీలు ఏపీ తరలించగా.. తెలంగాణ సాగర్ ఎడమ ప్రధాన కాలువ నుంచి 115 టీఎంసీలు తరలించింది. జంటనగరాల తాగునీటి అవసరాలకు 16టీఎంసీలు, ఏఎమ్మార్పీ నుంచి 44 టీఎంసీలు కలిపి 175 టీఎంసీలు తరలించినట్లు తేల్చారు. ఇక ప్రకాశం బరాజ్ నుంచి ఏపీ 164 టీఎంసీలు, తుంగభద్ర నుంచి 80 టీఎంసీలు, గుంటూరు చానల్ నుంచి 2 టీఎంసీల నీటిని తరలించినట్లు గుర్తించారు. మొత్తం కలిపి ఏపీ 718 టీఎంసీలు వాడుకోగా.. తెలంగాణ 286 టీఎంసీలు తరలించినట్లు లెక్కలు తీశారు.

నిరాశాజనకంగా తెలంగాణ వాడకం

కృష్ణాలో 50:50 శాతం నిష్పత్తితో నీటిని పంచాలని తెలంగాణ పట్టుబడుతున్న విషయం విదితమే. జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నీటి వాటాలు తేల్చేవరకు త్రిసభ్య కమిటీకే నీటి పంపిణీ అధికారాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో ఆ ఒక్క ఏడాదికి మాత్రం 63:37 నిష్పత్తితో కృష్ణా జలాల పంపిణీకి తాత్కాలిక ఒప్పందం జరిగింది. అయితే ఆ మేరకు నీటిని తెలంగాణ వినియోగించుకోలేక పోవడంతో 66–34 (ఏపీ, తెలంగాణ) నిష్పత్తితో నీటిని తెలుగు రాష్ట్రాలు పంచుకుంటున్నాయి. తెలంగాణ వినియోగం ఏటా నిరాశాజనకంగానే ఉంటోంది. పాలమూరు–రంగారెడ్డి, డిండి పథకాలు పూర్తయితే దాదాపు 120 టీఎంసీలను నిల్వ చేసుకునే వీలుంటుంది.

కృష్ణాబోర్డు లెక్కల ప్రకారం 11 ఏళ్ల నీటి వినియోగం (టీఎంసీల్లో)..

సంవత్సరం	ఏపీ	తెలంగాణ
2014–15	529.330	227.743
2015–16	124.960	69.688
2016–17	282:512	153.386
2017–18	359.897	183.298
2018–19	504.476	207.298
2019–20	653.064	278.234
2020–21	618.935	253.234
2021–22	621.841	265.051
2022–23	637.996	273.300
2023–24	210	120
2024–25	718	286

క్లుప్తంగా...

ఈవోటీలకు ఇక ఏకరూప విధానం

- బీవోసీఈ ఉప కమిటీ సమావేశంలో నిర్ణయం
- అమలు కోసం కర్ణాటక, మహారాష్ట్రలో అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నప్పుడు ఆయా పనులు పూర్తిచేసేందుకు గాను ఇచ్చే గడువు పెంపు (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ)పై నిర్ణయం తీసుకునే విషయంలో.. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఏకరూప విధానం అమలు చేయాలని బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్ (బీవోసీఈ) సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర ప్రజా పనుల శాఖ (సీపీడబ్ల్యూడీ), రైల్వేతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలో ఏ విధానం అమలు చేస్తున్నారో అధ్యయనం చేయాలని పేర్కొంది. బీవోసీఈ ఉప కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సబ్ కమిటీ సభ్యులుగా ఉన్న రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ, పంచాయతీరాజ్ ఈఎన్సీ, ప్రజారోగ్యం ఈఎన్సీ, నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్)లు హాజరయ్యారు. పనులు చేసే క్రమంలో నాణ్యత, ప్రమాణాలు పాటించకున్నా, పనిని మధ్యలో వదిలేసినా.. లేక ఎటువంటి అవకతవకలకు పాల్పడినా ఆ కాంట్రాక్టర్‌ను మార్చి, మరొకరి చేత పని చేయించే అధికారం సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఉంది. రూ.50 కోట్ల దాకా విలువ చేసే పనిని మరో కాంట్రాక్టర్‌కు అప్పగించే అధికారం ఈఈకి ఉండటంతో దాన్ని సవరించే అంశంపై అధ్యయనం చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇక రూ.10 కోట్ల లోపు పనులను నామినేషన్‌పై అప్పగించే అధికారం చీఫ్ ఇంజనీర్ (సీఈ)కు ఉండగా.. ఈ అంశంపై కూడా తగిన అధ్యయనం చేసి, అన్ని శాఖల్లో ఏకరూప విధానం తేవాలని సబ్ కమిటీ నిర్ణయించింది.

ఏఐజీ ఆస్పత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గచ్చిబౌలి ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రికి శుక్రవారం సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లారు. డా.నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం ఆయనకు గ్యాస్ట్రిక్ సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్టు తెలిపింది.

నీటిపారుదల మంత్రుల సమావేశం మళ్లీ వాయిదా

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ట్రిబ్యునల్ (జస్టిస్ బ్రిజేష్‌కుమార్) అవార్డును ప్రచురించడానికి వీలుగా, రాష్ట్రాల అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 18వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో నిర్వహించ తలపెట్టిన సమావేశం మళ్లీ వాయిదా పడింది. తొలుత గత మే 7వ తేదీన సమావేశం ఉంటుందని సమాచారం ఇచ్చి.. ఆ తర్వాత వాయిదా వేశారు. మళ్లీ ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. తాజాగా దీన్నీ వాయిదా వేస్తున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ శుక్రవారం సమాచారం ఇచ్చింది. ఈ మేరకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది.

నియామక సంస్థలు రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి

పీఎస్సీ జాతీయ సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే నియామక సంస్థలు రాజ్యాంగ విలువలను పరిరక్షించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యానించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్‌లోని నల్సార్ వర్సిటీలో రెండ్రోజులుగా జరుగుతున్న పీఎస్సీల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవ కోసం పనిచేసే సమర్థవంతులైన అభ్యర్థుల ఎంపికలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. రెండోరోజు సదస్సులో భాగంగా పలు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యుల మధ్య న్యాయపరమైన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, ఉత్తమ పద్ధతులు, భవిష్యత్తు మార్గాలు, చట్టపరమైన సమస్యలను పరిష్కరించడంలో సాంకేతికత పాత్ర వంటి అంశాలపై ఈ చర్చలు జరిగాయి. పీఎస్సీలకు సంబంధించిన కేసు చట్టాలు, తీర్పుల కేంద్రీకృత డిజిటల్ రిపోజిటరీని సృష్టించడంపై టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వివరించారు. కమిషన్లలో ముఖ్యమైన తీర్పులు, చట్టపరమైన నవీకరణలను క్రమం తప్పకుండా ప్రచురించడానికి, పంపిణీ చేయడానికి ఒక ప్రత్యేక లీగల్ జర్నల్‌ను ప్రారంభించాలని ఆయన ప్రతిపాదించారు. చట్టపరమైన అంశాల్లో సాంకేతికతను ఏకీకృతం చేయడం, బ్లాక్ చైన్ సామర్థ్యాన్ని పెంపొందించడం, ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి యంత్రాంగాలు, వ్యాజ్యంపై సోషల్ మీడియా ప్రభావం వంటి ఇతర ప్రముఖ అంశాలపై సభ్యులు చర్చించారు.

సీఎంను కలిసిన మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు

రేవంత్‌తో భేటీ అయిన మంత్రులు శ్రీహరి, జూపల్లి



సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి అడ్లూరి. చిత్రంలో మంత్రులు జూపల్లి, వాకిటి తదితరులు

సాక్షి, హైదరాబాద్: మాదిగ సామాజికవర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు శుక్రవారం సీఎం రేవంత్‌ను కలిశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలె యాదయ్యలు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా ఉన్నారు.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరి కూడా సీఎంను కలిశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాలపై కాసేపు మాట్లాడుకున్నారు.
- కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ ..టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మహేశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అరగంటకు పైగా చర్చలు జరిపారు.

కాంగ్రెస్‌కు సంస్థాగత నిర్మాణం కీలకం

- మీనాక్షి నటరాజన్
- మండల, జిల్లా కమిటీల నియామకంపై నాయకులతో చర్చ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తలే పునాది అని, సంస్థాగత నిర్మాణం పార్టీ విషయంలో చాలా కీలకమైందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. పార్టీ మండల, జిల్లా కమిటీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. డీసీసీ అధ్యక్షులు, జిల్లాల వారీగా నియమించిన టీపీసీసీ పరిశీలకులతో శుక్రవారం ఆమె జూమ్ ద్వారా సమావేశమయ్యారు. మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని, అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వ పదవుల్లోనూ సామాజిక న్యాయం కచ్చితంగా అమలు జరుగుతుందని వెల్లడించారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని హామీ ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంస్థాగత నిర్మాణంలో పార్టీ గణనీయంగా పురోగమిస్తోందని చెప్పారు. ఇందుకోసం నిబద్ధతతో పనిచేస్తున్న రాష్ట్ర పరిశీలకులు, కోఆర్డినేటర్లను ఆయన ప్రశంసించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని మహేశ్‌గౌడ్ సూచించారు.

నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపే

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ–కార్ రేసింగ్ వ్యవహారంలో మరోసారి విచారణకు రావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపేనని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కేటీఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్‌రెడ్డి ఈ నోటీసులు పంపించారని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తోందని, దర్యాప్తు సంస్థలను ముఖ్యమంత్రి యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, ఎన్ని రకాలుగా వేధించినా సర్కార్ వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బీఆర్‌ఎస్ ఆపదని హెచ్చరించారు. గతంలో చంద్రబాబు ఫార్ములా– వన్ కోసం ప్రయత్నించి, నిర్వహించలేకపోయారని, అలాంటిది కేటీఆర్ ఫార్ములా వన్ లాంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కు తీసుకొచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు కేటీఆర్ ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టుబడులను ఆకర్షించారన్నారు. అమర రాజా వంటి కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును మంటకలిపిందని హరీశ్‌రావు విమర్శించారు.

సాక్షి, హైదరాబాద్: భారతీయ వంటకాల్లో ఉప్పు సర్వసాధారణం. ఆహారానికి రుచిని చేకూర్చే ఉప్పు మన శరీరానికి అవసరమైన ఖనిజ పదార్థాల్లో ఒకటి. అయితే దీనిని ఎంత తీసుకోవాలో అంతే తీసుకోవాలి. కానీ భారత్‌లో ఉప్పు వినియోగం అధికంగా ఉందని, ఇప్పుడు దేశంలో ముఖ్య ఆరోగ్య సమస్యగా మారినట్టు అంతర్జాతీయ స్థాయి వైద్యులు, పరిశోధకులు చెబుతున్నారు. మోతాదుకు మించిన ఉప్పు వినియోగం..అధిక రక్తపోటు, గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులకు కారణమవుతోందని పేర్కొంటున్నారు. దేశంలో ఏటా సుమారు 1.75 లక్షల మంది అధిక ఉప్పు తీసుకున్న కారణంగా అధిక రక్తపోటుతో మృతి చెందుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గుండె జబ్బులకు, గుండె పోట్లకు ప్రధాన కారణమైన అధిక రక్తపోటు భారత్‌లో 22 కోట్ల మందిపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. మన దేశంలో కౌమార దశ (టీనేజ్)లో ఉన్న దాదాపు ఏడు కోట్లమందిని అధిక రక్తపోటు సంబంధిత సమస్యలు బాధిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. కాగా వీరు వయోజనులయ్యాక మరింత అధిక రక్తపోటుకు గురయ్యేందుకు ఏడింతలు ఎక్కువ అవకాశాలున్నట్టు పరిశోధనల్లో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 26 లక్షల మందికి పైగా గుండె జబ్బులతో చనిపోతుండగా, వారిలో యాభై శాతానికి పైగా మంది మరణాలకు అధిక రక్తపోటే కారణమని వెల్లడైంది.



ఉప్పు.. వెన్నంటే ముప్పు!

అధిక వినియోగంతో అధిక రక్తపోటు, హార్ట్ అటాక్‌లు, స్ట్రోక్లు, కిడ్నీ సమస్యలు

దేశంలో ఏటా 1.75 లక్షల మంది అధిక రక్తపోటుతో మృతి	22 కోట్ల మందిపై అధిక రక్తపోటు ప్రభావం	7 కోట్ల మంది టీనేజర్లను పీడిస్తున్న అధిక రక్తపోటు సంబంధిత సమస్యలు	భారత్‌లో నిర్ధారిత ప్రమాణాల కంటే రెండింతలు ఎక్కువగా ఉప్పు వినియోగం

వాడకం తగ్గించాల్సిందే అంటున్న అధ్యయనాలు, నిపుణులు • ప్రపంచవ్యాప్తంగా ఏటా 26 లక్షల మందికి పైగా గుండెజబ్బులతో మృత్యువాత

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏం చెబుతోంది

- వయోజనులు: రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ
- పిల్లలు: వారి శక్తి అవసరాలను బట్టి తక్కువ పరిమాణంలో ఉప్పు తీసుకోవాలి.
- అయోడిన్ లోపం నివారణకు అయోడైజ్డ్ చేసిన ఉప్పును వినియోగించాలి.

ఇటీవల న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఓ అధ్యయనాన్ని (భారత్‌కు సంబంధించి), తాజాగా ఢిల్లీలో 'రిజాల్వ్ టు సేవ్ లైవ్స్' ఆధ్వర్యంలో జరిగిన ఓ జాతీయ సదస్సులోనూ భారత్‌లో ఉప్పు అధిక వినియోగం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలపై కూలంకషంగా జరిగిన చర్చలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ మేరకు కొన్ని ముఖ్యమైన సూచనలు దేశ ప్రజల ముందుకొచ్చాయి.

ఏం చేయాలి..

- వంటల్లో, తినే ముందు వేసే ఉప్పును నియంత్రించాలి
- సోడియం మోతాదులు ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్ ఫుడ్స్ తగ్గించాలి
- సహజంగా తక్కువ ఉప్పుతో ఉండే కూరగాయలు, పండ్లు, తాజా మాంసం వంటివి ఉపయోగించాలి:
- ప్యాక్డ్ ఆహారాన్ని కొనుగోలు చేసే ముందు లేబుల్‌పై సోడియం స్థాయిని పరిశీలించాలి
- ఆహారం రుచిని పెంచేందుకు ఉప్పుకు బదులు జీలకర్ర, ఇలాచి, ధనియాల వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలు ఉపయోగించాలి.
- కొన్ని ఉప్పులు పొటాషియంతో తయారవుతాయి. ఇవి ఆరోగ్యానికి మంచిది.
- ప్రభుత్వ, ఆరోగ్య సంస్థలు ఉప్పు తగ్గింపు గురించి అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి.

3 గ్రాముల తగ్గింపుతోనే ఎన్నో ప్రయోజనాలు..

రోజువారీ తీసుకునే ఆహారంలో ఉప్పును మూడు గ్రాముల దాకా తగ్గించడం ద్వారా అధిక రక్తపోటు నియంత్రణతో పాటు గుండెపోటు ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా చేయడం ద్వారా మొత్తంగా మరణాలను 4.9 శాతం, హార్ట్ స్ట్రోక్‌ల ప్రమాదాన్ని 6.5 శాతం, హార్ట్‌అటాక్స్‌ను 4.6 శాతం తగ్గించవచ్చునని సూచిస్తున్నారు.

అధిక ఉప్పునకు ఇవే మూల కారకాలు...

- సంప్రదాయ వంటకాలు: ఇంట్లో వంట సమయంలో ఎక్కువ ఉప్పు వినియోగానికి అలవాటు పడటం.
- ప్రాసెస్ చేసిన ఆహారం: అధిక సోడియంతో కూడిన ప్యాక్డ్ ఫుడ్స్, ఇన్‌స్టంట్ మసాలాలు, చిప్స్, పిజ్జాలు, బర్గర్లు మొదలైనవి వినియోగించడం
- బయట తినే ఆహారం: నగరాలు, పట్టణాల్లోని రెస్టారెంట్లలో ఆహారం సాధారణంగా అధిక ఉప్పుతో కూడుకుని ఉంటుంది.
- పురుషులు మహిళల కంటే ఎక్కువగా ఉప్పు తీసుకుంటారు
- ఉద్యోగులు, ధూమపానం చేసే వారు, అధిక బరువు గలవారు, రక్తపోటు ఉన్నవారు అధికంగా ఉప్పు తీసుకుంటున్నారని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

రెండింతలు ఎక్కువ వాడేస్తున్నారు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), భారత్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) రోజుకు 5 గ్రాములు (గరిష్ట పరిమితి) కన్నా తక్కువ ఉప్పు తీసుకోవాలని సూచిస్తే, భారతీయులు రోజుకు సగటున తీసుకునే పరిమాణం 8–11 గ్రాముల మధ్య (ఉత్తరాదిలోని కొన్ని రాష్ట్రాల్లో 12 గ్రాములు) ఉందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల కంటే మనోళ్లు రెండింతల కంటే ఎక్కువ ఉప్పును వాడేస్తున్నారన్న మాట. మొత్తంగా 80 శాతం మంది డబ్ల్యూహెచ్‌వో, ఎన్‌ఐఎన్ సిఫారసుల కంటే అధిక మోతాదులో ఉప్పును ఉపయోగించేస్తున్నారు.

టాప్‌లో త్రిపుర

- ➤ తూర్పు, దక్షిణ రాష్ట్రాలలో ఉప్పు వినియోగం ఎక్కువగా ఉండగా, త్రిపుర రోజుకు 13.14 గ్రాముల అత్యధిక వినియోగంతో మొదటి స్థానంలో ఉంది.
- ➤ పురుషులు, ధూమపానం చేసేవారు, స్థూలకాయులు, ఉద్యోగాలు చేస్తున్నవారు ఎక్కువ ఉప్పు తీసుకునేలా పరిస్థితులు, అవసరాలు దోహద పడుతున్నాయి.

ఉప్పు చేసే హానిని గుర్తించాలి

ఉప్పు జీవనానికి అవసరమైన ఒక పోషకతత్వం ఉన్నదే అయినా, దాని అధిక వినియోగం తెలియకుండా ప్రాణహానికి దారితీస్తోంది. ఈ అంశంపై వ్యక్తిగత స్థాయి నుంచే కాకుండా దేశ స్థాయిలో విధానాలు రూపొందించడం అత్యవసరం. మనం తినే ప్రతి గ్రాము ఉప్పు మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని గుర్తించాలి. వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని గుర్తించి నియంత్రణ చర్యలు ప్రారంభించాలి.



సహజంగానే ఉప్పు ఉంటుంది

అధికంగా ఉప్పు వినియోగంతో రక్తస్రావ సమస్యలు రావొచ్చు. దప్పిక పెరుగుతుంది. బలం నశిస్తుంది. జుట్టు నెరుస్తుంది. బట్టతల, చర్మంలో ముడతలు, ఇతర చర్మ సమస్యలు వస్తాయి. రక్తపోటు, కీళ్లనొప్పులు, మూత్రపిండ వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతం వంటి సంక్లిష్ట వ్యాధులకు దారితీస్తుంది. శరీరంలో నీటిని నిల్వ ఉండేట్టు చేసి ఊబకాయం, వాపులు కలుగజేస్తుంది. నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, మజ్జిగ మిరపకాయల వంటి వాటి వాడకం బాగా తగ్గించాలి. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్, ఆకుకూరలు, కూరగాయలు, గ్రీన్ సలాడ్స్, ముల్లంగి, బీట్‌రూట్‌లో తగు పాళ్లలో సోడియం ఉంటుంది. కొబ్బరి నీళ్లు, మజ్జిక, చెరకు రసం వంటి పానీయాల ద్వారా శరీరానికి సోడియం అందుతుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే అతి తక్కువ ఉప్పు వినియోగాన్ని అలవాటు చేయాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ వృద్ధుల లక్ష్మీనరసింహ శాస్త్రి, విశ్రాంత ప్రధానాచార్యులు, అదనపు సంచాలకుడు, ఆయుష్ విభాగం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

క్లుప్తంగా...

నేటి నుంచి డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈ సెట్ వెబ్ ఆప్షన్లు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈఈ సెట్ కన్వీనర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 వరకు ఆప్షన్లు ఎంచుకోవచ్చని, 20న సీట్లను కేటాయిస్తామన్నారు. సీట్లు పొందిన వారు ఈనెల 21 నుంచి 24 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి, అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలన్నారు. ఈనెల 25 లోపు సీట్లు పొందిన కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని,జూలై 1 నుంచి మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు.

దోస్త్ రెండో దశలో 43,568 సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్, తెలంగాణ (దోస్త్) రెండో దశలో శుక్రవారం 43,568 సీట్లు కేటాయించినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ దశలో 35,952 మంది రిజిస్టర్ చేసుకున్నారని, 46,883 (మొదటి దశలో వారు కూడా) మంది ఆప్షన్లు ఇచ్చారని వెల్లడించారు. మొదటి ప్రాధాన్యం ఆప్షన్లతో 30,973 మంది సీట్లు పొందారని, రెండో ప్రాధాన్యంతో 12,595 మంది సీట్లు పొందారని, కామర్స్‌లో 13,900, ఫిజికల్ సైన్స్‌లో 11,277, లైఫ్‌సైన్సెస్‌లో 8,821, ఆర్ట్స్‌లో 5,032, ఇతర కోర్సుల్లో 4,538 సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 18లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

18 నుంచి పీజీ సెట్ దరఖాస్తుల స్వీకరణ

సెట్ నోటిఫికేషన్ విడుదల.. ఆగస్టు మొదటి వారంలో ప్రవేశ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ సీపీగెట్)కు ఈనెల 18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. సెట్ నోటిఫికేషన్‌ను శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష ఆగస్టు మొదటి వారంలో ఉంటుందని, జూలై 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రూ.500 ఫైన్‌తో జూలై 24 వరకు, రూ.2 వేల ఫైన్‌తో జూలై 28 వరకు ఆన్‌లైన్ అప్లికేషన్లు తీసుకుంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఉస్మానియా వీసీ కుమార్, శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ సూర్య ధనుంజయ, మండలి వైస్ చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే మహమ్మద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46,742 పీజీ సీట్లు

అన్ని యూనివర్సిటీల పరిధిలో మొత్తం 46,742 పీజీ సీట్లు ఉన్నాయని, ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో 9,570 సీట్లు, యూనివర్సిటీ క్యాంపస్‌లో 9,530 సీట్లు, అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల్లో 35,002 సీట్లు ఉన్నాయని పీజీసెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి వెల్లడించారు. గతేడాది 21,560 సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లో 4,518, క్యాంపస్‌ల్లో 8,087 సీట్లు భర్తీ అయితే, అఫ్లియేటెడ్ కాలేజీల్లో 12,643 సీట్లు భర్తీ అయినట్టు చెప్పారు. పలు కారణాల వల్ల పీజీ కోర్సుల్లో సీట్లు ఉన్నా, విద్యార్థులు చేరడం లేదన్నారు. విద్యార్థులు ఈ సంవత్సరం ఆదాయ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు. వికలాంగులకు గతంలో 3 శాతం ఉన్న రిజర్వేషన్‌ను ఈ సంవత్సరం నుంచి 5 శాతానికి పెంచుతున్నట్టు చెప్పారు.

ఇంజనీరింగ్ ఫీజుల పెంపు వాయిదా!

▶ మొదటి పేజీ తరువాయి

సీట్లు పెంచుకోవడం, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలిందేంటని ప్రశ్నించారు. అయితే, అధికారులు ఇందుకు సంసిద్ధంగా లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ముఖ్యమంత్రి వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సమీక్షకు వచ్చేటప్పుడు కనీసం అవసరమైన నివేదికలతో రావద్దా?' అంటూ ప్రశ్నించారు. ఫీజులకు, ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌కు లింక్ పెట్టడం సరికాదు.. కాలేజీలపై పూర్తి అధ్యయనం చేసిన తర్వాతే ఫీజుల వ్యవహారం చూద్దాం అని అన్నారు.

తాళాలపై తీవ్ర ఆగ్రహం..

అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు బిల్లులు విడుదల చేయలేదని యజమానులు తాళం వేయడంపై ముఖ్యమంత్రి సీరియస్‌గా స్పందించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇంత జరుగుతుంటే కనీసం ప్రభుత్వం దృష్టికి ఎందుకు తేలేదని నిలదీశారు. విద్యాశాఖ అధికారులు పనిచేస్తున్నారా? లేదా? అనే అనుమానం కలుగుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్కూళ్లు రీఓపెన్ అయిన తర్వాత ప్రభుత్వ స్కూళ్లల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను అధికారులు వివరించలేకపోవడం కూడా సీఎంను ఆగ్రహానికి గురి చేసింది. బడిబాట కార్యక్రమం రాష్ట్రంలో ఎక్కడా సజావుగా సాగడం లేదని, టీచర్లు దీన్ని సీరియస్‌గా తీసుకోలేదని, ఉన్నతాధికారులు కూడా పట్టించుకోలేదని సీఎంఅసంతృప్తి వ్యక్తం చేశారు. చాలాచోట్ల పుస్తకాలు, దుస్తులు అందడం లేదని విమర్శలు వస్తున్నా అధికారులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నాయని, నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు ఇచ్చిన వివరణపై కూడా ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రైవేటు స్కూళ్లల్లో 25 శాతం ఉచిత సీట్లు ఇచ్చే అంశంపై కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

కొత్తగా 571 పాఠశాలలు: సీఎం

ఇరవై మందికన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకుని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యాశాఖపై సీఎం శుక్రవారం నిర్వహించిన సమీక్షకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలిలో పైరవీల జోరు

జేఏసీల పేరుతో అధికారుల చాంబర్లలో తిష్ట
ప్రైవేటు కాలేజీల్లో సీట్లు ఇప్పించాలని ఒత్తిడి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలిలో వివిధ సంఘాల పేరుతో వస్తున్న వ్యక్తుల పైరవీల జోరు పెరిగింది. ఏదో ఒక విద్యార్థి కార్యాచరణ కమిటీ (జేఏసీ)గా ఏర్పడటం, ఆ పేరుతో అధికారుల వద్ద తిష్ట వేయటం పరిపాటిగా మారింది. ప్రైవేటు కాలేజీలపై ఏదో ఒక ఫిర్యాదుతో వస్తున్న ఈ నేతలు చివరకు తమ వాళ్లకు సీట్లు ఇప్పించమని మండలి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ముందుగా ప్రైవేటు కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే, ఏం చేస్తున్నారంటూ అధికారులపై వీరంగం సృష్టిస్తున్నారు. వాళ్లతో కుమ్మక్కయారా? అంటూ.. పరుష పదజాలంతో ఆరోపణలు చేస్తున్నారు. దీంతో ఈ బాధంతా ఎందుకని మండలి కార్యదర్శి, వైస్ చైర్మన్లు వారిని చూసీ చూడనట్టు ఊరుకుంటున్నారు. దీంతో వారు అధికారుల చాంబర్లలోనే గంటల కొద్దీ తిష్ట వేస్తున్నారు. సంబంధం లేని వాదనలతో కాలం వృథా చేస్తున్నారు. అయితే మండలి వర్గాలను కలిసేందుకు కార్యాలయానికి వచ్చే వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు, ప్రైవేటు కాలేజీల వారు అక్కడే ఉండటంతో మాట్లాడలేని పరిస్థితి ఉంటోంది. అక్కడున్న కుర్చీల్లో జేఏసీల పేరుతో వచ్చే నాయకులే కూర్చోవడంతో, ఇతరులు నిలబడాల్సి వస్తోంది. ఇతర పనుల కోసం వచ్చే విద్యార్థులు కూడా గంటల తరబడి అధికారుల గది బయటే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి వాళ్లను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

దేశానికే ఆదర్శ నమూనా తెలంగాణ

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రపంచ దేశాలతో పనిచేసేందుకు తెలంగాణ సిద్ధం
- ఐబీసీ ఆధ్వర్యంలో 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్–2025'



గ్లోబల్ లీడర్స్ సమ్మిట్‌లో వివిధ దేశాల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శ నమూనాగా నిలుస్తున్న తెలంగాణతో కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వివిధ దేశాల ప్రతినిధులను కోరారు. అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తక్కువ సమయంలోనే అభివృద్ధిలో నిలువరించలేని స్థాయికి (అన్ స్టాపబుల్) చేరిందని అన్నారు. శుక్రవారం ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్ (ఐబీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్–2025'ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జీడీపీ రూ.16.12 లక్షల కోట్లకు చేరడంతో పాటు 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు 9.9 శాతాన్ని తెలంగాణ అధిగమించిందన్నారు. తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు కాగా దేశ సగటుతో పోలిస్తే ఇది 1.8 రెట్లు అధికమని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంలోనే తమ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగిందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో గడిచిన 14 నెలల్లో రూ. 40 వేల కోట్ల పెట్టుబడులను సాధించి రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించామన్నారు. కాగా, దేశ జీడీపీలో సేవా రంగం వాటా 55 శాతం కాగా తెలంగాణలో మాత్రం 66.3 శాతంగా నమోదైందన్నారు. విభిన్న రంగాల్లో వివిధ సంస్థల మధ్య అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పురోగతిని మరింత వేగవంతం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. వ్యవసాయ ఆవిష్కరణలు, ఏఐ ఆధారిత పాలన, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ వ్యవసాయం, భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా విద్యా వ్యవస్థ, కాలుష్య రహితంగా తయారీ రంగం, పర్యావరణ హితంగా విద్యుత్ ఉత్పాదన తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సదస్సు ద్వారా బ్రెజిల్, జర్మనీ, రష్యా, కామెరూన్, మాల్టా, యూకే, బల్గేరియా, బెల్జియం, యూఏఈ, దుబాయ్ తదితర 25 దేశాల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం శుభపరిణామమని అన్నారు. ఐబీసీ చైర్మన్ సాల్మన్ గట్టు, డైరెక్టర్ గ్లోరియా సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ద్రవ్యోల్బణం 0.55 శాతమే!

2025–మే గణాంకాలను వెల్లడించిన ఎకో ర్యాప్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం తెలంగాణలో నమోదైంది. గత 7 నెలల కాలంలో దేశంలో అతి తక్కువగా ఈ ఏడాది మే నెలలో 2.8 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. అదే సమయంలో తెలంగాణలో ద్రవ్యోల్బణం 0.55 శాతం మాత్రమే కావడం గమనార్హం. నిర్ణీత కాల వ్యవధిలో మార్కెట్‌లో వస్తువుల ధరల్లో ఏర్పడే పెరుగుదల రేటును ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఎస్‌బీఐ పరిశోధక విభాగం 'ఎకోర్యాప్' విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఆగస్టు, 2024తో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రాష్ట్రంలో ద్రవ్యోల్బణం 4.95 శాతం తగ్గింది. ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, ధాన్యాల ధరలు తగ్గడమే కారణమని నివేదికలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో అత్యధికంగా 6.46 శాతం ద్రవ్యోల్బణం ఉంది. ఈ ఏడాది మొత్తం పరిస్థితి కొనసాగుతుందని, 2026 సంవత్సరం ముగిసే నాటికి దేశంలో ద్రవ్యోల్బణం 3.5 శాతానికి మించదని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది.

దక్షిణాది రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఇలా..

రాష్ట్రం	ఆగస్టు-2024	మే-2025
ఆంధ్రప్రదేశ్	6.17	1.69
కర్ణాటక	5.96	3.19
తమిళనాడు	6.32	2.81
కేరళ	6.52	6.46
తెలంగాణ	5.50	0.55

ఒక్కో లారీకి రూ.3 వేలు

- ఆంధ్రా నుంచి కోదాడ మీదుగా ప్రతిరోజూ 16 లారీల్లో హైదరాబాద్‌కు ఇసుక తరలింపు
- దందాలో ఏపీ టీడీపీ నేతల కీలకపాత్ర... కోదాడ పోలీసులకు చిక్కిన మూడు లారీలు



కోదాడ పట్టణ పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

కోదాడ: ఆంధ్రప్రదేశ్ నుంచి కోదాడ మీదుగా హైదరాబాద్‌కు రాత్రి సమయాల్లో ఇసుకను తరలి స్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. మూడు రోజుల క్రితం కోదాడ పట్టణ పోలీసులకు మూడు ఇసుక లారీలు పట్టుబడ్డాయి. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం సీసీఎస్ పోలీసులు విచా రించారు. దీంతో ఈ దందాలో కొంతమంది పోలీసుల పాత్ర కూడా ఉన్నట్టు ఉన్నతాధికారులకు సమా చారం అందింది.

అసలేం జరుగుతుందంటే..: ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామకు చెందిన టీడీపీ నాయ కులు కొన్ని నెలలుగా ఇసుకదందా చేస్తున్నారు. వీరు తమ ఇసుక లారీలను రాత్రి సమయంలో సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం దొండపాడు మీదుగా కోదాడ బైపాస్‌కు చేరుకొని అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా హైదరా బాద్‌కు తరలిస్తున్నారు. వీరికి జిల్లాలోని కొంతమంది పోలీసులు సహకరిస్తూ, సిబ్బందిని ఎస్కార్ట్‌గా పంపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రతీ రోజు 16 లారీల్లో ఇసుక తరలిస్తున్నారని, ఒక్కో లారీకి రూ.3 వేల వరకు పోలీసులకు ముట్టజెప్పుతున్నట్టు సీసీఎస్ పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం.

అగ్రిగోల్డ్ కేసులో బాధితులకు ఊరట

- జప్తు చేసిన ఆస్తుల నుంచి రూ.611 కోట్ల విలువైన స్థిరాస్తులను అందజేయనున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాల ఆశ చూపి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల నుంచి దాదాపు రూ. 611 కోట్ల విలువైన ఆస్తులను (జప్తు చేసిన సమయంలో విలువ) బాధితులకు తిరిగి ఇచ్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.1,000 కోట్లు ఉంటుందని ఈడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఏపీ సీఐడీ అధికారులు జప్తు చేసిన అగ్రిగోల్డ్ కంపెనీల ఆస్తులను తిరిగి బాధితులకు అప్పగించేందుకు అనుమతి కోరుతూ ఈడీ అధికారులు ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 8(8)కింద హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎదుట ఈ ఏడాది మేలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు.. జప్తు చేసిన ఆస్తుల్లో వ్యవసాయ భూమి, నివాస, వాణిజ్య సముదాయాలు సహా మొత్తం 397 స్థిరాస్తులను బాధితులకు తిరిగి ఇచ్చేందుకు ఈనెల 10న అనుమతించినట్టు ఈడీ అధి కారులు తెలిపారు. కోర్టు అనుమతించిన ఆస్తులలో 380 ఆంధ్రప్రదేశ్‌లో, 13 ఆస్తులు తెలంగాణలో, కర్ణాటకలో నాలుగు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

పాత కాంట్రాక్టర్లే వెరీ 'గుడ్డు'!



అంగన్‌వాడీల్లో కోడిగుడ్ల పంపిణీ బాధ్యత వారికే అప్పగింత
జూన్ నెలాఖరు వరకు పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ
కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక తేలక... పాతవారినే కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: పాత కాంట్రాక్టర్లే అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేయనున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి రెండు నెలలు గడిచినా, కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియలో జాప్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. వేసవి సెలవుల నేపథ్యంలో మే నెలకు సంబంధించి చాలా కేంద్రాల్లో కోడిగుడ్లు సరఫరా చేయలేదు. కేంద్రాల పునఃప్రారంభం కూడా జూన్ రెండోవారంలోనే జరిగింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు పోషకాహార పంపిణీలో ఇబ్బందులు తలెత్తొద్దని భావించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ... తాజాగా పాత కాంట్రాక్టర్లకు రెండు నెలల పాటు గుడ్ల సరఫరా బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. మే నెలతోపాటు జూన్ నెలకు సంబంధించి డిమాండ్‌కు తగిన మేరకు కోడిగుడ్లు సరఫరా చేయాలని వర్క్ ఆర్డర్ జారీ చేసింది. కోడిగుడ్డు ధరను బహిరంగమార్కెట్ ధరకు సమానంగా ఉండేలా రూ.6కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

తేలని టెండర్... ఖరారు కాని కాంట్రాక్టర్

రాష్ట్రవ్యాప్తంగా 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు 4,57,643, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు చిన్నారులు 10,34,562, 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 6,67,783 ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనిదినాలకు అనుగుణంగా ఆయా లబ్ధిదారులకు కోడిగుడ్లు సరఫరా చేస్తారు. ఇందులో భాగంగా ఏటా 36,96,80,897 కోడిగుడ్లు సరఫరా చేసేలా ఆ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియ చేపట్టినా, కొంత కాలంగా వాయిదా పడుతూ వస్తోంది. టెండరు నిబంధనలు కఠినతరంగా, కొంతమందికే అనుకూలంగా ఉన్నాయంటూ పలువురు పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. కొందరు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. దీంతో మూడుసార్లు టెండర్ల ప్రక్రియ వాయిదా పడింది.

ఈ నెల 16వ తేదీ వరకు టెండరు దరఖాస్తులు సమర్పించేలా అవకాశమిచ్చారు. జూన్ 17న టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంది. కోడిగుడ్డు సరఫరాకు సంబంధించిన టెండర్ల నిబంధనలు మాత్రం ఇప్పటికీ మారకపోగా... ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉన్నాయని పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే వారంలో తెరవాల్సిన టెండర్లపైనా సందిగ్ధం నెలకొంది. ఒకవైపు పాతకాంట్రాక్టర్లకు పంపిణీ గడువును పెంచుతూ పోతున్న రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ... మరోవైపు టెండరు గడువును పొడిగిస్తుండడం పౌల్ట్రీ రైతులను తీవ్ర అయోమయానికి గురిచేస్తోంది. ఈసారైనా టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తారా? లేక గడువు తేదీని పొడిగించి చేతులు దులుపుకుంటారో చూడాలి.



సామాజిక బంధం రక్త సంబంధం

ప్రతి ఏడాదికీ ఓ థీమ్ ఉన్నట్లే ఈ ఏడాది 2025 ప్రపంచ రక్తదాతల దినోత్సవ థీమ్ ''రక్తమివ్వండీ... నమ్మకం ఇవ్వండీ'' (గివ్ బ్లడ్... గివ్ హోప్) అని. దీని అర్థం ఏమిటంటే... 'రక్తం మనందరిలోనూ ఉండే మనందరినీ కలుపుతుంది. రక్తదానం చేయడం ద్వారా సాటి మనిషి ప్రాణాలకు మనం విలువ ఇస్తున్నామనీ, ఆపదలో ఉన్నవారి ప్రాణాల్ని కాపాడటానికి మేం సంసిద్ధమనే సందేశం ద్వారా తోటివారిలో నమ్మకం పెంచాలన్నదే ఈ ఏడాది థీమ్. మనందరినీ మానవులుగా కలిపేది మన రక్తమే. బ్లడ్ డొనేషన్ ద్వారా రక్తాన్ని ఇస్తే తోటివారికి నమ్మకాన్ని ఇచ్చినట్టే... వాళ్ల ప్రాణానికి మన ప్రాణాన్ని అడ్డు వేస్తామన్న భరోసాని నింపినట్టే అన్నది ఈ ఏడాది థీమ్ ఆంతర్యం.

కాంపోనెంట్లుగా విడదీసిన రక్తంతో ప్రయోజనాలివే...

ఒక వ్యక్తి నుంచి సేకరించిన మొత్తం రక్తాన్ని అంటే హోల్ బ్లడ్‌ను ఎర్ర రక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు వంటివి... ఎవరికైనా ప్రమాదం జరిగిన వ్యక్తికి ఎక్కిస్తే... అప్పటికి అతడికి అవసరం లేని కాంపోనెంట్స్ కూడా అతడి శరీరంలోకి వెళ్లి వృథా అయిపోతాయి. అయితే బాధితులకు నిర్దిష్టంగా రక్తంలోని ఏ అంశం కావాలో దాన్నే (అదే కాంపోనెంట్‌ను) ఎక్కించే ఆధునిక పరిజ్ఞానం, సదుపాయాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు... అగ్నిప్రమాదానికి లోనైన ఒక వ్యక్తికి ప్లాస్మా ఎక్కువగా అవసరం. ఇక రక్తహీనత ఎక్కువగా ఉన్న వ్యక్తికి పూర్తి రక్తం కంటే పాకెట్ ఆర్‌బీసీ ఎక్కువగా అవసరం. అలాగే డెంగీలాంటి వ్యాధి సోకి ప్లేట్‌లెట్ల సంఖ్య బాగా తగ్గిన వారికి కేవలం ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. ఇలా... రక్తాన్ని వేర్వేరు కాంపోనెంట్లుగా విడదీయగల సామర్థ్యం ఉన్న బ్లడ్‌బ్యాంకుల్లో రక్తదానం చేస్తే అప్పుడు ఒకరి నుంచి సేకరించిన హోల్‌బ్లడ్‌ను వివిధ అవసరాలు ఉన్న వారికి ఎక్కించి ఒకరికంటే ఎక్కువమందికి ఒకే రక్తం ఉపయోగపడేలా చేయవచ్చు. అందుకే రక్తదానం చేయదలచిన దాతలు నేరుగా ఏదైనా బ్లడ్‌బ్యాంకుకు వెళ్లడం కంటే.... రక్తాన్ని వివిధ కంపోనెంట్లుగా విడదీయగల సామర్థ్యం ఉన్న బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేయడం చాలా మంచిది.

సేకరణ ఇలా...

దాతల నుంచి రక్తం సేకరణ కార్యక్రమాన్ని ఇరు రాష్ట్రాలలోని దాదాపు అన్ని ముఖ్యమైన ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ, వైద్యవిధాన పరిషత్, జిల్లా ఆసుపత్రులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ (ఐఆర్‌సీఎస్), లయన్, రోటరీ వంటి సంస్థలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలకు చెందిన బ్లడ్‌బ్యాంకులు చేస్తుంటాయి. రక్తంలోని ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ వంటి అంశాలను వేర్వేరుగా విడదీసే 'కాంపోనెంట్ సపరేషన్ యూనిట్లు' కూడా చాలానే ఉన్నాయి. అయితే ఇలా రక్తంలోని కాంపొనెంట్లను వేటికవి విడదీసే వాటికంటే మొత్తం రక్తాన్ని సేకరించే బ్లడ్‌బ్యాంకులే ఎక్కువ. కాబట్టి మనం దానం చేసిన రక్తం పలువురికి ఉపయోగపడాలనుకునేవారు 'కాంపోనెంట్ సపరేషన్ యూనిట్లు' ఉన్న రక్తనిధుల్లో రక్తదానం చేయడం మరింత మేలు చేసే అంశం. పలువురికి ఉపయోగపడే విషయం.

మానవ దేహంలో ప్రాణం నిలవడానికి అవసరమైన నిరంతర ప్రవాహమే రక్తం. మొదటి కణాలకు తాజా రక్తం అందించాక... జీవక్రియల తర్వాత మలిన వ్యర్థాలను తగిన వ్యవస్థల ద్వారా విసర్జింపజేస్తూ... మళ్లీ తాజా రక్తంలో పోషకాలూ, ఆక్సిజన్ నింపి... ఈ సైకిల్ నిరంతరం కొనసాగేలా చేస్తుండే ప్రధానమైన అంశం రక్తం. ఆ రక్తం కాసేపు అందకపోతే కీలకమైన మెదడు కణం నుంచి మామూలు దేహ కణం వరకు ఏదైనా చనిపోతుంది. ఇంతటి ఈ కీలకమైన రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదు. ప్రమాదాల్లో గాయపడ్డవారిని రక్షించేందుకు వారికి అవసరమైన రక్తాన్ని అందించి భర్తీ చేయడం అవసరం. అలా భర్తీ చేయడం కోసం దాతలు స్వచ్ఛందంగా రక్తాన్ని ఇవ్వడమూ అవసరం. ఇలా రక్తదానం ప్రాధాన్యాన్ని తెలియజెప్పడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ జూన్ 14ను ''స్వచ్ఛంద రక్తదాన దినం'గా నిర్వహిస్తుంటారు.

అపోహలు కాదు.. నమ్మకాన్ని నింపాలి...

రక్తదానం పట్ల ప్రజల్లో ఎన్నెన్నో అపోహలు ఉన్నాయి. రక్తదానం చేసే వ్యక్తులు బలహీనమైపోతారన్నది ఓ ప్రధానమైన అపోహ. ఇది ఏమాత్రం నిజం కాదు. వాస్తవానికి ఓ వ్యక్తిలో 5 నుంచి 6 లీటర్ల రక్తం ఉంటుంది. అందులో ఆరోగ్యకరమైన వ్యక్తి నుంచి కేవలం 350 మి.లీ. రక్తం మాత్రమే సేకరిస్తారు. ఇది కేవలం 21 రోజుల్లో పూర్తిగా భర్తీ అవుతుంది. అయినాగానీ ఓసారి ఓ వ్యక్తి నుంచి రక్తం సేకరిస్తే మరో మూడు నెలల పాటు అతడినుంచి రక్తం సేకరించరు. అంటే... ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి 90 రోజులకు ఓమారు రక్తదానం చేయవచ్చు. 18-60 ఏళ్ల మధ్యనున్న ఆరోగ్యకరమైన వ్యక్తులు ఎవరైనా రక్తం ఇవ్వవచ్చు. దీంతో ఎలాంటి బలహీనతా రాదు. అందుకే ఈ ఏడాది థీమ్ ప్రకారం రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ... ''రక్తమివ్వండీ... మానవతపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నింపండి''.


డాక్టర్ ఎ. గౌతమ్
మెడికల్ అండ్ హిమటో అంకాలజిస్ట్

చివరగా...

చాలా సందర్భాల్లో అవసరమైనంత రక్తం ఉండదు. అంటే రక్తానికి ఉండే డిమాండ్ కంటే సప్లై చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ఏదైనా ఒక ఆఫీసు నుంచి గానీ లేదా ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఒక కార్యాలయంలోని ఔత్సాహికులుగానీ రక్తాన్ని దానం చేయదలచుకుంటే అందరూ ఒకేసారి రక్తదానం చేయడం కంటే... దశల వారీగా రోజుకు కొంతమంది చొప్పున రక్తదానం చేస్తుండటం మంచిది. దీనివల్ల రక్త సరఫరా మరీ ఎక్కువగా కాకుండానూ, మరీ తగ్గకుండా కాన్‌స్టాంట్‌గా అందుతూ ఉంటుంది. మన వద్ద ఆసుపత్రి పడకల సామర్థ్యం (బెడ్ స్ట్రెంగ్త్) ఆధారంగా కూడా రక్తం డిమాండ్‌ను లెక్కవేస్తారు. అంటే ఒక ఆసుపత్రిలోని ఒక్కో పడకకు కనీసం 7 యూనిట్ల రక్తం అవసరమని అంచనా. అయినా ఇప్పటికి దొరుకుతున్నది కేవలం 75 శాతమే. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కేసుల్లో 70% మరణాలు కేవలం రక్తం అందకపోవడం వల్లనే సంభవిస్తున్నాయి. అందుకే ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులు, మంచి పేరున్న స్వచ్ఛంద సంస్థలకు చెందిన రక్తనిధులకు, అందునా రక్తాన్ని వేర్వేరు కాంపోనెంట్లుగా విడదీయగల సామర్థ్యం ఉన్న రక్తనిధి కేంద్రాలకు (బ్లడ్‌బ్యాంకులకు) రక్తదానం చేయాలన్నది నిపుణులు ఇస్తున్న పిలుపు.

– యాసీన్

అందుకే ఆనందబాష్పాలు



కళ్లవెంబడి కారే నీరంతా దుఃఖంతో వచ్చే కన్నీరు కాకపోవచ్చు. ఒక్కోసారి మనం పట్టరాని సంతోషానికి లోనైనప్పుడు మన కళ్ల నుంచి నీళ్లు వాటంతటవే ఉబికి వస్తుంటాయి. ముఖ్యంగా భావోద్వేగపూరితమైన కొన్ని సందర్భాల్లో నవ్వు, ఏడుపు ఒకేసారి వస్తుంటాయి. తద్వారా మనిషిలో ఉన్న ఒత్తిడి పూర్తిగా తొలగిపోతుంది. వీటినే ఆనంద బాష్పాలంటారు. ఈ ఆనంద బాష్పాల వెనుక ఉన్న శాస్త్రీయపరమైన కారణాలేంటో తెలుసుకుందాం.

కొన్ని అధ్యయనాల ప్రకారం ఆనంద బాష్పాలకు రెండు కారణాలున్నాయి. మొదటి కారణం.. మనం స్వేచ్ఛగా నవ్వినప్పుడు.. అది మన మెదడులోని లాక్రిమల్ గ్రంథులపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా కళ్ల నుంచి నీళ్లు బయటకు వస్తాయి. రెండో కారణం ఏమిటంటే.. భావోద్వేగపూరిత సందర్భంలో నవ్వినప్పుడు.. అది ముఖంలోని కణాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అప్పుడు కళ్ల నుంచి నీళ్లు బయటకొస్తాయి. ఒక రకంగా మన శరీరం కన్నీళ్ల ద్వారా ఒత్తిడిని సమతుల్యం చేయడానికి ప్రయత్నిస్తుంది.

వాస్తవానికి ఈ మొత్తం ప్రక్రియ ఒక్కొక్కరిలో భిన్నంగా ఉంటుంది. కొంతమంది త్వరగా ఉద్విగ్నతకు లోనవుతారు. అలాంటివారిలో ఆనందబాష్పాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. స్త్రీలు పురుషుల కంటే ఎక్కువ భావోద్వేగానికి గురవుతారని చెబుతారు.

బాల్టిమోర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌కి చెందిన మనస్తత్వవేత్త రాబర్ట్ ప్రొవిన్ ప్రకారం మనిషి భావోద్వేగానికి గురికావడంలో హార్మోన్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. నిరంతరం నవ్వడం లేదా ఏడవడం వల్ల మెదడు కణాలపై చాలా ఒత్తిడి ఉంటుంది. అప్పుడు కార్టిసాల్, అడ్రినలిన్ అనే హార్మోన్లు శరీరంలో విడుదలవుతాయని. మీరు నవ్వినప్పుడు లేదా ఏడ్చినప్పుడు అందుకు వ్యతిరేకంగా జరిగే ప్రతిచర్యకు ఈ హార్మోన్లే కారణమని తెలిపారు. మొత్తం మీద రకరకాల భావోద్వేగాలతో మెదడు ఒకవిధమైన గందరగోళానికి గురైనప్పుడే ఈ విధంగా ఆనంద బాష్పాలు వస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

ఇలా లేపండి...



ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పెద్దపని. ఇంత కంటే వాళ్లను నిద్రలేపడం అతి పెద్ద టాస్క్. ఎంత లేపినా అస్సలు లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను సులభంగా లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

● **సమస్యను అర్థం చేసుకోవాలి:** ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బది పడుతున్నారేమో తెలుసుకోవాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా? అసలు నిద్రపట్టలేదా? ఇంకేదైనా సమస్య ఉంటే డాక్టర్‌ని సంప్రదించాలి. ● **సరిపోయిందా లేదా?** స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి. ● **ప్రేమతో లేపాలి:** ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్రలేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమగా చెప్పాలి. ● **ఇష్టమైన ఫుడ్:** పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరా నిద్రలేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

సాక్షి సినిమా

రెండు గంటలు... ఏడు ప్రాజెక్ట్‌లు!


● అమితాబ్ బచ్చన్

ఎనిమిది పదుల వయసులో ఎంతో చురుకుగా సినిమాలు, వాణిజ్య ప్రకటనలు, టీవీ షోలు చేస్తూ బిజీ బిజీగా ఉంటున్నారు అమితాబ్ బచ్చన్. వేగంగా పని చేయడం తనకు ఇష్టం అంటున్నారు ఈ బిగ్ బి. అందుకు ఉదాహరణగా ఇటీవల తాను రెండు గంటల్లో ఏడు ప్రాజెక్ట్‌లు (ఐదు వాణిజ్య ప్రకటనలు, రెండు ఫొటోషూట్‌లు) చేసిన విషయం గురించి చెప్పారు. ''ఈ మధ్య నేను రెండు గంటల్లో ఏడు ప్రాజెక్ట్‌లు చేయడంతో నా డైరెక్టర్ ఫ్రెండ్ ఒకరు 'ఇలా పని చేయడం సరి కాదు. ఒక్క రోజులో పూర్తి చేయాల్సిన పనిని నువ్వు రెండు గంటల్లో పూర్తి చేస్తే ఎలా? నువ్వు పని విధానాన్ని పాడు చేస్తున్నావు. ఇలా చేస్తే క్లైంట్‌లు ఒకే రోజులో ఎక్కువ ప్రాజెక్ట్‌లు చేయమంటారు. అది కరెక్ట్ కాదు' అని చమత్కారంగా అన్నాడు. ఆ మాటలు నాకు చాలా ఆనందాన్నిచ్చాయి. నాకు ఇలా స్పీడ్‌గా పని చేయడం ఇష్టం'' అని పేర్కొన్నారు అమితాబ్ బచ్చన్.

లీక్ కంటెంట్ షేర్ చేస్తే కఠిన చర్యలు
– 'ది రాజా సాబ్' యూనిట్


● ప్రభాస్

''ది రాజా సాబ్' సినిమా లీక్ కంటెంట్‌ను ఎవరైనా షేర్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం'' అని చిత్రయూనిట్ హెచ్చరించింది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ చిత్రం టీజర్‌ని ఈ నెల 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఎవరో టీజర్‌ని లీక్ చేశారట. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో చిత్రబృందం స్పందించి, 'ఎక్స్' వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ''ది రాజా సాబ్' సినిమా కంటెంట్‌కు సంబంధించిన అనధికారక వీడియోలు, ఫొటోలు షేర్ చేసినా, ఎవరి సోషల్ మీడియాలోనైనా కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటాం. అలానే వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే సస్పెండ్ చేయిస్తాం. ప్రేక్షకులకు చక్కని సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు ఎంతో కష్టపడుతున్నాం... అందరూ మాకు సహకరిస్తారని అనుకుంటున్నాం'' అని పోస్ట్ చేశారు. ఇక పీరియాడికల్ హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న 'ది రాజా సాబ్' తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ ఏడాది ఏప్రిల్ 10న విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్ ఖరారు కాలేదు. సంజయ్ దత్, బ్రహ్మానందం, 'వెన్నెల' కిశోర్, రాజీవ్ కనకాల ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: కార్తీక్ పళని.

శక్తిమాన్?


● అల్లు అర్జున్

'పుష్ప: ది రైజ్' (2021), 'పుష్ప 2: ది రూల్' (2024) సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ఈ చిత్రం తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తారనుకున్నారంతా. అయితే తమిళ దర్శకుడు అట్లీ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లారు. 'ఏఏ 22 అండ్ ఏ 6' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ ఫిక్స్ అయ్యారు. ఇదిలా ఉంటే... ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అనే చర్చ ఇండస్ట్రీలో నడుస్తోంది. లోకేశ్ కనగరాజ్, సందీప్ రెడ్డి వంగా.. ఇలా పలు పేర్లు ప్రచారంలో ఉండగానే తాజాగా మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్ పేరు వినిపిస్తోంది. 'మిన్నల్ మురళి' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు జోసెఫ్. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ చిత్రం రూపొందనుందనే వార్తలు వైరల్‌గా మారాయి. పైగా ఈ సినిమాలో అల్లు అర్జున్ శక్తిమాన్‌గా కనిపించనున్నారని టాక్. 'అల్లు అర్జున్ ఇప్పటికే ఒక సినిమాను ఖరారు చేశారు. ఆ ప్రకటన రాగానే అందరూ ఆశ్చర్యపోతారు' అంటూ ఆయన స్నేహితుడు, నిర్మాత బన్నీ వాసు ఇటీవల పేర్కొన్నారు. అయితే, అది ఏ సినిమా అనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వనప్పటికీ బాసిల్ జోసెఫ్ సినిమానే అని సమాచారం. మరి... ఈ వార్తలపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడక తప్పదు.

రామాయణ్‌లో?


రకుల్ ప్రీత్ సింగ్

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ భలే చాన్స్ అందుకున్నారట. బాలీవుడ్‌లో తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ్'లో నటించే అవకాశం ఆమెని వరించిందని టాక్. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. రావణుడి పాత్రను 'కేజీఎఫ్' చిత్రాల ఫేమ్, కన్నడ స్టార్ హీరో యశ్ పోషిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో రావణుడి సోదరి శూర్పనఖ పాత్ర కోసం చిత్రయూనిట్ తొలుత హీరోయిన్ ప్రియాంకా చోప్రాను సంప్రదించిందట. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్‌తో పాటు తెలుగులో మహేశ్ బాబు 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వంటి సినిమాలతో ప్రియాంక ఫుల్ బిజీగా ఉండటంతో 'రామాయణ్'లో నటించేందుకు వీలు కాదని సున్నితంగా తిరస్కరించారని బాలీవుడ్ టాక్. దీంతో శూర్పనఖ పాత్ర కోసం రకుల్ ప్రీత్ సింగ్‌ని సంప్రదించినట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులో భాగం కావడంతో పాటు కథ, తన పాత్ర నచ్చడంతో ఆమె నటించేందుకు పచ్చ జెండా ఊపారట. త్వరలోనే రకుల్‌కి లుక్ టెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారట. ఇదిలా ఉంటే... 'రామాయణ్'లో హనుమంతుడిగా సన్నీ డియోల్, కైకేయిగా లారా దత్తా, శివుడిగా మోహిత్ రైనా, లక్ష్మణుడిగా రవి దూబే, దశరథుడిగా అరుణ్ గోవిల్ కనిపించనున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానున్నాయి. ఈ చిత్రానికి యశ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండటం విశేషం.

అజిత్‌కి జోడీగా...


శ్రీనిధి శెట్టి

స్టార్ హీరో అజిత్‌కి జోడీగా శ్రీనిధీ శెట్టి నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. యశ్ హీరోగా రూపొందిన కన్నడ చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 1'తో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రీనిధీ శెట్టి. ఆ సినిమా పాన్ ఇండియా హిట్ కావడంతో ఈ బ్యూటీకి ఫుల్ క్రేజ్ నెలకొంది. ఆ తర్వాత ఆమె నటించిన 'కేజీఎఫ్: చాప్టర్ 2', తమిళ చిత్రం 'కోబ్రా' మంచి విజయాలు సాధించాయి. నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది థర్డ్ కేస్' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు శ్రీనిధి. ఈ చిత్రంలో తనదైన నటన, యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకున్నారామె. ప్రస్తుతం తెలుగులో సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా 'తెలుసు కదా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే... అజిత్ కుమార్‌తో నటించే క్రేజీ చాన్స్‌ను శ్రీనిధి అందుకున్నట్లు టాక్. అజిత్ నటిస్తున్న 64వ సినిమాలో ఆమెను కథానాయికగా ఎంపిక చేశారని సమాచారం. అజిత్‌తో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమా తెరకెక్కించిన అధిక్ రవిచంద్రన్ 'ఏకే 64' (వర్కింగ్ టైటిల్)కి దర్శకత్వం వహిస్తారని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ నవంబరులో ఆరంభం అవుతుందట. 2026 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి... అజిత్‌కి జోడీగా శ్రీనిధి నటిస్తారా? లేదా అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

చూస్తే ఒకటే నిజం!


● రఘు కుంచె

సంగీతదర్శకుడు-గాయకుడు-నటుడు రఘు కుంచె టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'గేదెల రాజు'... కాకినాడ తాలూకా'. మోటూరి టాకీస్ పతాకంపై రఘు కుంచె సమర్పణలో వాణీ రవికుమార్ మోటూరి నిర్మించారు. చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. 'చూస్తే ఒకటే నిజం... చూడకపోతే వంద అనుమానాలు' అనే పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించామని చిత్రబృందం పేర్కొంది. శుక్రవారం (జూన్ 13) రఘు కుంచె జన్మదినం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. రవి ఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మౌనిక తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె.

సాక్షి బిజినెస్

శనివారం
14-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 573	81,119
నిఫ్టీ ▽ 170	24,719

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,532	▽	130
డోజోన్స్	42,385	▽	583
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,851	▽	60
డాక్స్	23,516	▽	255
షాంఘై	3,377	▽	26
నికాయ్	37,834	▽	339

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.75	86.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.70	117.67
€	యూరో	ఎస్‌బీఐ	98.11	100.84
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.26	60.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.80	57.02
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.81	69.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.06	23.57
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.55	23.33
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93



ఎటాక్!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడితో ప్రపంచ మార్కెట్లలో కలకలం...

- స్టాక్ సూచీలకు 'చమురు' సెగలు
- సెన్సెక్స్ నష్టం 573 పాయింట్లు
- 24,750 స్థాయి దిగువకు నిఫ్టీ
- 59 పైసలు కరిగిన రూపాయి

ముంబై: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడితో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు దేశీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ శుక్రవారం 573 పాయింట్లు పతనమై 81,119 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 170 పాయింట్లు కోల్పోయి 24,719 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభమైన క్షణాల్లోనే 1,337 పాయింట్లు క్షీణించి 80,355 వద్ద, నిఫ్టీ 415 పాయింట్లు కుప్పకూలి 24,473 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే దిగువ స్థాయిలో కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. ఆసియా యూరప్ దేశాల స్టాక్ సూచీలు 1%–1.5% నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు 1.5% నష్టాలతో ట్రేడవుతున్నాయి.

- ఫార్మా, రియల్టీ షేర్లకు మాత్రమే స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో సర్వీసెస్ 2.06%, బ్యాంకెక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, విద్యుత్ 1.01 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం నష్టపోయాయి.
- భారత్‌కు ఎక్కువగా దిగుమతయ్యే బ్రెంట్ క్రూడాయిల్ ధరల అనూహ్య ర్యాలీతో దేశీయంగా చమురు ఆధారిత రంగాలైన ఆయిల్ మార్కెటింగ్, ఏవియేషన్, పెయింట్స్, అడెషివ్స్, టైర్స్ కంపెనీల షేర్లు డీలా పడ్డాయి. బీపీసీఎల్ 2%, ఐఓసీ 1.78%, హెచ్‌పీసీఎల్ 1.41% షేర్లు నష్టపోయాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ 4%, స్పైస్‌జెట్ 2% పతనమయ్యాయి. ట్రేడింగ్‌లో 6% కుప్పకూలాయి. ఇండిగో పెయింట్స్ 3%, బెర్జర్ పెయింట్స్ 0.59%, ఏషియన్ పెయింట్స్ 0.14% నష్టపోయాయి. సియట్ 1.35%, అపోలో టైర్స్ 1.13 శాతం పతనమయ్యాయి.
- ఆటోమోటివ్ టెక్నాలజీ సంస్థ సోనా కమ్‌స్టర్ కంపెనీ చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ జే కపూర్(53) అకాల మరణంతో కంపెనీ షేరు షేరు 2% నష్టపోయి రూ.502 వద్ద స్థిరపడింది. లండన్‌లో జూన్ 12న సంజయ్ గుండెపోటుతో ప్రాణాలు విడిచినట్లు కంపెనీ తెలిపింది.

రూ. 8.35 లక్షల కోట్లు ఆవిరి...

స్టాక్ మార్కెట్ వరుస పతనంతో రెండురోజుల్లో రూ.8.35 లక్షల కోట్లు హరించుకుపోయాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ రూ.447 లక్షల కోట్లు (5.19 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది. గడిచిన 2 రోజుల్లో సెన్సెక్స్ 1,396 పాయింట్లు నష్టపోయింది.

ఏలూరులో వేగ జ్యువెలర్స్ షోరూం

ప్రారంభించిన సినీ నటుడు బాలకృష్ణ



హైదరాబాద్: వేగ జ్యువెలర్స్ ఏలూరు పట్టణంలో సినీ నటుడు బాలకృష్ణ చేతుల మీదుగా తమ 5వ నూతన షోరూం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. లక్ష రూపాయల కొనుగోలుపై ఉచితంగా బంగారు నాణెం పొందవచ్చు. పాత బంగారం మార్పిడిపై ప్రతి గ్రాముకు రూ.100 అదనంగా చెల్లిస్తుంది. ఒక క్యారెట్ డైమండ్ ధర రూ.51,999లకే అందిస్తుంది. లక్కీ డ్రా ద్వారా అయిదుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌లు బహుమతిగా అందిస్తుంది. జూన్ 30 వరకు అందుబాటులో ఉండే ఆఫర్లు కేవలం ఏలూరు షోరూం వరకే వర్తిస్తాయి. ''ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటికే కాకినాడలో షోరూం తెరిచాము. ఇప్పుడు వేగ బ్రాండ్ అంబాసిడర్ బాలకృష్ణ చేతుల మీదుగా ఏలూరులో ప్రారంభించడం సంతోషంగా ఉంది'' అని కంపెనీ చైర్మన్ బండ్ల మూడి రామ్మోహన్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీ నటి సంయుక్త మీనన్, కంపెనీ ఎండీ వనమా నవీన్ కుమార్, డైరెక్టర్లు వనమా సుధాకర్, చంద్రకాంత్, చిట్లూరు నాగేశ్వరావు పాల్గొన్నారు.

పెరిగిన క్రూడ్ ధరలతో కరిగిన రూపాయి

క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 59 పైసలు బలహీనపడి 86.11 వద్ద స్థిరపడింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడితో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా



అమెరికా కరెన్సీ డాలర్ బలపడటం కూడా మన కరెన్సీ ఒత్తిడికి లోనైంది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో గురువారం ముగింపు(85.52)తో పోలిస్తే ఏకంగా 73 పైసల బలహీనతతో 86.25 వద్ద మొదలైంది. దేశీయ మేద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి దిగిరావడం.., ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి కాస్త రికవరీ అయ్యింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ @ రూ. 3,600 కోట్లు	మళ్లీ కొలువుల కళకళ!

బంగారం భగభగ.. చమురు సలసల!

మళ్లీ రూ. లక్ష పైకి జంప్

- 10 గ్రాములకు 2,200 ర్యాలీ
- రూ.1,01,540 స్థాయి నమోదు
- జీవితకాల గరిష్టానికి వెండి ధరలు
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఆజ్యం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు, పసిడి ధరలు భగ్గుమన్నాయి. ముఖ్యంగా పసిడి మరో సరికొత్త రికార్డు దిశగా పరుగులు తీసింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులతో బంగారం ధర భారీగా పెరిగింది. శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో ఒక దశలో 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,200 పెరిగి రూ.1,01,540 స్థాయిని తాకింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర సైతం రూ.1,900 పెరిగి రూ.1,00,700



స్థాయిని నమోదు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న నమోదైన పసిడి ధర (99.9 శాతం స్వచ్ఛత) రూ.1,01,600 ఇప్పటివరకు దేశీ మార్కెట్లో ఆల్ టైమ్ గరిష్ట స్థాయిగా కొనసాగుతోంది. దీని ప్రకారం సరికొత్త రికార్డుకు చేరువైనట్టు తెలుస్తోంది. అయితే అమ్మకాల ఒత్తిడితో ఢిల్లీ మార్కెట్లో పసిడి ధరలు ఆ తర్వాత కొంత దిగొచ్చాయి. మరోవైపు వెండి సైతం కిలోకి రూ.1,100 పెరగడంతో సరికొత్త జీవిత కాల గరిష్ట స్థాయి రూ.1,08,100కు చేరుకుంది. ఎంసీఎక్స్ మార్కెట్లో ఆగస్ట్ డెలివరీ కాంట్రాక్టు పసిడి ధర రూ.2,011 పెరిగి రూ.1,00,403కు చేరుకుంది. ''బంగారం ధరలు రూ.లక్ష మార్క్‌ను దాటి కొత్త గరిష్టాన్ని తాకాయి. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ బంగారం ధర 3,440 డాలర్లను అధిగమించింది. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనం వైపు మొగ్గుచూపించారు'' అని మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కళంత్రి తెలిపారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులు మధ్య ప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చన్న అంచనాలు ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురి చేసినట్టు చెప్పారు.

ముడిచమురు మంటలు

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ఒక దశలో 13 శాతం పెరిగి 78 డాలర్లకు చేరింది. 2022 మార్చి తర్వాత ఒకే రోజు చమురు ధరలు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. నాడు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చమురు ధరలకు ఆజ్యం పోశాయి. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అత్యున్నత నేత ఖమేనీ చేసిన ప్రకటన ఆందోళనలను మరింత పెంచింది. ఆ తర్వాత కొంత తగ్గి 74.32



డాలర్ల స్థాయికి బ్రెంట్ క్రూడ్ ధరలు దిగొచ్చాయి. బెంచ్‌మార్క్ యూఎస్ క్రూడ్ సైతం 7%కి పైగా పెరిగి 73 డాలర్లకు చేరింది.

ధరలు మరింత పెరగొచ్చు..

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు విస్తృతమైతే ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్లు చేరుకోవచ్చని జేపీ మోర్గాన్ హెచ్చరించింది. మోర్గాన్ స్టాన్లీ అయితే 130 డాలర్ల వరకు పెరగొచ్చని అంచనా వేసింది. చమురు ఉత్పత్తిలో ఇరాన్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంటే, మధ్యప్రాచ్యంలో సౌదీ అరేబియా తర్వాత రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉండడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్

'స్వర్ణ' సురుచి

ప్రపంచకప్‌లో మూడోసారి పసిడి పతకం గెలిచిన భారత యువ షూటర్



మ్యూనిక్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) మూడో ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టుకు తొలి స్వర్ణ పతకం లభించింది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 19 ఏళ్ల సురుచి సింగ్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ సీజన్‌లో సురుచి పోటీపడ్డ మూడు ప్రపంచకప్ టోర్నీల్లోనూ బంగారు పతకాలు గెలవడం విశేషం. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురుచి 241.9 పాయింట్లు స్కోరు చేసి విజేతగా అవతరించింది. కామిలీ జెద్రెజెవ్స్కీ (ఫ్రాన్స్; 241.7 పాయింట్లు) రజతం నెగ్గగా... కియాన్‌జున్ యావో (చైనా; 221.7 పాయింట్లు) కాంస్య పతకాన్ని సంపాదించింది. ఈ ఏడాది జాతీయ సీనియర్ జట్టులోకి వచ్చిన సురుచి ఏప్రిల్‌లో బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన తొలి ప్రపంచకప్ టోర్నీలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లోనే పెరూ రాజధాని లిమాలో జరిగిన రెండో ప్రపంచకప్ టోర్నీలో సురుచి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో బంగారు పతకాలు గెలిచింది.

స్వదేశానికి హెడ్ కోచ్ గంభీర్



బెకెన్‌హామ్: భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇంగ్లండ్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు. తల్లి సీమా అనారోగ్యానికి గురవడంతో... గంభీర్ హుటాహుటిన భారత్‌కు బయలుదేరాడు. 'గంభీర్ తల్లికి గుండెనొప్పి వచ్చింది. ప్రస్తుతం ఆమె ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో ఐసీయూలో ఉంది. అందుకే గంభీర్ కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి స్వదేశానికి వెళ్లాడు' అని బీసీసీఐ అధికారి వెల్లడించారు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఈ నెల 20 నుంచి ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... దానికి ముందు భారత 'ఎ' జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడింది. ఆ సమయంలోనే ఇంగ్లండ్ చేరుకున్న గంభీర్... భారత్ 'ఎ'కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్ల ప్రదర్శనను దగ్గరి నుంచి పరిశీలించాడు. గంభీర్ గైర్హాజరీలో... సహాయక కోచ్ డస్కటే ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను పర్యవేక్షిస్తున్నాడు. తల్లి ఆరోగ్యం కుదుటపడిన వెంటనే గంభీర్ తిరిగి ఇంగ్లండ్ బయలుదేరనున్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు	సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



మార్క్‌రమ్ సెంచరీ అభివాదం

బవుమా క్యాచ్ పట్టి ఉంటే...

భారీ భాగస్వామ్యానికి ముందు ఒకే ఒక్క సారి ఆసీస్‌కు మరింత పట్టు బిగించే అవకాశం వచ్చింది. 2 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బవుమాకు లైఫ్ లభించింది. స్టార్క్ ఓవర్లో బవుమా ఆడిన షాట్‌కు బంతి మొదటి స్లిప్‌లోకి దూసుకెళ్లగా క్యాచ్ అందుకోవడంలో స్మిత్ విఫలమయ్యాడు. అయితే నిజానికి అది అంత సులువైన క్యాచ్ కాదు. ఈ టెస్టులో చాలా బంతులు బ్యాట్‌కు తగిలాక స్లిప్ కార్డాన్‌కు కాస్త ముందే పడుతుండటంతో స్మిత్ సాహసం చేస్తూ సాధారణంగా నిలబడే చోటుకంటే కాస్త ముందు వచ్చి నిలబడ్డాడు. ముందు జాగ్రత్తగా హెల్మెట్ కూడా పెట్టుకున్నాడు. ఊహించినట్లుగానే బంతి చాలా వేగంగా దూసుకొచ్చింది. మరీ దగ్గర కావడం వల్ల స్పందించే సమయం కూడా లేకపోయింది. దాంతో స్మిత్ కుడి చేతి వేలికి బంతి బలంగా తగిలి కింద పడిపోయింది. నొప్పితో విలవిల్లాడిన అతను వెంటనే మైదానం వీడాడు. అనంతరం స్కానింగ్‌లో వేలు విరిగినట్లు తేలింది!

విజయం దిశగా దక్షిణాఫ్రికా

మరో 69 పరుగుల దూరంలో డబ్ల్యూటీసీ టైటిల్

మార్క్‌రమ్ సెంచరీ • రాణించిన బవుమా • ఆస్ట్రేలియా బౌలర్ల సమష్టి వైఫల్యం

ఐసీసీ టోర్నీల్లో తమ రాత మార్చుకునేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమైంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో మూడో రోజు అసాధారణ ఆటతో టైటిల్‌కు చేరువైంది. 282 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఎక్కడా తడబడని సఫారీ టీమ్ గెలుపుపై గురి పెట్టింది. పేలవ ప్రదర్శనతో ఆసీస్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేయగా... మార్క్‌రమ్ సెంచరీతో చెలరేగాడు. మరోవైపు కండరాల నొప్పితో బాధపడుతూ కూడా బ్యాటింగ్ కొనసాగించిన కెప్టెన్ తెంబా బవుమా అండగా నిలిచాడు. చేతిలో 8 వికెట్లతో శనివారం మరో 69 పరుగులు సాధిస్తే 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ దక్షిణాఫ్రికా ఖాతాలో చేరుతుంది.

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో విజేతగా నిలిచే దిశగా దక్షిణాఫ్రికా అడుగులు వేస్తోంది. లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లో సఫారీ టీమ్ డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై మూడో రోజు సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 282 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 56 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించింది. మార్క్‌రమ్ (159 బంతుల్లో 102 బ్యాటింగ్; 11 ఫోర్లు) శతకం బాదగా... కెప్టెన్ తెంబా బవుమా (121 బంతుల్లో 65 బ్యాటింగ్; 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు ఇప్పటికే అభేద్యంగా 143 పరుగులు జోడించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 144/8తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌటైంది. స్టార్క్ (136 బంతుల్లో 58 నాటౌట్; 5 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించాడు.

చివరి వికెట్‌కు 59 పరుగులు...

మూడో రోజు ఆట ఆరంభంలోనే లయన్ (2)ను రబాడ అవుట్ చేయడంతో ఆసీస్ 9వ వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సమయం పట్టదని పించింది. అయితే స్టార్క్ పట్టుదలగా పోరాడాడు. అతనికి హాజల్‌వుడ్ (53 బంతుల్లో 17; 2 ఫోర్లు) అండగా నిలవడంతో ఆలౌట్ చేసేందుకు సఫారీ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కొన్ని చక్కటి షాట్లు ఆడిన స్టార్క్ 131 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో ఆసీస్ స్కోరు కూడా 200 దాటింది. ఎట్టకేలకు మార్క్‌రమ్ బౌలింగ్‌లో హాజల్‌వుడ్ వెనుదిరగడంతో దక్షిణాఫ్రికా ఊపిరి పీల్చుకుంది. స్టార్క్, హాజల్‌వుడ్ 22.3 ఓవర్ల పాటు ఆడి చివరి వికెట్‌కు 59 పరుగులు జోడించడం విశేషం.

శతక భాగస్వామ్యం...

తొలి ఇన్నింగ్స్‌కు భిన్నంగా దక్షిణాఫ్రికా ఆరంభం నుంచే ధాటిగా ఆడింది. 10 ఓవర్లలోనే 47 పరుగులు చేసిన జట్టు రికెల్టన్ (6) కోల్పోయింది. మార్క్‌రమ్, ముల్డర్ (27; 5 ఫోర్లు) ఓవర్‌కు 4 పరుగుల రన్‌రేట్‌తో ధాటిని కొనసాగించారు. లబుషేన్ చక్కటి క్యాచ్‌తో ముల్డర్ వెనుదిరగడంతో



హాజల్‌వుడ్, స్టార్క్

ఈ భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆస్ట్రేలియా ఆనందం ఇక్కడికే పరిమితమైంది. మార్క్‌రమ్, బవుమా కలిసి సమర్థంగా ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈ క్రమంలో 69 బంతుల్లోనే మార్క్‌రమ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తీవ్రంగా ఎండ కాయడంతో పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిపోయింది. దాంతో ఆసీస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. కొద్ది సేపటికి బవుమా 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆట ముగియడానికి కొద్దిసేపు ముందు మార్క్‌రమ్ 156 బంతుల్లో సెంచరీతో సగర్వంగా నిలిచాడు.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (బ్యాటింగ్) 102; రికెల్టన్ (సి) కేరీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (బ్యాటింగ్) 65; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (56 ఓవర్లలో 2 వికెట్లకు) 213.** **వికెట్ల పతనం:** 1–9, 2–70. **బౌలింగ్:** స్టార్క్ 9–0–53–2, హాజల్‌వుడ్ 13–0–43–0, కమిన్స్ 10–0–36–0, లయన్ 18–3–51–0, వెబ్‌స్టర్ 4–0–11–0, హెడ్ 2–0–8–0.

మరణం..
మరో ఆరంభమా?

- చనిపోయి మళ్లీ బతికిన వ్యక్తులు చెప్పింది ఇదే
- కొలరాడోలో చనిపోయిన 8 నిమిషాల తర్వాత కళ్లు తెరిచిన మహిళ
- స్పెయిన్‌లో మరణించిన 24 నిమిషాల తర్వాత లేచి కూర్చున్న మరో అతివ
- గతంలోనూ పలుచోట్ల ఇలాంటి ఘటనలు
- చనిపోయాక మరో ప్రపంచం ఉందంటూ తమ అనుభవాలు పంచుకున్న వైనం
- దేహం నుంచి ప్రాణం వీడిపోవడంపై పరిశోధనల్లో పలు ఆసక్తికర అంశాలు



మరణం అంటే..? జీవి భౌతిక పయనానికి ముగింపు. క్లుప్తంగా చెప్పాలంటే దేహం నుంచి ప్రాణం పోవడం. మరి మరణించిన తర్వాత ఆ ప్రాణం ఏమవుతుంది? చనిపోయిన వ్యక్తి ఆత్మ గాలిలో కలిసిపోయే సమయంలో ఏం జరుగుతుంది? దేహాన్ని వీడిన ఆత్మ ఎక్కడకు పయనమవుతుంది? అనే ప్రశ్నలకు జవాబులు.. చనిపోయిన వ్యక్తి మాత్రమే చెప్పగలుగుతాడు. కానీ అది అసాధ్యం కదా? లేదా చనిపోయి మళ్లీ బతికి వచ్చిన వ్యక్తి చెప్పే అవకాశం ఉంటుంది. ఇది కూడా సాధ్యం కాదంటారా? కానీ అమెరికాలో ఓ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. 33 ఏళ్ల మహిళ చనిపోయిన 8 నిమిషాల తర్వాత మళ్లీ కళ్లు తెరిచింది. ఆమె పేరు బ్రియన్నా లాఫర్టీ. ఉండేది అమెరికాలోని కొలరాడోలో. మ్యోక్లోనస్ డిస్టోనియా అనే ప్రాణాంతకమైన నరాల సంబంధిత వ్యాధితో ఆమె బాధపడుతోంది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. వైద్యులు కూడా ఆమె చనిపోయిందని నిర్ధారించారు. ఇక్కడే ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆమె చనిపోయిందని వైద్యులు ప్రకటించిన ఎనిమిది నిమిషాల తర్వాత బ్రియన్నా ఊపిరి తీసుకోవడం ప్రారంభించింది. ఆగిపోయిన గుండె మళ్లీ కొట్టుకోవడం మొదలైంది. ఆ తర్వాత ఆ 8 నిమిషాల్లో ఏం జరిగిందో ఆమె తన అనుభవాన్ని పంచుకుంది.



నువ్వు రెడీయా..?

'నేను అకస్మాత్తుగా నా భౌతిక శరీరం నుంచి విడిపోయి పైకి వెళ్లడం తెలిసింది. నన్ను నేను చూసుకోలేకపోతున్నా. కానీ అక్కడ ఏం జరుగుతుందో అన్నీ స్పష్టంగా తెలుస్తున్నాయి. కింద నా శరీరం ఉంది. కానీ నేను అందులో లేను. నువ్వు రెడీయా అంటూ ఎవరో అడిగినట్టు వినిపించింది. ఆ తర్వాత అంతా చీకటి'అని బ్రియన్నా తన అనుభవం గురించి వివరించారు. మరణం అనేది ఓ భ్రమ మాత్రమే. ఎందుకంటే మన ఆత్మకు చావు లేదు కదా? నా ఆత్మ పైకి వెళ్తున్న సమయంలో నాకు ఎలాంటి నొప్పి, బాధ, ఆందోళన లేవు. ఎంతో తేలికగా, చాలా ప్రశాంతంగా ఉంది. కొద్దిసేపటికి అంతా చీకటిమయం అయిపోయింది. తర్వాత ఏం జరిగిందో తెలియదు. మళ్లీ నేను బతికాను. మరణం తర్వాత మరేదో ఉంది. అదేమిటో నాకు అర్థం కాలేదు'అని పేర్కొన్నారు.




24 నిమిషాల తర్వాత కళ్లు తెరిచి..

చచ్చి బతికిన ఉదంతం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. స్పెయిన్‌కు చెందిన టిస్సా రొమారో అనే 50 ఏళ్ల మహిళ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఆమె తన కూతురితో కలిసి స్కూల్‌కు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి చనిపోయారు. అయితే, ఆశ్చర్యకరంగా 24 నిమిషాల తర్వాత మళ్లీ బతికారు. ఆ 24 నిమిషాల్లో ఏం జరిగిందో ఓ పుస్తకం కూడా రాశారు. 'నేను చనిపోయిన తర్వాత చాలా ప్రశాంతంగా అనిపించింది. నా మీద ఎన్నో ఏళ్ల నుంచి పెట్టిన పెద్ద బరువు తీసేసినట్టు హాయిగా అనిపించింది. నా శరీరం నుంచి నేను విడిపోయి గాలిలో తేలుతూ పైకి వెళుతున్నట్టు తెలిసింది. కింద అన్ని దృశ్యాలూ కనిపిస్తున్నాయి. అక్కడ నా శరీరం అచేతనంగా పడి ఉంది. నేను సజీవంగానే ఉన్నా అనుకోవడం వల్ల నా శరీరాన్ని చూసి గందరగోళానికి గురయ్యా. నేను అక్కడే ఉన్నా కానీ నన్ను ఎవరూ చూడట్లేదు.. నేను చనిపోయిన తర్వాత ఎలాంటి నొప్పి లేదు. సమయం కూడా తెలియలేదు. ఓ ప్రశాంతమైన ప్రపంచంలోకి ప్రవేశించినట్టుగా అనిపించింది'అని ఆమె వివరించారు. మరణం అనేది ముగింపు కాదని, ఓ కొత్త ప్రపంచానికి ఆరంభం అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా తాము చావును చూసి వచ్చామని చెప్పినవారి అనుభవాలు కూడా ఇంచుమించు ఇలానే ఉన్నాయి. అందరూ తాము చనిపోయిన తర్వాత ఓ సొరంగం నుంచి వెళుతున్నట్టు అనిపించిందని, అక్కడ తెల్లని కాంతి పుంజాలు కనిపించాయని పేర్కొన్నారు. వీళ్లు చెప్పిన విషయాలు నిజమా, అబద్ధమా అనేది పక్కనపెడితే, పలు పరిశోధనలు మరణంపై ఆసక్తికర విషయాలు వెల్లడించాయి.

సైన్స్ ఏం చెబుతోంది?

మనిషి చనిపోయిన తర్వాత ప్రాణం ఏమవుతుందనే అంశంపై శాస్త్రవేత్తలు కొన్నేళ్లుగా పరిశోధనలు జరుపుతూనే ఉన్నారు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ స్టువర్ట్ హేమరాఫ్ దీనిపై ఓ పరిశోధన నిర్వహించారు. తీవ్ర అనారోగ్యానికి గురై వెంటిలేటర్‌పై ఉన్న ఏడుగురు రోగులకు ఎలక్ట్రో ఎన్‌సెఫోలాగ్రామ్ (ఈఈజీ) అనే పరికరం అమర్చారు. మెదడులో జరిగే చర్యలను ఇది నమోదు చేస్తుంది. అనంతరం వారి వెంటిలేటర్ తీసివేయగా.. తొలుత గుండె కొట్టుకోవడం ఆగిపోయింది, తర్వాత రక్తప్రసరణ పూర్తిగా నిలిచిపోయింది. అదే సమయంలో వారి మెదడులో ఒక విధమైన శక్తి తరంగాలు తీవ్రస్థాయిలో ఉద్భవించడం గుర్తించారు. గామా సింక్రొనీ అనే ఈ చర్య మనిషి స్పృహలో ఉన్నప్పుడు, ఆలోచిస్తున్నప్పుడు జరుగుతుందని.. కానీ ఇక్కడ ఆ రోగులు చనిపోయిన తర్వాత జరిగిందని, 30 సెకన్ల నుంచి 90 సెకన్ల వరకు అది కొనసాగి అంతర్ధానమైందని డాక్టర్ స్టువర్ట్ వివరించారు. బహుశా ప్రాణం దేహాన్ని వీడిపోవడం ఇదే అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇక కెనడాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాల్గరీకి చెందిన పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో.. ఈ సృష్టిలో ప్రతి జీవి బతికి ఉన్నప్పుడు ఓ అంతుచిక్కని వెలుతురు కలిగి ఉంటుందని.. మరణించిన తర్వాత ఆ వెలుగు అదృశ్యమవుతోందని గుర్తించారు. దీనిని వైజ్ఞానిక భాషలో అల్ట్రావీక్ ఫొటాన్ ఎమిషన్ (యూపీఈ) అని అంటారని వివరించారు.

\- సాక్షి సెంట్రల్ డెస్క్



సమగ్ర నివేదిక ఇవ్వండి

వరంగల్ కలెక్టర్ సత్యశారదను ఆదేశించిన మహిళా, శిశు సంక్షేమశాఖ!

సాక్షి ఎఫెక్ట్

సాక్షి , వరంగల్: 'దత్తతలో నకిలీ సర్టిఫికెట్ల దందా'శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ అంశంపై సమగ్ర విచా రణ చేసి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ కార్యాలయం వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదను ఆదేశించినట్టు తెలిసింది. తక్కువ వయసున్న పిల్లలను పొందడానికి ఎక్కువ వయసున్న దంపతుల వయసు తక్కువగా చూపించేందుకు వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి నకిలీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు సృష్టించిన వైనంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సీరియస్‌గా ఉంది. దీనిపై క్షేత్రస్థాయిలో నివేదిక తెప్పించుకుంటోంది. ఇటు పోలీసులు, అటు విద్యాశాఖ అధికారులు కూడా రంగంలోకి దిగా రు. నకిలీ సర్టిఫికెట్ల దందాపై పోలీసులు నర్సంపేటలోని శ్రీ అరుణోదయ విద్యాలయం, పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ నిర్వాహకులను ప్రశ్నించినట్టు తెలిసింది. ఏకశిల హైస్కూల్, అరుణోదయ విద్యాలయం లేకపోవడంతో అవి నకిలీవని నిర్ధారణకు వచ్చిన పోలీసులు..జిల్లా సంక్షేమ విభాగం కిందకు వచ్చే బాలల సంరక్షణ విభాగాధికారులను కూడా ప్రశ్నించేందుకు సిద్ధమైనట్టు సమాచా రం. ఒకటిరెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకొని బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునే దిశగా ఉన్నతాధికారులు ముందుకెళుతున్నారు.



చూడగానే ఎర్ర సముద్రం అనుకునేరు.. మామూలు సముద్రమే. వందలాది డాల్ఫిన్లను వధించడంతో వాటి రక్తంతో నీరు ఇలా ఎర్రబారింది. ఫేరో ద్వీప సమూహంలో వేసవికాలం మొదలైనప్పుడు సాగే క్రతువు ఇది. ఇది వారి వెయ్యేళ్ల సంప్రదాయమట. డాల్ఫిన్లను తమ పడవలు, వలలతో చుట్టుముట్టి.. తీరం వైపు తీసుకొస్తారు. తర్వాత మత్స్యకారులు వాటిని చంపుతారు. మాంసంతో విందు చేసుకుంటారు. ఇది దారుణమని.. ఇప్పటికైనా సంప్రదాయం పేరిట ఈ సామూహిక వధను ఆపాలని వన్యప్రాణి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

కిలిమంజారోపై నిర్మల్ సాహసి

ఆపరేషన్ సిందూర్ పతాక ప్రదర్శన.. బడిని మరువని చార్టర్డ్ అకౌంటెంట్



నిర్మల్: అతడి వృత్తి చార్టర్డ్ అకౌంటెంట్. ప్రవృత్తి సాహస యాత్రలు. అతడే నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సీఏ ముక్క సాయిప్రసాద్. ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన పర్వతాలను అధిరోహించటమే లక్ష్యంగా పెట్టుకున్న ఆయన తాజాగా ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం, టాంజానియాలోని కిలిమంజారోను అధిరోహించారు. సాయిప్రసాద్ 2023లో ఎవరెస్ట్ శిఖరాన్ని కూడా అధిరోహించారు. కిలిమంజారో పర్వతం సముద్ర మట్టానికి 5,895 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ నెల 11న సాయిప్రసాద్ ఆ శిఖరాన్ని అధిరోహించారు. శిఖరంపై భారత త్రివిధ దళాల చిహ్నాలతో కూడిన 'ఆపరేషన్ సిందూర్'పతాకాన్ని ప్రదర్శించారు. తాను చదువుకున్న కరీంనగర్‌లోని పారమిత స్కూల్ పతాకాన్ని కూడా ప్రదర్శించారు.



ఆ బడిలో.. ఒకే ఒక్కడు

కేసముద్రం: రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాలలు పండుగ వాతావరణంలో పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. కాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెద్దమోరితండా జీపీ శివారు కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో రెండ్రోజులుగా హెచ్‌ఎం వీరభద్రం మాత్రమే హాజరవుతున్నారు. విద్యార్థులు లేకపోవడంతో రోజంతా ఖాళీగా కూర్చుని వెళ్తున్నారు. గత విద్యాసంవత్సరం ఇద్దరు విద్యార్థులు చదివారు. ప్రస్తుతం వారు పాఠశాలకు రావడం లేదు. దీంతో హెచ్‌ఎం ఒక్కరే ఉదయం పాఠశాలకు వచ్చి సాయంత్రం కాగానే వెళ్తున్నారు.

విమానం కూలిపోలేదు కావాలనే కూల్చేశారు!!



మీరు విన్నది నిజమే.. ఈ విమానం కూలిపోలేదు.. కూల్చేశారు. ఎందుకో తెలుసా? విమానంలో ఏ సీట్లు సేఫ్ అన్న విషయాన్ని తెలుసుకోవడం కోసం..

అయితే, ఇది జరిగింది ఇప్పుడు కాదు.. 2012లో.. ఆ విమానం కూడా బోయింగ్ కంపెనీదే..

తాజా విమాన ప్రమాదంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ 11ఏ సీటులో కూర్చున్న రమేశ్ మృత్యుంజయుడిలా తిరిగొచ్చిన నేపథ్యంలో 2012లో ఏం జరిగిందన్న విషయం మీ కోసం..

మెక్సికోలోని సొనొరన్ ఎడారి.. విమానాలు కూలిపోయినప్పుడు ఏ సీట్లు సేఫ్ అన్న విషయాన్ని తెలుసుకోవడం కోసం ఓ ప్రయోగాన్ని చేయాలని శాస్త్రవేత్తలు అనుకున్నారు. దీన్ని డాక్యుమెంటరీగా తీయడానికి ముందుకొచ్చిన చానెల్ 4, డ్రాగన్ ఫ్లై అనే టెలివిజన్ ప్రొడక్షన్ కంపెనీ.. అప్పట్లోనే దీని కోసం రూ. 13 కోట్లు ఖర్చుపెట్టాయి. విమానంలో కెమెరాలు, సెన్సర్లు అమర్చారు. ప్రమాద సమయంలో మనుషుల్లో ఏయే ఎముకలు విరిగే చాన్సుందో తెలుసుకోవడానికి మన ఎముకల నిర్మాణం ఎలా ఉంటుందో అలాంటివే కలిగిన డమ్మీ బొమ్మలను ఉంచారు. వాటిని మూడు రకాల పొజిషన్లలో కూర్చోబెట్టారు. ఒకటి.. సీటు బెల్ట్ పెట్టుకుని, బ్రేస్ పొజిషన్(క్రాష్ ల్యాండింగ్ టైంలో ఇదే సురక్షితమైన పొజిషన్)లో, రెండు.. బెల్ట్ పెట్టి.. మామూలుగా కూర్చోబెట్టారు. మూడు.. బెల్ట్ లేకుండా.. బ్రేస్ పొజిషన్‌లో కాకుండా మామూలుగా కూర్చో బెట్టారు. ఆ బోయింగ్ 727 విమానాన్ని 2,500 అడుగుల ఎత్తుకు తీసుకెళ్లాక.. పైలట్ పారాచూట్ ద్వారా బయటకు దూకేశాడు. తర్వాత ఆ విమానాన్ని వెనుక చిన్నపాటి విమానంలో వస్తున్న పైలట్ రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపి, కూల్చేశాడు.



విమానంలోని డమ్మీ బొమ్మలు..

బిజినెస్ క్లాస్.. భద్రత పెరగదు..

బిజినెస్ క్లాస్‌కు రేటెక్కువ చెల్లించినంత మాత్రాన.. దానికి తగ్గట్టు భద్రత పెరగదని ఈ పరిశోధనలో తేలింది. విమానం కూలితే.. మిగిలినవారితో పోలిస్తే.. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌కు దగ్గర్లో ఉండే.. ఎకానమీ క్లాసులోని వారే బతికే అవకాశాలు ఎక్కువని నిర్ధారణ అయింది. ఇందులో తొలి 11 వరుసల సీట్లు పూర్తిగా చిన్నాభిన్నమైపోయాయి. ఈ సీట్లలో ఎవరూ బతికే అవకాశం లేదని తేల్చారు. వెనుక ఉన్న సీట్లలో 75% మంది (విమానం పేలిపోలేదు గనుక) బతికే అవకాశముందని శాస్త్రవేత్తలు చెప్పారు. కూలినప్పుడు ఎయిర్‌క్రాఫ్ట్ బాడీ ఎంత తీవ్రతను తట్టుకోగలదు అన్న విషయాన్నితెలుసుకోవడానికి కూడా ఈ ప్రయోగం ఉపయోగ పడిందని తెలిపారు. అప్పటి 727బ్లాక్ బాక్స్ సమాచారాన్ని విశ్లేషించిన అన్నే ఇవాన్స్.. అప్పటితో పోలిస్తే.. ఇప్పటి విమానాల్లో భద్రత బాగా పెరిగిందని చెప్పారు. అయితే.. తనను విమానంలో సీటు ఎంచుకోమన్నా.. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌కు దగ్గర్లో ఉన్న వరుసల్లోని సీటునే ఎంచుకుంటానని చెప్పారు. 2012 కన్నా ముందు.. ఇలాంటి పరీక్షనే 1984లో బోయింగ్ 720 విమానంతో నాసా నిర్వహించింది.

\- సాక్షి, సెంట్రల్ డెస్క్

సీసీఎల్‌గా లోకేశ్‌కుమార్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా ఐఏఎస్ అధికారి లోకేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన సీనియర్ అధికారి నవీన్ మిత్తల్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. కాగా, నూతన సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్‌ను తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తహసీల్దార్ల సంఘం నేతలు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, రమేశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం సీపీఆర్వోగా నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గుర్రం మల్సూర్

మూడేళ్లలో 22,622 కేసుల పరిష్కారం

- జస్టిస్ సురేందర్ సేవలను కొనియాడిన ఏసీజే
- ఘనంగా వీడ్కోలు పలికిన హైకోర్టు ఫుల్‌బెంచ్



జస్టిస్ సురేందర్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తిగా మూడేళ్లలో 22,622 కేసులను పరిష్కరించారని జస్టిస్ కె.సురేందర్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ కొనియాడారు. క్రిమినల్ వివాదాల పరిష్కారంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. బదిలీపై మద్రాస్ హైకోర్టుకు వెళుతున్న జస్టిస్ సురేందర్‌కు హైకోర్టు ఫుల్‌బెంచ్ శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఆయన ఎదిగిన తీరును ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ వివరించారు. ముందుగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రిమినల్ చట్టాలపై పట్టున్న జస్టిస్ సురేందర్.. సత్యం స్కామ్ లాంటి కేసులతో పాటు దిల్‌సుఖ్‌నగర్, లుంబినీ పార్కు, గోకుల్‌చాట్ పేలుళ్ల కేసులో వాదనలు వినిపించి, నిందితులకు శిక్షలు పడటంలో కీలక పాత్ర పోషించారన్నారు. న్యాయమూర్తిగా 641 రోజుల్లో 22,622 ప్రధాన కేసులతో పాటు 18,700 మధ్యంతర అప్లికేషన్లను పరిష్కరించారని చెప్పారు. జస్టిస్ సురేందర్ మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైనా గుండె సమస్య కారణంగా వెళ్లలేకపోయానన్నారు. అనంతరం న్యాయవాద వృత్తి వైపు పయనించినట్టు చెప్పారు. న్యాయమూర్తిగా నిష్పక్షపాతంగా పనిచేశారని.. గది మారొచ్చు కానీ, మద్రాస్‌లోనూ ఇదే ఉత్సాహంతో పనిచేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులతోపాటు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీ ఏఏ) అధ్యక్షుడు జగన్, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బందితోపాటు జస్టిస్ సురేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టులో విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ కె.సురేందర్‌ను మద్రాస్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఏప్రిల్‌లో సిఫార్సు చేయగా, కేంద్రం ఆమోదం తెలిపిన విషయం విదితమే.

నకిలీ వైద్యులతో జరభద్రం

ప్రజలకు మెడికల్ కౌన్సిల్ సూచన

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యా అర్హతలు లేకుండా డాక్టర్లుగా పనిచేస్తున్న నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో అనర్హులైన 15 మందిపై కేసులు నమోదు చేశామని కౌన్సిల్ ప్రజా సంబంధాల కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ తనిఖీలు డాక్టర్లు ఆనంద్, కిరణ్ కుమార్, రాజీవ్ నాయక్, అరుంధతి, సన్నీ డేవిస్, శిరీష్, శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించామని ఆయన వెల్లడించారు. తగిన వైద్య అర్హతలేమీ లేకుండానే ఆస్పత్రులు, క్లినిక్‌లు నడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నకిలీ వైద్యుల సమాచారం పోలీస్ స్టేషన్లో లేదా మెడికల్ కౌన్సిల్ వాట్సాప్ నంబర్ 9154382727కు తెలియజేయవచ్చన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



దోమకొండ కోట



మూడు సంస్థానాలు.. 46 జాగీర్లు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒకప్పటి పాలన తీరు

ఇప్పటికీ ఆకట్టుకుంటున్న దోమకొండ, సిర్నాపల్లి, కౌలాస్ కోటలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా చరిత్ర పుటల్లో అనేక పేజీలు లిఖించుకుంది. కాకతీయుల పాలన తరువాత కూడా ఇందూరు సీమలో పలువురు సంస్థానాధీశులు, జాగీర్‌దార్లు తమదైన ముద్ర వేశారు. ఇందులో కీలకమైన దోమకొండ సంస్థానం, సిర్నాపల్లి సంస్థానానికి చెందిన కోటలు ఆకట్టుకుంటున్నాయి. కౌలాస్ కోటను మాత్రం సందర్శకులు వచ్చేలా అభివృద్ధి చేయకపోవడం గమనార్హం.

దోమకొండ సంస్థానం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని దోమకొండ సంస్థానం మూలస్థానం భిక్కనూరు. ఈ సంస్థానం కేంద్రం కొంతకాలం రామారెడ్డి, కామారెడ్డిల్లో ఉండేది. చివరకు దోమకొండ కేంద్రంగా స్థిరపడింది. ఈ సంస్థానాధీశులు మొదట కుతుబ్‌షాహీలు, తరువాత అసఫ్‌జాహీలకు సామంతులుగా ఉన్నారు. కామినేని వంశస్థుడైన కామినేడు దీనికి మూలపురుషుడు. కామిరెడ్డి, కామినేని చౌదరిగా పేరుపొందాడు. కామిరెడ్డి కుమారుడు కాచారెడ్డి, కాచారెడ్డి కుమారుడు రాజన్న చౌదరి, రాజన్నచౌదరి కుమారుడు రాజేశ్వరరావు, ఈయన కుమారుడు పెద్ద రాజేశ్వరరావు, తరువాత రాజేశ్వరరావు సోదరుడు అన్నారెడ్డి, అన్నారెడ్డి తరువాత ఇతని కుమారుడు ఉమాపతిరావు, తరువాత ఇతని కుమారులు రామచంద్రరావు, సోమేశ్వరరావు, తరువాత సోమేశ్వరరావు కుమారుడు రెండో ఉమాపతిరావు, తరువాత ఇతని కుమారుడు రాజేశ్వరరావు, అనంతరం ఈయన కుమారుడు రాజా సోమేశ్వరరావు పాలించారు. 300 ఏళ్ల పాటు అవిచ్ఛిన్నంగా దోమకొండ సంస్థనాధీశులు పాలన చేశారు.

కౌలాస్ సంస్థానం..

కాకతీయుల తరువాత కొద్దికాలం పాటు ఈ ప్రాంతం విజయనగర రాజుల పాలనలో ఉండేది. కుతుబ్‌షాహీల తరువాత, అసఫ్‌జాహీల పాలనలో ఉండేది. అయితే రాజస్తాన్ రాజపుత్ర వంశానికి చెందిన గోపాల్‌సింగ్ గౌర్ దక్కనుకు వచ్చి నిజాం సైన్యంలో అధిపతిగా చేరాడు. మహారాష్ట్ర సైన్యంతో వీరోచిత పోరాటం చేయడంతో ఇతనికి నిజాం కౌలాస్ కోటను అప్పగించాడు. ఇతని తరువాత రాజా పదంసింగ్ గౌర్, రాజాకున్వర్ నరేందర్‌సింగ్ గౌర్, రాజాకున్వర్ నైన్‌సింగ్ గౌర్, రాజాకున్వర్ దీప్‌సింగ్ గౌర్ పాలించారు. రాజాకున్వర్ దీప్‌సింగ్ గౌర్ ద్వారా అనేక పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. తరువాత దుర్జన్‌సింగ్, జగత్‌సింగ్, శివసదన్ సింగ్ పాలించారు. శివసదన్‌సింగ్ ఆరుగురు కుమారుల్లో ఒకరైన అజిత్‌కుమార్ సింగ్ భారత సైన్యంలో కల్నల్‌గా పనిచేసి, తరువాత మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎన్‌సీసీ అధికారిగా అనేకమంది అధికారులను తీర్చిదిద్దారు.



కౌలాస్ కోట

భూమి ధారాదత్తం

రాజుల సేవలో పాలు పంచుకున్నందుకు, యుద్ధాలలో పాల్గొన్నందుకు, ఆపద సమయాల్లో ఆదుకున్నందుకు, ఇతర కారణాలతో, రాజులు కొందరికి అధిక మొత్తంలో భూమిని ధారాదత్తం చేశారు. అలా ఎక్కువ మొత్తంలో భూమి పొందిన వారు సంస్థానాధీశులు, జాగీర్‌దార్లు, జమీన్‌దారులు, మాఖుదార్లు, మునసబ్‌దార్లుగా పిలవబడ్డారు. సంస్థానాలు అంటే చాలా మొత్తంలో ఎక్కువ గ్రామాలు ఏలుబడి కలిగిన అధికారం అని, సంస్థానాధీశులు అంటే ఆ ప్రాంతానికి అధికారులని అర్థం. నిజామాబాద్ జిల్లాలో దోమకొండ, సిర్నాపల్లి, కౌలాస్ సంస్థానాలతో పాటు 46 జాగీరులు ఉండేవి.

సిర్నాపల్లి సంస్థానం..



సిర్నాపల్లి కోట

ఇందూరు జిల్లాలో సిర్నాపల్లి సంస్థానం ప్రత్యేకమైనది. దీని సంస్థానాధీశుడు చెన్నారెడ్డి. తరువాత ఆయన కుమారుడు రఘుపతిరెడ్డి, చెన్నారెడ్డి, రాంరెడ్డి, రఘునాథరెడ్డి, చెన్నారెడ్డి, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి వరుసగా వంశ పారంపర్యంగా పాలించారు. చెన్నారెడ్డి మరణంతో ఆయన భార్య రాణి ఉషమ్మ 1203లో అధికారం చేపట్టింది. ఆమె తరువాత రాజారామ్ పాలించారు. తరువాత రాజారామ్ మరణంతో ఆయన భార్య జానకీబాయి సంస్థానాధీశురాలయ్యారు. తరువాత ఈమె కుమారుడు రఘుపతిరెడ్డి, తరువాత ఆయన కుమారుడు ప్రతాపరెడ్డి పాలించారు. 1294లో ప్రతాపరెడ్డి మరణంతో ఆయన భార్య శీలం జానకీబాయి బాధ్యతలు చేపట్టింది. శీలం జానకీబాయి ఆధ్వర్యంలో అనేక చెరువులు తవ్వించారు. చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించారు. ఇప్పటికీ ఈమె తవ్వించిన చెరువులు నీటితో నిండి సాగుకు ఉపయోగపడుతున్నాయి. నిజామాబాద్ నగరంలో గంజ్ స్తంభాన్ని నిర్మించారు. జానకీబాయి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. జానకీబాయికి సంతానం లేకపోవడంతో తన సోదరుడి కుమారుడు రఘుపతిరెడ్డిని దత్తత తీసుకుని రాణి మంగమ్మతో వివాహం జరిపించగా.. రెండేళ్లకే రఘుపతిరెడ్డి మరణించాడు. దీంతో రాణి మంగమ్మ శీలం రామలింగారెడ్డిని దత్తత తీసుకున్నారు. జానకీబాయి మరణానంతరం రామలింగారెడ్డి అధికారం చేపట్టి, వనపర్తి సంస్థానాధీశుడైన రెండో రాజారామేశ్వరరావు కుమార్తె జానకమ్మను వివాహం చేసుకున్నాడు. తరువాత రామలింగారెడ్డి కుమారుడు రాంభూపాల్ సంస్థానాధీశుడయ్యాడు. నిజాం రాజ్యం పతనమయ్యాక రాంభూపాల్ ఐఏఎస్ ఉత్తీర్ణుడై కలెక్టరుగా పనిచేశాడు. రాంభూపాల్ ఇద్దరు కుమారులు ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడ్డారు. కుమార్తె అనురాధరెడ్డి మాత్రం చరిత్ర పరిశోధన, సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నారు.

జాగీర్లు, జాగీర్‌దార్ల వివరాలు

జాగీరు	జాగీర్‌దారు పేరు
కోటగిరి	నవాబ్ సుల్తాన్ ముల్క్ బహదూర్
గాంధారి	ముక్‌ముద్‌దావులా
బినోల	ఫకరుల్‌ముల్క్
కలిగోట్	రుకునుల్‌ముల్క్
బోర్గాం	మన్సర్ అలీషా
యంచ	పార్వతీబాయి
సుద్దుల	హైదరీబేగం
నాళేశ్వరం	ఎకరామొద్దీన్ ఖాన్
గోపన్‌పల్లి	ఉమాబాయి
తొర్తి	సయ్యద్ షా మహ్మద్‌గౌస్
భీమ్‌గల్	దావర్ అలీఖాన్
రామన్నపేట	బసరత్ అలీఖాన్
మోర్తాడ్	రామేశ్వర్‌రెడ్డి
పడకల్	అక్బరలీఖాన్
రేకులపల్లి	రాయిహీరిలాల్
బాలకొండ	ముకరబ్ జంగ్
సిరికొండ	ముషీర్‌జంగ్
ఖుద్వాన్‌పూర్	తుర్బాజంగ్
పల్లికొండ	మోహన్‌జంగ్
ముచ్కూర్	హజమద్‌జంగ్
నడ్కుడ	రాజాశివరాజ్
కామారెడ్డి	వెంకటరాజుబాయి
ఎర్రపహాడ్	దావుర్‌హుసేన్‌ఖాన్
తాడ్వాయి	మేకమ్‌జంగ్
అన్నారం	రాజాఅలీఖాన్
సదాశివనగర్	రాజుబాయి
నిజాంపేట	అబ్దుల్ బజ్బార్
చిల్లర్గి	సైఫ్ నవాజ్‌జంగ్
రెంజల్	రాజాబన్సీలాల్
బ్రాహ్మణపల్లి	మోతీలాల్
ఎరాజ్‌పల్లి	ఫైజుద్దీన్ ఖాన్
తాడ్‌బిలోలి	సయ్యద్ మహ్మద్ రజ్వీ
కుల్‌దుర్కి	మహ్మద్ గౌస్‌ఖాన్
హంగిర్గా	అబ్బాస్ అలీఖాన్
కందకుర్తి	బకరత్ ఖాన్
హున్సా	హసన్‌నవాజ్‌జంగ్
మిర్జాపూర్	మహ్మద్ అలీఖాన్
వాజీద్‌నగర్	సయ్యద్ అలీరాజా
చందూర్	గులాం అహ్మద్‌ఖాన్
కుర్నాపల్లి	సఫ్దర్ యార్‌ఖాన్
నీలా	సర్ఫ్ ఫరోజ్ ఖాన్
తోడ్కోల్	బిచోల్ ఖాన్
సాలూరా	విక్రోద్దీన్ ఖాన్
జలాల్‌పూర్	అహ్మదలీఖాన్
రెంజల్	రాజా శివరాజ్
సంగం	రాజేశ్వరరావు



దోమకొండ కోట



కౌలాస్ కోట



విద్యా రంగం నాశనమైంది బీఆర్‌ఎస్ హయాంలోనే

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: ఆరునెలల సావాసం వారిని వీరిని చేస్తుంది అన్నట్టుగా కేటీఆర్ వెంట తిరుగుతున్న గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ కూడా అబద్ధాలు నేర్చుకున్నారని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎద్దేవా చేశారు. ఐపీఎస్ అధికారి హోదాలో గురుకులాలకు 8 ఏళ్ల పాటు కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఆ రంగాన్ని ఏం ఉద్ధరించారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో విద్యావ్యవస్థ నాశనమైందని బీఆర్‌ఎస్ నాయకుడిగా ప్రవీణ్‌కుమార్ చెప్తున్న మాటల్లో వాస్తవం లేదని, అసలు విద్యారంగం నాశనమైంది బీఆర్‌ఎస్ హయాంలోనేనని చెప్పారు. శుక్రవారం సీఎల్పీలో సత్యం విలేకరులతో మాట్లాడారు. గురుకులాలకు ఏళ్ల తరబడి అద్దెలు పెండింగ్‌లో పెట్టినప్పుడు అప్పటి సీఎం కేసీఆర్‌ను ప్రవీణ్ ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోయినా ప్రవీణ్ మాట్లాడలే దన్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిపైనా రాజకీయ కక్ష సాధించాల్సిన అవసరం లేదని, ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సిందేనన్నారు.



జస్టిస్ సురేందర్ వీడ్కోలు సందర్భంగా సాయంత్రం హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికను అందజేస్తున్న రిజిస్ట్రార్ జనరల్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో రిజిస్ట్రార్లు డి.రవీంద్రశర్మ, సూర శ్రీనివాస్‌రెడ్డి, జె.జీవన్‌కుమార్, జి.ప్రవీణ్‌కుమార్, టి.వెంటేశ్వరరావు, బీఎస్ చిరంజీవి, పీ.శ్రీధర్‌రావు తదితరులు

‘ముసురు’కున్న పేర్లు

వర్ష తీవ్రతను బట్టి పేర్లు !

ముసురు వాన నుంచి కుండపోత దాకా..

చూరునీళ్ల వాన నుంచి బట్టతడుపు వాన దాకా..

మట్టి మనిషికి... వర్షానికి అనుబంధం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ‘వానల మన్నువడ కొట్టింది లేదు. పోయింది లేదు. మూడు దినాల సంది ముసురు పెట్టింది. ఏం పని చేసుకోనియ్యది’.. అంటూ ముసురు పెట్టినపుడు వ్యాఖ్యానిస్తుంటారు. ఆ వానను ‘ముసురు’వానగా పేర్కొంటారు. గడప దాటి బయటకు వెళ్లిన వ్యక్తి ఇంట్లోకి వస్తూనే ‘ఇదేం వానో ఏమో. కొట్టింది కాదు. ఉత్తిగ బట్టలు తడిసినయి’.. అంటూ బట్టతడుపు వానను గురించి మాట్లాడతాడు. చిన్నగా దుబురు పడుతుంటే.. దుబ్బురు వాన పడుతుందని అంటారు. చినుకులు పడి వాకిలి సాన్పు జల్లినట్టు కనబడంగనే సాన్పు వాన.. అంటుంటారు. ఇంటి పైకప్పు పెంకుల చూరు నుంచి ధార కారుతుంటే సూరునీళ్ల వాన.. అని పిలుస్తారు. భారీ వర్షం కురుస్తుంటే కుండపోత వాన.. అని, కొద్దిగా కురిసే వానను ముంతపోత వాన.. అని అంటుంటారు. ఒక్కోసారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తూనే వడగళ్లు పడుతుంటాయి. దాన్ని రాళ్ల వాన అని చెబుతారు. భీకరమైన గాలితో కూడిన వాన కురుస్తుంటే బొయ్యగొట్టే వాన.. అంటారు. ఒక్క ఊర్లోనే ఒక దగ్గర కురిసి, ఇంకో దిక్కు కురవకుంటే కప్పదాటు వాన.. అంటుంటారు. రాత్రంతా భారీ వర్షం కురిసి.. తెల్లారేసరికి ఏం లేనట్టు ఉంటే దాన్ని దొంగవాన.. అంటుంటారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసి రోడ్ల వెంట ఉండే గుంతలు నిండితే.. కోపులు నిండే వాన అంటారు. సాయంత్రం కాగానే వర్షం కురుస్తుంటే మాపుసారి వాన.. అంటారు. జోరుగా వాన దంచి కొడుతుంటే గాంధారి వాన.. అని, జోరువాన.. అని కూడా అంటారు. ఒక్కొక్కసారి ఒక మేఘం వర్షించిపోగానే తెప్పవాన.. అంటుంటారు.

వర్షం–వ్యవసాయం..

వ్యవసాయమే జీవనాధారంగా బతికే గ్రామీణ ప్రాంతాల్లో వానాకాలం సీజన్ ఆరంభం కాగానే.. ప్రతీ కుటుంబం వర్షం కోసం ఎదురు చూస్తుంది. వర్షం కురిస్తే దుక్కులు దున్నొచ్చని, విత్తనం వేయొచ్చని ఆశగా ఆకాశానికేసి చూస్తుంటారు. వేసవి సీజన్ ముగిసిన తరువాత పడే తొలకరితోనే వ్యవసాయ పనులు మొదలవుతాయి. వర్షపు చినుకులు కురిసినపుడు వెదజల్లే మట్టి పరిమళాలను ఎంతగానో ఆస్వాదిస్తారు. పొద్దున లేస్తే పొలం పనుల్లో మునిగిపోయే మట్టి మనిషికి.. వర్షానికి ఎంతో అనుబంధం ఉంటుందనే చెప్పాలి. వర్షం కురిసిందంటే మోములో ఆనందం వెల్లివిరుస్తుంది. అదే ఉత్సాహంతో ఏరువాక మొదలుపెడతాడు. ఏదేమైనా వర్షం కురిస్తేనే సేద్యం.. లేకుంటే దుర్భిక్షం అన్నది మాత్రం నిజం.

రేవంత్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు: గజ్జెల కాంతం



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కావని.. మరోమారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్ ఇంటిని ముట్టడిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హెచ్చరించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడాలనుకుంటే ఈపాటికే కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితలు చర్లపల్లి జైల్లో ఉండేవారన్నారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా విచారణకు రావాల్సిందేనని, కాళేశ్వరం, ఫార్ములా రేసుల్లో అవినీతి జరిగింది కాబట్టే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు విచారణకు రావాలని చెప్పారు.

‘ఆదిత్యపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం’

సాక్షి, హైదరాబాద్: హుస్నాబాద్‌లో ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై జరిగిన హత్యాయత్నాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఓ యువ నాయకుడిపై కత్తులతో దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వ్యాఖ్యానించారు. ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని, ఇవి భవిష్యత్ తెలంగాణకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ దాడి వెనుక ఉన్న గూండాలను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని ప్రేమేందర్ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

హాజీల తిరుగు ప్రయాణం

సాక్షి, అమరావతి: హజ్–2025 యాత్రకు వెళ్లిన హాజీలు ఆధ్యాత్మిక యాత్రను విజయవంతంగా ముగించుకొని తిరుగు ప్రయాణమైనట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి వెళ్లిన 1,618 హజ్ యాత్రికుల్లో తొలివిడతగా శుక్రవారం 49 మంది హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారని తెలిపారు. హజ్ యాత్రలో భాగంగా పవిత్ర మక్కా, మీనా, అరఫాత్, ముజ్దలిఫా, మదీనా ప్రాంతాల్లో వీరు పర్యటించారు.

నిబంధనల పేరుతో 'తల్లికి వందనం'లో కోతలు వద్దు

ప్రభుత్వానికి సీపీఎం సూచన

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో టీడీపీ కూటమి వాగ్దానం చేసినట్టుగా «తల్లికి వందనం» నగదును అర్హులైన వారందరి ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నిబంధనల పేరుతో పథకంలో కోతలు వద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. షరతులు పెట్టి లబ్ధిదారులతో పాటు నగదును కూడా తగ్గించడం సరికాదన్నారు.

టీచర్ల శిక్షణ తరగతులు వాయిదా వేయండి: వైఎస్సార్‌టీఏ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను వాయిదా వేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వి.రెడ్డి శేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునే ప్రక్రియ సాగుతోందని, ఈ విధుల్లో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారన్నారు. ఇలాంటి సమయంలో ప్రధానోపాధ్యాయులకు నెలాఖరు దాకా లీడర్‌షిప్ శిక్షణ పేరుతో పాఠశాలకు దూరం చేయడం సరికాదన్నారు. ఇలాచేస్తే పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పడిపోతాయని తెలిపారు. అందువల్ల శిక్షణ తరగతులను జూలై చివరి వారంలో నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు రూ.62.92 కోట్లు

సాక్షి, అమరావతి: విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ (డీఆర్ఎఫ్ఎస్) ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.62.92 కోట్లు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ మేరకు కేటాయింపులు చేస్తూ హోం శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

248 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు పదోన్నతి

రాష్ట్రంలో 248 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు హోం శాఖ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది.

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

సీతారామపురం: నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం రంగనాయుడుపల్లి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన నవరం చిన్నలక్ష్మయ్య (35) ఆర్థిక సమస్యలతో శుక్రవారం మద్యంలో పురుగు మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మయ్యకు భార్య, ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో లక్ష్మయ్య తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఇంటిముందు పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యాంకింగ్ మోసాలు @ రూ.36,014 కోట్లు

మూడు రెట్లు పెరిగిన విలువ
2024-25పై ఆర్‌బీఐ నివేదిక
ప్రభుత్వ రంగ బ్యాంకులకే అధిక నష్టం

సాక్షి, అమరావతి: రుణ ఖాతాలు, డిజిటల్ పేమెంట్లకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ నేరాల విలువ 2023–24తో పోల్చిచూస్తే మూడు రెట్లు పెరిగింది. ఈ మోసాల విలువ రూ.12,230 కోట్ల నుంచి రూ.36,014 కోట్లకు ఎగసింది. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం విడుదల చేసిన వార్షిక నివేదిక ఈ విషయాన్ని తెలిపింది. ఇదే కాలంలో నేరాల సంఖ్య మాత్రం 36,060 నుంచి 23,953కు తగ్గింది. ఫ్రాడ్ క్లాసిఫికేషన్‌కు సంబంధించి 2023 మార్చి 27న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి, గత సంవత్సరాల్లో నివేదించిన రూ.18,674 కోట్ల విలువైన 122 కేసులను తిరిగి తాజా నేరాలుగా నమోదు చేయడం వల్ల మొత్తం నేరాల విలువ పెరిగిందని ఆర్‌బీఐ నివేదిక వివరించడం గమనార్హం. మొత్తం నేరాల సంఖ్యలో ప్రైవేటు బ్యాంకులకు సంబంధించినవి 60 శాతం ఉన్నాయి. కానీ విలువ పరంగా ప్రభుత్వ రంగ బ్యాంకులవి 71 శాతం కంటే ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- నేరాల సంఖ్యలో ఎక్కువగా డిజిటల్ చెల్లింపుల (కార్డ్, ఇంటర్నెట్) కేటగిరీలో చోటుచేసుకున్నాయి. అయితే విలువ పరంగా చూస్తే లోన్ లేదా అడ్వాన్స్ ఖాతాల్లోనే ఎక్కువ నేరాలు జరిగాయి.
- ప్రైవేట్ బ్యాంకుల్లో ఎక్కువగా కార్డ్, ఇంటర్నెట్ నేరాలు జరగ్గా, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో లోన్ పోర్టుఫోలియోకి సంబంధించిన నేరాలు ఎక్కువ ఉన్నాయి.
- మొత్తం కేసుల్లో లోన్ సంబంధిత నేరాలు 33 శాతానికి పైగా ఉండగా, మొత్తం నేరాల విలువలో 92 శాతం వాటాను కలిగి ఉన్నాయి.
- 2024–25 చివరిలో కార్డ్, ఇంటర్నెట్ నేరాల కేటగిరీలో 13,516 కేసులు నమోదయ్యాయి. ఇవి మొత్తం 23,953 నేరాల్లో 56.5 శాతం.
- రూ.లక్ష, అంతకంటే ఎక్కువ ఉన్న కేసుల వివరాలనే నివేదికలో పొందుపరచడం జరిగింది.
- సంస్థలు తమ నివేదికలను సవరిస్తే ఈ డేటా మారే అవకాశం కూడా ఉంది.
- నివేదికలో పేర్కొన్న మొత్తాన్ని 'కోల్పోయిన నష్టం'గా పరిగణించడం సరికాదు. రికవరీల ఆధారంగా నష్టం తగ్గవచ్చు.



భద్రత కోసం కొత్త డొమెయిన్‌లు..

డిజిటల్ చెల్లింపుల్లో పెరుగుతున్న నేరాలపై పోరాటానికి ఒక వినూత్న ప్రయత్నంగా భారతీయ బ్యాంకుల కోసం ప్రత్యేకంగా ".bank.in', నాన్–బ్యాంకుల కోసం ".fin.in' అనే ఇంటర్నెట్ డొమెయిన్‌లను ప్రవేశపెట్టే ప్రతిపాదనను రిజర్వ్ బ్యాంక్ చేసింది. ఈ ప్రయత్నం డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది, సైబర్ మోసాలను గుర్తించడంలో అలాగే ఫిషింగ్ వంటి ప్రమాదకరమైన కార్యకలాపాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్‌బీటీ) ఈ డొమెయిన్‌లకు ప్రత్యేక రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తుందని, బ్యాంకుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమవుతుందని నివేదిక తెలిపింది.

బ్యాంకుల వారీగా మోసాల తీరిదీ...


బ్యాంకు గ్రూపు	2022-23		2023-24		2024-25	
	మోసాల సంఖ్య	నగదు	మోసాల సంఖ్య	నగదు	మోసాల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
ప్రభుత్వ రంగ బ్యాంకులు	3,331	12,557	7,460	9,254	6,935	25,667
ప్రైవేట్ బ్యాంకులు	8,971	5,206	24,207	2,722	14,233	10,088
విదేశీ బ్యాంకులు	804	292	2,899	154	1,448	181
ఆర్థిక సంస్థలు	9	888	1	1	2	13
చిన్న ఫైనాన్స్ బ్యాంకులు	311	31	1,019	64	1,217	58
పేమెంట్ బ్యాంకులు	68	7	472	35	113	6
స్థానిక ప్రాంత బ్యాంకులు	0	0	2	0	5	1
మొత్తం	13,494	18,981	36,060	12,230	23,953	36,014

హాజీలకు చంద్రబాబు వెన్నుపోటు

హజ్ యాత్రికులకు అందని రూ.లక్ష సాయం

"కూటమి అధికారంలోకి వస్తే హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరికి రూ.లక్ష ఇస్తాం"
గత ఏడాది ఎన్నికలకు ముందు, మేనిఫెస్టోలో టీడీపీ అధినేత

చంద్రబాబు "విజయవాడ నుంచి వెళ్లేవారికి మాత్రమే రూ.లక్ష ఇస్తాం"
అధికారంలోకి వచ్చాక చంద్రబాబు



ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసగించిన చంద్రబాబు

వైస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన ఎంబార్కేషన్ పాయింట్‌ను సైతం రద్దు చేయించిన కూటమి సర్కారు

అరకొర సౌకర్యాలతో అవస్థల నడుమ హజ్ యాత్ర

3 విడతల్లో ఏపీ నుంచి మక్కాకు 1,632 మంది

సాక్షి, అమరావతి: హజ్ యాత్రికులను (హాజీలు) కూడా చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కేశారు. రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లిన ఒక్కరికి కూడా పైసా ఇవ్వకుండా దగా చేశారు. మొదట లక్ష ఇస్తామని చెప్పి.. యాత్ర ప్రారంభం నాటికి మెలిక పెట్టారు. దీనికితోడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కూడా కూటమి ప్రభుత్వం కత్తిగట్టి రద్దు చేయించింది. హజ్–2025కు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి మూడు విడతల్లో ఏపీకి చెందిన 1,632 మంది వెళ్లారు. గత నెల 27న చివరి బృందం ప్రయాణమైంది. గురువారం నుంచి ఐదు రోజుల పాటు మక్కాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. హజ్ యాత్రకు పొరుగున ఉన్న కర్ణాటక రూ.9 కోట్లు, తెలంగాణ రూ.3 కోట్లు కేటాయించగా.. ఏపీలోని కూటమి ప్రభుత్వం పైసా విదల్చలేదు.

- రాష్ట్రం నుంచి హజ్‌కు వెళ్లే ముస్లింల సౌకర్యార్థం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టుదలతో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ (గన్నవరం విమానాశ్రయం)ను సాధించింది. 2023, 2024లో ఇక్కడినుంచే హజ్‌కు వెళ్లారు. హాజీలపై అదనపు భారాన్ని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే భరించి రూ.14.50 కోట్లకు పైగా ఇచ్చింది. నాటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో సాధించిన ఎంబార్కేషన్ పాయింట్ రద్దుకు అనుకూలంగా చంద్రబాబు ప్రభుత్వం ఏపీ హజ్ కమిటీతో లేఖ రాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇదంతా హజ్ యాత్రికులకు రూ.లక్ష ఎగవేసేందుకే అనే ఆరోపణలు వచ్చాయి.
- గతంలో ఉన్న రూ.30 వేలు, రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచి ఇస్తామన్న చంద్రబాబు హామీని నమ్మి ఈ ఏడాది హజ్ యాత్రకు 1,990 మంది దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడ నుంచి వెళ్లేందుకు 101 మందే ఉండడంతో సాయాన్ని ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. ఈ సంఖ్యను చూపుతూ.. విజయవాడ నుంచి విమానం సాధ్యం కాదని, ఎంబార్కేషన్ పాయింట్ తొలగింపునకు అనుకూలంగా లేఖ ఇచ్చింది. ఇదే సమయంలో 'విజయవాడ నుంచి వెళ్లేవారికే రూ.లక్ష' ఇస్తామనే మెలిక పెట్టింది. చివరకు ఎంబార్కేషన్ పాయింట్ ఎత్తేయించి ఆ లక్ష కూడా ఎగ్గొట్టింది.

హజ్ యాత్రికులను చూస్తే బాధేస్తుంది



హైదరాబాద్ హజ్ హౌస్‌లో ఏపీవాళ్లను సాగనంపేందుకు వెళ్లాను. అరకొర సౌకర్యాలతో పడిన అవస్థలు వారు చెబుతుంటే చాలా బాధేసింది. విమానం బయల్దేరడానికి 24 గంటల ముందే హజ్ హౌస్‌కు చేరుకున్నామని, తాగు నీరు లేక, పారిశుధ్య లోపంతో నరకం చూశామని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మహ్మద్ పర్వేజ్ షేక్, శాలిమూన్ షేక్, మెహబూబ్, మహజబీన్ షేక్ దంపతులు వాపోయారు. వయోభారం, అనారోగ్యంతో ఉన్న హాజీలకు సాయం చేసేందుకు బంధువులను కూడా అనుమతించలేదు. ఏపీలోనే ఎంబార్కేషన్ పాయింట్ ఉంటే హజ్ హౌస్‌లో అన్ని సౌకర్యాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించే అవకాశం ఉండేదని యాత్రికులు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హజ్ హౌస్‌లో సౌకర్యాల కోసం రూ.2 కోట్ల వరకు ఖర్చు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

–మహ్మద్ ఇబదుల్లా, ఏపీ హజ్ కమిటీ మాజీ సభ్యుడు

చంద్రబాబు మాట మార్చడంతో తీవ్ర అవస్థలు



ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా వెళ్లాలని భావించే హజ్ యాత్ర విషయంలో చంద్రబాబు మాట మార్చడం దుర్మార్గం. రూ.లక్ష ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచాక మెలిక పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఎన్నికల కోడ్ వస్తుందని ముందుజాగ్రత్తగా ఓటాన్ బడ్జెట్‌లో హజ్ యాత్రకు రూ.14.04 కోట్లు కేటాయించారు. 1,797 మందికి ఇవ్వాల్సిన రూ.9.40 కోట్లను టీడీపీ అధికారంలోకి రాగానే పెండింగ్ పెట్టింది. ఇస్తామన్న రూ.లక్ష కూడా ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పడం లేదు. బడ్జెట్‌లో ముస్లిం సంక్షేమం కోసం రూ.వేల కోట్లు కేటాయించామని చెప్పుకొంటూ హజ్ క్యాంప్ ఖర్చులకు రూపాయి విదల్చకపోవడం, హాజీలకు సాయం ఎగ్గొట్టడం దారుణం.

–షేక్ గౌస్ లాజమ్, ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్

సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందించాలి

- ప్రతీ రైతుకు రుణ పరపతి సౌకర్యం కల్పించాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి : అదును దాటిపోకుండా ప్రతి రైతుకు సకాలంలో పూర్తిస్థాయిలో సబ్సిడీ విత్తనాలను అందించాలని, రుణ పరపతి కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలో శుక్రవారం సంఘం రాష్ట్రాధ్యక్షుడు వి. కృష్ణయ్య అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో రైతాంగం సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ నేతలు మాట్లాడుతూ.. జూన్ 1తో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ డిమాండ్‌కు సరిపడా విత్తనాలు సరఫరా చేయలేకపోవడం వలన రైతాంగం ప్రైవేటు విత్తన కంపెనీలు, వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని విత్తన కంపెనీలు, వ్యాపారాలు నాసిరకం విత్తనాలను రైతులకు అంటగడుతున్నారని ఆరోపించారు. పొగాకు, మామిడి రైతుల పంటలకు ప్రభుత్వం ప్రకటించిన ధరలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులతో సహ ప్రతీ రైతుకు పీఎం కిసాన్‌తో సంబంధంలేకుండా రూ.20వేల చొప్పున పెట్టుబడి సాయం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో పెట్టుబడికి అవసరమైన రుణసదుపాయం బ్యాంకుల నుండి కల్పించాలన్నారు. సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, జొన్నా శివ శంకర్, ఎ. రాజశేఖర్, పలువురు సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.20.50 లక్షలు విరాళం

తిరుమల: టీటీడీకి శుక్రవారం రూ.20.50 లక్షలు విరాళంగా అందింది. విజయవాడలోని ఫార్చ్యూన్ ఫైన్ జ్యూవెలర్స్ కు చెందిన కోమటి సునీల్ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,50,001 విరాళం అందించారు. తాడేపల్లిగూడేనికి చెందిన మాతురు పంచాక్షరి బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకానికి రూ.10,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

వక్ఫ్ భూ బదలాయింపులు దుర్మార్గం

గుంటూరు జిల్లాలో 'అన్యాక్రాంతం'పై ముస్లింల ఆందోళన
ఏపీఐఐసీకి 311 ఎకరాలు ఇవ్వాలనే ప్రతిపాదనపై ఆగ్రహం

సాక్షి, అమరావతి: పవిత్ర ఆశయంతో దాతలు అల్లా పేరుతో వక్ఫ్ చేసిన భూములను అన్యాక్రాంతం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కుట్రలు దుర్మార్గమని ముస్లిం సమాజం మండిపడితోంది. ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వక్ఫ్ భూములను కబ్జా చేయగా తాజాగా రాజధాని ప్రాంతంలో రూ.వందల కోట్ల విలువైన భూములను అధికారికంగా కొట్టేసేందుకు పచ్చ నేతలు వేసిన పెద్ద స్కెచ్‌ను సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ''పచ్చ నేతలకు చంద్రన్న తోఫా.. రాజధాని ప్రాంతంలో రూ.వందల కోట్ల విలువైన వక్ఫ్ భూములపై కన్ను'' అనే శీర్షికన ప్రచురించిన కథనంపై ముస్లిం నేతలు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపు తగదని, చంద్రబాబు ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వారేమన్నారంటే..

ఇండస్ట్రియల్ పార్క్ పేరిట అల్లా ఆస్తుల దోపిడి

కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లిం సమాజానికి తీరని ద్రోహం చేసిన చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్రంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో అల్లా ఆస్తుల దోపిడీకి మార్గం వేయడం దుర్మార్గం. ఒక్క గుంటూరు జిల్లాలోనే 311 ఎకరాలకుపైగా వక్ఫ్ భూములను ఏపీఐఐసీకి బదలాయించి ఆపై టీడీపీ నేతలకు లీజు పేరుతో ఫలహారంగా పంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు దారుణం. అల్లాహ్ ఆస్తుల జోలికి వచ్చిన వారికి ఆ అల్లాహ్ తగిన బుద్ధిచెబుతారు.

–షేక్ నాగుల్ మీరా, ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు

గుంటూరులో పడిన బీజాన్ని అడ్డుకోకపోతే పెను ముప్పు

గుంటూరు జిల్లాలో 'షాయి జామియా మసీదు (పెద్ద మసీదు)'కు చెందిన 233.18 ఎకరాలు, 'అంజుమన్ ఏ ఇస్తామీయా' సంస్థకు చెందిన 78 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిని అడ్డుకోకపోతే రాష్ట్రంలోని అన్ని వక్ఫ్ ఆస్తులను కాజేసే పెను ముప్పు ముంచుకొస్తుంది. భూ సేకరణ పేరుతో రూ.వందల కోట్ల విలువైన వక్ఫ్‌భూములను కారుచౌకగా కొట్టేసి టీడీపీ నేతలకు పరిశ్రమల ఏర్పాటుకు అప్పన్నంగా అప్పగించేందుకు రంగం సిద్ధం చేయడం సరికాదు. దీనిపై ముస్లిం సమాజం పోరాడాలి.

–షేక్ మునీర్ అహ్మద్, ఏపీ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్

కొల్లేరు అధ్యయనానికి కేంద్ర కమిటీ

వినతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కొల్లేరు ప్రజలు
ఈ నెల 17, 18లో కొల్లేరు గ్రామాల్లో పర్యటన

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరులో కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ) బృంద పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఈ నెల 16న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై కొల్లేరు అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ నెల 17, 18 తేదీల్లో ఏలూరు జిల్లాలో కొల్లేరు పరీవాహక ప్రాంతాల ప్రజలతో సమావేశమవుతారు. పూర్వం కొల్లేరు ప్రజల స్థితిగతుల అధ్యయనంపై సుప్రీంకోర్టు నియమించిన అజీజ్, రామన్ సుకుమారన్ కమిటీలు నివేదికలు అందించాయి. తాజాగా మరోసారి సీఈసీ కమిటీ రానుండటంతో కొల్లేరు పరివాహక గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది.

కొల్లేరు అభయారణ్యంపై 2006 ఏప్రిల్ 10న జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వాధికారులు ఉల్లంఘిస్తున్నారని, దీన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాలని కాకినాడకు చెందిన పర్యావరణవేత్త మృత్యుంజయరావు సుప్రీంలో పిటిషన్ వేశారు. సీఎస్‌ను ప్రతివాదిగా చేర్చారు. దీంతో ఈ ఏడాది జనవరి 16న జస్టిస్ బీఆర్.గవాయి(ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి), జస్టిస్ అగస్టీ జార్జ్ మసీహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రకాంత్‌లు కొల్లేరులో ఆక్రమణలు తొలగించి మూడు నెలల్లో సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర చేపల రైతు సంఘం తరుపున జీ రాయితీ రైతులు రిట్ పిటిషన్ వేశారు. దీంతో కోర్టు కొంత గడువునిస్తూ సీఈసీ కొల్లేరులో పర్యటించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఈసీ సభ్యులు కొల్లేరులో పర్యటించనున్నారు.



వినతులతో కొల్లేరు ప్రజలు సిద్ధం

కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ)కి కొల్లేరు గ్రామాల ప్రజలు వినతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ఈ విషయంపై కొల్లేరు పెద్దలు కీలక సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కొల్లేరు జీ రాయితీ, డీఫాం పట్టా వివరాలతో పాటు గ్రామంలో మౌలిక వసతులైన తాగునీటి చెరువులు, ఇంటి స్థలాల పంపిణీ, రహదారుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని పంచాయతీ సర్పంచ్ తీర్మానాలు అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.

20 వేల ఎకరాలను మినహాయించాలి

కొల్లేరు అభయారణ్యం 77,138 ఎకరాలుగా జీవో 120 ప్రకారం నిర్ణయించారు. కొల్లేరు సరస్సు చుట్టూ 122 గ్రామాల్లో 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. సుప్రీం ఆదేశాలతో 2006లో జరిగిన కొల్లేరు ఆపరేషన్‌లో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 31,125 ఎకరాలలో ఆక్రమిత చేపల చెరువులను ధ్వంసం చేశారు. వీటిలో పట్టా భూములు 14,932 ఎకరాలు, డీఫాం భూములు 5,510 ఎకరాలు ఉన్నాయి. కొల్లేరు పరిధి నుంచి పట్టా, డీఫాం భూములు మినహాయించి, కొత్త సరిహద్దులు నిర్ణయించాలంటూ జాతీయ వన్య ప్రాణి సంరక్షణ బోర్డు(ఎన్‌బీడబ్ల్యూఎల్) 2018లోనే ఆదేశాలిచ్చింది. దీనిని అమలు చేయాలని కోరనున్నారు.

● మూవీ మేకర్







ఇతనిలా సినిమా తీస్తారా?

పిల్లలూ.... సినిమాలంటే మనందరికీ ఇంట్రెస్టే కదా. ప్రతి వారం టీవీలోనో, ఓటిటిలోనో, థియేటర్‌లోనో ఏదో ఒక సినిమా చూస్తూ ఉంటాం. సినిమా తీయడం టీమ్ ఎఫెర్ట్. చాలామంది కలిసి పని చేస్తేనే సినిమా తయారవుతుంది. వాళ్లందరూ ఏమేం చేయాలో చెప్పేవాడే డైరెక్టర్. అందుకే డైరెక్టర్‌ని 'కెప్టెన్ ఆఫ్ ద షిప్' అని పిలుస్తారు. ఎంతో అనుభవం, టాలెంట్ ఉంటే తప్ప డైరెక్టర్‌గా మారడం కష్టం. అలాంటిది పదేళ్ళ పిల్లాడు దర్శకుడిగా మారి సినిమా తీశాడంటే, ఆ సినిమా గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిందంటే నమ్మడం సాధ్యమేనా? అవును సాధ్యమే! ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసాడు కర్ణాటకకి చెందిన కిషన్ శ్రీకాంత్.

బెంగళూరులో జన్మించిన కిషన్ చిన్నప్పటినుండే సినిమాల మీద విపరీతమైన ఆసక్తి చూపించాడు. ఆ ఆసక్తి ఇష్టంగా మారి ఏకంగా సినిమాని డైరెక్ట్ చేసేదాక తీసుకెళ్లింది. 2006లో Care of Footpath సినిమాని పదేళ్ళ వయస్సులో కన్నడలో తీశాడు కిషన్. అనాథ బాలుడి విద్యను కాంక్షించే నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాలో, జాకీ ష్రాఫ్, సౌరభ్ షుక్లా, జయశ్రీ వంటి ప్రముఖ నటులు నటించారు. మొత్తం ఐదు భారతీయ భాషల్లో డబ్ చేయబడిన ఈ సినిమా 54వ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌లో గోల్డెన్ లోటస్ అవార్డ్‌తో పాటు, కర్ణాటక స్టేట్ అవార్డ్‌ను గెలుచుకుంది. అంతర్జాతీయంగా కూడా సైప్రస్, ఇటలీ, దక్షిణ కొరియా ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకుంది. అంతేకాకుండ పూర్తి నిడివి గల ఫీచర్ ఫిల్మ్‌ని డైరెక్ట్ చేసినందుకు 'అతి పిన్న ఫీచర్ ఫిల్మ్ డైరక్టర్‌గా గిన్నిస్ బుక్‌లో రికార్డ్స్ సాధించాడు కిషన్.

ఆ తరువాత కాలంలో Care of Footpath సీక్వెల్‌ను త్రిభాషా చిత్రంగా కన్నడ, హిందీ, తెలుగులో డైరెక్ట్ చేశాడు కిషన్. ఇందులో జువెనైల్ నేరాలు, న్యాయ వ్యవస్థ పనితీరుల గురించి చర్చించబడింది. ఈషా దేఓల్ మరియు అవికా గోర్ నటించారు. ఈ రెండు సినిమాలతో పాటు, Kill Them Young (2015), Teenage (2013), Enidu Manasali (2014), Maanja (2016) వంటి సినిమాలను డైరెక్ట్ చేశాడు మరికొన్నిట్లో నటించాడు.

● వింత ప్రపంచం


140 ఏళ్ల సర్కస్... షో అదుర్స్



సర్కస్ పిల్లలందరికీ చాలా ఇష్టం. అందులో మనుషులు, జంతువులు చేసే రకరకాల విన్యాసాలు పిల్లల్ని ఎంతో అలరిస్తాయి. అందుకే తమ ఊరికి సర్కస్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. మరి ప్రపంచంలో అతి ప్రాచీన సర్కస్‌లలో ఒకటైన బెలారస్ సర్కస్ గురించి మీకు తెలుసా? ఈ సర్కస్ పుట్టి ఇప్పటికి 140 ఏళ్లయ్యింది. నేటికీ ఇంకా కొనసాగుతూ ఉంది.

బెలారస్ అనేది యూరప్ ఖండంలో ఓ దేశం. 1884 నవంబర్ 16న ఆ దేశంలోని మిన్స్క్‌లో మొదటి బెలారసియన్ స్టేషనరీ సర్కస్‌ను ప్రారంభించారు. మొదట్లో ఓ చెక్క భవనంలోనే ఈ సర్కస్ ఏర్పాటు చేసేవారు. అయితే జనాల ఆదరణ పెరిగి చోటు చాలకపోవడంతో 1930లో అక్కడే 1200 సీట్ల సర్కస్ టెంట్‌ను నిర్మించారు. ఆ తర్వాత యుద్ధంలో ఆ సర్కస్ నాశనమైనా 1946లో మళ్లీ టెంట్ స్థానంలో కొత్త కట్టడం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకూ ఆ సర్కస్ జనాలను అలరిస్తూనే ఉంది. బెలారసియన్ స్టేట్స్ సర్కస్ నీటి ప్రదర్శనలకు, వైమానిక విన్యాసాల ప్రదర్శనలకు ప్రసిద్ధి. దీంతోపాటు అనేక ఇతర అంశాలు కూడా ఇందులో ఉంటాయి. 2008 నుండి 2010 వరకు బెలారసియన్ స్టేట్ సర్కస్‌ను పూర్తిస్థాయిలో మార్చారు. భవనంలో ప్రధాన రిహార్సల్ అరేనాలు, బ్యాలెట్ గది, జంతువుల బోనులు, పశువైద్యశాల ఏర్పాటు చేశారు. అరేనాలో పార్కెట్ డ్యాన్స్ ఫ్లోర్, లైట్ షోల కోసం ఒక అరేనా, శిక్షకులు జంతువులతో పని చేసే రబ్బరు అరేనాను ఏర్పాటు చేశారు.

బెలారసియన్ స్టేట్ సర్కస్ సొంతంగా ప్రదర్శనలు ఇస్తుంది. అనేక దేశాల్లో పర్యటిస్తుంది. అంతేకాకుండా అనేక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీల్లో అవార్డులను సైతం గెలుచుకుంది. ఎక్కడైనా ఒకసారి సర్కస్ చూస్తే మరోసారి చూసేందుకు పెద్దగా ఆసక్తి ఉండదు. అయితే బెలారసియన్ స్టేట్ సర్కస్ మాత్రం అందుకు భిన్నంగా ఉంటుందని ప్రేక్షకులు అంటుంటారు. ప్రతిసారీ కొత్త కొత్త విన్యాసాలు, షోలతో జనాన్ని ఎల్లప్పుడూ అలరిస్తుందని వివరిస్తారు.


● మన సినిమా

ఓ సూపర్ ఫాంటసీ మూవీ



హేయ్ కిడ్స్... సమ్మర్ వెకేషన్ అయిపోయిందని బాధ పడుతున్నారా... డోన్ట్ వర్రీ మిమ్మల్ని హ్యాపీగా ఉంచడానికి ఓ కొత్త మూవీతో మీ ముందుకు వచ్చాను. 'స్నో వైట్'... ఇదో సూపర్ ఫాంటసీ మూవీ. దీని స్టోరీ సూపర్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అదేంటంటే ఓ భయంకరమైన మంచు తుఫానులో ఓ రాజ్యానికి సంబంధించిన రాణికి చిన్న పాప పుడుతుంది. మంచు తుఫానులపుట్టిన పాప కాబట్టి 'స్నో వైట్' అనే పేరు పెట్టుకుంటారు ఆ రాజు, రాణి. ఇంతలో ఆ రాణి చనిపోతే రాజు ఇంకో ఈవిల్ క్వీన్‌ని మేరేజ్ చేసుకుంటాడు. ఆ ఈవిల్ క్వీన్ ఆ రాజ్యాన్నంతా తన చేతిలో ఉంచుకొని అక్కడి ప్రజలను బాధలు పెడుతుంటుంది. స్నో వైట్‌ని తన పని మనిషిగా చేసుకుంటుంది. ఈవిల్ క్వీన్‌కి ఓ మేజిక్ మిర్రర్ ఉంటుంది. ఆ మిర్రర్ దగ్గరకు ఈవిల్ క్వీన్ వెళ్ళి ప్రతిరోజూ 'హూ ఇజ్ ఫెయిరెస్ట్ ఆఫ్ ఆల్' అని అడుగుతూ ఉంటుంది. మేజిక్ మిర్రర్ ప్రతిసారి ఈవిల్ క్వీనే ఫెయిర్ అని చెబుతుంది. కాని ఓ రోజు మాత్రం మేజిక్ మిర్రర్ 'స్నో వైట్ ఫెయిర్' అని చెబుతుంది. దానితో ఈవిల్ క్వీన్ స్నో వైట్‌ని డీప్ ఫారెస్ట్‌లో చంపేయమని ఆదేశిస్తుంది. కాని స్నో వైట్ డీప్ ఫారెస్ట్ లో వింతగా ఉన్న ఉడ్ ల్యాండ్ యానిమల్స్ దగ్గరకు చేరుకుంటుంది. ఇక అక్కడ నుంచి స్నో వైట్ ఈవిల్ క్వీన్‌ని ఎలా ఎదిరిస్తుందనేది స్నో వైట్ మూవీలోనే చూడాలి. జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ మూవీ సూపర్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఎక్సెలెంట్‌గా ఉంటుంది. వాచ్ ఇట్.








మీకు తెలుసా?

చందమామ కథలు ఎలా పుట్టాయి?

పిల్లలూ... చందమామ కథలు గురించి మీకు తెలుసా? మీ అమ్మనో, నాన్ననో అడగండి... అయ్యో... అవంటే మాకు చిన్నప్పుడు చాలా ఇష్టం అని చెబుతారు. చెన్నైలో 'చందమామ' అనే బాలల పత్రిక 1947లో మొదలైతే వాటి ద్వారా ఆబాల గోపాలానికి అందిన కథలే చందమామ కథలు. తెలుగువారైన బి. నాగిరెడ్డి మరియు చక్రపాణి స్థాపించిన ఈ పత్రిక, భారతీయ సంస్కృతి, పురాణాలు, నీతి కథలు, జానపద కథనాలను పిల్లలకు సరళంగా, ఆకర్షణీయ బొమ్మలతో అందించే లక్ష్యంతో ప్రారంభమైంది. పంచతంత్ర, జాతక కథలు, రామాయణం, మహాభారతం, స్థానిక జానపద కథల నుండి స్ఫూర్తి పొందిన ఈ కథలు, నీతి, సాహసం, ఊహాశక్తిని పెంపొందించాయి. కోడూరి కౌశల్యాదేవి, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి రచయితలు - శంకర్, చిత్రప్రసాద్ వంటి చిత్రకారులు ఈ కథలకు ప్రాణం పోశారు. 'విక్రమ్-బేతాళ్', 'తెనాలి రామకృష్ణ' వంటి ధారావాహికలు పాఠకులను ఆకర్షించాయి. తెలుగు, తమిళం, హిందీ సహా 12 భారతీయ భాషలలో ప్రచురితమై, చందమామ పిల్లల మనసులను ఆకర్షించింది. 1990ల వరకు ఈ పత్రిక బాగా ప్రాచుర్యం పొందింది, కానీ డిజిటల్ యుగంలో పాఠకుల సంఖ్య తగ్గడంతో 2013లో ముద్రణ ఆగిపోయింది. అయినప్పటికీ చందమామ కథలు భారతీయ బాలల సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయి. వీటి పాత ఎడిషన్లు నెట్‌లో దొరుకుతాయి. సంపాదించి చదవండి.

● పుస్తకాలు


పిల్లల కోసం టాల్‌స్టాయ్ కథలు



ప్రముఖ రచయిత లియో టాల్‌స్టాయ్ పిల్లల కోసం రాసిన 13 కథలున్న పుస్తకం ఇది. ఈ పుస్తకానికి ఎ. పహోమొవ్ నలుపు, తెలుపులలో వేసిన పెన్సిల్ బొమ్మలు ప్రత్యేక ఆకర్షణ. ఇందులో అనేక జంతువులు, వాటి చుట్టూ జరిగే ఘటనలు తారసపడతాయి. అవి పిల్లల్ని ఎంతో అలరిస్తాయి. హాయిగా, సరదాగా సాగిపోయే పుస్తకం ఇది.

***

తారతమ్యాలను దూరం చేసుకోమని చెప్పే పుస్తకం



2015లో అమెరికన్ రచయిత మాట్ డి లా పెనా రాసిన ఈ పుస్తకానికి క్రిస్టియన్ రాబిన్సన్ బొమ్మలు గీశారు. 'సీజే' అనే అబ్బాయి చేసిన బస్సు ప్రయాణంలో అతనికి ఎదురైన విశేషాలు, రోజువారీ విషయాలలో అతను కనిపెట్టిన అద్భుతాలను ఈ నవల పట్టిచూపిస్తుంది. సమాజంలో మనుషుల మధ్య నెలకొన్న జాతి, ఆర్థిక తారతమ్యాలను ఎలా దూరం చేసుకోవాలో ఈ నవల వివరిస్తుంది. పిల్లలకు ఎంతో నచ్చేలా రచయిత దీన్ని రాశారు.

● మహనీయులు

స్వాతంత్ర్యయోధుడు కల్లూరి చంద్రమౌళి



పిల్లలూ! బ్రిటిష్ వారి నుంచి భారతదేశం విముక్తి పొందాలని ఎంతోమంది యోధులు పోరాడారు. వారిలో అనేకమంది తెలుగు వారు ఉన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేశారు. వారిలో ఒకరు కల్లూరి చంద్రమౌళి.

కల్లూరి చంద్రమౌళి 1898లో గుంటూరుజిల్లా అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వెంకమాంబ, సుదర్శనం. చంద్రమౌళి ప్రాథమిక విద్య తుళ్లూరు, తెనాలి, బాపట్లలో, ఉన్నత విద్య కలకత్తాలో చదువుకున్నారు. 1920లో ఇంగ్లాండు వెళ్లి వ్యవసాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1924లో భారతదేశానికి తిరిగివచ్చారు. బ్రిటీష్ ప్రభుత్వంలో ఉద్యోగం చేయటానికి నిరాకరించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1926లో వార్ధా సేవాగ్రాం వెళ్ళి గాంధీజీని కలిసి, అక్కడ మూడు నెలలు ఉండి కాంగ్రెస్ కార్యకర్తగా మారి గుంటూరుకు తిరిగొచ్చారు. ఊరూరా తిరిగి యువజన సంఘాలు పెట్టి వారిలో స్వతంత్ర భావాలను నాటారు. గాంధీజీ గుంటూరు జిల్లా పర్యటనలో ఆయనకు తోడుగా ఉన్నారు. జాతీయోద్యమాలల్లో పాల్గొని అనేకసార్లు జైలుకెళ్లారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా స్వాతంత్ర్య కాంక్షను మాత్రం వీడలేదు.

1955లో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో గెలిచి బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో రెవెన్యూ, దేవాదాయశాఖ మంత్రిగా పనిచేశారు. దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో దేవాదాయశాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 1964లో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షునిగా, భద్రాచల రామాలయ జీర్ణోద్ధరణ సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. అనేక రచనలు చేసి కవిగా, విమర్శకుడిగా పేరు పొందారు. 94 ఏళ్ల వయస్సులో 1992 జనవరి 2న ఆయన మరణించారు. గుంటూరు, మోపర్రులలో చంద్రమౌళి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేశారు.

● బాలల కథ

ఐకమత్యం

ఒక ఊరిలో రాము, సోము అనే ఇద్దరు స్నేహితులు ఎల్లప్పుడూ కలిసిమెలిసి ఉండేవారు. వారి స్నేహాన్ని ఊళ్లో చాలామంది ఆదర్శంగా తీసుకునేవారు. అయితే కొన్ని రోజులకు వారి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. అవి కాస్తా పెద్దగా మారి గొడవలకు దారితీశాయి. ఒకరంటే ఒకరు మండిపడే స్థితికి చేరుకున్నారు. ఇక్పై తమకు ఏ సంబంధం లేదని, తాము స్నేహితులం కాదని ప్రకటించాలంటూ పంచాయితీ పెట్టారు.

ఊరిపెద్దలకు వీరి మాటలు వింతగా తోచాయి. ఇన్నాళ్లపాటు ఎంతో చక్కగా కలిసున్న స్నేహితులు ఇలా విడిపోవడం వారెవరికీ నచ్చలేదు. విడిపోవడం మంచిది కాదని, ఇద్దరూ కలిసుంటే ఎంతో లాభం ఉంటుందని వారిని నచ్చజెప్పాలని చూశారు. కానీ రాము, సోము ఇద్దరూ పట్టు మీద ఉన్నారు. తాము విడిపోవాల్సిందేనని కచ్చితంగా చెప్పేశారు. దీంతో పెద్దలు ఓ ఉపాయాన్ని ఆలోచించారు.

'మీ ఇద్దరూ ఇక్పై స్నేహితులు కాదని ప్రకటిస్తాం. అయితే ముందుగా ఓ పని చేయండి' అన్నారు. సరేనన్నారు రాము, సోము. వెంటనే వారి చేతికి చెరొక చీపురు ఇచ్చారు. చేతులతో ఆ చీపుర్ని విరగ్గొట్టమని చెప్పారు. రాము, సోము ఇద్దరూ విడివిడిగా ఆ చీపురులను విరగ్గొట్టాలని ప్రయత్నించారు. వారి చెయ్యి నొప్పి పుట్టింది కానీ, చీపురు విరగలేదు. ఎంతసేపు ప్రయత్నించినా వారి వల్ల కాలేదు.



వెంటనే పెద్దలు మరో సలహా ఇచ్చారు. 'ఈసారి మొత్తం చీపురు కాకుండా, అందులోని పుల్లల్ని విరిచేయండి' అన్నారు. వెంటనే రాము, సోము టకటకా చీపురులోని పుల్లల్ని విరవడం మొదలుపెట్టారు. అప్పుడు పెద్దలు వారిని ఆపి, 'చూశారా.. అన్ని పుల్లలూ ఒక చోట ఉంటే దాన్ని విరగ్గొట్టడం మీ వల్ల కాలేదు. అదే విడివిడిగా ఉంటే సులభంగా పుల్లల్ని విరిచేశారు. స్నేహం కూడా అలాంటిదే. కలిసి ఉంటే మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. విడిగా ఉంటే మీకు సులభంగా కీడు చేయగలరు. కాబట్టి గొడవలు ఆపి కలిసి ఉండండి' అని సలహా ఇచ్చారు. దీంతో బుద్ధి తెచ్చుకున్న రాము, సోము గొడవలు మాని కలిసి ఉన్నారు.

నీతి: స్నేహితులతో ఎప్పుడూ ఐకమత్యంగా మెలగాలి.

● వండర్ కిడ్




ఉపన్యాసాలు అదరగొడతాడు



చిన్నపిల్లలు ముద్దు ముద్దు మాటలు మాట్లాడుతూ అందర్నీ ఆకట్టుకుంటారు. అయితే మూడేళ్ల వయసులోనే అనర్గళంగా మాట్లాడమే కాకుండా ఎందరికో స్ఫూర్తినందించేలా ప్రసంగాలు చేసిన చిన్నారి కాలేబ్ స్టీవర్ట్.

అమెరికాలోని ఫ్లోరిడాలోని తల్లాహస్సీకి చెందిన కాలేబ్ ప్రస్తుత వయస్సు 11 ఏళ్లు. అతను మూడేళ్ల వయసులోనే అబౌఅఖఇంటర్నేషనల్ చర్చిలో తన మొట్టమొదటి ప్రసంగం ఇచ్చాడు. 'మిమ్మల్ని మీరు నమ్మడం ఎంతో అవసరం' అంటూ అతను చేసిన ప్రసంగం అక్కడి వారందర్నీ ఆకట్టుకుంది. కాలేబ్ అక్కడితో ఆగలేదు. పాఠశాలలు, చర్చిలు, కమ్యూనిటీ గ్రూపులతో తన ఆలోచనలను పంచుకునేవాడు. అంత చిన్నపిల్లాడు అన్ని విషయాల గురించి సుదీర్ఘంగా మాట్లాడటం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. కొన్ని కార్యక్రమాలకు అతణ్ని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించి ప్రసంగించమని కోరేవారు.

వెళ్లిన ప్రతిచోటా అతను అద్భుతంగా ప్రసంగించేవాడు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే మనోధైర్యం అవసరమని, బాధ్యతల నుంచి తప్పించుకోకూడదని, అమ్మానాన్నల్ని కష్టపెట్టవద్దని, జీవితంలో ఏ విషయానికీ కుంగిపోకూడదని.. ఇలా రకరకాల అంశాలపై అతను చెప్పే మాటలు అందర్నీ ఆకట్టుకునేవి. ఆ ప్రసంగాలు మీడియాలో సైతం రావడంతో అతని ప్రసంగాలకు క్రేజ్ ఏర్పడింది. అనర్గళంగా ఎలా ప్రసంగించాలో నేర్పించమని అతని చేత ప్రత్యేకంగా శిక్షణ తరగతులు ఇప్పించడం మొదలైంది. అతని ప్రతిభ గమనించిన గిన్నిస్ ప్రతినిధులు 'అతి చిన్న వయస్కుడైన మోటివేషనల్ స్పీకర్' అని అతనికి రికార్డు అందించారు.

రెండేళ్ల వయసులోనే చదవడం నేర్చుకున్న కాలేబ్‌ని అందరూ 'మాస్టర్ కాలేబ్' అని పిలుస్తారు. పుస్తకాలను ఎంతో ఇష్టంగా చదువుతాడు. పెద్దయ్యాక ఉపాధ్యాయుడిగా మారతానని, దాంతోపాటు గొప్ప మోటివేషనల్ స్పీకర్‌గా రాణించాలని ఉందని వివరిస్తున్నాడు కాలేబ్.

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ రంగం @రూ. 3,600 కోట్లు

- ఈ ఏడాది మరో 25 శాతం వృద్ధి
- ఫాలోయర్ల కన్నా కంటెంట్ నాణ్యతకే తయారీ రంగ ప్రాధాన్యత
- విశ్వసనీయతకు పెద్దపీట
- ఇండియా ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ రిపోర్ట్



న్యూఢిల్లీ: దేశీయంగా ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ పరిశ్రమ 2024లో రూ. 3,600 కోట్ల స్థాయికి చేరింది. 2025లో ఇది మరో 25 శాతం వృద్ధి చెందనుంది. ది గోట్ ఏజెన్సీ, డబ్ల్యూపీపీ మీడియా, కాంటార్ కలిసి రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. భారత్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ తీరుతెన్నులు, వినియోగదారుల ధోరణులను మార్చేందుకు .. బ్రాండ్‌పై విశ్వసనీయతను పెంచుకునేందుకు కంపెనీలు ఏ విధంగా తమ మార్కెటింగ్ వ్యూహాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లను భాగం చేసుకుంటున్నాయి లాంటి అంశాలను ఇది వివరించింది. దీని ప్రకారం ఈ పరిశ్రమలో ప్రధానంగా ఫాలోయర్ల సంఖ్యపైనే దృష్టి పెట్టే ధోరణిలో మార్పులు వస్తున్నాయి. బ్రాండ్లు ఎక్కువగా కంటెంట్ నాణ్యత, క్రియేటర్ల ఔచిత్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా తయారీ రంగంలో ఇలాంటి ట్రెండ్ కనిపిస్తోంది. ఈ విభాగంలో 85 శాతం బ్రాండ్లు ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంపికలో కంటెంట్ నాణ్యత ప్రాథమిక ప్రాతిపదికగా ఉంటున్నట్లు వివరించాయి.

దీర్ఘకాలిక భాగస్వామ్యానికి మొగ్గు..

నివేదిక ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను కుదుర్చుకునేందుకు బ్రాండ్లు మొగ్గు చూపుతున్నాయి. 72 శాతం బ్రాండ్లు ఇలాంటి భాగస్వామ్యాలను ఎంచుకున్నాయి. కంటెంట్ నియంత్రణ, బ్రాండ్ భద్రత రీత్యా 95 శాతం బ్రాండ్లు పెద్ద ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంచుకుంటున్నాయి. అయితే, విశిష్టమైన రంగాల్లో ప్రత్యేక నైపుణ్యాలున్న ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆటోమోటివ్, కన్జూమర్ డ్యూరబుల్స్‌లాంటి విభాగాల్లో డిమాండ్ ఉంటోంది.

సవాళ్లు ఉన్నాయి...

- సానుకూలాంశాలు అనేకం ఉన్నప్పటికీ ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్‌లో సవాళ్లు కూడా ఉంటున్నాయి. సరైన ఇన్‌ఫ్లుయెన్సర్లను దొరకపుచ్చుకోవడం ప్రధాన సవాలుగా ఉంటోంది. 83 శాతం మార్కెటర్లు, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాలు) సెక్టార్లో 95 శాతం సంస్థలు సరైన టాలెంట్‌ను దొరకపుచ్చుకోవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వివరించాయి. పెట్టుబడులపై రాబడులను (ఆర్‌వోఐ) లెక్కించేందుకు మార్కెటర్లు ఎక్కువగా ఎంగేజ్‌మెంట్ రేట్ (39 శాతం), కంటెంట్ నాణ్యత (36 శాతం)కు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- వినియోగదారుల కోణం నుంచి చూస్తే కొనుగోలు ప్రస్థానంలో ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రోడక్ట్ డిస్కవరీ కోసం (63 శాతం మంది), సమాచార సేకరణ కోసం (69 శాతం మంది) ఫాలో చేస్తున్నట్లు భారతీయ వినియోగదారులు తెలిపారు.
- ఇన్‌ఫ్లుయెన్సర్లతో చేతులు కలపడంలో విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు 70 శాతం బ్రాండ్లు తెలిపాయి. బీఎఫ్ఎస్ఐలో ఇది 77 శాతంగా ఎఫ్ఎంసీజీలో ఇది 76 శాతంగా ఉంది.
- నేటి వినియోగదారులు కేవలం ప్రోడక్టుల కొనుగోలుకే కాకుండా, స్టోరీలు, కమ్యూనిటీలు, తాము విశ్వసించే క్రియేటర్లు చెప్పే విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. భవిష్యత్తులో ఇన్‌ఫ్లుయెన్సర్లను వ్యూహాత్మక భాగస్వాములుగా వ్యవహరించే బ్రాండ్లే రాణిస్తాయి. నియంత్రణలు, కంటెంట్‌పై ఫోకస్ పెరుగుతున్న పరిస్థితుల్లో బ్రాండ్లు, క్రియేటర్లు అర్థవంతమైన, దీర్ఘకాలం నిలబడే భాగస్వామ్యాలను ఏర్పర్చుకోవడం కీలకంగా నిలుస్తుంది.

ఐపీవో స్ట్రీట్

పబ్లిక్ ఇష్యూకి రేజాన్ సోలార్

- రూ. 1,500 కోట్ల సమీకరణ
- నెలాఖరులో సెబీకి డీఆర్‌హెచ్‌పీ



న్యూఢిల్లీ: సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థ రేజాన్ సోలార్ తాజాగా పబ్లిక్ ఇష్యూకి సిద్ధమవుతోంది. రూ. 1,500 కోట్ల సమీకరణకు సంబంధించి ఈ నెలాఖరు నాటికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐపీవో నిర్వహణ కోసం కంపెనీ ఇప్పటికే పలు దిగ్గజ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను నియమించుకుంది. తాజాగా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను కార్యకలాపాల విస్తరణకు కంపెనీ వినియోగించుకోనున్నట్లు సమాచారం. 2017లో ఏర్పాటైన రేజాన్ సోలార్ దేశీయంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న సోలార్ పీవీ మాడ్యుల్స్ తయారీ సంస్థల్లో ఒకటిగా ఉంది. సంస్థవెబ్‌సైట్ ప్రకారం గుజరాత్‌లోని కారంజ్, సావా ప్లాంట్లలో 6,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని సాధించింది. కంపెనీ ఇటీవల మార్చిలో ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా రూ. 138 కోట్లు సమీకరించింది.

ఎరిస్‌ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ ధర శ్రేణి రూ210-222



నిర్మాణ మెటీరియల్స్ కొనుగోలు ప్రక్రియను సరళతరం చేసే బీ2బీ టెక్నాలజీ సేవల సంస్థ ఎరిస్‌ఇన్‌ఫ్రా ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూకి సంబంధించి ధర శ్రేణిని ఒక్కో షేరుకు రూ. 210–222గా నిర్ణయించారు. జూన్ 18న ఐపీవో ప్రారంభమై 20న ముగుస్తుంది. తాజాగా షేర్ల జారీ రూపంలో కంపెనీ రూ. 499.6 కోట్లు సమీకరించుకోనుంది. ప్రైస్ బ్యాండ్ గరిష్ఠ ధర ప్రకారం సంస్థ విలువ రూ. 1,800 కోట్లుగా ఉంటుంది. ఇష్యూ ద్వారా సేకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్, అనుబంధ సంస్థ బిల్డ్‌మెక్స్–ఇన్‌ఫ్రాలో పెట్టుబడులు, మరో అనుబంధ సంస్థ ఎరిస్‌యూనిటెర్న్ ఆర్‌ఈ సొల్యూషన్స్‌లో ప్రస్తుత షేర్‌హోల్డర్ల నుంచి కొంత వాటాను కొనుగోలు చేయడం, రుణాల చెల్లింపు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 2021 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్య కాలంలో 1,458 మంది వెండార్ల ద్వారా 2,133 మంది కస్టమర్లకు 10.35 మిలియన్ టన్నుల కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ (రెడీ మిక్స్ కాంక్రీట్, ఉక్కు, సిమెంట్ మొదలైనవి) అందించినట్లు ఎరిస్‌ఇన్‌ఫ్రా పేర్కొంది.

ఓస్వాల్ పంప్స్ ఐపీవోకు 42 శాతం స్పందన



సోలార్ పవర్ పంపులు, ఎలక్ట్రిక్ మోటార్లు తదితర ఉత్పత్తుల తయారీ సంస్థ ఓస్వాల్ పంప్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) తొలి రోజున 42 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యింది. 1.62 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తుండగా 67.83 లక్షల షేర్లకు బిడ్లు వచ్చాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగం 79 శాతం, రిటైల్ విభాగం 45 శాతం, క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయర్స్ (క్యూఐబీ) విభాగం 8 శాతం సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఈ ఐపీవో 17తో ముగుస్తుంది. ఇష్యూ కింద ఒక్కో షేరు ధర శ్రేణి రూ. 584–614గా ఉంది. ఐపీవో పరిమాణం రూ. 1,387 కోట్లు. ఇందులో రూ. 890 కోట్లను తాజాగా షేర్లను జారీ చేయడం ద్వారా, అలాగే ప్రమోటరు వివేక్ గుప్తా 81 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించడం ద్వారా సుమారు రూ. 497.34 కోట్ల మొత్తాన్ని సమీకరించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను నిర్దిష్ట మూలధన వ్యయాలకు, అనుబంధ సంస్థ ఓస్వాల్ సోలార్‌లో డెట్ లేదా ఈక్విటీ రూపంలో పెట్టుబడులు పెట్టేందుకు, హర్యానాలోని కర్నాల్‌లో కొత్తగా తయారీ యూనిట్ల ఏర్పాటుకు, రుణాల చెల్లింపు.. ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. ఓస్వాల్ పంప్స్ 2003లో లో–స్పీడ్ మోనోబ్లాక్ పంపుల తయారీతో కార్యకలాపాలు ప్రారంభించింది. ఆ తర్వాత సబ్‌మెర్సిబుల్ పంపులు, ఎలక్ట్రిక్ మోటార్ల విభాగంలోకి విస్తరించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం 97 శాతం పెరిగి రూ. 385 కోట్ల నుంచి రూ. 759 కోట్లకు, లాభం రూ. 34 కోట్ల నుంచి రూ. 98 కోట్లకు ఎగిసింది.

సన్ ఫార్మా ఎండీగా కీర్తి గనోర్కర్



న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం సన్ ఫార్మా టాప్ మేనేజ్‌మెంట్‌లో మార్పులు, చేర్పులు చేపట్టింది. ఇందులో భాగంగా కీర్తి గనోర్కర్ కంపెనీ ఎండీగా పదోన్నతి పొందారు. దిలీప్ సంఘ్వీ స్థానంలో సెప్టెంబర్ 1 నుంచి ఆయన బాధ్యతలు చేపడతారు. ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సంఘ్వీ కొనసాగుతారు. నార్త్ అమెరికా విభాగం ప్రెసిడెంట్, సీఈవో అభయ్ గాంధీ తప్పుకోనుండటంతో ఆయన స్థానంలో రిచర్డ్ ఆస్క్రాఫ్ట్ చేరతారని కంపెనీ తెలిపింది. ఎంబీఏ, కెమికల్ ఇంజినీర్ అయిన గనోర్కర్ 1996 నుంచి సన్ ఫార్మాలో వివిధ విభాగాల్లో పని చేశారు. 2019 జూన్ నుంచి సన్ ఫార్మా భారత విభాగానికి గనోర్కర్ నేతృత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో వ్యాపారం, మార్కెట్ వాటా నిలకడగా పెరిగిందని సంస్థ వివరించింది. స్పెషాలిటీ విభాగాలు, జపాన్.. యూరప్ మార్కెట్లలోకి కూడా సన్ ఫార్మా విస్తరించడంలో గనోర్కర్ కీలక పాత్ర పోషించారని పేర్కొంది.

ఫలితాలతోపాటే వేగంగా వార్షిక నివేదికలు

- జాప్యాన్ని తగ్గించాలని సూచన
- సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్



ముంబై: కంపెనీలు ఆర్థిక ఫలితాల వెల్లడికి, వార్షిక నివేదికల విడుదలకు మధ్య అంతరాన్ని తగ్గించాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కోరింది. దీనివల్ల ఇన్వెస్టర్ల విశ్వాసం ఇనుమడిస్తుందని కంపెనీ సీఎఫ్‌వోలకు సూచించింది. ఆడిట్ కమిటీలు, ఆడిటర్లతో సీఎఫ్‌వోలు మరింత లోతుగా సంప్రదింపులు నిర్వహించాలని, తద్వారా మరింత సహకారంతో ఆర్థిక ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకోవాలని సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్ కోరారు. సీఎఫ్‌వోలకు సంబంధించి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా విశ్వాసం నిలబెట్టడంలో సీఎఫ్‌వోలు పోషిస్తున్న పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. ''ప్రస్తుతం వార్షిక ఫలితాలు, వార్షిక నివేదికల వెల్లడికి మధ్య అంతరం 70 నుంచి 140 రోజుల వరకు ఉంటోంది. ఖాతాలు, అంతర్గత నియంత్రణలు, కంపెనీ ఆడిటర్ రిపోర్ట్ గురించి మరింత లోతైన వివరాలతో కూడిన వార్షిక నివేదిక మరింత సమాచారయుక్తంగా ఉంటుంది. ఈ జాప్యాన్ని తగ్గిస్తే ఇన్వెస్టర్లకు పారదర్శకత పెరుగుతుంది''అని అనంత నారాయణ్ పేర్కొన్నారు.


వివో టీ4 అల్ట్రా స్మార్ట్‌ఫోన్ విడుదల

18 నుంచి అమ్మకాలు ప్రారంభం



హైదరాబాద్: వివో టీ4 అల్ట్రా పేరుతో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. సోనీ ఐఎంఎక్స్ 921 50 మెగాపిక్సల్స్ రియర్ కెమెరా సెన్సార్‌తో ఇది వస్తుంది. మొత్తంగా వెనుక మూడు కెమెరాలు ఉంటాయి. 100 ఎక్స్ హైపర్‌జూమ్ ఫీచర్ కూడా ఉంది. ఫోనిక్స్ గోల్డ్, మెటీరియర్ గ్రే రంగుల్లో ఇది లభించనుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 9300 ప్లస్ ప్రాసెసర్‌తో ఉండే ఈ ఫోన్ 8జీబీ, 256జీబీ వేరియంట్ ధర రూ.37,999. 12జీబీ, 256జీబీ వేరియంట్ ధర రూ.39,999. 12జీబీ, 512జీ వేరియంట్ ధర రూ.41,999గా కంపెనీ ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్‌తోపాటు వివో ఇండియా ఈ స్టోర్‌లో ఈ నెల 18 నుంచి అమ్మకాలు మొదలవుతాయని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ కార్డులపై ఫ్లాట్ రూ.3,000 డిస్కౌంట్‌ను ప్రకటించింది. రూ.5,000 ఎక్స్ఛేంజ్ బోనస్‌తోపాటు, 9 నెలల నోకాస్ట్ ఈఎంఐ సదుపాయలను కూడా ఆఫర్ చేస్తోంది.

జేపీఎల్ దివాలా పరిష్కార ప్రణాళికకు డెడ్‌లైన్ పొడిగింపు



న్యూఢిల్లీ: దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొంటున్న జైప్రకాష్ అసోసియేట్స్ (జేపీఎల్) పరిష్కార ప్రణాళిక దాఖలుకు ఆఖరు తేదీని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు జూన్ 24కి పొడిగించాయి. బిడ్డర్ల విజ్ఞప్తి కారణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. ఆఖరు తేదీ పొడిగింపును రుణదాతల కమిటీ (సీవోసీ) ఆమోదించినట్లు జేపీఎల్ తెలిపింది. వాస్తవానికి ఈ గడువు జూన్ 9తో ముగియాలి. అయితే, పలువురు బిడ్డర్లు పరిష్కార ప్రణాళికను సమర్పించేందుకు మరింత గడువు కావాలని కోరడంతో సీవోసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వివరించింది. సుమారు 25 కంపెనీలు జేపీఎల్‌ను దక్కించుకోవడంపై ఆసక్తిగా ఉన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, వేదాంత, పతంజలి ఆయుర్వేద, జీఎంఆర్ బిజినెస్ అండ్ కన్సల్టెన్సీ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. రియల్ ఎస్టేట్, సిమెంట్ తయారీ, ఆతిథ్యం తదితర రంగాల్లో జేపీఎల్ కార్యకలాపాలు సాగిస్తోంది. రుణాల చెల్లింపులో డిఫాల్ట్ కావడంతో 2024 జూన్ 3న కంపెనీపై దివాలా పరిష్కార ప్రక్రియ కింద జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) విచారణ చేపట్టింది. కంపెనీకి మొత్తం రూ. 57,185 కోట్ల మేర రుణభారం ఉంది.

‘జూబిలెంట్’ సంస్థల్లో ప్రమోటర్ల వాటాల విక్రయం

విలువ రూ. 1,801 కోట్లు

న్యూఢిల్లీ: జూబిలెంట్ గ్రూప్ కంపెనీల్లో ప్రమోటర్లు గణనీయంగా వాటాలు విక్రయించారు. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ (జేఎఫ్ఎల్), జూబిలెంట్ ఇన్‌గ్రేవియా, జూబిలెంట్ ఫార్మోవాలో రూ. 1,801 కోట్ల విలువ చేసే వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా అమ్మేశారు. ఎన్ఎస్ఈలోని బ్లాక్ డీల్స్ డేటా ప్రకారం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రమోటర్ అయిన జూబిలెంట్ కన్జూమర్ 1.06 కోట్ల ఈక్విటీ షేర్లను (1.61 శాతం వాటా) విక్రయించింది. అలాగే, జూబిలెంట్ ఇన్‌గ్రేవియా ప్రమోటింగ్ సంస్థలు (జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్, శ్యామ్ సుందర్ భార్తియా ఫ్యామిలీ ట్రస్ట్) 98.65 లక్షల షేర్లు (6.2 శాతం వాటా) విక్రయించాయి. అలాగే జూబిలెంట్ ఫార్మోవా ప్రమోటర్ సంస్థలు జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్ 32.86 లక్షల షేర్లను (2.06 శాతం వాటా) విక్రయించాయి. ఈ షేర్లను సగటున రూ. 662–1,060.37 రేటుకు అమ్మడంతో మొత్తం అన్ని లావాదేవీల విలువ కలిపి రూ. 1,800.98 కోట్లుగా నమోదైంది.

జోయాలుక్కాస్ అతిపెద్ద జ్యువలరీ సేల్



హైదరాబాద్: జోయాలుక్కాస్ 'సంవత్సరంలో అతి పెద్ద జ్యువలరీ సేల్' మళ్లీ తీసుకొచ్చింది. అందుకు తగ్గట్లు 10 లక్షలకు పైగా భిన్నమైన బంగారం, వెండి డిజైన్లు అందుబాటులో ఉంచింది. సేల్‌లో భాగంగా అన్‌కట్ డైమండ్స్, ప్లాటినం, వెండి, ప్రెషస్ స్టోన్ జ్యువెలరీ మజూరీ ఛార్జీలపై ఫ్లాట్ 50% తగ్గింపు ఇస్తుంది. '' ప్రతి కస్టమర్‌కి నిజమైన, ఆనందకరమైన జ్యువలరీ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. సంవత్సరంలో అతిపెద్ద జ్యువలరీ సేల్‌తో సాటిలేని విలువ, నాణ్యత, విలక్షణమైన డిజైన్లు అందిస్తున్నాము. జూలై 13 వరకు ఉండే ఈ ప్రత్యేక ఆఫర్‌ను అందరూ వినియోగించుకోవాలి'' అని జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ కోరారు.

ఏఐ చిప్ మార్కెట్ జోరు..

- 2028 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరిక
- ఏఎండీ సీఈవో లీసా అంచనా



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో (2028 నాటికి) కృత్రిమ మేథ (ఏఐ) ప్రాసెసర్ మార్కెట్ 500 బిలియన్ డాలర్ల స్థాయిని అధిగమిస్తుందని అంచనా వేస్తున్నట్లు అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ (ఏఎండీ) సీఈవో 'లీసా సూ' తెలిపారు. 2023లో 45 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ విభాగం ఏటా 60 శాతం మేర వృద్ధి చెందుతోందని వివరించారు. అడ్వాన్సింగ్ ఏఐ 2025 కాన్ఫరెన్స్‌లో 'ఎంఐ350 సిరీస్' జీపీయూలు (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు), ఇతర ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా లీసా ఈ విషయాలు వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన చిప్‌లు నలభై శాతం అధిక సామర్థ్యంతో పని చేస్తాయని పేర్కొన్నారు. డెవలపర్ కమ్యూనిటీ కొత్త ఉత్పత్తులను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు డెవలపర్ క్లౌడ్ యాక్సెస్ ప్రోగ్రాంను కూడా కంపెనీ ప్రవేశపెట్టింది. 'హీలియోస్ ఏఐ ర్యాక్ స్కేల్' సొల్యూషన్‌ని కూడా ఏఎండీ ఆవిష్కరించింది. ఇది వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. ఏఐని వినియోగించే 10 అతి పెద్ద కంపెనీల్లో ఏడు సంస్థలు తమ ఏఎండీ ఇన్‌స్టింక్ట్ యాక్సిలరేటర్లను ఉపయోగిస్తున్నాయని, ఈ లిస్టులో భారత టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కూడా ఉందని లీసా చెప్పారు. కాన్ఫరెన్స్ సందర్భంగా ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌తో పాటు మెటా, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ తదితర దిగ్గజాల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-6-2025	
విశాఖ	550–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	395.15	2
ONGC	251.05	1.28
TECHM	1,658.00	0.83
TCS	3,447.40	0.38
WIPRO	260.59	0.38

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,406.10	-2.27
ITC	413.95	-1.67
SBIN	793.3	-1.57
HINDALCO	641.35	-1.49
ADANIENT	2,506.00	-1.43

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,975
ఎన్ఎస్ఈ	1,04,982
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,61,776
ఎఫ్ఐఐ	- 1,264
డీఐఐ	+ 3,041

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.05	$ 68.04
బ్రెంట్	74.25	$ 69.36

మోతీలాల్ ఓస్వాల్‌కు జరిమానా

- స్టాక్ బ్రోకర్ నిబంధనల ఉల్లంఘన
- రూ. 3 లక్షల ఫైన్ విధించిన సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌పై రూ. 3 లక్షల జరిమానా విధించింది. స్టాక్ బ్రోకర్ నిబంధనలు అతిక్రమించినందుకు విధించిన జరిమానాను 45 రోజుల్లోగా చెల్లించవలసిందిగా ఆదేశించింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 జనవరి కాలంలో సెబీ నిర్దిష్ట పరిశోధన చేపట్టింది. 13 ఎన్ఎస్ఈ ట్రేడింగ్ టెర్మినళ్లు అధీకృత ప్రదేశాల్లో లేనట్లు ఈ సందర్భంగా గుర్తించింది. 13 టెర్మినళ్లకుగాను 5 టెర్మినళ్ల నుంచి లావాదేవీలు నిర్వహించినట్లు సెబీ ఉత్తర్వుల్లో పేర్కొంది. 9 బీఎస్ఈ టెర్మినళ్లు సంబంధిత ప్రాంతాలలో లేవని తెలియజేసింది. లావాదేవీలు 1 టెర్మినల్ నుంచే జరిగినట్లు వెల్లడించింది. నాలుగు ఎన్ఎస్ఈ, 4 బీఎస్ఈ టెర్మినళ్లలో అనుమతించిన వ్యక్తులుకాకుండా ఇతరులు నిర్వహిస్తున్నట్లు సెబీ దర్యాప్తులో గుర్తించింది.

మళ్లీ కొలువుల కళకళ!

- పుంజుకున్న ఉద్యోగ నియామకాలు
- మే నెలలో 8.9 శాతం అప్
- ఎనిమిది నెలల క్షీణతకు బ్రేక్



ముంబై: ఉద్యోగ నియామకాలు మే నెలలో సానుకూలంగా నమోదయ్యాయి. ఎనిమిది నెలల వరుస క్షీణత తర్వాత మే నెలలో 8.9 శాతం నియామకాలు పెరిగినట్లు (పోస్టింగ్‌లు) జాబ్‌సైట్ ఇండీడ్ ప్రకటించింది. ఇతర దేశాలతో పోల్చి చూస్తే భారత్‌లోనే అధిక నియామకాలు కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. మరింత సంఘటిత ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ మారుతుండడం ఇందుకు మద్దతునిస్తున్నట్లు తెలిపింది. భారత్‌లో ఉద్యోగ నియామకాలు కరోనా ముందు సంవత్సరం (2019) కంటే 80 శాతం అధికంగా ఉన్నట్టు, ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల కంటే ఎంతో మెరుగని వెల్లడించింది. ముఖ్యంగా యూకే, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్‌లో ఉద్యోగ నియామకాలు ఇప్పటికీ కరోనా ముందు నాటి కంటే తక్కువగా ఉండడాన్ని తన నివేదికలో ఇండీడ్ ప్రస్తావించింది. వీటితో పోల్చి చూసినప్పుడు భారత్‌లో నియామకాలు మెరుగ్గా ఉన్నట్టు తెలిపింది. భారత్ మార్పు దిశగా ప్రయాణిస్తుండడంతో ఇటీవలి సంవత్సరాల్లో సంఘటిత రంగంలో మరిన్ని ఉద్యోగ కల్పనలకు దారితీస్తున్నట్టు విశ్లేషించింది. ఇతర ఆర్థిక వ్యవస్థలు ఈ స్థాయిలో సంఘటితం వైపు అడుగులు వేయడం లేదని తెలిపింది.

ఈ విభాగాల్లో అధిక నియామకాలు..

చిన్నారుల సంరక్షణ విభాగంలో 27 శాతం, వ్యక్తిగత సంరక్షణ, గృహ ఆరోగ్యంలో 25 శాతం, విద్యా రంగంలో 24 శాతం, తయారీలో 22 శాతం చొప్పున మే నెలలో నియామకాలు పెరిగాయి. అదే సమయంలో డెంటల్ రంగలో 10.2 శాతం, వ్యవసాయం, ఫారెస్ట్రీలో 8.6 శాతం, కమ్యూనిటీ, సామాజిక సేవల్లో 6.8 శాతం, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 4.2 శాతం చొప్పున నియామకాలు తగ్గాయి. మే నెలలో 1.5 శాతం ఉద్యోగ ప్రకటనల్లో కంపెనీలు జెనరేటివ్ ఏఐ అవసరాన్ని ప్రస్తావించాయి. ముఖ్యంగా డేటా అనలైటిక్స్ ఉద్యోగాల్లో 12.5 శాతం వాటికిర, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 3.6 శాతం, సైంటిఫిక్ రీసెర్చ్‌లో 3.1 శాతం మేర జెనరేటివ్ ఏఐ పరిజ్ఞానాన్ని అవసరాన్ని పేర్కొన్నాయి.

ఎస్‌బీఐలో 505 ప్రొబేషనరీ ఆఫీసర్ల నియామకం

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా 505 మంది ప్రొబేషనరీ ఆఫీసర్లను కొత్తగా నియమించుకున్నట్టు ప్రకటించింది. జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్‌లో పరిశ్రమలోనే ఇదొక పెద్ద నియామకంగా పేర్కొంది. బ్యాంకింగ్ కార్యకలాపాలు, కార్పొరేట్ రుణాలు, అగ్రి బిజినెస్, వెల్త్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ కార్యకలపాలు, నియంత్రణలు, నిబంధనల అమలు తదితర విభాగాల్లో వీరు సేవలు అందించనున్నట్టు వెల్లడించింది. బ్యాంకులో అత్యున్నత స్థాయి ఉద్యోగం వరకు ఎదిగే అవకాశాలను ఎస్‌బీఐ వీరికి అందిస్తుందని తెలిపింది. 13,455 జూనియర్ అసోసియేట్లను సైతం నియమించుకున్నట్టు ఎస్‌బీఐ రెండు రోజుల క్రితమే ప్రకటించింది. వివిధ కేటగిరీల్లో కలిపి మొత్తం 18,000 మంది నియామకం చేపట్టినట్టు.. ఇందులో 13,500 మంది వరకు క్లరికల్ ఉద్యోగులు అని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి సైతం తెలిపారు.



సాక్షి ప్లస్
శనివారం । 14-6-2025

‘వారిద్దరిలా అభిమానాన్ని పొందలేదు’


ఫ్రెంచ్ ఓపెన్ సందర్భంగా ఫెడరర్, నాదల్‌లతో జొకోవిచ్

- ఎవరూ పట్టించుకోని పసివాడిలా భావించాను
- ఫెడరర్, నాదల్‌లపై జొకోవిచ్ వ్యాఖ్య
- సెర్బియా స్టార్ ప్లేయర్ అంతరంగం

బెల్‌గ్రేడ్: పురుషుల టెన్నిస్‌ను దాదాపు రెండు దశాబ్దాల పాటు ఫెడరర్, నాదల్, జొకోవిచ్ శాసించారు. ఫెడరర్ 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలుచుకోగా, నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో దానిని సవరించాడు. ఆ తర్వాత జొకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు సాధించి అగ్ర స్థానాన నిలిచాడు. అయితే సుదీర్ఘ కెరీర్‌లో ఫెడరర్, నాదల్ అభిమానులకు చేరువైనంతగా జొకోవిచ్ కాలేకపోయాడు. ఆట అద్భుతమే అయినా కొన్నిసార్లు కోర్టులో తన ప్రవర్తన, మాటతీరు అతని ప్రతిష్టను కొంత తగ్గించాయి. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు స్వయంగా జొకోవిచ్ ఈ విషయాన్ని అంగీకరించాడు. ఫెడరర్, నాదల్ తరహాలో తాను టెన్నిస్ ప్రేమికుల నుంచి తగినంత అభిమానం పొందలేకపోయానని అతను వ్యాఖ్యానించాడు. ‘నాలో ఎన్నో లోపాలు ఉండవచ్చు. అది వాస్తవం. అయితే ఎప్పుడూ మనసులో చెడు ఆలోచనలు లేకుండా మంచి ఉద్దేశంతోనే నా జీవితాన్ని గడిపాను. నాకు నచ్చినట్లుగా బతికాను. కానీ ఫెడరర్, నాదల్‌తో పోలిస్తే చాలాసార్లు నేను ఎవరికీ అక్కర్లేని పసివాడిలా నన్ను చూశారు. ఈ కారణంగా చాలాసార్లు బాధపడ్డాను. ఎందుకు ఇలా జరుగుతోందని చాలాసార్లు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. నా ప్రవర్తన మారితే అంతా బాగుంటుందని భావించి ఆ ప్రయత్నమూ చేశాను. అయినా సఫలం కాలేకపోయాను’ అని జొకోవిచ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అందుకే నన్ను పట్టించుకోలేదు...

ఫెడరర్, నాదల్‌తో పోలిస్తే తనకు తగినంత గౌరవం దక్కకపోవడానికి భౌగోళిక పరిస్థితులు కూడా ఒక కారణమని జొకోవిచ్ అభిప్రాయపడ్డాడు. యూరోప్‌లోని ప్రముఖ దేశాల నుంచి వారిద్దరు వచ్చారని, తాను వారికి సవాల్ విసరడం కొందరికి నచ్చలేదని అతను అన్నాడు. ‘నాకు గుర్తింపు రాకముందే ఫెడరర్, నాదల్ సముజ్జీలైన ప్రత్యర్థులుగా పోరాడుతూ వచ్చారు. పశ్చిమాన బలమైన దేశాలైన స్విట్జర్లాండ్, స్పెయిన్‌ల నుంచి వారు వచ్చారు. కాబట్టి నాతో పోలిస్తే సహజంగానే వారికి ఎన్నో సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరే గొప్ప ఆటగాళ్లు అనే కొందరి మనస్తత్వాన్ని నేను మార్చలేకపోయాను. పైగా నంబర్‌వన్‌ను అవుతాను అంటూ నేను చేసిన ప్రకటన చాలా మందికి నచ్చలేదు’ అని 38 ఏళ్ల జొకోవిచ్ గుర్తు చేసుకున్నాడు.

వారిద్దరిపై గౌరవం ఉంది...

ఫెడరర్, నాదల్‌లతో ఎన్నో గొప్ప మ్యాచ్‌లలో తలపడ్డానని, ఏనాడూ తప్పుగా మాట్లాడలేదని జొకో వ్యాఖ్యానించాడు. ‘మైదానంలో ప్రత్యర్థులైనంత మాత్రాన ఎవరినైనా ద్వేషిస్తామా. వారికి కీడు తలపెట్టాలని, ఏం చేసైనా ఓడించాలనే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. గెలుపు కోసమే పోరాడాం. మెరుగైన ఆటగాడే గెలిచాడు. వారిద్దరిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఒక్క చెడు మాట కూడా మాట్లాడలేదు. ఇకపై కూడా మాట్లాడను’ అని సెర్బియా స్టార్ తమ మనసులో మాట వెల్లడించాడు.

ముగ్గురి ఆట భిన్నం...

జొకోవిచ్ తన ఆటతో పాటు ఫెడరర్, నాదల్ ఆట గురించి కూడా విశ్లేషించాడు. ముగ్గురి ఆట భిన్నంగా ఉంటుందని అతను పోల్చాడు. ‘ఫెడరర్ చాలా ప్రతిభావంతుడు. అతని ఆట చాలా అందంగా అనిపిస్తుంది. అలవోకగా అతను కదిలి షాట్లు ఆడే తీరులో కూడా కళ కనిపిస్తుంది. నాదల్ దీనికి పూర్తిగా భిన్నం. అతని శారీరక సామర్థ్యం అసమానం. దానినే బాగా వాడుకుంటాడు. నా ఆట వీరిద్దరికి మధ్యలో ఉన్నట్లుగా ఉంటుంది. నాదల్ ప్రదర్శనతో నాకు దగ్గరి పోలికలు ఉన్నాయి. సమయం సాగుతున్నకొద్దీ మా ఆటలో మరిన్ని సొంత ప్రత్యేకతలు వచ్చి చేరాయి. ఒకరి ఆటను మరొకరు అభినందించుకుంటూ ముందుకు సాగాం. ఈ క్రమంలో మాలో పోటీతత్వం పెరిగి ఆట కూడా మరింత మెరుగైంది. వీరిద్దరితో హోరాహోరీ సమరాల్లో తలపడటం నాకు మేలు చేసింది. నా కెరీర్ ముందుకు సాగడంలో నిస్సందేహంగా వారి ప్రభావం ఉంది’ అని ఇటీవల జెనీవా ఓపెన్‌లో విజేతగా నిలిచి కెరీర్‌లో 100 సింగిల్స్ టైటిల్స్ పూర్తి చేసుకున్న జొకోవిచ్ వివరించాడు.

క్వార్టర్స్‌లో సహజ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. డొమినికన్ రిపబ్లిక్ రాజధాని సాంటో డొమింగోలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సహజ 6–4, 6–3తో థైసా గ్రానా పెడ్రెటి (బ్రెజిల్)పై గెలిచింది. తొలి రౌండ్‌లో ‘బై’ పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన సహజ 6–3, 2–6, 7–6 (7/4)తో ఇమా బుర్జిక్ (బోస్నియా అండ్ హెర్జెగోవినా)పై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో రాచెల్ గైలిస్ (అమెరికా)తో సహజ తలపడుతుంది. మరోవైపు డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ–హిరోకో కువాటా (జపాన్) ద్వయం 0–6, 6–4, 5–10తో ‘సూపర్ టైబ్రేక్’లో ఎస్తేర్ అదెషినా (బ్రిటన్)–సోఫియా డొమింగెజ్ (వెనిజులా) జోడీ చేతిలో ఓడిపోయింది.



హైదరాబాద్‌లో భారత్, న్యూజిలాండ్ మ్యాచ్!

వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే అవకాశం ● నేడు అపెక్స్ కౌన్సిల్ భేటీలో తుది నిర్ణయం



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆరంభంలో భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో ఒక మ్యాచ్ జరిగే అవకాశాలున్నాయి. 2026 జనవరిలో టీమిండియాతో 3 వన్డేలు, 5 టి20లు ఆడేందుకు న్యూజిలాండ్ జట్టు భారత్‌కు రానుంది. ఈ 8 మ్యాచ్‌ల కోసం జైపూర్, మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్, గువాహటి, హైదరాబాద్, త్రివేండ్రం, నాగ్‌పూర్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేశారు. ఈ సిరీస్‌ల కోసం మరికొన్ని వేదికలను కూడా పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఉంది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. తొలి టెస్టుకు అహ్మదాబాద్ వేదిక కానుండగా... రెండో మ్యాచ్ ఢిల్లీలో జరగనుంది. నవంబర్ 14 నుంచి దక్షిణాఫ్రికాతో కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు ఆడనుంది. 22 నుంచి గువాహటిలో రెండో టెస్టు జరుగుతుంది. ఆ తర్వాత నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6 మధ్య సఫారీ జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లు ఆడనుంది. ఈ మూడు మ్యాచ్‌లు వరుసగా రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలలో జరగనున్నాయి. అనంతరం డిసెంబర్ 9 నుంచి 19 వరకు ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ జరగనుంది. ఇందులో భాగంగా కటక్, ముల్లాన్‌పూర్, ధర్మశాల, లక్నో, అహ్మదాబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. రోస్టర్ విధానంలో అన్ని నగరాలకు ఆతిథ్యమిచ్చే అవకాశం ఇవ్వడంలో భాగంగా... వచ్చే ఏడాది ఆరంభంలో న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే, టి20 సిరీస్‌ల కోసం హైదరాబాద్ వేదికను పరిశీలిస్తున్నారు. శనివారం జరగనున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అపెక్స్ కౌన్సిల్ భేటీ అనంతరం కివీస్‌తో షెడ్యూల్ ప్రకటించనున్నారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌ల అనంతరం ఫిబ్రవరి–మార్చిలో భారత్, శ్రీలంక వేదికగా ఐసీసీ టి20 ప్రపంచకప్ జరగనుంది.


కనిక

భారత జట్టుకు ‘హ్యాట్రిక్’ విజయం

ఆంట్‌వర్ప్: ప్రొ హాకీ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో సీనియర్ పురుషుల జట్టు వరుస వైఫల్యాలతో సతమతమవుతుంటే... భారత జూనియర్ మహిళల జట్టేమో అదే యూరోప్ పర్యటనలో వరుస విజయాలతో దూసుకెళుతోంది. హాకీలో పటిష్టమైన బెల్జియంపై భారత యువ క్రీడాకారిణిల జట్టు ‘హ్యాట్రిక్’ విజయాన్ని సాధించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మూడో మ్యాచ్‌లో భారత బృందం 3–2 గోల్స్ తేడాతో బెల్జియంపై ఘనవిజయం సాధించింది. సోనమ్ భారత్‌కు శుభారంభం అందజేసింది. దీంతో ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే జట్టు ఖాతా తెరిచింది. 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం మూడో క్వార్టర్ మొదలైన రెండో నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను లాల్‌తంత్లుయాంగి (32వ నిమిషంలో) గోల్‌గా మలచడంతో ఆధిక్యం పెరిగింది. అయితే నిమిషాల వ్యవధిలో బెల్జియం అమ్మాయిలు మేరీ గోయెన్స్ (37వ నిమిషంలో), మార్టే మేరీ (40వ నిమిషంలో) చెరో గోల్ చేసి స్కోరును 2–2తో సమం చేశారు. ఈ దశలో భారత రక్షణ పంక్తి పట్టుతప్పినట్లు కనిపించినా తర్వాత పుంజుకుంది. మరో గోల్ అవకాశాన్ని ప్రత్యర్థికి ఇవ్వకుండా ఆఖరి క్వార్టర్‌ను కట్టుదిట్టంగా ఆడింది. ఇంకో తొమ్మిది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా... కనిక సివాచ్ (51వ నిమిషంలో) పెనాల్టీ కార్నర్‌ను వృథాకాకుండా గోల్‌గా మలచడంతో భారత్ 3–2తో మళ్లీ ఆధిక్యానికి చేరింది. ఈ ఆధిక్యాన్ని చివరిదాకా కాపాడటంలో డిఫెండర్లు పట్టుదల కనబరచడంతో భారత్ విజయం సాధ్యమైంది. బెల్జియంతో ఇదివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత జూనియర్ మహిళలే గెలుపొందగా... ఇప్పుడు ఆస్ట్రేలియాతో పోరాటానికి సిద్ధమైంది. నేడు ఆస్ట్రేలియాతో తొలి మ్యాచ్ ఆడుతుంది.

భారత్ X ఆస్ట్రేలియా

నేటి నుంచి మహిళల ప్రొ హాకీ లీగ్


యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామితో కలిసి ఆయనకు టీమ్ జెర్సీ అందజేసిన భారత మహిళల హాకీ జట్టు కెప్టెన్ సలీమా టెటె, కోచ్ హరేంద్ర సింగ్ తదితరులు

లండన్: మహిళల హాకీ ప్రొ లీగ్ యూరోపియన్ అంచె పోటీల కోసం భారత జట్టు పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. లోటుపాట్లను సవరించుకొని ఆస్ట్రేలియాను ‘ఢీ’కొట్టేందుకు రెడీ అయ్యింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) ప్రొ లీగ్‌లో 9 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్న భారత మహిళల జట్టు పట్టికలో ఎగబాకేందుకు యూరోప్ అంచెను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మహిళల టీమ్ నేడు, రేపు వరుస మ్యాచ్‌ల్లో ఆసీస్‌తో తలపడుతుంది. ప్రస్తుత జట్టు యువ క్రీడాకారిణిలతో పాటు అనుభవజ్ఞుల కలబోతతో సమతూకంగా ఉంది. యూరోప్ పర్యటనతో రాటుదేలాక సెప్టెంబర్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ టైటిల్‌తో నేరుగా వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలని మహిళల జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. గట్టి ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు దీటుగానే సిద్ధమయ్యామని చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ అన్నారు. ‘ప్రతి విభాగం కూడా పటిష్టమయ్యేందుకు సమష్టిగా శ్రమించాం. అయితే రెండు విభాగాల్లో మరింత దృష్టి సారించాల్సి వచ్చింది. ఫలితాన్ని తారుమారు చేసే గోల్ కీపింగ్, డ్రాగ్ ఫ్లికింగ్ విభాగాలు అత్యంత కీలకం’ అని కోచ్ అన్నారు. ఇందులో భాగంగానే డ్రాగ్‌ఫ్లికర్లు దీపిక, మనీషాలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. యూరోప్ టూర్‌కు ముందే డ్రాగ్ ఫ్లిక్‌లో నిపుణుడైన నెదర్లాండ్స్ కోచ్ టూన్ సీప్‌మన్‌తో పది రోజుల పాటు ఇద్దరు శిక్షణ తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన డ్రాగ్ ఫ్లికర్లలో చాలా మంది సీప్‌మన్ శిష్యులే అని ఈ సందర్భంగా హరేంద్ర సింగ్ చెప్పుకొచ్చారు. ఇలా ప్రతి విభాగంలోనూ క్రీడాకారిణిలను దీటుగా తయారు చేస్తున్నామని చెప్పారు. భారత్ అంచె పోటీల్లో ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్‌ను 2–2తో భారత్ నిలువరించేందుకు ప్రత్యేక కోచింగ్‌లే దోహదం చేశాయన్నారు. భువనేశ్వర్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ షూటౌట్‌లో గెలిచి బోనస్ పాయింట్ సాధించింది. పెర్త్ (ఆస్ట్రేలియా)లో ‘ఎ’ జట్టుతో ఆడిన ఫ్రెండ్లీ మ్యాచ్‌ల అనుభవం కూడా భారత అమ్మాయిలకు కలిసివస్తుందని చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ అన్నారు. ఆసీస్ సీనియర్ జట్టు బలాబలాలేంటో తమకు తెలుసని పరిస్థితులకు తగ్గట్లు వ్యూహాలతోనే బరిలోకి దిగుతామని చెప్పారు. కంగారూ టీమ్‌తో వరుస మ్యాచ్‌లు ముగిసిన వెంటనే ఇక్కడే 17, 18 తేదీల్లో పటిష్టమైన అర్జెంటీనాను ఎదుర్కొంటుంది. అనంతరం బెల్జియంకు పయనమవుతుంది. అంట్‌వర్ప్‌లో 21, 22 తేదీలో జరిగే మ్యాచ్‌ల్లో మేటి జట్టయిన బెల్జియంతో ఢీకొంటుంది. చివరగా బెర్లిన్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో చైనాతో జరిగే పోటీలతో యూరోప్ అంచె ప్రొ లీగ్ ముగుస్తుంది.

సోఫీ ఎకిల్‌స్టోన్ పునరాగమనం

భారత్‌తో టి20 సిరీస్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టు ప్రకటన




లండన్: భారత మహిళల జట్టుతో సొంతగడ్డపై జరగబోయే ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టును శుక్రవారం ప్రకటించారు. 14 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ జట్టుకు ఆల్‌రౌండర్ నాట్ సివర్ బ్రంట్ నాయకత్వం వహిస్తుంది. తొడ కండరాల గాయం కారణంగా ఆట నుంచి తాత్కాలిక విరామం తీసుకున్న ఇంగ్లండ్ ఎడంచేతి వాటం స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ జట్టులోకి పునరాగమనం చేసింది. 26 ఏళ్ల సోఫీ ఇంగ్లండ్ తరఫున 96 టి20 మ్యాచ్‌లు ఆడి 137 వికెట్లు పడగొట్టింది. అంతేకాకుండా 72 వన్డేలు ఆడి 120 వికెట్లు, 9 టెస్టులు ఆడి 40 వికెట్లు తీసుకుంది. జూన్ 28 నుంచి ఇంగ్లండ్, భారత్ జట్ల మధ్య ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ జరుగుతుంది. తొలి మ్యాచ్ జూన్ 28న ట్రెంట్ బ్రిడ్జ్‌లో, రెండో మ్యాచ్ జూలై 1న బ్రిస్టల్‌లో, మూడో మ్యాచ్ జూలై 4న ఓవల్‌లో... నాలుగో మ్యాచ్ జూలై 9న ఓల్డ్‌ట్రాఫర్డ్‌లో... చివరిదైన ఐదో మ్యాచ్ జూలై 12న ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతాయి.

ఇంగ్లండ్ టి20 జట్టు: నాట్ సివర్ బ్రంట్ (కెప్టెన్), ఎమ్ అర్లాట్, టామీ బ్యూమోంట్, లౌరెన్ బెల్, అలైస్ క్యాప్సీ, చార్లీ డీన్, సోఫియా డంక్లీ, సోఫీ ఎకిల్‌స్టోన్, లౌరెన్ ఫిలెర్, అమీ జోన్స్, పైజ్ స్కోల్‌ఫీల్డ్, లిన్సే స్మిత్, డానీ వ్యాట్ హాడ్జ్, ఇసీ వోంగ్.

బిగ్‌బాష్ లీగ్‌లో బాబర్ ఆజమ్

సిడ్నీ సిక్సర్స్ తరఫున తొలిసారి బరిలోకి దిగనున్న పాక్ స్టార్



సిడ్నీ: ఆస్ట్రేలియాలో జరిగే బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ మాజీ కెప్టెన్, స్టార్ ప్లేయర్ బాబర్ ఆజమ్ తొలిసారి బరిలోకి దిగనున్నాడు. ఇప్పటి వరకు కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్), బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్), లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్), పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్), విటాలిటీ బ్లాస్ట్ తదితర టి20 ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడిన బాబర్ ఆజమ్ ఇక బిగ్‌బాష్ లీగ్‌లోనూ తన బ్యాట్‌ను ఝుళిపించనున్నాడు. 2025–2026 బిగ్‌బాష్ లీగ్ సీజన్‌లో బాబర్ ఆజమ్ సిడ్నీ సిక్సర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. బీబీఎల్‌లో విదేశీ ఆటగాళ్లను ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 19న ఓవర్సీస్ డ్రాఫ్ట్ నిర్వహించనుండగా... దానికి ముందు ప్రతి ఫ్రాంచైజీ ఒక్కో ఆటగాడిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా సిడ్నీ సిక్సర్స్ జట్టు బాబర్ ఆజమ్‌ను తీసుకుంది. ఇప్పటికే ఆ జట్టులో ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్, సీన్ అబాట్, జోయల్ డేవిస్, జాక్ ఎడ్వర్డ్స్, హెన్రిక్స్, మర్ఫీ, జోష్ ఫిలిప్, జోర్డాన్ సిల్క్ వంటి పలువురు ఆటగాళ్లు ఉన్నారు. ‘ప్రపంచంలోని అత్యుత్తమ టి20 లీగ్‌ల్లో ఒకటైన బిగ్‌బాష్ లీగ్‌లో ఆడే అవకాశం రావడం ఆనందంగా ఉంది. గొప్ప ఫ్రాంచైజీలో భాగం కానున్నా. జట్టు విజయాల కోసం నా వంతు కృషి చేస్తా’ అని బాబర్ అన్నాడు. పాకిస్తాన్ నుంచి పలువురు ప్లేయర్లు బీబీఎల్‌లో పాల్గొంటున్నారు. షాహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్, హారీస్ రవూఫ్, రిజ్వాన్ సైతం ఈ సీజన్‌లో ఆడనున్నారు. ఇప్పటి వరకు 320 టి20 మ్యాచ్‌లు ఆడిన బాబర్ ఇటీవల పీఎస్‌ఎల్‌లో పెషావర్ జాల్మీ జట్టుకు సారథ్యం వహించాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో 128.57 స్ట్రయిక్‌రేట్‌తో 288 పరుగులు చేసి జట్టు తరఫున టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఏడాది ఆరంభంలో బాబర్ పాకిస్తాన్ జాతీయ టి20 జట్టులో చోటు కోల్పోయాడు.

ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ షురూ

- ఇంగ్లండ్ పర్యటనలో భారత్ చివరి ప్రాక్టీస్ మ్యాచ్
- విమాన ప్రమాద మృతులకు సంతాపం ప్రకటించిన టీమిండియా

బెకెన్‌హామ్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు భారత క్రికెట్ జట్టు నాలుగు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది. శుక్రవారం ఈ ప్రాక్టీస్ మ్యాచ్ ప్రారంభం కాగా... ఆట ఆరంభానికి ముందు అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు భారత జట్టు నివాళులర్పించింది. దీనికి సంబంధించిన ఫొటోలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఎయిరిండియా ఏఐ–171 విమాన ప్రమాదంలో మృతిచెందిన 265 మందికి సంతాపంగా ఆటగాళ్లంతా చేతులకు నల్ల రిబ్బన్లతో బరిలోకి దిగారు. మరోవైపు లార్డ్స్ వేదికగా జరుగుతున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ మూడో రోజు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు కూడా ఈ ప్రమాద మృతులకు ఒక నిమిషం పాటు మౌనం వహించి సంతాపం తెలిపారు. ఈ నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... అంతకుముందు ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో భారత ‘ఎ’ జట్టు రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడింది. ప్రస్తుతం భారత ‘ఎ’ జట్టు ఆటగాళ్లతో కలుపుకొని ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌కు అభిమానులు, మీడియాకు అనుమతి లేదు.



లండన్‌కు చేరాక ఫోన్ చేస్తా..

తండ్రికిచ్చిన మాట నిలబెట్టుకోకుండానే..
- ప్రాణాలు కోల్పోయిన డ్రీమ్‌లైనర్ ఉద్యోగి మైథిలి
- 12 మంది సిబ్బందిలో 9 మంది మహారాష్ట్ర వాసులే
- ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద గాథ

ముంబై: అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల హృదయవిదారక విషాద గాథలు ఒక్కటొక్కటిగా బయటకొస్తున్నాయి. ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ క్యాబిన్ క్రూలో పనిచేసే మైథిలీ పాటిల్(23) తన తండ్రి మోరేశ్వర్ పాటిల్‌కు గురువారం మధ్యాహ్నం చివరిసారిగా ఫోన్ చేశారు. లండన్ చేరుకున్నాక మళ్లీ చేస్తానంటూ ఆయన్ను అనునయించారు. కానీ, కొద్ది గంటల్లోనే ఘోరం జరిగిపోయింది. ఆమె తన మాట నెరవేర్చకుండానే తిరిగి రానిలోకాలకు వెళ్లిపోయారు. డ్రీమ్‌లైనర్‌లో క్రూ సిబ్బందిలో ప్రాణాలు కోల్పోయిన 12 మందిలో మైథిలి ఒకరు. అంతేకాదు, వీరిలో ఇద్దరు పైలట్లు సహా మొత్తం 9 మంది క్రూ సిబ్బంది మహారాష్ట్రకు చెందిన వారే కావడం గమనార్హం. నవా గ్రామానికి చెందిన మైథిలి రెండేళ్ల క్రితం ఎయిరిండియాలో జాయినయ్యారు. ఈమె తండ్రి మోరేశ్వర్‌పాటిల్ ఓఎన్‌జీసీ లేబర్ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. లండన్ చేరుకున్న వెంటనే ఫోన్ చేస్తానంటూ మైథిలి దుర్ఘటనకు కొద్దిసేపటి ముందే తండ్రికి ఫోన్ చేసి చెప్పారని ఆమె బంధువు, నవా గ్రామ మాజీ సర్పంచి జితేంద్ర మాత్రే చెప్పారు. క్యాబిన్ క్రూ మరో సభ్యుడు దీపక్ పాఠక్ థానె పక్కనే ఉన్న బద్లాపూర్ నివాసి. ఎయిరిండియాలో 11 ఏళ్లుగా పనిచేస్తున్న పాఠక్ లండన్ వెళ్లేముందుకు తల్లికి ఫోన్ చేసి మాట్లాడారని ఆయన సోదరి చెప్పారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన క్రూ సభ్యుడు అపర్ణా మహదిక్(43)కి కూడా ముంబై సమీప గోరెగావ్ ప్రాంతమే. ఈమె భర్త కూడా ఎయిరిండియా క్రూ సభ్యుడిగా పనిచేస్తున్నారు. అపర్ణకు ఎన్‌సీపీ నేత సునీల్ తత్కారేకు బంధువు. విమానం క్రూ సభ్యుల్లో ఒకరైన ఇర్ఫాన్ సమీర్ షేక్(22) రెండేళ్ల క్రితమే ఎయిరిండియాలో జాయినయ్యారు. ఈయన ఎన్నో కలలు కన్నారని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. షేక్ కుటుంబం పుణె నగరం పింప్రి చించ్‌వాడీలో ఉంటోంది. క్రూలో మరో సభ్యురాలు శ్రద్ధా ధావన్‌ది ములుండ్‌లోని వైశాలి నగర్. ధావన్ మరణ వార్త తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు డీఎన్‌ఏ నమూనాలు ఇచ్చేందుకు అహ్మదాబాద్‌కు వెళ్లారు. విమాన క్యాబిన్ క్రూ సభ్యుల్లో రోష్నీ రాజేంద్ర సాంఘూరె డొంబివిలి ప్రాంతంలో ఉంటుండగా, సాయినీత చక్రవర్తి జుహు కొలివాడకు చెందిన వారు. ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా అయిన సాంఘూరేకు ఇన్‌స్టాలో 54 వేలకు పైగా ఫాలోయర్లున్నారు. ప్రమాదంలో చనిపోయిన పైలట్ సుమీత్ పుష్కరాజ్ సభర్వాల్(56) ముంబైలోని పొవైలో జల్ వాయు విహార్‌లో వృద్ధులైన తల్లిదండ్రులతో ఉంటున్నారు. విమానం కో–పైలట్ క్లైవ్ కుందర్‌ది కూడా ముంబైనే. శాంటాక్రుజ్ ప్రాంతంలోని కలినాలో జెరోమ్ అపార్టుమెంట్‌లో నివసిస్తున్నారు.


మైథిలి

భర్తతో కలిసి గడపాలని..

గుజరాత్‌లోని మెహ్‌సనాకు చెందిన అంకితా పటేల్‌ది మరో విషాదం. ఈమెకు గతేడాది డిసెంబర్‌లో పెళ్లయింది. భర్త వసంత్ లండన్‌లో ప్రొవిజన్ స్టోర్ యజమాని. ఈ నూతన దంపతులు కలిసి గడిపింది కేవలం 12 రోజులు మాత్రమే. వసంత్ లండన్ వెళ్లిపోవడంతో, తనూ అక్కడికి వెళ్లి భర్తతో గడపాలని ఎన్నో ఆశలు పెట్టుకుంది. తన తల్లిదండ్రులు, సోదరుడితోపాటు వసంత్ సోదరితో కలిసి వీసా కోసం చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. అంకితను లండన్ పంపించేందుకు వీరంతా గురువారం విమానాశ్రయానికి వచ్చారు. ఆమెకు గుడ్ బై చెప్పి మెహ్‌సనాకు బయలుదేరిన కొద్దిసేపటికే ఘోరం జరిగిపోయిందని వసంత్ సోదరి ఆశాబెన్ పటేల్ చెప్పారు. వెంటనే తిరిగి వచ్చామన్నారు. గాట్విక్ విమానాశ్రయంలో భార్యకు ఘనస్వాగతం పలకాల్సిన వసంత్..బదులుగా ఆమె అవశేషాలను తీసుకునేందుకు వస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించేందుకు అధికారులు అంకిత సోదరుడి డీఎన్‌ఏ నమూనాలు తీసుకున్నట్లు వివరించారు.

ప్రయాణాలంటే ఎంతో సరదా..

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన నీరజ్ లవానియా(50), అపర్ణ దంపతులకు ప్రయాణాలంటే ఎంతో ఇష్టం. ఈ వేసవి సెలవుల్లో లండన్ వెళ్లాలనుకున్నారు. వీరితోపాటు 18 ఏళ్ల కుమార్తె కూడా వెళ్లాల్సి ఉంది. అయితే, ఒంటరిగా ఉండే 70 ఏళ్ల నీరజ్ తల్లిని చూసుకునేందుకని ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా విమానమెక్కిన లవానియా దంపతులు ప్రాణాలు కోల్పోయారు. డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్న వీరి కూతురు తల్లిదండ్రుల అవశేషాలను గుర్తుపట్టేందుకు అహ్మదాబాద్ వెళ్లి అధికారులకు డీఎన్‌ఏ నమూనా ఇచ్చారు. ఆగ్రాలోని అకోలాకు చెందిన నీరజ్ 1995లో ప్రైవేట్ కంపెనీలో జాబ్ కోసమని వడోదరకు మకాం మార్చారు. చుట్టుపక్కల వారితో ఎంతో కలుపుగోలుగా ఉండే నీరజ్ మరణ వార్త విని అకోలా వాసులు సైతం విషాదంలో మునిగిపోయారు. విమాన ప్రయాణానికి కొద్దిసేపటి ముందే 1.30 గంటల సమయంలో తనతో నీరజ్ మాట్లాడాడని సోదరుడు సతీశ్ చెప్పారు. టీవీలో వచ్చిన వార్తను చూసి షాక్‌కు గురయ్యానన్నారు.



ఆప్తుల ఆవేదన...















అహ్మదాబాద్‌లోని బీజే వైద్య కళాశాల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. విమాన ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. పైఫొటోల్లో విషణ్ణ వదనాలతో ఉన్న వీరంతా డీఎన్‌ఏ నమూనాలను అందజేసేందుకు వచ్చిన మృతుల కుటుంబీకులు.

కుమారుడి వద్ద గడిపేందుకని..

డ్రీమ్‌లైనర్ ప్రమాద మృతుల్లో మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా వాసి మహదేవ్ పవార్(68), ఆశా(60) దంపతులు కూడా ఉన్నారు. సంగోలా తెహశీల్‌లోని హటిడ్ గ్రామానికి చెందిన మహదేవ్ గుజరాత్‌లోని నడియాడ్‌లోని టెక్స్‌టైల్ మిల్లులో పని చేసేవారు. ఈయనకు ఇద్దరు కుమారులు. ఒకరు అహ్మదాబాద్‌లో, మరొకరు లండన్‌లో ఉంటున్నారు. లండన్‌లో నివసిస్తున్న కుమారుడి వద్దకని బయలుదేరిన ఈ దంపతులు విమాన ప్రమాదం బారినపడ్డారు. వీరు అహ్మదాబాద్‌లో 15 ఏళ్లుగా నివసిస్తున్నారని సోలాపూర్ జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఈ దంపతులు ఇటీవలే హటిడ్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చి వెళ్లారని చెప్పారు.

భర్త బర్త్‌డే కోసం..

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన హర్‌ప్రీత్ కౌర్ హోరా(28) ఐటీ నిపుణురాలిగా బెంగళూరులో పనిచేస్తున్నారు. ఈమె భర్త రాబ్బీ హోరా లండన్‌లోని ఐటీ కంపెనీలో ఉద్యోగి. ఈనెల 16న రాబ్బీ పుట్టినరోజు. వాస్తవానికి హర్‌ప్రీత్ ఈ నెల 19న లండన్ వెళ్లాల్సి ఉంది. అయితే, భర్త పుట్టిన రోజు వేడుక కోసమని ముందుగానే ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌లో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. లండన్ వెళ్లాక దంపతులు యూరప్ టూర్ కూడా ప్లాన్ చేసుకున్నారని బంధువులు చెప్పారు. ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోయిందని, వీరి కుటుంబాలు తీవ్ర దుఃఖంలో మునిపోయాయని బంధువులు చెప్పారు.

టీస్టాల్ యజమాని 14 ఏళ్ల కుమారుడు..

డ్రీమ్‌లైనర్ ప్రమాదం అహ్మదాబాద్ మెఘానీనగర్ ప్రాంతం బీజే మెడికల్ కాలేజీ హాస్టల్‌కు సమీపంలోని చెట్టు కింద టీకొట్టు నడుపుకునే కుటుంబంలో తీరని విషాదం నింపింది. విమానం కూలిన సమయంలో సీతా బెన్ టీ తయారు చేస్తుండగా ఆమె కుమారుడు 14 ఏళ్ల ఆకాశ్ పట్ని పక్కనే నిద్రిస్తున్నాడు. కూలిన విమాన లోహ శకలం ఒకటి వచ్చి ఆకాశ్ తలను తాకింది. ఆ వెంటనే చెలరేగిన మంటల్లో ఆకాశ్ మాడి మసయ్యాడు ఆకాశ్. కుమారుడిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నంలో తల్లి సీతా బెన్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

అంతా బాగుందని చెప్పి అంతలోనే..

గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉండే సురేశ్ మిస్త్రీ అహ్మదాబాద్ బీజే మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో వద్ద డీఎన్‌ఏ నమూనా ఇచ్చేందుకు క్యూలో ఉన్నారు. ఈయన కుమార్తె 21 ఏళ్ల క్రినా మిస్త్రీ విమాన ప్రమాదంలో చనిపోయింది. వర్క్ వీసా రావడంతో ఏడాది క్రితం లండన్ వెళ్లిన క్రినా ఇటీవలే ఆనంద్‌కు తిరిగి వచ్చింది. వైద్య చికిత్స అనంతరం డ్రీమ్‌లైనర్‌లో లండన్ తిరిగి పయనమయ్యింది. విమానం ఎక్కాక కూడా తండ్రికి ఫోన్ చేసి నిశ్చింతగా ఇంటికి వెళ్లండంటూ ధైర్యం చెప్పింది. ఇంటికి వెళ్లాక దుర్వార్త తెలిసిందని, క్రినా ఇక లేదన్న విషయాన్ని నమ్మలేకపోతున్నట్లు సురేశ్ గద్గద స్వరంతో చెప్పారు.

తిరిగొచ్చాక భారీగా వేడుక చేద్దామని..

గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర విషాదంలో అసువులు బాసిన వారిలో భవిక్ మహేశ్వరి(26) అనే నవ వరుడు కూడా ఉన్నారు. లండన్‌లో పనిచేసే భవిక్ 15 రోజుల క్రితమే వడోదరకు వచ్చారు. పెళ్లి చేసుకున్నాకే తిరిగి లండన్ వెళ్లాలని కుటుంబసభ్యులు పట్టుబట్టడంతో వారి కోరిక మేరకు జూన్ 10న ఓ యువతితో చాలా సాదాసీదాగా పెళ్లి చేసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత నవ వధువును లండన్ పంపేందుకు ఏర్పాట్లు సైతం మొదలయ్యాయి. మరోసారి వివాహ వేడుకను భారీగా నిర్వహించాలని ప్లాన్ చేసుకున్నారు. నూతన వధువు సహా కుటుంబసభ్యులంతా గురువారం అహ్మదాబాద్ విమానాశ్రయంలో భవిక్‌కు వీడ్కోలు పలికారు. వారి తిరిగి ఇళ్లకు చేరుకున్నారో లేదో ఘోరం జరిగిపోయింది. ఈ విషాదాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోందని బంధువొకరు తెలిపారు.

ఏకైక కెనడియన్ నిరాలీ పటేల్..

అహ్మదాబాద్ విషాద బాధితుల్లో కెనడా పౌరురాలు ఒకరుండటం తెల్సిందే. ఈమె భారత సంతతికి చెందిన నిరాలీ పటేల్(32). టొరంటోని ఎటోబికోక్‌లో ఉండే నిరాలీ సోషల్ ట్రిప్‌లో భాగంగా భారత్‌కు వచ్చారు. నిరాలీ మరణవార్త తెల్సిన భర్త, ఏడాది వయస్సున్న కుమార్తెతో భారత్‌కు వచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఈమె తల్లిదండ్రులు, సోదరుడి కుటుంబం బ్రాంప్టన్‌లో నివస్తున్నారు. భారత్‌లో 2016లో దంత వైద్యంలో డిగ్రీ పొందిన నిరాలీ 2019లో కెనడా వెళ్లారు. మిస్సిస్సాగాలో డెంటల్ క్లినిక్ నడుపుతున్నారు. నిరాలీ మృతి పట్ల కెనడా ప్రధాని మార్క్ కార్నీ, విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ సంతాపం ప్రకటించారు.

అంత్యక్రియలకు బయల్దేరి అనంతలోకాలకు

అహ్మదాబాద్/నాగ్‌పూర్: అహ్మదాబాద్ నుంచి లండన్‌కు అంత్యక్రియల కోసం వెళ్తున్న కుటుంబంలోని ముగ్గురు విమాన ప్రమాదంలో మరణించారు. నాగపూర్‌కు చెందిన 32 ఏళ్ల యశా కామ్‌దార్‌కు నాలుగేళ్ల కిందట అహ్మదాబాద్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. అప్పటినుంచి ఆమె అహ్మదాబాద్‌లోనే నివసిస్తున్నారు. మామ కిషోర్ మోదా చాలాకాలంగా లండన్‌లో ఉంటున్నారు. ఆయన అంత్యక్రియల కోసం ఒకటిన్నరేళ్ల కొడుకు, 58 ఏళ్ల అత్త రక్షతో కలిసి ఆమె లండన్ బయల్దేరి ముగ్గురూ ప్రమాదానికి బలయ్యారు. దాంతో యశా కుటుంబం, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. నాగపూర్‌లోని ఆమె తల్లిదండ్రులు అహ్మదాబాద్ బయలుదేరారు.

లండన్ నుంచి పూర్తిగా వచ్చేయాలనుకుని..

కోచి: విమాన ప్రమాదంతో మరణించిన 39 ఏళ్ల కేరళ నర్సు రంజితది మరో విషాద గాథ. కేరళ ప్రభుత్వ నర్సుగా చేసిన ఆమె సెలవు పెట్టి కొంతకాలం ఒమన్‌లో పని చేశాక బ్రిటన్ వెళ్లింది. లండన్‌లో నర్సుగా చేస్తోంది. కేరళలో కొత్తిల్లు కట్టుకుని కుటుంబానికి కొత్త జీవితం ఇవ్వాలని కలలు కంది. లండన్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి శాశ్వతంగా భారత్‌కు వచ్చేయాలనుకుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. వారిని రంజిత తల్లి చూసుకుంటోంది. నాలుగు రోజుల క్రితమే కేరళ వచ్చింది. అక్కడ మళ్లీ తన ప్రభుత్వోద్యోగంలో చేరడానికి లాంఛనాలు పూర్తి చేసింది. లండన్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి సర్టిఫికెట్లు, సామగ్రి తెచ్చుకోవడానికి గురువారం చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లింది. లండన్‌కు ఎయిరిండియా విమానమెక్కి తిరిగిరాని లోకాలకు చేరింది. దాంతో పిల్లలు, తల్లి దిక్కులేనివారయ్యారు. కాగా, రంజితను కులపరంగా, లైంగికంగా వేధిస్తూ ఆన్‌లైన్‌లో అసభ్య పోస్టులు పెట్టిన కాసరగోడ్ జిల్లా వెల్లరికుందు డిప్యూటీ తహశీల్దార్ పవిత్రన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఇతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడు ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హుడని, మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

అమెరికాలో ఆగని రగడ

కొనసాగుతున్న ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు
- అక్రమ వలసదారుల అరెస్టుల పట్ల ఆగ్రహం
- నేడు భారీ ర్యాలీలకు సిద్ధమవుతున్న నిరసనకారులు
- ఇమ్మిగ్రేషన్ దాడులు, డిపోర్టేషన్లు కొనసాగుతాయన్న ట్రంప్ ప్రభుత్వం



గురువారం లాస్ ఏంజెలెస్‌లోని ఫెడరల్ భవనం వద్ద కాలిఫోర్నియా నేషనల్ గార్డుల కాపలా

వాషింగ్టన్/ఆస్టిన్: అమెరికాలో వలసదారుల ఆందోళనలు, నిరసన కార్యక్రమాలతో ప్రధాన నగరాలు అట్టుడికిపోతున్నాయి. మరోవైపు ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) ఆధ్వర్యంలో అక్రమ వలసదారుల అరెస్టులు, గెంటివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజధాని వాషింగ్టన్ డీసీలో శనివారం భారీ ఎత్తున మిలటరీ పరేడ్ జరుగనుంది. విదేశాల నుంచి అతిథులు హాజరు కాబోతున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 'నో కింగ్స్'కార్యక్రమాలు నిర్వహించాలని, నిరసనలు ఉధృతం చేయాలని వలసదారులు నిర్ణయించారు. దాదాపు 2 వేల ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టేలా వ్యూహం రూపొందించారు. ఫిలడెల్ఫియాలో భారీ ర్యాలీకి సిద్ధమవుతున్నారు. దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల శాంతియుతంగానే జరుగుతున్నప్పటికీ, మరికొన్నిచోట్ల హింసాత్మకంగా మారుతున్నాయి. లాస్ ఏంజెలెస్, స్పోకేన్ సిటీలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఒత్తిళ్లకు లొంగిపోయే ప్రసక్తే లేదని, ఇమ్మిగ్రేషన్ రైడ్స్, డిపోర్టేషన్లు యథాతథంగా కొనసాగుతాయని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. అక్రమ వలసదారులు దేశం విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే బలవంతంగా పంపించక తప్పదని స్పష్టంచేసింది.

అధికారులపై రాళ్లు, టపాకాయలతో దాడులు

అక్రమ వలసదారుల అరెస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. లాస్ వెగాస్‌లో 94 మంది నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. వారిపై పలు అభియోగాలు మోపారు. బుధవారం రాత్రి ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు 800 మంది వలసదారులు అధికారులపై విరుచుకుపడ్డారు. రాళ్లు, మంచినీటి సీసాలు విసిరారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో నలుగురు అధికారులు గాయపడ్డారు. జనాన్ని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారు. మిషగాన్‌లో గురువారం ఆందోళనలు జరిగాయి. వందలాది మంది పార్క్ ప్లాజాలో గుమికూడారు. ట్రంప్ ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తిపోశారు. తమను బలవంతంగా బయటకు వెళ్లగొట్టాలని చూస్తే చట్టపరంగా పోరాడుతామని హెచ్చరించారు. సియాటెల్ డౌన్‌టౌన్‌లో సైతం నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తమను అడ్డుకొనేందుకు ప్రయత్నించిన పోలీసులపై నిరసనకారులు పెప్పర్‌స్ప్రే చల్లారు. టపాకాయలు, రాళ్లు విసిరారు. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రద్దు చేయాలని నినదించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని స్పోకేన్ సిటీలో 30 మందికిపైగా నిరసనకారులు అరెస్టయ్యారు. టెక్సాస్ రాష్ట్రంలోని శాన్ అంటోనియో, అరిజోనా రాష్ట్రంలోని టక్సన్‌లో ఆందోళనలు శాంతియుతంగా జరుగుతున్నాయి. అలాస్కాలో 40 మంది వలసదారులను పోలీసులు నిర్బంధించారు. లాస్ ఏంజెలెస్‌లో గత వారం రోజుల్లో 470 మంది అరెస్టయ్యారు. న్యూజెర్సీలో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్‌ను నిరసనకారులు చుట్టుముట్టారు. ఈ కేంద్రంలో చాలామంది అక్రమ వలసదారులను అధికారులు నిర్బంధించారు. వీరిని విడిపించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో న్యూజెర్సీలో వెయ్యి పడకలతో డిటెన్షన్ సెంటర్ ఏర్పాటు చేశారు. శనివారం ఆందోళనలు మరింత ఉధృతరూపం దాల్చే అవకాశం ఉన్నట్లు సంకేతాలు రావడంతో పలు రాష్ట్రాల్లో ముందు జాగ్రత్తగా నేషనల్ గార్డు దళాలను మోహరిస్తున్నారు. 'నో కింగ్స్'ర్యాలీలకు అనుమతి లేదని గవర్నర్లు చెబుతున్నారు. హింస, విధ్వంసానికి పాల్పడేవారిపై త్వరగా విచారణ చేపట్టాలని అమెరికా న్యాయ శాఖ అన్ని రాష్ట్రాల అటార్నీలకు గురువారం సందేశం పంపించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది.

ట్రంప్ నిర్ణయానికి కోర్టు మద్దతు

ఆందోళనలు అణచివేయడానికి లాస్‌ఏంజెలెస్‌కు 4 వేల నేషనల్ గార్డు దళాలను, 700 మంది మెరైన్ గార్డులను రంగంలోకి దించాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు కాలిఫోర్నియాకు నేషనల్ గార్డు సిబ్బందిని పంపించాలన్న నిర్ణయాన్ని తప్పుపడుతూ ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును తొమ్మిదో యూఎస్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్ తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ నిర్ణయానికి పరోక్షంగా మద్దతు పలికింది. కోర్టు నిర్ణయంతో నేషనల్ గార్డు సిబ్బందికి అడ్డంకి తొలగిపోయింది. నిరసనకారులను ఎక్కడికక్కడ అరెస్టు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

పార్లమెంట్ భేటీకి ముందే బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

జూలై 21 నాటికి అధ్యక్ష ఎంపిక ప్రక్రియ పూర్తి చేసే యోచనలో బీజేపీ

ఆలోగానే తెలంగాణ, ఏపీ, యూపీ సహా పలు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికను వచ్చే నెల జరుగనున్న పార్లమెంట్ సమావేశాలకు ముందుగానే ముగించాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. జూలై 21న పార్లమెంట్ సమావేశాలు ఆరంభమయ్యే ముందు నాటికే జాతీయ అధ్యక్షుడి ఎంపిక పూర్తి చేసేలా ఎన్నికల ప్రక్రియను వచ్చే వారంలో ప్రారంభించాలని పార్టీ యోచిస్తోంది. ఆగస్టు 15 నుంచి బిహార్ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యే అవకాశాల దృష్ట్యా, కొత్త అధ్యక్షుడి నేతృత్వంలోనే ఎన్నికలను ఎదుర్కొనే ఆలోచనలో ఉంది. ఇప్పటికే బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక పదేపదే వాయిదా పడుతూ వస్తుంది. మే నెలలోనే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని భావించినా ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దీనిని వాయిదా వేశారు. అధ్యక్ష బరిలో నిలిపే అభ్యర్థుల పేర్లపైనా పరిశీలనలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రధాన పోటీదారుల జాబితాలో కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్, మనోహర్‌లాల్ ఖట్టర్, భూపేంద్ర యాదవ్, జి.కిషన్‌రెడ్డిలతో పాటు పార్టీ సీనియర్ నేతలు సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్ తదితరులు ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లో బిహార్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. అంటే సెప్టెంబర్‌లోగా ఎన్డీఏ కూటమి పక్షాలతో సీట్ల పంపకాలు, పోటీ చేసే స్థానాలు, అభ్యర్థులపై ఓ అవగాహనకు రావాల్సి ఉంది. ఇది జరగాలంటే ఆగస్టు నుంచే బిహార్ ఎన్నికలపై ఆగస్టు నుంచే పూర్తి స్థాయి ఫోకస్ పెట్టాల్సి ఉంది. అయితే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు జరుగనున్నాయి. పార్టీ కీలక నేతలంతా సమావేశాల్లో బిజీగా ఉండే నేపథ్యంలో, సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కొత్త అధ్యక్షుడిని ఎంపిక చే యాలని, అలా అయితేనే ఆయన సారథ్యంలో బిహార్ ఎన్నికలపై ముందుకు వెళ్లొచ్చనే భావనలో పార్టీ ఉంది. దీనికై ఈ నెల చివరి వారంలో అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాల్సి ఉంది. పార్టీ నియమావళి ప్రకారం జాతీయ అధ్యక్షుడి ప్రకటనకు ముందే సగానికి పైగా రాష్ట్రాల్లో అధ్యక్షుల ఎంపికను పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి చాలా రాష్ట్రాల్లో అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. వీరిని త్వరలోనే ప్రకటించే దిశగా ఇప్పటికే కీలక చర్చలు ముగిశాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీరి ప్రకటన ముగిసిన వెంటనే కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ మొదలయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తయితే ఆయన మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ మూడేళ్ల కాలంలో యూపీ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, పంజాబ్ వంటి కీలక రాష్ట్రాలతో పాటు మొత్తంగా 12 రాష్ట్రాల ఎన్నికలు ఈయన సారథ్యంలోనే జరుగుతాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు సైతం కొత్త అధ్యక్షుడి హయంలోనే ఉండనున్నాయి.


ఇండియన్ బిస్మార్క్ అని ఎవరిని అంటారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్ర (స్వాతంత్ర్యోద్యమం)

- సిల్వర్ టంగ్డ్ ఆరేటర్ అని ఏ జాతీయ నాయకుడిని పిలుస్తారు? - **సురేంద్రనాథ్ బెనర్జీ**
- హంటర్ విద్యా కమిషన్ సభ్యుడైన భారతీయుడు? - **ఆనందమోహన్ బోస్**
- నేతాజీ స్థాపించిన పార్టీ? - **ఫార్వర్డ్ బ్లాక్**
- వందేమాతరాన్ని ఆంగ్లంలోకి అనువదించినవారు? - **అరవింద ఘోష్**
- ఆనందమఠ్‌లో ప్రధాన ఇతివృత్తం? - **సన్యాసుల తిరుగుబాటు**
- అలీపూర్ కుట్ర కేసు నుంచి అరవిందఘోష్‌ను నిర్దోషిగా విడుదల చేయించినవారు? - **సి.ఆర్.దాస్**
- భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన తొలి ముస్లిం? - **అష్ఫకుల్లాఖాన్**
- దేశంలో తొలిసారి అరెస్టయిన బాలుడిగా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నిలిచినవారు? - **ఓరుగంటి రామచంద్రయ్య**
- సిన్‌ఫిన్ ఉద్యమం ప్రేరణతో భారత్‌లో జరిగిన ఉద్యమం? - **హోం రూల్ ఉద్యమం**
- సహాయ నిరాకరణోద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? - **1920, ఆగస్టు 31**
- సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్థాపించిన విద్యా సంస్థలు? - **జామియా మిలియా ఇస్లామియా, బిహార్ విద్యాపీఠం, కాశీ విద్యాపీఠం, గుజరాత్ విద్యాపీఠం**
- వందేమాతర ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? - **1905, అక్టోబర్ 16**
- న్యూలాంప్స్ ఫర్ ఓల్డ్, వ్యాస సంపుటి రాసినవారు? - **అరవింద ఘోష్**
- వందేమాతర ఉద్యమ కాలంలో గోపాల మిత్ర బెంగాల్‌లో ఏర్పర్చిన సంస్థ? - **వార్షిక హిందూ మేళా**
- దక్షిణ భారత్‌లో తొలి INC సమావేశం జరిగిన ప్రాంతం? - **మద్రాస్**
- ఇంగ్లండ్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు? - **దాదాభాయ్ నౌరోజీ**
- క్విట్ కశ్మీర్ ఉద్యమ నిర్మాత? - **షేక్ అబ్దుల్లా**
- శాసనోల్లంఘనోద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? - **1930, మార్చి 12**
- బెంగాల్‌ను తిరిగి ఏకీకరించిన సంవత్సరం? - **1911**
- కలకత్తా నుంచి రాజధానిని ఢిల్లీకి మార్చినవారు? - **హార్డింజ్**
- రాజాజీ ఫార్ములాను ఎప్పుడు రూపొందించారు? - **1944**
- స్వదేశీ ఉద్యమంలో బాలభారతి సమితి ఎక్కడ ఏర్పడింది? - **రాజమండ్రి**
- "యాచించడం కాదు శాసించాలి" అన్నవారు - **లోకమాన్య బాలగంగాధర్ తిలక్**
- తిలక్ ప్రచురించిన పత్రికలు? - **కేసరి, మరాఠీ**
- త్రివర్ణ పతాకాన్ని మేడం కామా ఎక్కడ ఎగురవేశారు? - **స్టట్‌గర్ట్ (జర్మనీ)**
- గాంధీజీ దక్షిణాఫ్రికాకు ఎప్పుడు వెళ్లారు? - **1893**
- మైఖేల్-ఒ-డయ్యర్‌ను ఉద్ధమ్‌సింగ్ ఎప్పుడు చంపాడు? - **1940**
- జామా మసీదు (ఢిల్లీ) ప్రార్థనలో పాల్గొన్న ఆర్యసమాజ నాయకుడు? - **స్వామి శ్రద్ధానంద**
- సైమన్ కమిషన్ కాలంలో మద్రాస్‌లో మరణించిన యువకుడు? - **పార్థసారథి**
- సైమన్ కమిషన్ ఏర్పడిన సంవత్సరం? - **1928 (ఇందులోని సభ్యుల సంఖ్య 7. ఈ కమిషన్ కాలం నాటి వైస్రాయ్ ఇర్విన్)**
- జెండా సత్యాగ్రహాన్ని నాగ్‌పూర్‌లో ప్రారంభించినవారు? - **జమ్నాలాల్ బజాజ్**
- కేంద్ర శాసనసభకు స్పీకర్‌గా ఎన్నికైన తొలి భారతీయుడు? - **విఠల్‌భాయ్ పటేల్**
- శాసనోల్లంఘనోద్యమ రాణి ఎవరు? - **సరోజినీ నాయుడు**
- గైడిన్‌లియూ ఏ ఉద్యమంలో ప్రసిద్ధి పొందారు? - **ఉప్పు సత్యాగ్రహం**
- ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ బిరుదు? - **సరిహద్దు గాంధీ**
- ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న గాంధీజీ అనుచరుల సంఖ్య? - **78**
- హరిజనోద్ధరణ ఆంధ్ర శాఖ స్థాపకుడు? - **కాశీనాథుని నాగేశ్వరరావు**
- శారదా నికేతన్‌ను ఉన్నవ లక్ష్మీనారాయణ ఎక్కడ స్థాపించారు? - **గుంటూరు**
- కొండా వెంకటప్పయ్య బిరుదు? - **దేశభక్త**
- సుభాష్ చంద్రబోస్ ఎక్కడ జన్మించారు? - **కటక్ (ఒడిశా)**
- అండమాన్, నికోబార్ దీవులకు బోస్ పెట్టిన పేర్లు? - **షహీద్, స్వరాజ్**
- ది డివైన్ లైఫ్, సావిత్రి గ్రంథాల రచయిత? - **అరవింద ఘోష్**
- 1946 నాటి క్యాబినెట్ మిషన్‌లోని సభ్యులు? - **పెథిక్ లారెన్స్, సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్**
- వేల్స్ రాకుమారుడు (8వ ఎడ్వర్డ్) ఇండియాను ఎప్పుడు సందర్శించారు? - **1921**
- భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి భారతీయ వనిత? - **సరోజినీ నాయుడు**
- దేశికోత్తమ బిరుదాంకితులు ఎవరు? - **సురేంద్రనాథ్ బెనర్జీ**
- ఏ నియోజకవర్గం నుంచి దాదాభాయి నౌరోజీ బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికయ్యారు? - **ఫ్రిన్స్‌బరి**
- ఫకీర్ మోహన్ సేనాపతి ఏ రాష్ట్రానికి చెందిన జాతీయ కవి? - **ఒడిశా**
- కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (1934) స్థాపకులు? - **జయప్రకాష్ నారాయణ్, ఆచార్య నరేంద్రదేవ్**



- అతివాదులు, మితవాదులు ఎప్పుడు ఏకమయ్యారు? - **1916**
- గాంధీజీ రాసిన ప్రముఖ గ్రంథాలు? - **మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్, హింద్ స్వరాజ్**
- 1921 మోప్లా తిరుగుబాటు (కేరళ) నాయకుడు? - **అలీ ముస్లియార్**
- రౌండ్‌టేబుల్ సమావేశాలు మొత్తం ఎన్ని జరిగాయి? - **3**
- అజాద్ హింద్ ఫౌజ్ సైనికుల తరఫున వాదించిన జాతీయ కాంగ్రెస్ న్యాయవాదుల బృందం? - **భూలాభాయ్ దేశాయ్, తేజ్ బహదూర్ సప్రూ, అసఫ్ అలీ**
- అజాద్ హింద్ ఫౌజ్ మహిళా విభాగం పేరు? - **ఝాన్సీ లక్ష్మీబాయి దళం**
- ఝాన్సీ లక్ష్మీబాయి దళానికి నాయకురాలు? - **లక్ష్మీ సెహగల్**
- ది గ్రేట్ కలకత్తా కిల్లింగ్ ఎప్పుడు జరిగింది? - **1946 ఆగస్టు 16**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్‌ను బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ సభలో ప్రవేశపెట్టినవారు? - **లిస్టోవెల్**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్‌ను బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ప్రవేశపెట్టినవారు? - **లార్డ్ శామ్యూల్**
- స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు? - **జీవత్‌రామ్ భగవాన్‌దాస్ కృపలాని (జె.బి.కృపలాని)**
- వైస్రాయి వెవేల్ 1945లో అఖిలపక్ష సమావేశాన్ని ఎక్కడ ఏర్పాటు చేశాడు? - **సిమ్లా**
- రవీంద్రనాథ్ ఠాగూర్ ఆత్మకథ పేరు? - **మై రెమినిసెన్సెస్**
- 'యాన్ ఇండియన్ పిలిగ్రిమ్' రాసినవారు? - **సుభాష్ చంద్ర బోస్**
- పూర్ణ స్వరాజ్ తీర్మానాన్ని నెహ్రూ ఎప్పుడు చేశారు? - **1929**
- చీరాల-పేరాల ఉద్యమం ఏ ఉద్యమంలో భాగం? - **సహాయ నిరాకరణోద్యమం**
- విజయవాడ INCకి పరిశీలకుడిగా హైదరాబాద్ నుంచి వచ్చినవారు? - **మాడపాటి హనుమంతరావు**
- జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించిన తొలి తెలుగు వనిత? - **రావూరి అలివేలు మంగమ్మ**
- అల్లూరి సీతారామరాజు దాడి చేసిన తొలి పోలీస్‌స్టేషన్? - **చింతపల్లి**
- 1920లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాను ఎక్కడ స్థాపించారు? - **తాష్కెంట్**
- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఎప్పుడు ఉరి తీశారు? - **1931, మార్చి 23**
- ఆనందమండల్ అనే విప్లవ సంస్థ ఎక్కడి నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడింది? - **అహ్మదాబాద్**
- 1937లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది? - **8**
- 1942లో భారత్‌లో పర్యటించిన చైనా అధ్యక్షుడు? - **చాంగ్-కై-షేక్**
- నేతాజీ సింగపూర్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు? - **1943 అక్టోబర్ 21**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్లును ఆమోదించిన బ్రిటన్ చక్రవర్తి? - **6వ జార్జి**
- వైస్రాయ్‌గా లార్డ్ ఇర్విన్ పాలనా కాలం? - **1926-1931**
- లార్డ్ లిన్‌లిత్‌గో పాలనా కాలం? - **1936-1943**
- యుగాంతర్ పత్రికాధినేత? - **బరేంద్రకుమార్ ఘోష్**
- సచిన్ సన్యాల్ రాసిన గ్రంథం? - **బందీ జీవన్**
- మాండలే జైలు నుంచి తిలక్ విడుదలైన సంవత్సరం? - **1914**
- రస్త్‌గోఫ్తర్ పత్రికాధినేత? - **దాదాభాయి నౌరోజీ**
- భారతదేశం నుంచి బర్మా ఏ చట్టం ద్వారా విడిపోయింది? - **1935 చట్టం**
- అమృత బజార్ పత్రిక స్థాపకుడు? - **శిశిర్ కుమార్ ఘోష్**
- జైహింద్, చలో ఢిల్లీ నినాదకర్త? - **నేతాజీ బోస్**
- లార్డ్ రీడింగ్ పాలనా కాలం? - **1921-1925**
- ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్ గ్రంథకర్త? - **లాయక్ అలీ**
- 'ది ఎండ్ ఆఫ్ యాన్ ఎరా' రాసినవారు? - **కె.యం.మున్షీ**
- రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారతీయుల సహాయం కోరుతూ లిన్‌లిత్‌గో చేసిన ప్రకటన? - **ఆగస్ట్ ఆఫర్**
- క్యాబినెట్ మిషన్‌ను భారత్‌కు పంపిన ఇంగ్లండ్ ప్రధాని? - **క్లైమెంట్ అట్లీ**
- నేతాజీకి సహకరించిన జపాన్ ప్రధాని? - **టోజో**
- హోంరూల్ ఉద్యమాన్ని అనీబిసెంట్ ఎక్కడి నుంచి ప్రారంభించారు? - **అడయార్ (తమిళనాడు)**
- 1911లో తొలిసారి INCలో జాతీయ గీతాలాపన సమయం నాటి INC అధ్యక్షుడు? - ...ధర్
- కాంగ్రెస్, ము... కుదిరిన ఒప్పందం? - **లక్నో ఒప్పందం (1916)**
- హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలపై రామ్సే మెక్‌డొనాల్డ్ చేసిన ప్రకటనను ఏమంటారు? - **కమ్యూనల్ అవార్డ్స్**
- ద్విజాతి సిద్ధాంత కర్త? - **మహ్మద్ అలీ జిన్నా**
- గాంధీజీ హరిజనులకు ప్రవేశం కల్పించిన దేవాలయం కృష్ణా జిల్లాలో ఎక్కడ ఉంది? - **సిద్ధాంతం అనే ఊరిలో**
- నీల్ దర్పణ్ గ్రంథకర్త? - **దీనబంధుమిత్ర**
- అంబేద్కర్, గాంధీజీల మధ్య జరిగిన ఒప్పందం? - **పూనా ఒప్పందం**
- గోఖలే తీర్మానం (1912) ఉద్దేశం? - **బడి ఈడు పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య**
- గదర్ పార్టీలో చేరిన ఏకైక తెలుగు వ్యక్తి? - **దర్శి చెంచయ్య**
- స్వరాజ్య పార్టీ అధికార పత్రిక? - **ఫార్వర్డ్**
- మోతీలాల్ నెహ్రూ 1919లో స్థాపించిన పత్రిక? - **ఇండిపెండెంట్**
- వార్ధా విద్యా ప్రణాళికను గాంధీజీ ఎప్పుడు రూపొందించారు? - **1937**
- మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన సిక్కు ప్రతినిధి? - **సంపూరణ్ సింగ్**
- మహ్మద్ అలీ జిన్నా ఎప్పుడు ముస్లింలీగ్‌లో చేరాడు? - **1913**
- వేల్స్ రాకుమారుడికి గౌరవ పట్టా ఇచ్చిన యూనివర్సిటీ? **బెనారస్ హిందూ యూనివర్సిటీ**
- ప్రిన్స్ ఆఫ్ బెగ్గర్స్ అని ఎవరిని అంటారు? - **మదన్‌మోహన్ మాలవ్య (బెనారస్ హిందూ యూనివర్సిటీ కోసం కోటిన్నర నిధులు వసూలు చేసినందుకు ఇలా పిలుస్తారు)**
- RSSను ఎప్పుడు స్థాపించారు? - **1925**
- 'ది స్పాట్‌లెస్ పండిట్' అని ఎవరిని అంటారు? - **మదన్‌మోహన్ మాలవ్య**
- ఇండియన్ బిస్మార్క్ అని ఎవరిని అంటారు? - **సర్దార్ వల్లభాయ్ పటేల్**
- హైదరాబాద్‌లో పౌర ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడింది? - **1950**
- హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్‌కు మధ్య యథాతథ ఒప్పందం ఎప్పుడు జరిగింది? - **1947 నవంబర్ 29**
- ట్రావెన్‌కోర్ సంస్థాన రాజధాని? - **తిరువనంతపురం**
- ట్రావెన్‌కోర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసినవారు? - **బలరామ్ వర్మ (1949లో)**

నీటిని క్లోరిన్‌తో శుద్ధి చేయడానికి గల కారణం?

టెట్/ డీఎస్సీ ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్ - ప్రాక్టీస్ టెస్ట్

1. ప్రయోగశాలలో నీటి శాంపిల్ COD (Chemical Oxygen Demand)ను నిర్ణయించడానికి ఉపయోగించే ఆక్సీకరణి ఏది?
   1) KNO_3 2) $KMnO_4$
   3) ఆగ్జాలికామ్లం
   4) $K_2Cr_2O_7$ + 50% H_2SO_4 (ఆమ్లీకృత పొటాషియం డైక్రోమేట్)
2. నీటిని క్లోరిన్‌తో శుద్ధి చేయడానికి గల కారణం?
   1) ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది.
   2) సూక్ష్మజీవులను చంపుతుంది.
   3) తేలియాడుతున్న కణాలను తొలగిస్తుంది.
   4) నీటి కాఠిన్యాన్ని తొలగిస్తుంది.
3. ఓజోన్ అనేది?
   1) ఆక్సిజన్ రూపాంతరం
   2) ఆక్సిజన్ ఐసోటోప్
   3) ఆక్సిజన్ సమ్మేళనం
   4) ద్విపరమాణుక అణువు
4. గది ఉష్ణోగ్రత వద్ద p- రకపు అర్ధవాహకంలో?
   1) అధిక స్వేచ్ఛా ఎలక్ట్రాన్‌లు, అల్ప రంధ్రాలు ఉంటాయి.
   2) అధిక రంధ్రాలు, అల్ప ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   3) అధిక రంధ్రాలు, ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   4) ఎలక్ట్రాన్‌లు, రంధ్రాలు ఉండవు.
5. పురోశక్మం (Forward Bias) పద్ధతిలో ఆదర్శ డయోడ్ నిరోధం?
   1) అనంతం 2) పరిమితం
   3) రుణాత్మకం 4) సున్నా
6. p-n-p ట్రాన్సిస్టర్ (Transistor) కంటే n-p-n ట్రాన్సిస్టర్ ఎక్కువగా ఎందుకు ఉపయోగిస్తారు ?
   1) ఎక్కువ సామర్థ్యం ఉంటుంది కాబట్టి
   2) n-p-n లో శక్తి దుర్వినియోగం తక్కువ
   3) రంధ్రాల కంటే ఎలక్ట్రాన్‌ల చలనశీలత ఎక్కువ. అందువల్ల ఎక్కువ శక్తి చలనశీలత ఉంటుంది.
   4) రంధ్రాలకు ఎక్కువ చలనశీలత కాబట్టి శక్తి ఎక్కువగా ప్రసరిస్తుంది.
7. పౌనఃపున్యానికి (Frequency) మితి ఫార్ములా?
   1) $M^1L^2T^{-1}$ 2) $M^0L^2T^{-1}$
   3) $M^1L^0T^{-1}$. 4) $M^0L^0T^{-1}$
8. కిందివాటిని జతపరచండి

   గ్రూప్-A
   a) నిరోధం (Resistance)
   b) వాహకత్వం (Conductance)
   c) కెపాసిటెన్సీ (Capacitance)
   d) ప్రేరణా గుణకం (Inductance)

   గ్రూప్-B
   e) హెన్రీ (Henry)
   f) ఫారడ్ (Farad)
   g) ఓమ్ (Ohm)
   h) సీమెన్స్ (Siemens)

   1) a-g, b-f, c-h, d-e
   2) a-g, b-h, c-f, d-e
   3) a-f, b-g, c-f, d-e
   4) a-c, b-f, c-h, d-g



9. 10^{12} పూర్వ లగ్నం (Prefix) ఏది?
   1) పీటా 2) ఎక్సా
   3) టెరా 4) మెగా
10. 50kg ద్రవ్యరాశి ఉన్న స్త్రీ ఒంటికాలిపై 1 సెం.మీ^{2} వైశాల్యమున్న మేజోళ్లు (Sharp-heeled shoe) పై నిలుచున్నది. భూమిపై ఆమె చేసే ఒత్తిడి? (g = 10 మీ/సె^{2})
    1) 5×10^6 Pa 2) 5×10^5 Pa
    3) 500 Pa 4) 0·05 Pa
11. 50 గ్రాముల ద్రవ్యరాశి, 20 సెం.మీ^{3} ఘన పరిమాణం గల ఒక వస్తువును నీటిలో వేస్తే అది?
    1) పూర్తిగా మునిగిపోతుంది.
    2) తేలుతుంది. 3) వేలాడుతుంది.
    4) మొదట మునిగి తర్వాత తేలుతుంది.
12. లాక్టోమీటర్ (Lactometer)ను పాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగిస్తారు. ఇది ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
    1) ఆర్కిమెడిస్ సూత్రం
    2) ప్లవన సూత్రం 3) బెర్నౌలీ సూత్రం
    4) కులూంబ్ సూత్రం
13. షర్మిష్ఠ (Sharmista) అనేది?
    1) ఒక తోకచుక్క 2) ఒక ఉల్క
    3) ఒక నక్షత్ర మండలం
    4) సౌర కుటుంబం ఆవల ఉన్న గ్రహాల సముదాయం
14. వేడి నీటి ఊటలు, అగ్ని పర్వతాలు వేటికి ఉదాహరణలు?
    1) భూగర్భ లవణాలకు
    2) భూగర్భ ద్రవ రూపాలకు
    3) భూగర్భ ఉష్ణానికి
    4) భూగర్భ ఖనిజాలకు
15. నీటి వక్రీభవన గుణకం 4/3. కాంతి నీటిలో 3 మీటర్లు ప్రయాణించడానికి పట్టే సమయం ఎంత? (శూన్యంలో కాంతి వేగం C= 3×10^8 మీ/సె)
    1) 1.33×10^{-8} సెకన్లు
    2) 1.33 సెకన్లు 3) 3/4 సెకన్లు
    4) 1.33×10^8 సెకన్లు
16. ఖగోళ దూరదర్శినిలో వస్తు కటక నాభ్యంతరం F_0, అక్షి కటక నాభ్యంతరం F_e అయితే 'సహజ సర్దుబాటు' తర్వాత కటకాల మధ్య దూరం ఎంత?
    1) $L = F_0 + F_e$ 2) $L = F_0 / F_e$
    3) $L = F_0 \times F_e$ 4) $L = F_0 - F_e$
17. సంయుక్త సూక్ష్మదర్శిని వస్తు కటకం, అక్షి కటకాల నాభ్యంతర దూరాలు 0.5 సెం.మీ., 4 సెం.మీ., ఆవర్తనం 250 అయితే రెండు కటకాల మధ్య దూరం ఎంత?
    1) 24 సెం.మీ 2) 22 సెం.మీ
    3) 20 సెం.మీ. 4) 26 సెం.మీ
18. అనునాద ప్రయోగంలో మొదటి, రెండో అనునాదం వద్ద గాలి స్తంభం పొడవులు వరుసగా 20 సెం.మీ., 70 సెం.మీ. వాడుక చేసిన శ్రుతిదండం (Tuning Fork) పౌనఃపున్యం 330Hz అయితే గాలిలో ధ్వని వేగాన్ని కనుక్కోండి?
    1) 320 సెం.మీ/గంటలు
    2) 320 సెం.మీ/సెకన్లు
    3) 320 మీ/సెకన్లు
    4) 320 మీ/గంటలు
19. వస్తువులున్న గదిలో ప్రతిధ్వనులు వినపడవు. కానీ ఖాళీగా ఉన్న పెద్ద హాలులో ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఎందుకు?
    1) గదిలో ధ్వనిని శోషించుకుంటాయి. హాలులో ధ్వని అనేక పరావర్తనాలు చెందడం వల్ల ప్రతిధ్వనులు వినిపిస్తాయి.
    2) గది శోషణ గుణకం తక్కువ కాబట్టి
    3) గదిలో అనేక పరావర్తనాలు చెందుతాయి కాబట్టి
    4) హాలులో శోషణం ఎక్కువ కాబట్టి
20. వాయు సమీకరణం కిందివాటిలో దేనికి వర్తిస్తుంది?
    1) సమోష్ణగ్రతా ప్రక్రియలకు మాత్రమే
    2) స్థిరోష్ణక ప్రక్రియలకు మాత్రమే
    3) సమోష్ణోగ్రతా, స్థిరోష్ణక ప్రక్రియలకు వర్తిస్తుంది.
    4) పై రెండు ప్రక్రియలకు వర్తించదు.
21. ఒక ఘనపదార్థం దైర్ఘ్య వ్యాకోచ గుణకం (α=0.00009/°C) అయితే ఘనపరిమాణ వ్యాకోచ గుణకం γ ఎంత?
    1) 0.000027/°C 2) 0.00027/°C
    3) 0.00081/°C 4) 0.00003/°C
22. నీటిని 0°C నుంచి 10°C కు వేడి చేసినప్పుడు ఘనపరిమాణం?
    1) పెరుగుతుంది. 2) తగ్గుతుంది.
    3) దాదాపుగా మారదు.
    4) మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
23. కార్బోహైడ్రేట్ కానిది?
    1) గ్లూకోజ్ 2) చక్కెర
    3) ఆసిటిక్ ఆమ్లం
    4) రమనోజ్ (Rhamnose)
24. జంతువుల శరీరంలో నిక్షిప్తమైన కార్బో హైడ్రేట్ ఏది?
    1) సెల్యులోజ్ 2) గ్లైకోజన్
    3) అమైలోజ్ 4) లాక్టోజ్
25. ఆవశ్యక ఎమైనో ఆమ్లం (Essential amino acid) కానిది?
    1) గ్లైసిన్ 2) వాలిన్
    3) ల్యూసిన్ 4) లైసిన్
26. ఉన్ని, పట్టు వంటి వాటిలో ఉన్న ప్రొటీన్ ఏది?
    1) మైయోసిన్ 2) అల్బుమిన్స్
    3) కెరటిన్ 4) పైవన్నీ
27. వీటిలో సహజ పాలిమర్ ఏది?
    1) రేయాన్ 2) నైలాన్
    3) బూనా-s 4) రబ్బర్
28. దువ్వెనల తయారీలో ఉపయోగించే పాలిమర్ ఏది?
    1) PVC 2) పాలిప్రొపీన్
    3) బెకలైట్ 4) పాలిస్టైరిన్
29. సోయా చిక్కుడు గింజలు ఏ ఫాటీ ఆమ్లాల వనరు?
    1) లారిక్ ఆమ్లం 2) స్టియరిక్ ఆమ్లం
    3) లినోలినిక్ ఆమ్లం 4) ఓలియిక్ ఆమ్లం
30. జె.ఎస్పిడిన్ కనుగొన్నది ఏది?
    1) గాజు 2) కృత్రిమ దారాలు
    3) సిమెంట్ 4) రంజనాలు
31. ఒక ధాతువును అధిక గాలి సమక్షంలో దాని ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద తీవ్రంగా వేడి చేయడాన్ని ఏమంటారు?
    1) భస్మీకరణం 2) భర్జనం
    3) ప్రగలనం 4) క్షయకరణం
32. 'గెలీనా' (Galena) ఏ లోహం ధాతువు?
    1) మెర్క్యురీ 2) వెండి
    3) సీసం 4) కాల్షియం
33. జర్మన్ సిల్వర్‌లోని సంఘటనాలు?
    1) కాపర్, జింక్, నికెల్
    2) కాపర్, టిన్, నికెల్
    3) కాపర్, జింక్, టిన్
    4) కాపర్, జింక్, అల్యూమినియం
34. అణుచలన సిద్ధాంతం ప్రకారం వాయు అణువుల సగటు గతిజ శక్తి (E_K), పరమ ఉష్ణోగ్రత (T) ల మధ్య సంబంధాన్ని కిందివిధంగా సూచించవచ్చు?
    1) $E_K \propto T^2$ 2) $E_K \propto T$
    3) $E_K \propto 1/T$ 4) $E^2_K \propto T$
35. ఒకే ఉష్ణోగ్రత వద్ద ఉన్న 3g హైడ్రోజన్, 4g ఆక్సిజన్ వాయువుల గతిజశక్తి నిష్పత్తిని లెక్కిస్తే అది ఎంత ఉంటుంది?
    1) 3:4 2) 12:1
    3) 1:12 4) 4:3
36. కిందివాటిలో వాండర్‌వాల్ బలాలు ఏవి?
    1) పదార్థంలోని కణాలైన పరమాణువులు లేదా అణువుల మధ్య బలాలు
    2) విరుద్ధ విద్యుదావేశాలు గల అయాన్‌ల మధ్య గల స్థిరవిద్యుత్ ఆకర్షణ బలాలు
    3) అణువులు, పరమాణువుల మధ్య ఉండే సంయోజనీయ బంధాలు
    4) కేంద్రక కణాల మధ్య ఆకర్షణ బలాలు
37. వాయువు వ్యాపనం రేటు దాని సాంద్రత వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది. ఇది ఏ నియమం?
    1) డాల్టన్ పాక్షిక పీడనాల నియమం
    2) గ్రాహం వాయు వ్యాపన నియమం
    3) అవగాడ్రో నియమం
    4) చార్లెస్ వాయు వ్యాపన నియమం
38. సోమర్‌ఫీల్డ్ (Somerfield) దీర్ఘవృత్తాకార కక్ష్య అనే భావనను కింది విషయాన్ని విశదీకరించడానికి ప్రవేశపెట్టారు?
    1) రేఖావర్ణపటంలోని రేఖలను విశదీకరించడానికి
    2) రేఖావర్ణపటంలోని రేఖలు ఉపరేఖలుగా విడిపోవడాన్ని విశదీకరించడానికి
    3) పట్టిక వర్ణపట రేఖలను విశదీకరించడానికి
    4) హైడ్రోజన్ వర్ణపటంలోని రేఖలను వివరించడానికి
39. d ఉప కర్పరంలోని ఆర్బిటాళ్ల సంఖ్య?
    1) 1 2) 3 3) 5 4) 7
40. ఒక ఆర్బిటాల్‌లో గరిష్ఠంగా ఉంచగలిగే ఎలక్ట్రాన్‌ల సంఖ్యను తెలియచేయడానికి ఏ నియమం ఉపయోగపడుతుంది?
    1) పౌలీవర్జన నియమం
    2) ఆఫ్‌బౌ నియమం
    3) హుండ్ నియమం
    4) మాయిలర్ చిత్రం
41. పరమాణు ద్రవ్యరాశులను ఆరోహణ క్రమంలో ఒక క్రమపద్ధతిలో అమర్చి ఆవర్తన పట్టికను తయారుచేసిన శాస్త్రవేత్త?
    1) మోస్లే 2) మెండలీఫ్
    3) న్యూలాండ్స్ 4) డాబర్‌నీర్
42. ఆవర్తన పట్టికలో X అనే ఒకటో గ్రూపు మూలకం, Y అనే 17వ గ్రూపు మూలకం సంయోగం చెంది ఒక సమ్మేళనాన్ని ఏర్పరిస్తే దాని ఫార్ములా?
    1) X_3Y 2) X_2Y
    3) XY 4) X_2Y_3
43. ఏ రసాయన బంధాన్ని ఎలక్ట్రోవాలెంట్ బంధం (electro valent bond) అని కూడా అంటారు?
    1) సంయోజనీయ బంధం
    2) సమన్వయ సంయోజనీయ బంధం
    3) హైడ్రోజన్ బంధం
    4) అయానిక బంధం
44. వెస్పర్ట్ (VSEPRT) సిద్ధాంతం ప్రధానంగా దేనిని వివరించడంలో విఫలమైంది?
    1) బంధ దైర్ఘ్యం 2) బంధ కోణం
    3) బంధ శక్తి 4) బంధ స్వభావం
45. అమ్మోనియాలో $H\hat{N}H$ బంధ కోణం విలువ?
    1) 104°31' 2) 107°48'
    3) 109°28' 4) 90°
46. ఆవర్తన పట్టికలోని ఏ గ్రూపు మూలకాలను చాల్కోజనులు అంటారు?
    1) 14 2) 15 3) 16 4) 17

సమాధానాలు

1) 4	2) 2	3) 1	4) 2	5) 4
6) 3	7) 4	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 3	14) 3	15) 1
16) 1	17) 3	18) 3	19) 1	20) 3
21) 2	22) 4	23) 3	24) 2	25) 1
26) 3	27) 4	28) 3	29) 4	30) 3
31) 2	32) 3	33) 1	34) 2	35) 2
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 3	45) 2
46) 3.				

ప్రధానమైన పంట రుతువులు?



అనాదిగా భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. శ్రామిక శక్తిలో మూడింట రెండువంతులకు వ్యవసాయం, దాని అనుబంధ కార్యక్రమాల వల్లనే జీవనాధారం లభిస్తోంది. అంతేకాకుండా దాదాపు 70 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండటం, భారతదేశ జాతీయ ఆర్థికాభివృద్ధి.. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ఆధారపడి ఉండటం, పెరిగే జనాభాకు ఆహారాన్ని అందించడం, అనేక పరిశ్రమలకు ముడి సరుకులు అందించే దేశంగా ఉండటం, పెద్ద మొత్తాల్లో విదేశీ మారక ద్రవ్యం లభించడం మొదలైన అనేక కారణాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయాన్ని 'వెన్నెముక' గా చెప్పొచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - వ్యవసాయం

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులు రుతుపనాలు తెచ్చే వర్షంపైన ఆధారపడి ఉండటం వల్ల భారతదేశ ఆర్థికస్థితిని రుతుపవనాలతో 'జూద మాడటం'తో అనవచ్చు. భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అయిన వాటిలో ఎగుమతి అయ్యే ముఖ్యమైన సరుకులు.. టీ, కాఫీ, ఆముదాలు, వేరుశనగ, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పొగాకు, పత్తి, పంచదార, తోళ్లు, నూనెలు, జనపనార మొదలైనవి.

- 1900కి పూర్వం మన దేశ వ్యవసాయం మరీ పురాతన పద్ధతులలో సాగుతూ ఉండేది. 1908లో బిహార్‌లోని 'పూసా' వద్ద ఒక వ్యవసాయ కళాశాల, పరిశోధనా శాలను స్థాపించారు.
- 1937లో బ్రిటీష్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వ్యవసాయ శాఖల్ని ప్రారంభించింది.
- 1951 తర్వాత భారత వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికను రూపొందించి, అందులో వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాధాన్యతను ఇచ్చారు.
- భారతదేశంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం న్యూఢిల్లీలో ఉంది.
- వ్యవసాయోత్పత్తులను పెంచడానికి భారత ప్రభుత్వం 1963లో 'వ్యవసాయాభివృద్ధి బోర్డు' ఏర్పాటు చేసింది.

ప్రస్తుతం మనదేశంలో విభిన్న ప్రాంతాల్లో వివిధ రకాలైన వ్యవసాయ పద్ధతులున్నాయి. వీటిని ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1. విస్థాపన వ్యవసాయం
2. తోట వ్యవసాయం
3. సాంద్ర వ్యవసాయం
4. జీవనాధార వ్యవసాయం
5. విస్తృత వ్యవసాయం
6. మిశ్రమ వ్యవసాయం

1. **విస్థాపన వ్యవసాయం:** దీన్ని స్థలమార్పిడి వ్యవసాయం లేదా సంచార వ్యవసాయం అని కూడా అంటారు. ఇది సాధారణంగా కొండ ప్రాంతాల్లోని గిరిజనులు చేసే వ్యవసాయం.

- ఈ వ్యవసాయంలో చెట్లను నరికి, వాటిని కాల్చి వ్యవసాయ భూములుగా మారు స్తారు. కొన్నేళ్ల తర్వాత అంటే భూసారం తగ్గాక ఆ భూమిని వదిలి, మరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ మళ్లీ వ్యవసాయం చేస్తారు. ఇది నిరంతరంగా కొనసాగుతుంది. అందుకే దీన్ని 'నరుకు – కాల్చు' వ్యవసాయం లేదా 'పోడు వ్యవసాయం' అని అంటారు.

రాష్ట్రాలు/ప్రదేశం	పోడు/విస్థాపన వ్యవసాయం పేర్లు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ	పోడు వ్యవసాయం
కేరళ	పోనమ్
హిమాలయ	ఖిల్
జార్ఖండ్	కురువా
అసోం, ఈశాన్య రాష్ట్రాలు	జూమ్/ఝూం
మధ్యప్రదేశ్	బేవార్, పెండ
ఒడిశా	ధీటి
రాజస్థాన్	వాత్ర

- ఇటువంటి వ్యవసాయాన్ని మనదేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

2. **తోట వ్యవసాయం:** దీన్ని వాణిజ్య వ్యవసాయం అని కూడా అంటారు.

- ఈ పద్ధతిని మనదేశంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టారు.
- లాభం లేదా ధనాన్ని సంపాదించడం కోసం 'నగదు పంటల'ను పండిస్తారు.
- ఈ వ్యవసాయానికి ఎక్కువ పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, భూమి అవసరం.
- గోధుమలు, తేయాకు, కాఫీ, రబ్బరు, బార్లీ, పత్తి, చెరకు, పొగాకు, సుగంధ ద్రవ్యాలు మొదలైన పంటలు వాణిజ్య వ్యవసాయంలో సాగు చేస్తారు.

3. **సాంద్ర వ్యవసాయం:** అధిక జనసాంద్రత ప్రాంతాల్లో ఈ రకమైన వ్యవసాయం చేస్తారు. ఇది అధికంగా వ్యవసాయ శ్రామికులను, అత్యధిక జీవ రసాయనిక ఎరువులను, నీటి పారుదలను ఉపయోగించుకొని అధిక దిగుబడి సాధించే విధానం.

- తక్కువ భూవిస్తీర్ణంలో పురాతన వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తారు.
- మనదేశంలో గంగానదీ పరీవాహక ప్రాంతం, కృష్ణా, గోదావరి, మహానది, కావేరి డెల్టా ప్రాంతాలు ఈ రకానికి ఉదాహరణగా చెప్పొచ్చు. దీనిలో సరాసరి దిగుబడి ఎక్కువ మోతాదులో ఉంటుంది.

4. **జీవనాధార వ్యవసాయం:** ఆహార అవసరాల కోసం రైతు కుటుంబం అంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి చేసే వ్యవసాయాన్ని జీవనాధార వ్యవసాయం అంటారు.

- దీనిలో ఆహార పంటలు మాత్రమే పండిస్తారు. కాబట్టి దీనిలో లాభం ఉండదు.
- దీంతో ఎక్కువగా ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతుంది.

5. **విస్తృత వ్యవసాయం:** ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూమిలో ఎక్కువ పెట్టుబడితో చేసేదాన్ని విస్తృత వ్యవసాయం అంటారు.

- ఈ పద్ధతిలో వ్యవసాయ కూలీలు తక్కువగా ఉంటూ, యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తారు.
- ఇందులో సరాసరి దిగుబడి తక్కువ మోతాదులో ఉంటుంది.
- అమెరికా, కెనడా, రష్యా లాంటి దేశాల్లో ఈ పద్ధతి ఎక్కువగా అమల్లో ఉంది.

6. **మిశ్రమ వ్యవసాయం:** వ్యవసాయంతో పాటు పశుపోషణ లేదా కోళ్ల పెంపకం లేదా సెరికల్చర్ లేదా ఎపికల్చర్ వంటి కార్యకలాపాలు చేపడితే దాన్ని మిశ్రమ వ్యవసాయం అంటారు.

భారతదేశంలో పంట కాలాలు

వ్యవసాయ పంటలు రుతువుల మీద, సహజ వనరులైన మృత్తికలు, నీరు, సూర్యరశ్మిపై ఆధారపడి ఉంటాయి. వీటితోపాటు ఉష్ణోగ్రత, ఆర్ధ్రత అంశాలు కూడా ప్రధాన మైనవి. ఏ ప్రాంతంలోనైనా రుతువులను బట్టి పంటలు మారుతూ ఉంటాయి.

భారతదేశంలో ప్రధానంగా మూడు రకాల పంటకాలాలు ఉన్నాయి. అవి..

1. ఖరీఫ్ 2. రబీ
3. జయాద్ లేదా జైద్

1. **ఖరీఫ్ (జూన్ నుంచి అక్టోబర్ మధ్య వరకు):**

- నైరుతి రుతుపవనాల రాకతో దాదాపు దేశమంతటా ఖరీఫ్ ప్రారంభమవుతుంది.
- జూన్, జూలైల్లో విత్తనాలు వేసే కాలం ప్రారంభమై సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పంటకోతలు ప్రారంభమవుతాయి.
- వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కందులు, పెసలు, మినుములు, పత్తి, జనుము, వేరుశనగ, సోయాబీన్ ముఖ్యమైన ఖరీఫ్ పంటలు.

2. **రబీ (అక్టోబర్ మధ్య నుంచి ఏప్రిల్ వరకు):**

- ఈశాన్య రుతుపవనాల రాకతో దేశంలో రబీ కాలం మొదలవుతుంది.
- ఈ కాలంలోని పంటలు పెరిగేటప్పుడు చల్లని వాతావరణం, కోసేటప్పుడు వెచ్చని వాతావరణం అవసరం.
- రబీ పంటను శీతాకాలంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో విత్తి, ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పంటలు కోస్తారు.
- పశ్చిమ విక్షోభాల వల్ల శీతాకాలంలో సంభవించే కొద్దిపాటి వర్షపాతం రబీ పంటలకు అత్యంత ఉపయోగకరం.
- దీనిలో ముఖ్యమైన పంటలు గోధుమ, బార్లీ, బఠాణీ, శనగ, ఆవాలు, పప్పుధాన్యాలు మొదలైనవి.

3. **జయాద్/ జైద్ (మే నుంచి జూన్ వరకు):**

- రబీ, ఖరీఫ్ పంట కాలాల మధ్య స్వల్ప వ్యవధిలో ఉన్న పంట రుతువును 'జయాద్' అంటారు.
- నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పుచ్చకాయలు, కర్బూజ, దోసకాయ, కూరగాయలు, పశువుల మేత వంటి స్వల్ప కాల పంటలు పండిస్తారు.

భారతదేశంలో ముఖ్య పంటలు

భారతదేశంలో పంటలను ముఖ్యంగా నాలుగు విధాలుగా విభజించొచ్చు. అవి..

1. ఆహార పంటలు
2. నగదు లేదా వాణిజ్య పంటలు
3. తోట పంటలు
4. ఉద్యానవన పంటలు

1. **ఆహారపంటలు:** వరి, గోధుమ, మొక్క జొన్న, జొన్న, సజ్జ, రాగి, పప్పుధాన్యాలు.
2. **నగదు లేదా వాణిజ్య పంటలు:** పత్తి, పొగాకు, జనుము, చెరకు, నూనె గింజలు.
3. **తోట పంటలు:** కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, రబ్బరు.
4. **ఉద్యానవన పంటలు:** కూరగాయలు, పండ్లు, పూలు మొదలైనవి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రధానమైన పంట రుతువులు? (కానిస్టేబుల్ – 2009)
   1) ఖరీఫ్, రబీ 2) ఖరీఫ్, వేసవి
   3) ఖరీఫ్, రబీ, వేసవి
   4) రబీ, వేసవి
2. సాగు చేయడంలో కార్బనిక ఎరువు, సహజ క్రిమినాశనుల మందులను ఉపయోగించే వ్యవసాయం? (కానిస్టేబుల్ – 2009)
   1) జీవనాధార వ్యవసాయం
   2) పోడు వ్యవసాయం
   3) కార్బనిక వ్యవసాయం
   4) మిశ్రమ వ్యవసాయం
3. వ్యవసాయంలో ఖరీఫ్ రుతువు దేన్ని తెలుపుతుంది? (కానిస్టేబుల్ – 2009)
   1) రుతుపవనాల ఆగమనం (జూన్–జూలై)
   2) రుతుపవనాల ఉపసంహరణ (అక్టోబర్– నవంబర్)
   3) వేసవి ఆరంభం (ఏప్రిల్–మే)
   4) పైవేవీ కావు

సమాధానాలు: 1) 3; 2) 3; 3) 1.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ప్రధాన ఖరీఫ్ పంట?
   1) గోధుమ 2) వేరుశనగ
   3) వరి 4) పొగాకు
2. భారతదేశంలో రబీ కాలంలో ప్రధాన పంట ఏది?
   1) వరి 2) గోధుమ 3) పత్తి 4) సజ్జ
3. 1908లో మనదేశంలో ఎక్కడ వ్యవసాయ కళాశాల, పరిశోధనాశాలను స్థాపించారు?
   1) న్యూఢిల్లీ 2) కటక్
   3) పుణే 4) పూసా
4. కేరళలో పోడు లేదా విస్థాపన వ్యవసాయానికి ఉన్న మరో పేరు?
   1) కురువా 2) పోనమ్
   3) జూమ్ 4) వాత్ర

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 2.

Mac Operating System is developed by..

Model Questions



BANK EXAMS

COMPUTER AWARENESS

1. Block on buffer caches is used:
   1) To improve disk performance
   2) To speed up main memory read operation
   3) To handle interrupts
   4) To increase capacity of main memory
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting
   1) Primary keys and their relationships to instances
   2) Entity classes and their relationships to primary keys
   3) Entity classes and their relationships
   4) Primary keys and their relationships
   5) None of the above
3. A hexadigit can be represented by
   1) Three binary (consecutive) bits
   2) Sixteen binary (consecutive) bits
   3) Eight binary (consecutive) bits
   4) Four binary (consecutive) bits
   5) None of the above
4. If a previously saved file is edited ___?
   1) The file must be saved again to store the changes
   2) The changes will automatically be saved in the file
   3) The file will only have to be saved again if it is more than one page in length
   4) Its name must be changed
   5) It cannot be saved again
5. What do we call the HTML codes written in a text editor to make web pages?
   1) Roots 2) HTML tags
   3) Source elements
   4) Source code
   5) None of these
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page 2) Document
   3) Section 4) Page Setup
   5) None
7. Which key is used to indent a paragraph in MS word?
   1) Shift 2) Esc 3) Ctrl
   4) Tab 5) None of these
8. In a ring topology, the computer in possession of the______ can transmit data
   1) Packet 2) Data
   3) Token 4) Access method
   5) None of these
9. When you save to _______, your data will remain undamaged even when the computer is turned off.
   1) RAM 2) Motherboard
   3) Auxiliary storage
   4) Primary storage device
   5) None of these
10. A device operating at the physical layer is ________
    1) Bridge 2) Repeater
    3) Router 4) All of the above
    5) None of these
11. What type of computer could be found in a digital watch?
    1) Embedded computer
    2) Super computer
    3) Mainframe computer
    4) Notebook computer
    5) None of these
12. HTTP in URL stands for
    1) Hyper Text to Point
    2) Hyperlink for Tiny Protocol
    3) Highlighted Text through Pictures
    4) Hyper Text Transfer Protocol
    5) None of the above
13. Memory allocation at the dynamic time is known as
    1) Static memory allocation
    2) Demanding 3) Paging
    4) Run time memory allocation
    5) None of the above
14. Network components are connected to the identical cable in the _____ topology
    1) Star 2) Bus 3) Ring
    4) Mesh 5) Mixed
15. A mobile phone number, a date of birth and a customer name are all examples of
    1) A record 2) Data
    3) A file 4) A database
    5) None of these
16. In Excel, _____ contains one or more worksheets.
    1) Template 2) Workbook
    3) Active cell 4) Label
    5) None of these
17. Cyberspace is being governed by a system of law and regulation called?
    1) Civil Law 2) Criminal Law
    3) Cyber Law 4) Electronic Law
    5) Cyber Authority
18. Primary memory is used by the:
    1) CPU 2) Input device
    3) User 4) All of these
    5) None of these
19. In Ms- Word, what combination of keys do you press to delete an entire word?
    1) Ctrl + Del 2) Alt + Del
    3) Shift + Backspace
    4) Shift + Alt + Del
    5) None of these
20. Specialized programs that allow particular input or output devices to communicate with the rest of the computer system are called ____.
    1) Operating systems
    2) Device drivers
    3) Utilities
    4) Language translators
    5) Connectors
21. ROM and memory differ with respect to which of the following characteristics?
    1) Price 2) Reliability
    3) Speed 4) All of the above
    5) None of these
22. The group of processors combined together to create a program is referred to as
    1) Multi-programming
    2) Multiprocessing
    3) Multitasking
    4) Thrashing 5) None of these
23. Which device is used to access your computer from another computer or for talk over phone?
    1) CD-ROM Drive 2) Modem
    3) RAM 4) Hard Drive
    5) None of these
24. System software does all of the following except
    1) Add graphics and pictures to files.
    2) Coordinate instructions between application software and the computer's hardware devices.
    3) Help manage system resources.
    4) Help run the computer.
    5) None of these
25. What are .bas, .doc and .htm examples of?
    1) Databases 2) Extensions
    3) Domains 4) Protocols
    5) None of these
26. When data changes in multiple lists and all lists are not updated, this causes:
    1) Data redundancy
    2) Information overload
    3) Duplicate data
    4) Data inconsistency
    5) Data repetition
27. Which of the following is not true?
    1) Chatting is like e-mail
    2) Chatting can be done with a single person
    3) Chatting can involve multiple persons
    4) Chatting is an electronic dialogue
    5) None of these
28. ______ is the process of dividing the disk into tracks and sectors.
    1) Tracking 2) Allotting
    3) Crashing 4) Formatting
    5) None of these
29. The computer abbreviation of KiB usually means-
    1) Key Block 2) kibi byte
    3) Kilobyte 4) Kernel Boot
    5) None of these
30. Hardware used to translate words, sounds, images, and actions that people understand into a form that the system unit can process is known as ______
    1) Device drives
    2) Device readers
    3) Input devices
    4) Output devices
    5) None of these
31. The mouse ______ usually appears in the shape of an arrow.
    1) Indicator 2) Marker
    3) Meter 4) Pointer
    5) None of these
32. A tool used to find a synonym or antonym for a particular word
    1) Dictionary 2) Summary
    3) Thesaurus 4) Spell check
    5) None of the above
33. Which of the following protocols is used by Internet mail?
    1) HTTP 2) TCP/IP 3) FTP
    4) HTMP 5) None of these
34. A scripting language similar to HTML and which runs only on a browser is
    1) FORTRAN 2) BASIC
    3) FOXPRO 4) Java script
    5) None of these
35. Generally, you access the Recycle Bin through an icon located-
    1) On the first visible screen
    2) On the hard drive
    3) On the shortcut menu
    4) In the Properties dialog box
    5) None of these
36. The first Computers were programmed using _______
    1) Assembly Language
    2) Machine Language
    3) Source Code 4) Object code
    5) Spaghetti code
37. The programs which are as permanent as hardware and stored in ROM is known as
    1) Hardware 2) Software
    3) Firmware 4) ROM ware
    5) None of these
38. Which computer memory is used for storing programs and data currently being processed by the CPU?
    1) Mass memory
    2) Internal memory
    3) Non-volatile memory
    4) PROM 5) None of these
39. The world's first truly cross-platform programming language is called ________
    1) C++ 2) Java
    3) Visual Basic.NET
    4) Smalltalk
    5) None of these
40. ________ software allows the user to speak into the computer rather than type in text.
    1) Speech recognition
    2) Chat 3) Message
    4) All of the above
    5) None of these
41. The ______ folder retains copies of mail that you have in progress but are not yet ready to send.
    1) Drafts 2) Outbox
    3) Address Book 4) Sent Items
    5) None of these
42. Which of the following programming language is used to create programs like applets?
    1) COBOL 2) C Language
    3) Java 4) BASIC
    5) None of these
43. Mac Operating System is developed by which company?
    1) IBM 2) Apple
    3) Microsoft 4) Samsung
    5) None of these
44. A characteristic of a file server is which of the following?
    1) Acts as a fat client and is limited to one PC
    2) Manages file operations and is limited to one PC
    3) Acts as a fat client and is shared on a network
    4) Manages file operations and is shared on a network
    5) None of these
45. The access method used for magnetic tape is_______
    1) Direct 2) Random
    3) All of the above
    4) Sequential
    5) None of these
46. What is a serial port that adds a direct connection to a network?
    1) FireWire 2) NIC
    3) USB 4) Internal modem
    5) None of these

Key

1) 1; 2) 2; 3) 4; 4) 1;
5) 4; 6) 4; 7) 4; 8) 3;
9) 3; 10) 2; 11) 1; 12) 4;
13) 4; 14) 2; 15) 1; 16) 2;
17) 3; 18) 1; 19) 5; 20) 2;
21) 4; 22) 2; 23) 2; 24) 1;
25) 2; 26) 4; 27) 1; 28) 4;
29) 2; 30) 3; 31) 4; 32) 3;
33) 1; 34) 4; 35) 1; 36) 2;
37) 3; 38) 2; 39) 2; 40) 1;
41) 1; 42) 3; 43) 2; 44) 4;
45) 4; 46) 2.